ఈనాడు

హైదరాబాద్ 18-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 68
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

వసుంధర

vasundhara@eenadu.in

తెలివితేటల గుట్టు విప్పారు!

మానవ శరీరానికి యజమాని మెదడే... దాని ఆదేశాల ప్రకారమే అవయవాలన్నీ పనిచేస్తాయి. ఈ సమన్వయం వెనకున్న రహస్యాన్ని ఛేదించాలనే తపనే... శుభా టోలేను న్యూరో సైంటిస్ట్‌గా మార్చింది. ఆమె తన విశేషమైన పరిశోధనలతో మెదడు, నరాల సమస్యలకు అధునాతన పరిష్కారాలెన్నో చూపించారు. ఈ కృషి తాజాగా అంతర్జాతీయ బ్రెయిన్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఐబీఆర్‌వో) అధ్యక్షురాలిగా ఎంపికయ్యేలా చేసింది.



ఐబీఆర్‌వో... 57 దేశాలకు చెందిన 69 సైంటిఫిక్ సొసైటీలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ సంస్థకు అధ్యక్షురాలిగా శుభ డిసెంబర్ 31, 2028వరకూ పదవిలో ఉంటారు. అభివృద్ధి చెందుతోన్న దేశం నుంచి మొదటిసారి ఈ పదవిని అందుకుని గుర్తింపు సాధించారామె. 'మెదడు ఒక సంక్లిష్టమైన పజిల్. దాని నిర్మాణం అందరిలోనూ ఇంచుమించు ఒకేలా ఉన్నా... ఆలోచనలు, అభిప్రాయాలు, భావాలు, భావోద్వేగాలు... మాత్రం వేర్వేరుగా ఉంటాయి. ఇదే నాకు మెదడు రహస్యాలు తెలుసుకోవాలన్న ఆసక్తిని పెంచి, న్యూరోసైంటిస్ట్‌గా కెరియర్‌ని ఎంచుకునేలా చేసింది' అంటారు శుభ.

మెచ్చే మెంటార్‌గా...

శుభా టోలేది ముంబయి. తల్లి అరుణ ఆక్యుపేషనల్ థెరపిస్ట్. తండ్రి పద్మాకర్ టోలే కేంద్ర ప్రభుత్వ సంస్థకు డైరెక్టర్. శుభ ముంబయిలోని సెయింట్ జేవియర్స్ కాలేజ్‌లో బీఎస్సీ-బయోకెమిస్ట్రీ చేశారు. అమెరికాలో ఎంఎస్సీ, పీహెచ్‌డీలను పూర్తిచేశారు. 'బయోమార్కర్స్' శుభ పరిశోధనాంశం. యూనివర్సిటీ ఆఫ్ షికాగోలో పోస్ట్ డాక్టోరల్ పరిశోధన చేశారు. అదే తనని న్యూరోసైన్స్ రంగంలో భవిష్యత్తును ఊహించుకునేలా చేసిందంటారు శుభ. 1999లో ఇండియాకు తిరిగి వచ్చి టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్‌లో చేరారు. గ్రాడ్యుయేట్ స్టడీస్ డీన్‌గా తర్వాతి తరం శాస్త్రవేత్తలు ఎందరినో తీర్చిదిద్దారు. 'సైన్స్ చాలామందికి కొరుకుడు పడని జడ పదార్థం. ఈ రంగంలో మరిన్ని పరిశోధనలు రావాలంటే... విద్యార్థులకు ఈ రంగంపై ఆసక్తి పెంచడం చాలా అవసరం' అంటారు శుభ. పోస్ట్ డాక్టోరల్ రిసెర్చ్‌లను ప్రోత్సహిస్తూ... విద్యార్థులు మెచ్చే మెంటార్‌గా పేరు తెచ్చుకున్నారు.

కీలక పరిశోధనలెన్నో...

'జన్యుపరమైన లోపాలు మెదడుని ఎలా ప్రభావితం చేస్తాయో అర్థం చేసుకోవాలంటే మొదట మెదడుని నియంత్రించే జన్యువులను అర్థం చేసుకోవాలి' అంటారు శుభ. మెదడు అభివృద్ధి, పనితీరుపై ఆమె విశేష పరిశోధనలు చేశారు. క్షీరదాల్లోని నాడీవ్యవస్థపైన చేసిన అధ్యయనంలో మెదడులోని కార్టెక్స్, హిప్పోక్యాంపస్, అమిగ్డల డెవలప్‌మెంట్‌ని నియంత్రించే మాస్టర్ రెగ్యులేటర్ జన్యువును కనుగొన్నారు. ఫలితంగా ఆటిజం, మూర్ఛ వంటివాటికి కారణాలు తెలుసుకోగలిగారు. అలానే తెలివి తేటలకు కారణమయ్యే నియో కార్టెక్స్ డెవలప్‌మెంట్‌ని అర్థం చేసుకోగలిగారు. మెదడులో హిప్పోక్యాంపస్ రూపుదిద్దుకోవడానికి కారణమైన ఆర్గనైజర్, న్యూరాన్లు, గ్లియాన్లు, కణాల పనితీరుకి సంబంధించిన రెగ్యులేటర్‌తో పాటు మరెన్నో మెదడుకు సంబంధించిన అంశాలను కనుగొన్నారు. ఈ ఆవిష్కరణలు మరిన్ని న్యూరాలజీ పరిశోధనలకు బాటలు వేశాయి.

సమస్యలపై సమరం...

శుభ ఓ పక్క మెదడుపై పరిశోధనలు చేస్తూనే, మరోవైపు భారతీయ సైన్స్ అభివృద్ధికి ఆటంకంగా మారిన సమస్యలపైనా యుద్ధం ప్రకటించారు. ముఖ్యంగా స్టెమ్ రంగాల్లో మహిళల ఎదుగుదలను నియంత్రిస్తున్న విషయాలకు వ్యతిరేకంగా గళం విప్పారు. లైంగిక వేధింపులపై మహిళా పరిశోధకులకు అవగాహన కల్పించారు. ప్రసూతి సెలవుల్లో ఉన్న పోస్ట్‌డాక్టోరల్ పరిశోధకురాళ్లకు టెక్నికల్ సపోర్ట్ ఇప్పించారు. 'సైన్స్ పరిశోధనల్లో మునిగి తేలేవారు... వ్యక్తిగత జీవితాన్నీ, సృజనాత్మక అభిరుచుల్నీ వదిలేస్తారని అందరూ అనుకుంటారు. కానీ, అది నిజం కాదు. నాకెంతో ఇష్టమైన కథక్ ప్రదర్శనలు ఇప్పటికీ ఇస్తుంటా. ఓ పక్క ఇంటినీ పిల్లల్నీ చూసుకుంటూ, మరోవైపు ల్యాబ్ పనులు నిర్వర్తిస్తూ, ఇంకోవైపు వివిధ సంస్థల్లో పలు హోదాల్లో బాధ్యతల్ని నిర్వహించడం కత్తిమీద సామే. ప్రతి ఒక్కరికీ ఉన్నట్లే నాకూ రోజుకి 24 గంటలే. అందుకే, ప్రతి పనికీ మధ్య సన్నని గీత గీసుకుంటా. ఎప్పటికప్పుడు పనిని షెడ్యూల్ చేసుకుంటా. ఈ వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ నా జీవనశైలికి సరిపోతుంది' అంటారామె. మెదడులోని స్పందనల కేంద్రాలు, జన్యువుల పనితీరు మీద ప్రత్యేక దృష్టి సారించినందుకు 'ఇన్నొవేషన్ ఇన్ న్యూరో సైన్స్' 'నేషనల్ ఉమన్ బయో సైంటిస్ట్' వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులు శుభను వరించాయి. ఆమె భర్త సందీప్ త్రివేది కూడా శాస్త్రవేత్తే. వారికి ఇద్దరు పిల్లలు.

ఆ ఫొటోలు అడుగుతున్నాడు!

ఇంజినీరింగ్ చదువుతున్నా. ఒకబ్బాయి నేనూ ప్రేమించుకుంటున్నాం. భవిష్యత్తులో పెళ్లి చేసుకోవాలన్న ఉద్దేశంతో ఇంట్లో ఫ్రెండ్‌గా పరిచయం కూడా చేశా. తనీమధ్య నా న్యూడ్ ఫొటోలు అడుగుతున్నాడు. కాదంటే నా మీద నీకు నమ్మకం లేదంటున్నాడు. నమ్మకం లేకకాదు నాకు నచ్చదంటే వినట్లేదు. ఏం చేయను? – ఓ సోదరి

డియర్... వసుంధర
డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు



భావి జీవితానికి పునాది వేసుకునే వయసు నీది. పూర్తిగా వ్యక్తిత్వమూ రూపుదిద్దుకోలేదు. ఇప్పుడిప్పుడే బయటి ప్రపంచాన్ని చూస్తున్నావు కాబట్టి, అన్నింటినీ అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి కానీ గుడ్డిగా నమ్మకూడదు. కాలేజీ అన్నాక చాలా పరిచయాలవుతాయి. వారిలో ఎవరిని స్నేహితులుగా చేసుకోవాలో ఆచితూచి నిర్ణయించుకోవాలి. కానీ నువ్వు చాలా వేగంగా అడుగులు వేస్తున్నావ్. ఇష్టపడటమే కాదు పెళ్లి కూడా చేసుకోవాలనే నిర్ణయాన్నీ తీసేసుకుని ఇంట్లో వాళ్లకీ పరిచయం చేశావు. ఈ వయసుకి ఇంత పెద్ద నిర్ణయం తీసుకోవడం ఎంతవరకు సబబు? ఆ అబ్బాయి వ్యక్తిత్వం ఇప్పటికైనా అర్థమైందా? నిజమైన ప్రేమ ఇలా అనుచిత కోరికలను కోరదు. వ్యక్తిత్వలోపం ఉన్నవాళ్లే క్షణికావేశాలకు గురవుతారు. సరైన నిర్ణయాలనూ తీసుకోలేరు. ఏ బంధంలోనైనా నమ్మకమే కాదు నైతికతా ఉండాలి. ఒక్కసారి అతను అడిగింది చేసి, ఏదైనా చిక్కుల్లో పడితే తరవాత నీ పరిస్థితేంటి? అందుకే ఇటువంటి స్నేహాలు, ఇష్టాలకు దూరంగా ఉండు. నీ అభిప్రాయాలు, విలువలను అర్థం చేసుకుని, నిన్ను నిన్నుగా గౌరవించే వ్యక్తికోసం నిరీక్షించు. ఆ అబ్బాయితోనూ నేరుగా చెప్పు. ఏమైనా ఇబ్బంది పెడితే ఇంట్లోవాళ్లకి విషయం చెప్పి, వారి సహకారంతో పరిష్కరించుకో. అంతేకానీ ప్రేమ అన్నారు కదా అని అడిగిందల్లా చేస్తూ మాత్రం వెళ్లకు.

మెనోపాజ్‌కి మరో కోణం!

పెరిగే బరువు, వేడి ఆవిర్లు, సరిగా నిద్ర పట్టకపోవడం... మెనోపాజ్ అనగానే గుర్తుకొచ్చేవే ఇవి. ఇక మారిపోయే భావోద్వేగాలు సరేసరి. అనుభవించే వారికే తెలుస్తుంది ఆ ఇబ్బంది ఏమిటో! అందుకే ఈ దశను మహిళల జీవితంలో ఓ సవాలుగానూ చెబుతారు. అయితే దీన్ని ఒకసారి సానుకూలంగా ఆలోచించి చూద్దామా?



మామూలు రోజుల్లో ఎలాగున్నా... పీరియడ్స్‌లో పనిచేయడం ఎంత ఇబ్బందిగా ఉంటుందో కదా! వస్తే ఒక గోల. సమయానికి రాకపోతే అదో భయం. ఇక ఆ సమయంలో ఉండే నొప్పి, చికాకు సంగతి సరేసరి. భావోద్వేగాలన్నీ చుట్టుముడతాయి. పీరియడ్ మైగ్రేన్ ఉన్నవారి సంగతైతే చెప్పనక్కర్లేదు. ఎక్కడికి వెళ్తున్నా ప్యాడ్ మోసుకెళ్లాలి. వేడుకలు, పండగల వేళ వచ్చిందా... సంబరాలు, పూజలన్నింటికీ దూరంగా ఉండాల్సిందే. మెనోపాజ్‌తో నెలసరి గొడవ వదిలిపోతుంది. అంటే ఈ సమస్యలన్నీ పోయినట్టేగా! వేడుకేదైనా ఎప్పుడైనా సిద్ధమైపోవచ్చు.

పెళ్లి కాకముందు చదువు, ఉద్యోగాలంటూ పరుగు. పెళ్లయ్యాక ఇంటి బాధ్యతలు, పిల్లల చదువులతో తీరికుండదు. మెనోపాజ్ దశకు చేరుకునేసరికి పిల్లలు వాళ్ల పనులు వారు చేసుకునే స్థాయికి చేరుకుంటారు. అంటే మన కోసం సమయం దొరికినట్టే. ఇప్పుడైనా ఇతరుల కోసం ఆలోచించక 'నాకేం కావాలి' అని ఆలోచించండి. ఒక అధ్యయనం ప్రకారం ఈ సమయంలో మహిళలు ఇంతకాలం తమలో గూడుకట్టుకున్న అసంతృప్తిని బయటపెడుతుంటారట. మీకూ అలా అనిపించిందా చేయండి కానీ... నచ్చినట్టుగా ఉండండి. నచ్చింది చేయండి. భావోద్వేగాలూ అదుపులో ఉంటాయి. మీకూ సంతృప్తి.

యవ్వనంలో ఏదైనా చేసేయగలమన్న ధైర్యం ఉంటుంది. ఆ భావన మెనోపాజ్ కూడా కలిగిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. తిరిగి కెరియర్‌లో చేరతారా? వ్యాపారం ప్రారంభిస్తారా? ఒంటరి ప్రయాణాలను ఆస్వాదిస్తారా... ఎంచుకుని చేసేయండి. యాభైల్లో రాణిస్తున్నవారి జాబితాలో మీరూ చేరొచ్చు.

శరీరం పెడుతున్న ఇబ్బందులతో ఇవన్నీ ఆలోచించడం అంత సులువేమీ కాదు. కానీ ఇలా సానుకూల ధోరణిలో ఆలోచిస్తూ సాగిపోండి. ఈ దశా మరీ కష్టంగా తోయదు. ఏమంటారు?

(ప్రపంచ మెనోపాజ్ దినోత్సవం)

నటి... రచయిత... మిస్ ఇండియా!



'నా జీవితంలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తి నేనే. నా బలాలను నేను గుర్తించుకున్నప్పుడల్లా ఇంకా సాధించాలన్న తపన నాలో పెరుగుతుంది. అది ప్రతిరోజూ నన్ను నేను ఉత్తమంగా తీర్చిదిద్దుకునేలా చేస్తుంది'... అంటూ మిస్ ఇండియా వేదికపై ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించింది **నిఖితా పోర్వాల్**. అంతేనా... 30 మంది పోటీదారులను దాటి, కిరీటాన్నీ కైవసం చేసుకుంది. 'ఒకరిని అనుసరించొద్దు... ప్రశ్నించు, నేర్చుకో... అలా నీకంటూ సొంత దారిని సృష్టించుకో' అని చెప్పే కుటుంబ వాతావరణంలో పెరిగిందీమె. ఆ మాటల ప్రభావమే తనను నడిపిస్తోంది అంటుంది 24ఏళ్ల నిఖిత. స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని. బరోడాలోని మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తోంది. కథలు, పురాణగాథలు వింటూ పెరిగిన ఈమెకి కథకురాలు అవ్వాలని కోరిక. దానికి నాటక రంగమే సరైనదని భావించి థియేటర్ ఆర్టిస్ట్‌గా మారింది. అరవై నాటకాల్లో నటించడమే కాదు... 250 పేజీల 'కృష్ణ లీల'ను రచించింది కూడా. 18 ఏళ్లకే టీవీ యాంకర్ అయ్యింది. తన ఫొటోని బిల్‌బోర్డ్స్‌పై చూసుకున్న క్షణం చాలా గర్వంగా తోచిందట. అందుకే సినిమాల్లోనూ రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నా అంటుంది నిఖిత. ఆ కల నెరవేర్చుకోవడానికే ఓ ఫీచర్ ఫిల్మ్‌లోనూ నటించింది. ఇది అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది కూడా. త్వరలో భారత్‌లోనూ విడుదల కానుంది.

నిఖితకి భక్తి ఎక్కువ. జంతువులంటే ప్రేమ. ఎన్జీవోలతో కలిసి వాటి సంరక్షణకు పాటుపడుతోంది. 'ఈ భూమి మన సొంతం కాదు. మనం కేవలం దీని పరిరక్షకులం. దాని రక్షణ మన బాధ్యత. మన ఆలోచనలు, తెలివితేటలను మన కోసమే కాదు... మనపై ఆధారపడే మూగజీవాల సంరక్షణకీ వినియోగించా'లనే నిఖిత జంతువధకు వ్యతిరేకంగా పోరాడుతోంది కూడా. తనకు ప్రకృతి అన్నా కళలన్నా ప్రేమే. ఓవైపు చదువుతూనే తన కలలపైనా దృష్టిపెడుతోంది. అంతేకాదు, 'గ్యాడ్జెట్లు, పెరుగుతోన్న సాంకేతికతతో సమయం ఆదా అవుతోందని సంబరపడుతున్నాం. కానీ దాని మాయలో పడి సమయ వృథా చేసుకోవద్దు. జీవితంలో ఏం సాధించాలి అనుకుంటున్నారో దానిపై ఎక్కువ దృష్టిపెట్టండి' అని యువతకి సలహానిస్తోంది.

60వ ఫెమినా మిస్ ఇండియా పోటీలు ముంబయిలో జరిగాయి. దాద్రా అండ్ నగర్ హవేలీకి చెందిన రేఖా పాండే, గుజరాత్ అమ్మాయి ఆయుషీ ఢోలకియా 2, 3 స్థానాల్లో నిలిచారు. విజేతగా ప్రకటించాక 'ఇప్పుడు నేను అనుభవిస్తోన్న ఆనందాన్ని వర్ణించలేను. ఇదంతా ఇప్పటికీ నమ్మలేకపోతున్నా.. కానీ నా తల్లిదండ్రుల కళ్లలోని ఆనందం చూసి గర్వంగా ఉంది. నా ప్రయాణం ఇప్పుడే మొదలైంది. ఇంకా నేను సాధించాల్సింది చాలా ఉంద'ని సంతోషాన్ని వ్యక్తం చేసింది నిఖిత. అన్నట్టూ... తనకు ఐశ్వర్యారాయ్ అంటే చాలా ఇష్టమట. మిస్ ఇండియా గెలుపుతో మిస్ వరల్డ్ వేదికపై పోటీ పడే అవకాశాన్ని దక్కించుకుంది నిఖిత. ఆ కిరీటాన్నీ అందుకోవాలని కోరుకుందామా మరి?


నిఖిత

ఒంటిని డిటాక్స్ చేద్దామా!

కనిపించిందల్లా తినేస్తాం. చిన్న నొప్పికే... యాంటీబయోటిక్స్ వాడేస్తాం. ఇవన్నీ శరీరంలో వ్యర్థాలను పేరుకునేలా చేస్తాయి. బరువు పెరిగేలా చేస్తాయి. చర్మాన్ని నిర్జీవంగా మార్చేస్తాయి. మరి వీటిని బయటకి పంపిస్తేనే... ఆరోగ్యంగా ఉండేది. ఇందుకోసం ఓ గ్లాసు ఈ ఇన్‌ఫ్యూజ్డ్ నీళ్లను తాగేయండి. బోలెడన్ని ప్రయోజనాలు...

కీరదోస- పుదీనా- దాల్చిన చెక్క



మూత ఉన్న గాజు సీసాలోకి లీటరు నీళ్లను నింపి... అందులో పలుచగా చక్రాల్లా కోసిన ఐదు కీరదోస ముక్కల్ని వేయండి. ఆపై రెండు పుదీనా ఆకులు, ఒక నిమ్మకాయ స్లైసు, చిన్న దాల్చిన చెక్క ముక్క వేసి నాలుగైదు గంటలైనా నాననివ్వండి. లేదా రాత్రంతా ఫ్రిజ్‌లో ఉంచి ఉదయాన్నే తాగండి. ఇదే సూత్రం అన్నింటికీ వర్తిస్తుంది. శరీరంలోని వ్యర్థాలు బయటకి పోవడమే కాదు... డీహైడ్రేషన్ సమస్యనీ అదుపులోకి తెస్తాయి ఈ నీళ్లు. కడుపుబ్బరం తగ్గుతుంది. రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉంటాయి.

బత్తాయి-అల్లం- తులసి



బత్తాయిని సన్నటి చక్రాల్లా తరిగి చల్లటి నీళ్లల్లో వేయాలి. దానిలో చిన్న అల్లం ముక్క, నాలుగు తులసి ఆకులు వేసి నాననివ్వాలి. ఈ నీళ్లు శరీరాన్ని డిటాక్స్ చేస్తాయి. బత్తాయిలో విటమిన్ సి తగినంతగా లభిస్తుంది. అల్లం జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. ఇందులోని జింక్, కాల్షియం వంటి ఖనిజాలు నిస్సత్తువను దూరం చేస్తాయి. తులసిలోని యాంటీఆక్సిడెంట్లు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి.

బంగారం-వెండి



17న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం (24క్యా)	79,210	78,840	76,630	75,875	78,000	78,000	78,900	78,500	77,830	77,600
ఆర్నమెంట్	72,400	72,200	71,600	71,400	72,230	72,230	72,580	72,250	71,600	71,400
వెండి (కిలో)	94,680	94,531	93,800	93,600	93,000	93,000	93,500	93,000	95,000	94,000

తమిళనాడు (రూ.లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	7,160	7,140
వెండి (గ్రా)	103.00	103.00

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.

వేద్దామా... గళ్ల డ్రెస్సు?





మెరిసే రంగులు... పెద్ద పెద్ద గళ్లు... ఒకప్పుడు ఈ అందం నేత చీరలదే! ఇప్పటికీ ఈ వర్ణన వాటినే గుర్తుకు తెస్తుంది. పట్టుచీరల్లోనూ ఆ అందం అడపాదడపా పలకరిస్తూనే ఉంటుంది. మనకి మాత్రం ఈ గళ్ల ఫ్యాషన్ కొత్తా? జీన్స్ మీదకి వేసే టాప్‌లు, ఫ్రాకుల్లో ఎప్పుడో అలరించింది. మరిప్పుడెందుకు ప్రస్తావన అంటారా? సస్టెయినబిలిటీ... దీనికి ఎంత ప్రాధాన్యం పెరుగుతోందో తెలుసు కదా! దానికి వస్త్ర ప్రపంచంలో అనువైనదంటే చేనేతే! ఈ వస్త్రాలు పర్యావరణ హితం... భూమిలోనూ త్వరగా కలిసిపోతాయి. నేతతీరు చర్మానికి గాలి తగిలేలా చేసి మేనికీ హాయినిస్తుంది. పైగా కాలంతో సంబంధం లేకుండా అనువుగానూ ఉంటాయి. సమస్యల్లా... అవి కనిపించే తీరే! ఆధునిక అమ్మాయిలు ఆ తరహావి ఎలా మెచ్చుతారు? అలాగని ఊరుకుంటే ఎలా... అందుకే డిజైనర్లు నేత వస్త్రాలపై దృష్టిపెట్టారు. ఆనాటి గళ్ల డిజైన్లలో ఇలా ట్రెండీగా ఫ్రాక్‌లను తీసుకొచ్చేశారు. నేతకారులూ కొత్తదనాన్ని అందిపుచ్చుకుంటున్నారు. కాబట్టే... వస్త్రరకంలోనే కాదు రంగుల్లోనూ బోలెడు రకాలు తీసుకొచ్చేస్తున్నారు. ఫలితమే సంప్రదాయ వస్త్రానికి ఇలా ఆధునిక లుక్! బాగున్నాయి కదూ! నాటి లుక్‌లో నేటి ఫ్యాషన్... మీకూ నచ్చిందా? ఇంకేం ప్రయత్నించేయండి. ట్రెండీగా కనిపించొచ్చు... పర్యావరణానికీ మేలు. భలే జోడీ కదూ!

నేటి ఫ్యాషన్



బొమ్మలతో మెదడుకు మేత!

ఏడాది కూడా నిండని పిల్లలూ ఫోన్ చేతికిస్తేనే అన్నం తింటామంటారు. పోనీ ఏదైనా ఆకర్షణీయంగా ఉండే బొమ్మలతో వాళ్ల దృష్టి మళ్లిద్దామంటే అటువంటివి మార్కెట్‌లోనూ కనిపించడం లేదు. ఇదే సమస్య హరిప్రియకూ వచ్చింది. తన ఇద్దరు పిల్లలకు బొమ్మల కోసం వెతికినప్పుడు నిరాశే ఎదురైంది. అదే ఆమెను బొమ్మల తయారీ సహా పిల్లల సృజనాత్మకతను పెంచే పజిల్స్, గేమ్స్‌కు రూపకర్తను చేసింది.



తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన హరిప్రియ. బీఎస్సీ ఎలక్ట్రానిక్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసింది. ఈమెకు ఇద్దరు పిల్లలు. ఫోన్ ఇవ్వకపోతే పెద్ద పాప పెట్టే పేచీ భరించలేకపోయేది. తన దృష్టి మళ్లించాలంటే... ఎలాగైనా బొమ్మల్ని ఇష్టపడేలా చేయాలనుకునేదీమె. 'బొమ్మలతో ఆడుకుంటే పిల్లల్లో జీవననైపుణ్యాలు పెరగాలి. వాళ్ల మెదడు అభివృద్ధి చెందాలి. తగిన విజ్ఞానాన్నీ అందించాలి. కానీ అటువంటివి నాకెక్కడా మార్కెట్‌లో కనిపించలేదు. దాంతో నా ఊహకు తగ్గట్లు నేనే ఎందుకు బొమ్మలను తయారు చేయకూడదు అనుకున్నా. అయితే ఇద్దరు చిన్నారులతో నువ్వు పనిచేయడం కష్టం అన్నారంతా. నేను మాత్రం పట్టుదలగా చేయాలనుకున్నా. దీనికి అమ్మ భాను ప్రోత్సాహం దొరికింది. అలా రూ.5వేల పెట్టుబడితో 'ఎక్స్‌ట్రోకిడ్స్' ప్రారంభించా. అన్ని వయసులవారికీ బొమ్మలుగానే కాకుండా వారి మేధాశక్తిని పెంచేలా రకరకాల డిజైన్లలో ఆటవస్తువులు తయారు చేసి ఆన్‌లైన్ విక్రయాలు ప్రారంభించాం. అంతవరకు బాగానే ఉంది. కానీ నెల గడిచినా ఆర్డర్స్ రాలేదు. సిబ్బందికి జీతాలు, అద్దె వంటివి మా ఎదుట సవాళ్లుగా నిలిచాయి. 'నష్టం రావొచ్చు, కంగారు పడుతున్నావేమో' అన్నారంతా. నా సహనానికి సమాధానం దొరికింది. ఆలస్యంగానైనా మొదటి ఆర్డరు అందుకున్నా. ఆ తర్వాత నుంచి నెలకు 15వేలకుపైగా ఆర్డర్లు వస్తున్నాయి' అంటోంది హరిప్రియ.

లక్షల్లో...

ప్రారంభించిన మూడేళ్లకే ఇన్‌స్టాలో 'ఎక్స్‌ట్రోకిడ్స్'కు అయిదు లక్షల మంది ఫాలోయర్లు వచ్చారు. 'కొత్త డిజైన్‌లో బొమ్మ తయారుచేసి ముందుగా మా పిల్లలకే ఇస్తా. వాళ్లు ఆసక్తి చూపిస్తే అది సక్సెస్ అయినట్లే. ఎడ్యుకేషనల్ టాయ్స్, ఫ్యామిలీ గేమ్స్, పజిల్స్, మెమరీకార్డు గేమ్స్ వంటివి ప్రస్తుతం 500రకాల బొమ్మలను విక్రయిస్తున్నాం. మాకు 5 లక్షల మందికిపైగా వినియోగదారులున్నారు. మొదట ఆర్డర్లు రాని సమయంలో బొమ్మల గురించి ఆన్‌లైన్‌లో వీడియో పోస్ట్ చేద్దామని అమ్మ సలహా ఇచ్చింది. తను పెద్దగా చదువుకోలేదు. గృహిణిగా ఉంటూ నాన్నకు చాకొలెట్ల వ్యాపారంలో సాయంగా ఉండేది. నాన్న చనిపోయిన తర్వాత ఇంట్లోనే ఉండే అమ్మ ఆలోచన మా బొమ్మల గురించి అందరికీ తెలిసేలా చేసింది. మొదటి వీడియోకు 60వేల వ్యూస్ వచ్చాయి. దాంతో పాటు బొమ్మల విక్రయాలూ మొదలయ్యాయి. ప్రతి కొత్త బొమ్మ నుంచి పిల్లల మెదడుకు అందే ప్రయోజనాలను అమ్మ వీడియోగా వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసి అవగాహన కలిగిస్తోంది. మనసులో వచ్చిన ఆలోచనను ఫాలో అయితే చాలు. విజయం మనదే అవుతుంద'ని చెప్పే హరిప్రియ నిజంగానే అందరికీ మార్గదర్శకురాలు కదూ!



ఈనాడు

హైదరాబాద్ 18-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 68

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


Results that matter,
Care that counts
ALLEN
now also in
HYDERABAD
AIR 1
JEE ADV.
355/360 Highest Ever % Score
(Classroom Course)
NEET (UG)
720/720 Highest Scorers
(Classroom Course)
JEE MAIN
300/300 Record Score
(Classroom Course)
HISTORIC HAT-TRICK IN 2024
JEE ADV. 2024
VED LAHOTI
Classroom
JEE MAIN 2024
NILKRISHNA
Classroom
NEET (UG) 2024
MAZIN MANSOOR
Classroom
NEET (UG) 2024
PRACHITA
Classroom
NEET (UG) 2024
DIVYANSH JITENDER
Classroom
NEET (UG) 2024
NEHA K. MANE
Classroom
NEET (UG) 2024
TAIJAS SINGH
Classroom
Better faculty | Better student care | Better infrastructure | Better results
1 IN 5 STUDENTS
in IIT in 2024 is from ALLEN Classroom Courses
23 STUDENTS
from ALLEN Classroom secure AIIMS Delhi seats in 2024
57 GOLD, 40 SILVER, 16 BRONZE
Medals won by ALLENites in last 5 years at International Olympiads
45 AIR in Top 100-JEE Adv. | 34 AIR in Top 100-JEE Main | 39 AIR in Top 100- NEET (UG)
Highest among all institutes of India in 2024
Hyderabad, are you ready for results?
ADMISSION ANNOUNCEMENT FOR SESSION 2025-26
JEE (MAIN+ADV.) | NEET (UG) | OLYMPIADS
CLASSES 6th TO 12th & 12th PASS
Scan to enrol
ENROL NOW, To avail the
Early Fee Benefit
Call : 99029 01234
Offer valid till 30th Oct'24
99029 01234
allen.ac.in/hyderabad
ALLEN Hyderabad : 3rd Floor, 1-62, Kavuri Hills, Beside Indwell House, Madhapur, Hyderabad, Telangana
Madhapur
Kukatpally
Dilsukhnagar
Miyapur
Secunderabad
Disclaimer: We provide an academic ecosystem and environment to prepare students for their target examinations. Studying in a coaching institute does not guarantee selection for the examination. Selection depends on preparation, admission seats in competitive exam and the number of applicants appearing.

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

హైదరాబాద్ 18-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 68 | రూ. 6-50 పేజీలు 18 | www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

యువతా.. ఫిట్‌గా ఉన్నారా?





తెలియాలంటే 18 ఏళ్లకే వైద్యపరీక్షలు అవసరం

- రాబోయే జబ్బుల్ని ముందే గుర్తిస్తే నివారణ సులువు
- ప్రభుత్వ నిధులతో అందరికీ వైద్యం అసాధ్యం
- ఆసుపత్రుల ఆధ్వర్యంలో బీమా.. మంచి ప్రత్యామ్నాయం
- దేశంలోనే తొలిసారిగా మా ఆసుపత్రి నుంచి ఆరోగ్యబీమా

'ఈనాడు' ముఖాముఖీలో 'నారాయణ హెల్త్' ఛైర్మన్ డాక్టర్ దేవిశెట్టి

"రోగి ఉదయం ఆసుపత్రికి వస్తే.. వైద్యుడితో సంప్రదింపులు, టెస్టులు, రిపోర్టులు, మళ్లీ వైద్యుడికి చూపించుకోవడం.. ఇవన్నీ పూర్తయ్యేసరికి రాత్రి అవుతుంది. ఈ విధానం మారాలి. డిజిటల్ రూపంలో ఇది సాధ్యమవుతుంది. రిసెప్షన్ డెస్క్ వద్దే క్యూ ఆర్ కోడ్ ద్వారా రోగుల వివరాలన్నీ వైద్యులకు అందుబాటులో ఉంచాలి. యాప్‌లో డాక్టర్ అపాయింట్‌మెంట్ బుక్ చేసుకొని కలుసుకోవచ్చు. వైద్యపరీక్షల ఫలితాలను వైద్యుడు ఆన్‌లైన్‌లోనే చూసి.. రోగికి మందుల చీటీ (ప్రిస్క్రిప్షన్) కూడా ఆన్‌లైన్‌లోనే పంపించాలి. దీనివల్ల గంటల కొద్దీ నిరీక్షించాల్సిన అవసరం ఉండదు."

ఎం.ఎల్.నరసింహారెడ్డి
ఈనాడు - హైదరాబాద్

మీరు యువత? ఫిట్‌గా ఉన్నారా? లేక ఉన్నారని భావిస్తున్నారా? ఏదో కొద్దిదూరం అలుపు లేకుండా పరుగెత్తగలను కాబట్టి ఫిట్‌గా ఉన్నామనుకుంటే పొరపాటేనంటున్నారు ప్రఖ్యాత కార్డియో థొరాసిక్ సర్జన్, నారాయణ హెల్త్ ఆసుపత్రుల ఛైర్మన్ డాక్టర్ దేవి ప్రసాద్ శెట్టి. 18 ఏళ్ల వయసులోనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని.. తద్వారా రాబోయే జబ్బులను ముందే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవచ్చని ఆయన సూచిస్తున్నారు. యువతకు తమ హెల్త్ నంబర్స్ (ఆరోగ్యపరమైన పరామితులు) తెలిసి ఉండాలని ఆయన స్పష్టం చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులే ఎవరికి వారు సొంతంగా వైద్య బీమా పాలసీలను తీసుకొస్తే.. అటు ఆసుపత్రులకు, ఇటు రోగులకు ఉభయతారకంగా ఉంటుందని ఆయన విశ్లేషించారు. దేశంలోనే మొదటిసారిగా నారాయణ హెల్త్ ఆసుపత్రులు ప్రారంభించిన ఆరోగ్యబీమాతో ఓ వినూత్న విధానానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. అన్ని ప్రైవేటు ఆసుపత్రులూ దీన్ని అమలులోకి తెస్తే.. వైద్యరంగ స్వరూప స్వభావాలే మారిపోనున్నాయని డాక్టర్ దేవిశెట్టి అంచనా వేశారు. కొవిడ్ తర్వాత యువత గుండెపోటుతో మరణిస్తున్నారన్నది అపోహేనని, వైద్యపరీక్షలు చేయించుకునే వారు పెరగడంతో గుండె జబ్బులున్నవారి సంఖ్య కూడా ఎక్కువగా కనిపిస్తోందని 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

పూర్తి ఇంటర్వ్యూ 6లో



కేంద్ర న్యాయశాఖకు పంపిన సిఫార్సు లేఖను జస్టిస్ సంజీవ్ ఖన్నాకు చూపిస్తున్న సీజేఐ జస్టిస్ డీ.వై.చంద్రచూడ్

తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా!

- కేంద్ర ప్రభుత్వానికి జస్టిస్ చంద్రచూడ్ సిఫార్సు 10లో
- వచ్చేనెల 10న ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి పదవీ విరమణ

పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6(ఎ) రాజ్యాంగబద్ధమే

- అస్సాం వలసలకు సంబంధించి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు 12లో

సుందరీకరణ కాదు.. పునరుజ్జీవం

ప్రపంచంలోనే అద్భుత కట్టడాలు నిర్మించిన ఐదు సంస్థలకు మూసీ డీపీఆర్ బాధ్యతలు అప్పగించాం

- డీపీఆర్ ఖర్చు రూ.141 కోట్లు మాత్రమే..
- నది ఒడ్డున హరీశ్, కేటీఆర్, ఈటల మూడు నెలలు నివసిస్తే ప్రాజెక్టును విరమించుకుంటా
- మూసీ పరీవాహకంలో ఒక్క ఇటుక కూడా కూల్చలేదు
- భారాస హయాంలో ఒక్క ప్రాజెక్టు కిందైనా నిర్వాసితులకు న్యాయం చేశారా?
- దీనిపై చర్చించేందుకు సెక్యూరిటీ లేకుండా వస్తా
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: "పదేళ్లు తెలంగాణను దోచుకున్నవారు.. ఇప్పుడు మూసీ పునరుజ్జీవాన్ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు. 'సుందరీకరణ' అంటూ కాస్మెటిక్ రంగులు అద్దాలని చూస్తున్నారు. వాళ్ల మెదడులో మూసీ మురికి కంటే ఎక్కువ విషం నింపేసుకొన్నారు. ప్రజల్లో అనుమానాలు రేకెత్తించేలా విషప్రచారం చేస్తున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మూసీ నరకకూపంగా మారింది. అందులోంచి ప్రజలను బయటకు తీసుకురావాలనేదే మా లక్ష్యం. వారి జీవనప్రమాణాలను మెరుగుపరచాలని, వారి సమస్యలన్నీ పరిష్కరించాలనేదే మా ఆలోచన. ఇది మూసీ సుందరీకరణ కానే కాదు.. ఇది మూసీ పునరుజ్జీవం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, తదితరులతో కలిసి మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. ...మిగతా 13లో

> మూసీ మురికిలో దుర్భర జీవనం గడుపుతున్న పేదల పక్షాన మాట్లాడుతున్నామని హరీశ్, కేటీఆర్, ఈటల చెబుతున్నారు. పేదలపై వారికి నిజంగా ప్రేమ ఉంటే.. ఆ ముగ్గురూ మూడు నెలలు మూసీ ఒడ్డున నివసించాలి. వారికి మూడు ఇళ్లు కేటాయించాలని అధికారులను ఆదేశిస్తున్నా. భోజన సదుపాయం, ఇతర వసతులు కూడా కల్పించండి. వారు మూడు నెలలు ఆ మురికికూపంలో ఉండగలిగితే నేను ఈ ప్రాజెక్టును విరమించుకుంటా. నా ఆస్తులు అమ్మైనా సరే.. ఈ ఒప్పందానికి అయిన ఖర్చును భరిస్తా. -సీఎం రేవంత్‌రెడ్డి

ఇక 60 రోజులే

రైల్వే ముందస్తు రిజర్వేషన్ల గడువు తగ్గింపు


- నవంబరు 1 నుంచి అమలు



ఈనాడు, దిల్లీ: రైళ్లలో ముందుగా బెర్తులు రిజర్వు చేసుకోవడానికి ఇప్పటివరకు ఉన్న 120 రోజుల గరిష్ఠ గడువును 60 రోజులకు తగ్గిస్తూ రైల్వేబోర్డు నిర్ణయం తీసుకొంది. నవంబరు 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. ప్రస్తుత గడువుతో ఈ నెల 31 వరకు చేసుకునే ముందస్తు రిజర్వేషన్లు చెల్లుబాటవుతాయి. 60 రోజుల కంటే ఎక్కువ వ్యవధికి ఇప్పటికే టికెట్లు రిజర్వు చేసుకున్నవారు వాటిని రద్దు చేసుకోవాలంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. పగటి పూట ప్రయాణాలు జరిగే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ గడువు (ఏఆర్‌పీ) ఇప్పటికే తక్కువగా ఉన్నందువల్ల దానిని మార్చడం లేదని రైల్వేబోర్డు తెలిపింది. విదేశీ ప్రయాణికులకు ప్రస్తుతం ఉన్న 365 రోజుల గడువులో ఎలాంటి మార్పు లేదని పేర్కొంది. గతంలో ఏఆర్‌పీ 30-60 రోజులే ఉండేది. 2015 మార్చి 25 నుంచి దీనిని 120 రోజులకు పెంచారు. 1981-85 మధ్య, 2012-13 మధ్య కూడా 120 రోజుల గడువు అమల్లో ఉండేది. నాలుగు నెలల ముందుగా టికెట్లు బుక్ చేసుకుంటున్నవారిలో ...మిగతా 6లో

హమాస్ అగ్రనేత
యాహ్యా సిన్వర్ హతం

- డీఎన్ఏ పరీక్షలు జరిపి ధ్రువీకరించిన ఇజ్రాయెల్
- బుధవారమే ఐడీఎఫ్ దాడిలో మృతి
- హమాస్‌కు భారీ ఎదురుదెబ్బ




జెరూసలెం: గాజా యుద్ధంలో ఇజ్రాయెల్ అతి పెద్ద విజయం సాధించింది. అక్టోబరు 7 దాడుల సూత్రధారి. . హమాస్ మిలిటెంట్ గ్రూపు అధినేత యాహ్యా సిన్వర్‌ను హతమార్చింది. ఈ విషయాన్ని గురువారం ఇజ్రాయెల్ విదేశాంగమంత్రి కాంట్జ్ ధ్రువీకరించారు. "ఇది ఇజ్రాయెల్‌కు సైనికంగా, నైతికంగా ఘనవిజయం. ఇరాన్ నేతృత్వంలో రాడికల్ ఇస్లాం దుష్టశక్తులకు వ్యతిరేకంగా స్వేచ్ఛా ప్రపంచం సాధించిన విజయమిది. సిన్వర్ ఏరివేతతో తక్షణ కాల్పుల విరమణకు, బందీల విడుదలకు మార్గం సుగమం కానుంది" అని ఆయన పేర్కొన్నారు. సిన్వర్‌ను హతమార్చి, లెక్కను సరిచేశామని.. అయితే యుద్ధం మాత్రం ఆగదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. ...మిగతా 6లో

జేఈఈ మెయిన్‌లో ఛాయిస్ ఎత్తివేత

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ మెయిన్ పరీక్షల్లో గత మూడేళ్ల నుంచి సెక్షన్ బీలో కొనసాగుతున్న ఛాయిస్‌ను ఎత్తివేశారు. ఈ మేరకు జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) గురువారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. జేఈఈ మెయిన్ ర్యాంకుల ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 32 ఎన్ఐటీల్లో బీటెక్ సీట్లు భర్తీ చేస్తారు. జేఈఈ మెయిన్‌లో 75 ప్రశ్నలు...ఒక్కో దానికి 4 మార్కుల చొప్పున మొత్తం 300 మార్కులకు ప్రశ్నపత్రం ఇచ్చేవారు. గణితం, భౌతిక, రసాయనశాస్త్రాల నుంచి 25 చొప్పున ప్రశ్నలు ఉండేవి. కొవిడ్ నేపథ్యంలో విద్యార్థులకు వెసులుబాటు ఇచ్చేందుకు ప్రతి సబ్జెక్టులో ఛాయిస్ ప్రశ్నలు ఇచ్చారు. జేఈఈ మెయిన్ 2021 నుంచి ఒక్కో సబ్జెక్టులో 30 చొప్పున మొత్తం 90 ప్రశ్నలు ఇస్తూ వచ్చారు. ప్రతి సబ్జెక్టులో ఏ, బీ సెక్షన్లు ఉండేవి. ...మిగతా 6లో

దన్ను ఇచ్చిన వారిపై కన్ను

- ఆక్రమణలకు సహకరించిన అధికారులు, నాయకులపై హైడ్రా దృష్టి
- అక్రమార్జనపై అనిశాతో విచారణ చేయించే యోచన



ఈనాడు - హైదరాబాద్

చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు.. వాళ్లు తలుచుకుంటే హాంఫట్ అన్నట్లు అన్నీ మాయమే. ఇప్పుడు తీరిగ్గా లెక్కలు చూస్తుంటే పెద్దసంఖ్యలో చెరువుల జాడ లేకుండా పోయింది. నిబంధనలకు నీళ్లొదిలి.. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు అడ్డగోలుగా అనుమతులిచ్చిన వారిపై అవినీతి నిరోధకశాఖ (అనిశా) దృష్టి సారించింది. ఇప్పటికే కేసులు నమోదైన వారితోపాటు కబ్జాలకు అధికారిక అనుమతులిచ్చిన వారందరి అక్రమార్జన బాగోతాలను వెలికితీయనుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం అనిశా ఇప్పటికే వీరందరి జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు లోపల నీటి వనరులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)'ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ...మిగతా 6లో

ఉద్యోగ విరమణ చేసిన వారిపైనా..

చెరువులు, కుంటలను మాయం చేయడంలో కీలకపాత్ర పోషించిన కొందరు అధికారులు ఉద్యోగ విరమణ చేసినా.. వారి అక్రమార్జన కూడా వెలికితీయాలని ప్రభుత్వం భావిస్తోంది. కబ్జాల్లో ముఖ్యపాత్ర పోషించిన ఓ అధికారి వల్ల సగం చెరువులు, కుంటలు మాయమయ్యాయని, ఇప్పుడు అధికార పార్టీలోకి మారిన అప్పటి ప్రముఖ ప్రజాప్రతినిధి ఒకరు ఇందులో కీలకపాత్ర పోషించినట్లు అధికారులు గుర్తించారు. అప్పట్లో కబ్జా అయిన ఆస్తులు, వాటిలో నిర్మించిన కట్టడాలు, వాటి యజమానులతో సదరు అధికారితోపాటు ప్రజాప్రతినిధికి ఉన్న సంబంధాలపైనా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

మీ పాలనలో ఎన్ని ఉద్యోగాలిచ్చారు?

- శ్వేతపత్రం విడుదల చేస్తారా?
- కేటీఆర్‌కు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సూటి ప్రశ్న
- గాంధీభవన్‌లో గ్రూప్ 1 అభ్యర్థులతో చర్చలు



హైదరాబాద్, న్యూస్‌టుడే: 'మీ పదేళ్ల పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు? వాటిపై శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం ఉందా' అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్... భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే 50 వేల పైచిలుకు ఉద్యోగ నియామకాలు పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని ఆందోళన చేస్తున్న అభ్యర్థులు గురువారం గాంధీభవన్ ముట్టడికి ప్రయత్నించడంతో వారిని పోలీసులు అరెస్టు చేసి బేగంబజార్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. వారిని వెంటనే వదిలేసి గాంధీభవన్‌కు పంపించాలని మహేశ్‌కుమార్‌గౌడ్ పోలీసులకు సమాచారం పంపడంతో అభ్యర్థులు గాంధీభవన్‌కు వచ్చి ఆయనతో చర్చలు జరిపారు. 'గత భారాస ప్రభుత్వం 503 పోస్టులతో ఇచ్చిన జీవో 55ను రద్దు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా మరో 60 పోస్టులు పెంచుతూ జీవో 29 తీసుకువచ్చింది. పాత నోటిఫికేషన్‌లో ఇచ్చిన 503 పోస్టులలో కొత్త అభ్యర్థులకు అవకాశం ఇవ్వొద్దు. పెంచిన 60 పోస్టుల్లో మాత్రమే కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం ఇవ్వాలి. జీవో 29, రిజర్వేషన్ల అంశాల్లో కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు తీర్పు వచ్చిన తర్వాతే పరీక్షలు పెట్టాలి. 21 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలను రాయడానికి 95 శాతం మంది సిద్ధంగా లేరు' అని అభ్యర్థులు చెప్పారు. చర్చల అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. "నిరుద్యోగుల విషయంలో కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారు. గ్రూప్ 1 అభ్యర్థులు చెప్పిన విషయాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అందరికీ న్యాయం జరిగేలా చూస్తా" అని అన్నారు.

ప్రభుత్వానికి మొండి పట్టుదల ఎందుకు?

- గ్రూప్-1 మెయిన్స్‌ను రీషెడ్యూల్ చేయాలి
- అభ్యర్థులతో జరిగిన సమావేశంలో కేటీఆర్



ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని అభ్యర్థులు కోరుతున్నా.. ప్రభుత్వం ఎందుకు మొండి పట్టుదలకు పోతోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. అశోక్‌నగర్‌లో ఆందోళన చేపట్టిన అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నానని, వారిపై కేసులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో పలువురు అభ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. తమకు అండగా నిలవాలని వారు 'ఎక్స్'లో కోరడంతో వారిని పిలిచి చర్చించారు. 'ప్రధాన ప్రతిపక్షంగా అభ్యర్థులకు అండగా ఉంటాం. అవసరమైన న్యాయ సహాయం అందిస్తాం. ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రాజ్యాంగ విరుద్ధం. రిజర్వేషన్ల విషయంలోనూ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోంది. గ్రూప్-1 మెయిన్స్‌కు సంబంధించి 22 కేసులు న్యాయస్థానంలో ఉన్నాయి. మేము సుప్రీంకోర్టుకు వెళ్తే పరీక్షలను తప్పకుండా రద్దు చేస్తుంది. ఈ విషయం తెలిసి కూడా ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తోంది. న్యాయపరమైన సమస్యలన్నీ తీరిన తర్వాతే పరీక్షలను నిర్వహించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

21 నుంచి 27 వరకు గ్రూప్-1 ప్రధాన పరీక్షలు

- 46 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి
- అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి: సీఎస్ శాంతికుమారి



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి 27 వరకు గ్రూప్-1 ప్రధాన పరీక్షలు నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు. 2011 తరువాత జరుగుతున్న గ్రూప్-1 నిర్వహణలో ఎలాంటి అపోహలు, వదంతులకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గురువారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, కమిషన్ కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్, డీజీపీ జితేందర్, ఎస్పీడీసీఎల్ ఎండీ ముషారఫ్ అలీ, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. మహేందర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. సాంకేతికత, సోషల్ మీడియా విస్తృతమైన తరుణంలో పరీక్షల నిర్వహణ సవాలుగా మారిందన్నారు. గ్రూప్-1 ప్రధాన పరీక్షల నిర్వహణకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 46 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వీటికి 31,383 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో జిల్లా కలెక్టర్లు నేరుగా పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తారని, సంబంధిత పోలీసు కమిషనర్లు బందోబస్తు ఏర్పాట్లు చూస్తారని తెలిపారు. సీనియర్ అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు, ఆయా కేంద్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నవీన్ నికోలస్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 8, రంగారెడ్డిలో 11, మేడ్చల్ జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ గది, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, టీజీపీఎస్సీ కార్యాలయ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పర్యవేక్షిస్తామన్నారు. అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరుకు ప్రత్యేక సిబ్బందిని నియమించామని, మధ్యాహ్నం 1.30 గంటల తరువాత కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. స్క్రైబ్(పరీక్ష రాయడానికి సహాయకులు) అవసరమైన దివ్యాంగ అభ్యర్థుల హాల్ టికెట్లపై 'స్క్రైబ్' విషయాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నామని, వీరి కోసం 4 ప్రత్యేక పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వీరికి అదనంగా గంట సమయాన్ని కేటాయిస్తున్నట్లు ఆయన వివరించారు. గురువారం సాయంత్రం వరకు 90 శాతం మంది అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నట్లు టీజీపీఎస్సీ వర్గాలు వెల్లడించాయి. డౌన్‌లోడ్ చేసుకునేందుకు 20వ తేదీ వరకు అవకాశం ఉంది.

తప్పులతడక 'కీ'తో అర్హుల ఎంపికపై ప్రభావం

- సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయండి
- హైకోర్టులో గ్రూప్-1 అభ్యర్థుల అప్పీలు



ఈనాడు, హైదరాబాద్: ప్రిలిమినరీ పరీక్షలకు సంబంధించిన తప్పులతడక 'కీ' ఆధారంగా అభ్యర్థుల జాబితా రూపొందించి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తే అర్హుల ఎంపికపై ప్రభావం పడుతుందని పలువురు హైకోర్టుకు నివేదించారు. 'కీ'లో తప్పులున్నాయని, పరీక్షను రద్దు చేయాలని ఆధారాలతో సహా సమర్పించినా సింగిల్ జడ్జి తమ అభ్యర్థనలను పట్టించుకోకుండా 15న తీర్పు ఇచ్చారన్నారు. దీనిని సవాలు చేస్తూ జి.దామోదర్‌రెడ్డి తదితరులు హైకోర్టులో గురువారం అప్పీలు దాఖలు చేశారు. "టీజీపీఎస్సీ ప్రచురించిన తుది కీలో తప్పులున్నాయంటూ అఫిడవిట్‌లో పేర్కొన్నా, వాదనల్లో వినిపించినా సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదు. ఒక ప్రశ్నకు ఐచ్ఛిక సమాధానాల్లో సరైనది లేనప్పుడు దానిని తప్పుగా రూపొందించినట్లు పరిగణించాలి. కానీ ఉన్నవాటిలో దగ్గరి సమాధానాన్ని పేర్కొనాలంటూ కమిషన్ వాదనతో ఏకీభవించడం సరికాదు. ప్రాథమిక పరీక్ష ఒక్కటే ఎంపికకు ప్రామాణికం కాదని, ఇది కేవలం అర్హత పరీక్ష మాత్రమేనని సింగిల్ జడ్జి పేర్కొనడం తగదు. 41, 119 ప్రశ్నలను పరిశీలించి ఉంటే మాకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చేవి. ఈ రెండు ప్రశ్నలు తొలగిస్తే మెరిట్ జాబితాపై ప్రభావం పడుతుంది. ఇలాంటి 'కీ' ద్వారా మెయిన్స్‌కు అభ్యర్థుల జాబితా రూపొందించడం సరికాదు. అభ్యర్థుల వడపోతకు ప్రాథమిక పరీక్ష కీలకం. గతంలో తప్పులు జరిగాయనే రెండు సార్లు పరీక్షను రద్దు చేసిన విషయాన్ని గుర్తించాలి" అని అప్పీలులో పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించే అవకాశం ఉంది.



హైదరాబాద్ గాంధీనగర్ పార్కులో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

గ్రూప్-1 మెయిన్స్ వాయిదా వేయాలి

- మరోసారి ధర్నా చేపట్టిన అభ్యర్థులు
- పలువురిని పోలీసులు అరెస్టు చేయడంతో తీవ్ర ఉద్రిక్తత

గాంధీనగర్, ముషీరాబాద్, న్యూస్‌టుడే: జీవో 29 రద్దుతోపాటు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు గురువారం హైదరాబాద్‌లో మరోసారి ధర్నా చేపట్టారు. బుధవారం రాత్రి అశోక్‌నగర్‌లో మెరుపు ధర్నాకు దిగిన విషయం విదితమే. తిరిగి గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో గాంధీనగర్‌లోని కెనరాబ్యాంకు సమీపంలో ఉన్న జీహెచ్ఎంసీ ఉద్యానంలో వారంతా ఆందోళన చేపట్టారు. తోడుగా నిరుద్యోగులూ తరలిరావడంతో పార్కు కిక్కిరిసిపోయింది. అనంతరం ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. న్యాయం చేయాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు భారీగా మోహరించి వారిని అరెస్టు చేసేందుకు యత్నించడంతో ఆ ప్రాంతంలో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ.. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో 31 వేల మంది వరకు క్వాలిఫై అయితే.. 34 వేల మందిని మెయిన్స్ పరీక్షలను ఎలా అనుమతిస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రూప్-1పై న్యాయస్థానాల్లో ఉన్న కేసులు కొలిక్కివచ్చాకే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పోలీసులు పెద్దఎత్తున లాఠీలు పట్టుకొని వచ్చారని, తాము ఏమైనా పశువులమా? రజాకార్లమా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత పలువురు నిరసనకారులను పోలీసులు అరెస్టు చేయడంతో స్వల్ప వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలో ఓ మహిళ చేతికి స్వల్పగాయమైంది. అరెస్టు చేసిన వారందరినీ నగరంలోని వివిధ పోలీసుస్టేషన్లకు తరలించారు. కాగా గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అశోక్‌నగర్ క్రాస్‌రోడ్స్ మళ్లీ కొంత మంది అభ్యర్థులు నిరసనకు యత్నించగా పోలీసులు చేరుకుని అడ్డుకున్నారు.



మన దృక్పథాన్ని బట్టే పురోగతి

మన మేధస్సును, వనరులను ఏ విధంగా ఉపయోగిస్తున్నామన్నదాన్ని బట్టి వ్యక్తిగత, సమాజ పురోగతి ఆధారపడి ఉంటుంది. సమస్యలను పరిష్కరించే దిశగా శక్తియుక్తులను కేంద్రీకరించడం, భవిష్యత్తు దృష్టిని కలిగి ఉండటం, ఇంకా ఏమేం చేయగలమని ఆలోచించడం, ఇంకెన్ని పరిష్కార మార్గాలున్నాయో శోధించడం, సృజనాత్మక ధోరణితో పనిచేయడాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలి. మన వద్ద ఎన్ని వనరులున్నాయన్నది కాదు, వాటితో ఏం చేస్తున్నామన్నదే ముఖ్యం.

– మహాత్రియ, ఆధ్యాత్మికవేత్త

గ్రహం అనుగ్రహం

18–10–2024 శుక్రవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం
పాడ్యమి: మ. 3-01 తదుపరి విదియ
అశ్విని: సా. 4-02 తదుపరి భరణి
వర్జ్యం: మ. 12-17 నుంచి 1-47 వరకు
తిరిగి రా. 1-02 నుంచి 2-37 వరకు
అమృత ఘడియలు: ఉ. 9-18 నుంచి 10-47 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-15 నుంచి 9-02 వరకు
తిరిగి మ. 12-08 నుంచి 12-54 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ. 5.56; సూర్యాస్తమయం: సా.5.34

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నిజామాబాద్	35.5	25.6
ఆదిలాబాద్	34.3	22.7
రామగుండం	34.2	25.2
ఖమ్మం	33.6	25.0
రాజమహేంద్రవరం	33.5	25.5
తిరుపతి	33.4	24.0
హనుమకొండ	33.0	25.0
కర్నూలు	32.4	24.3
నెల్లూరు	32.3	24.5
కరీంనగర్	31.0	23.0
విజయవాడ	30.8	26.2
విశాఖపట్నం	30.8	25.8
మెదక్	30.6	21.0
హైదరాబాద్	30.4	23.4
సూర్యాపేట	30.0	26.5
నల్గొండ	29.5	23.4
మహబూబ్‌నగర్	28.8	23.9



విశ్వసనీయత అత్యంత కీలకం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో వ్యక్తులకైనా, సంస్థలకైనా అత్యంత కీలకమైనది విశ్వసనీయత. విద్యార్హతలు, నైపుణ్యాలు ఉన్నవారికి కొదవలేదు. ఇలాంటి పరిస్థితుల్లో సంస్థలు విశ్వసనీయత ఉన్నవారికే పెద్దపీట వేస్తున్నాయి. ఇచ్చిన మాటను నిలబెట్టుకునేవారికి, చెప్పిన పనిని సకాలంలో పూర్తిచేసేవారికే విశ్వసనీయత ఉంటుంది. విశ్వసనీయతను బ్రాండ్‌గా మార్చుకున్నవారికి అవకాశాల విషయంలో ఆకాశమే హద్దు.

- కార్లోస్ జిమెనెజ్, బ్రాండ్ బిల్డర్

డిగ్రీ కళాశాలల బంద్ విరమణ

• యాజమాన్య ప్రతినిధులతో బుర్రా వెంకటేశం చర్చలు సఫలం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల బంద్‌ను విరమిస్తున్నట్లు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం(టీపీడీఎంఏ) ప్రకటించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ గత నాలుగు రోజులుగా కళాశాలల బంద్ పాటిస్తున్న విషయం తెలిసిందే. ఫీజు బకాయిలు విడుదలకు చర్యలు తీసుకోవాలని గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, టీపీడీఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జా సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పరమేశ్వర్ తదితరులు ప్రగతిభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి విన్నవించారు. కళాశాలల యాజమాన్యాలతో చర్చించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని భట్టి ఆదేశించారు. దీంతో సచివాలయంలో సంఘం నేతలతో వెంకటేశం చర్చలు జరిపారు. ఫీజు బకాయిలను సత్వరమే విడుదల చేసే విధంగా చర్యలు తీసుకుంటామని, బంద్ విరమించాలని ఆయన కోరారు. విద్యాశాఖ కార్యదర్శి హామీ మేరకు బంద్‌ను విరమిస్తున్నట్లు సంఘం నేతలు తెలిపారు.



హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్తు భవన్ ముందు ధర్నా చేస్తున్న ఆర్టిజన్లు

మా ఉద్యోగాలను కన్వర్షన్ చేయాలి

• ఎన్పీడీసీఎల్ ఎదుట ఆర్టిజన్ల మహాధర్నా

వరంగల్ (బాలసముద్రం, విద్యానగర్), న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో ఒప్పంద ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న తమను అర్హతల ప్రకారం శాశ్వత ఉద్యోగులుగా కన్వర్షన్ చేయాలని గురువారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్లు మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ విద్యుత్తు ఆర్టిజన్ల కన్వర్షన్ ఐకాస 'హలో ఆర్టిజన్.. చలో వరంగల్' నినాదంతో ఇచ్చిన పిలుపు మేరకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్ల నుంచి వారు తరలివచ్చారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి ర్యాలీగా బయలుదేరి నక్కలగుట్టలోని విద్యుత్తు భవన్‌కు చేరుకుని, రోడ్డుపై బైఠాయించారు. ఐకాస ఛైర్మన్ ఈశ్వర్‌రావు మాట్లాడుతూ.. "గత ప్రభుత్వం 2017లో ఎన్పీడీసీఎల్ పరిధిలో 23,667 మందిని ఆర్టిజన్ పేరుతో ఒప్పంద కార్మికులుగా నియమించింది. వారిలో 19,587 మంది మిగిలారు. కొందరు ఉద్యోగ విరమణ చేయగా.. మరికొందరు మృతి చెందారు. విద్యార్హతల మేరకు అందరినీ శాశ్వత ఉద్యోగులుగా కన్వర్షన్ చేయాలి" అని డిమాండ్ చేశారు. ఐకాస కన్వీనర్ వజీర్ మాట్లాడుతూ గతంలో ఏపీఎస్ఈబీ, ట్రాన్స్‌కో సంస్థల పరిధిలో ఒప్పంద పద్ధతిలో పనిచేసిన గ్రామీణ విద్యుత్తు కార్మికులు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ.. విద్యార్హతలు బట్టి జేఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్, సబ్ ఇంజినీర్ తదితర పోస్టులకు ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ముఖ్య నేతలు సీఎండీ వరుణ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఐకాస నాయకులు నాగరాజు, అరవింద్, శంకర్, సదానందం, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ధర్నాకు పెద్ద ఎత్తున ఆర్టిజన్లు రావడంతో పోలీసులు ట్రాఫిక్‌ను అంబేడ్కర్, కాళోజీ కూడళ్ల మీదుగా మళ్లించారు.

22న ఎన్ఐఆర్డీలో పంచాయతీ సమ్మేళనం

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్డీ)లో పంచాయతీ సమ్మేళనం జరగనుంది. ప్రాథమిక స్థాయి నుంచి సేవల విస్తరణ, సరళతర జీవనం అనే అంశాలపై దీనిని నిర్వహించనున్నారు. తెలంగాణ, ఏపీతో పాటు గుజరాత్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మిజోరం, ఒడిశా రాష్ట్రాల నుంచి ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు.

ఈడీఎల్ఐ పథకం గడువు పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: ఈపీఎఫ్‌వో పరిధిలోకి వచ్చే వేతనజీవులు ఉద్యోగుల డిపాజిట్ అనుసంధాన బీమా (ఈడీఎల్ఐ) పథకం కింద రూ.7 లక్షల బీమా సదుపాయం పొందే గడువును పొడిగిస్తున్నట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఈ పథకం కింద 6 కోట్ల మంది ఈపీఎఫ్‌వో చందాదారులకు ప్రయోజనం కలుగనుందని పేర్కొన్నారు. చందాదారులు ఎవరైనా చనిపోతే ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు 1976లో ఈపీఎఫ్‌వో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ లెక్కన 2021 ఏప్రిల్ 28న పథకంలో ఆర్థిక సహాయాన్ని పెంచింది. కరోనాలో ఆర్థిక సహాయంగా రూ.2.5 లక్షలు, గరిష్ఠంగా రూ.7 లక్షలు అందిస్తామని పేర్కొంది. ఈ ఆర్థికసాయం పొందే గడువు మూడేళ్లపాటు ఉంటుందని ప్రకటించింది. ఆ గడువు గత ఏప్రిల్ 28తో ముగిసింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచి గడువును మళ్లీ పొడిగిస్తున్నట్లు కార్మిక శాఖ మంత్రి ప్రకటించారు.

ఈనాడు

కల్తీరాయుళ్లకు కఠిన దండనలు

బలవర్ధక ఆహారమైన పాలను పిల్లలూ పెద్దలూ నిత్యం తాగుతుంటారు. టీ, కాఫీ, పాయసం ఏదైనా సరే, పాలు కలవనిదే అసలైన రుచి రాదు. అలా అందరి దైనందిన జీవితాల్లో అంతర్భాగమైన పాలు ఎంత స్వచ్ఛంగా ఉంటున్నాయంటే ఆవేదనే మిగులుతుంది. దేశవ్యాప్తంగా లభించే పాలలో 68శాతం కల్తీవేనని ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్వే లోగడే తేల్చిచెప్పింది. ఉత్పత్తి, సేకరణ, సరఫరా.. ఇలా పలు దశల్లో పాలు కల్తీ అవుతున్నాయి. వ్యవస్థాగత సమస్యలు అనేకం దీనికి కారణమవుతున్నాయి. మరోవైపు, కొందరు ప్రబుద్ధులు ప్రమాదకర రసాయనాలతో తెల్లటి కాలకూటాన్ని రూపొందించి, పాల ప్యాకెట్ల పేరిట అమ్మేస్తున్నారు. తాజాగా హైదరాబాద్ శివారులో ఇలాంటి హేయ దందా ఒకటి వెలుగుచూసింది. అక్కడ నిత్యం పాల వంటి హాలాహలం అయిదు వేల లీటర్ల దాకా తయారవుతోంది. దాన్ని హోటళ్లూ టీస్టాళ్లకు విక్రయిస్తున్నారన్న సమాచారం తీవ్రంగా కలవరపరుస్తోంది. కల్తీ పాలవల్ల క్యాన్సర్లు, జీర్ణాశయ సమస్యలు, పిల్లల్లో వినికిడి, దృష్టి లోపాలు తలెత్తవచ్చు. కాసుల కక్కుర్తితో ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న దుర్మార్గులు క్షమార్హులు కానేకారు!

ఒక్క పాలు అనే ఏముంది- టీపొడి మొదలు పప్పుదినుసులు, పసుపు, మసాలాలు, తేనె, నెయ్యి... ఇలా ఇండియాలో ప్రతిదీ కల్తీమయమవుతోంది. ప్రజల్లో అవగాహన కొరవడటం, సరిపడినంతగా ఆహార భద్రతా సిబ్బంది, ల్యాబులు లేకపోవడంతో కల్తీలకు అడ్డుకట్ట పడటంలేదు. ఆకలి తీర్చే ఆహారాన్ని పరబ్రహ్మ స్వరూపంగా భావించే సంస్కృతి మనది. ఆదాయాల యావలోపడి చాలా రెస్టారెంట్లు, హోటళ్లు, బేకరీలు, మిఠాయి షాపుల యజమానులు పాడైపోయిన, ప్రమాదకర రంగులు కలిసిన ఆహారాన్ని ప్రజలకు అంటగడుతూ ఆరోగ్యాలను గుల్ల చేస్తున్నారు. కనీస పరిశుభ్రత గురించీ వారు పట్టించుకోవడం లేదు. హైదరాబాద్‌లో గడచిన ఆర్నెల్లలో అధికారులు జరిపిన సోదాల్లో 90శాతం ఆహారశాలలు ప్రమాణాలకు నీళ్లొదిలినట్లు తేలింది. నిర్వాహకుల బరితెగింపునకు అది అద్దంపడుతోంది. ఆహార పదార్థాల కల్తీ కారణంగా ఏటా పది కోట్ల మంది భారతీయులు పలు రకాల జబ్బుల బారిన పడుతున్నట్లు పరిశీలనలు చెబుతున్నాయి. భవిష్యత్తులో బాధితుల సంఖ్య ఏడాదికి పదిహేడు కోట్ల దాకా చేరుతుందన్న విశ్లేషణలు దడ పుట్టిస్తున్నాయి. ఇప్పటికైనా యంత్రాంగం తేరుకోకుంటే పెను సామాజిక సంక్షోభం తప్పదు!

ఒక వ్యక్తిపై హత్యాప్రయత్నం చేస్తేనే కనీసం పదేళ్ల జైలుశిక్ష విధించే వీలుంది. మరి, ఆహార కల్తీతో ఎంతోమంది ఆయుష్షులను తెగ్గోస్తున్న వారికి ఎలాంటి దండనలు పడాలి? కానీ, దేశీయంగా ఆ పరిస్థితి లేదు. చాలామంది కల్తీరాయుళ్లు స్వల్ప జరిమానాలతో స్వేచ్ఛాజీవులవుతున్నారు. కేసుల నమోదు నుంచి విచారణ వరకు అన్నిచోట్లా మేటవేసిన లోపాలు, అధికారుల నిర్లక్ష్యం, అవినీతి వంటివి నేరగాళ్లకు అయాచిత వరాలవుతున్నాయి. ఆహార భద్రతా నిబంధనలను తుంగలో తొక్కే ప్రజాశత్రువులకు చైనా, బంగ్లాదేశ్‌లు మరణశిక్ష విధిస్తున్నాయి. స్పెయిన్, ఫ్రాన్స్, బ్రెజిల్, అమెరికా వంటివి నిరంతర తనిఖీలతో జనారోగ్య పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. వాటి స్ఫూర్తితో దేశీయంగానూ కల్తీ దందాసురులపై ఉక్కుపాదం మోపాలి. సంబంధిత విభాగాల్లో ఖాళీలను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలి. నాసిరకం ఆహారోత్పత్తులపై ప్రజలు ఫిర్యాదులు చేసేలా ప్రోత్సహించడంతో పాటు వాటిపై సకాలంలో చర్యలు తీసుకోవాలి. సురక్షిత ఆహారాన్ని పొందడం- జనజీవన హక్కులో అంతర్భాగం. దాన్ని కాపాడటం ప్రభుత్వాల విధ్యుక్త ధర్మం!



మార్పుని అంగీకరించాలంటే ధైర్యం కావాలి. భద్రమైన, అలవాటైన సుఖానికి దూరమవ్వాల్సి వస్తుంది. అయినా మార్పు అవసరం. దాంతోనే కొత్తదనం, సర్దుకుపోయే తత్వం అలవాటవుతాయి. ప్రగతి సాధ్యమవుతుంది.

– దీపక్ పరేఖ్, హెచ్‌డీఎఫ్‌సీ మాజీ ఛైర్మన్

జీవన తత్వం

అనుకున్నంతనే అన్నీ అయిపోవు. కోరినంతనే ఘన విజయాలు వచ్చి ఒడిలో వాలవు. అందుకోసం ఎంతో శ్రమించాలి. ఓపిగ్గా కష్టనష్టాలకు ఎదురీదాలి. చిన్న మొక్క ఎన్నో ఏళ్లు పెరిగి మహా వృక్షమై చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తుంది. సూర్యోదయాన్ని ఆస్వాదించాలంటే చీకటిని భరించాల్సిందే. ఓర్పు వహిస్తేనే అనుకున్నది సాధించగలం. ముందుగా మనిషికి తనపై తనకు నమ్మకం ఉండాలి.

మన జీవితానికి మనమే శిల్పి. ఎన్నో బాధలు తట్టుకొని ధైర్యంగా నిలిస్తేనే అపురూపమైన విగ్రహంగా మారగలం. రాముడు, కృష్ణుడు సైతం కష్టాలను ఓర్చుకొని అవతార పురుషులుగా ఖ్యాతి పొందారు. దేవుడి మెడలో హారంగా మారాలంటే- గుండెల్లో గుచ్చే సూది బాధను పువ్వులు తట్టుకోవాలి. ఏది సాధించాలన్నా సంకల్ప బలంతో బాధలు, అపజయాలను ఎదిరించక తప్పదు. వేలసార్లు వైఫల్యం వెక్కిరించినా వెనక్కి తగ్గలేదు కాబట్టే థామస్ అల్వా ఎడిసన్ బల్బును తయారుచేశాడు. ప్రపంచానికి వెలుగులు పంచి చిరకీర్తిని సంపాదించుకున్నాడు. వైకల్యం ఉందని చింతిస్తూ కూర్చోకుండా పట్టుదలతో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన అరుణిమా సిన్హా గుండెనిబ్బరం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. ఓపిక ఉన్నంత వరకు కాదు, ఊపిరి ఉన్నంత వరకు పోరాడితేనే విజయతీరాలకు చేరగలం.



అంతర్యామి

ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రతిభ దాగుంటుంది. దాన్ని గుర్తించి మెరుగుపెడితే ఉన్నత శిఖరాలకు చేరవచ్చు. సముద్రాన్ని దాటే ప్రతిభ తనలో ఉందని వానర వీరులు చెప్పే వరకు హనుమంతుడికి తెలియదు. తనలోని లోటుపాట్లను గుర్తించి సరైన దిశానిర్దేశం చేయగల గురువులు, స్నేహితులను మనిషి సంపాదించుకోవాలి. అప్పుడు విజయానికి మార్గం మరింత స్పష్టమవుతుంది. బతుక్కి అసలైన అర్థమూ తెలిసివస్తుంది. జీవితానికి మించిన గ్రంథం లేదు, అనుభవానికి మించిన పాఠం లేదు అంటారు స్వామి వివేకానంద. జీవితపథంలో ప్రతి అనుభవం నుంచీ పాఠం నేర్చుకోవాలి. ఒకసారి చేసిన తప్పు మళ్లీ చేయకుండా జాగ్రత్త వహించాలి. ఆధ్యాత్మిక సాధనలోనూ దీక్ష ప్రారంభించగానే దైవానికి చేరువకావడం సాధ్యం కాదు. ముందుగా భగవంతుడి పట్ల మనసును పూర్తిగా లగ్నం చేయాలి. మన భారాన్ని ఆయన చూసుకుంటాడన్న నమ్మకాన్ని అణువణువూ నింపుకోవాలి. అప్పుడు అనవసర భయాలు, ఆందోళనలు తొలగి మనసు తేలికవుతుంది.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ చెప్పినట్లు కలలు నెరవేరాలంటే- ఏకాగ్రత, నైపుణ్యం, ఆచరణ అవసరం. లక్ష్యసాధనలో ఎన్నో అడ్డంకులు వస్తుంటాయి. కొండలు, లోయలు దాటి సుదీర్ఘంగా ప్రవహిస్తూ లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసే నదిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన హితబోధ చేశారు. బలహీనమైన ఆలోచనలు, మూఢ నమ్మకాలను వదిలిపెట్టాలి. విజయానికి పొంగిపోకుండా, అపజయానికి కుంగిపోకుండా స్థితప్రజ్ఞతతో లక్ష్యాన్ని చేరాలి. కొంత మెరుగైన స్థితికి చేరాక నా ఇల్లు, నా కుటుంబం అంటూ గిరిగీసుకొని కూర్చోవడమూ సరికాదు. చేతనైనంతలో నలుగురికీ సాయపడటంలో ఉండే ఆనందం వెలకట్టలేనిది. అది ఆచరణలో పెట్టినప్పుడే జీవితానికి సార్థకత.

– కిల్లాన శ్రీనివాస్

ట్రూడో మాటలను నమ్మేదెవరు?

ఇండియా, కెనడా సంబంధాల పతనం నిజ్జర్ హత్యకు చాలా కాలం ముందే మొదలైంది. 2018లో జస్టిన్ ట్రూడో వారం రోజుల పాటు భారత్‌లో కుటుంబ సమేతంగా పర్యటించారు. ట్రూడో పర్యటనలో ఆరో రోజు ఆయనతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లాంఛనంగా భేటీ అయ్యారు. ఆ సందర్భంగా చెప్పుకోదగ్గ పరిణామాలేవీ చోటు చేసుకోలేదు. ఇది ట్రూడో అహానికి శరాఘాతమైంది. ఫలితం లేని పర్యటనపై స్వదేశంలో ట్రూడో అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. అదే సమయంలో సిక్కు సముదాయం మన్నన పొందడానికి ఆయన చేసిన ప్రయత్నాలూ దారుణంగా విఫలమయ్యాయి. నిరుడు సెప్టెంబరులో జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ట్రూడో మళ్లీ భారత్‌కు వచ్చారు. ఆ పర్యటనా ఆయనకు అసంతృప్తినే మిగిల్చింది. ట్రూడోతో ప్రధాని మోదీ అప్పుడు అధికారిక ద్వైపాక్షిక సంప్రతింపులేవీ జరపలేదు. ఖలిస్థాన్ ఉద్యమానికి మద్దతిస్తున్నందుకు ట్రూడో ఈ సందర్భంగానూ విమర్శలపాలయ్యారు. ఈ పర్యవసానాల ఫలితంగా జీ20 దేశాధినేతలకు భారత రాష్ట్రపతి ఇచ్చిన అధికారిక విందుకు ఆయన హాజరు కాలేదు. తిరుగు ప్రయాణంలోనూ కెనడా ప్రధానికి కాలం కలిసి రాలేదు. ఆయన ప్రయాణించాల్సిన విమానంలో యాంత్రిక లోపం తలెత్తడంతో ఒక రోజు అదనంగా దిల్లీలోనే గడపాల్సి వచ్చింది. దీంతో ట్రూడోకు పుండుమీద కారం చల్లినట్లైంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఆయన్ను నవ్వులపాలు చేసింది. ఈ క్రమంలో ట్రూడో అకస్మాత్తుగా నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వ ప్రమేయాన్ని ప్రస్తావించారు. భారత పర్యటన కారణంగా వచ్చిన తలవంపుల నుంచి కెనడా ప్రజల దృష్టిని మరల్చడానికి ఇదో సాకుగా ఉపయోగపడింది.



ఖలిస్థాన్ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత ప్రభుత్వ హస్తముందని కెనడా అధికారులు చాలామంది ఒకే పాట పాడుతున్నారు. కానీ, అదేమీ శాస్త్రీయ పద్ధతిలో జరిపిన సమగ్ర విచారణ ఆధారంగా చేస్తున్న అభియోగంలా అనిపించడం లేదు. కృతకమైన సమర్థనలు, వైరుధ్యాలతో కూడిన కెనడా ప్రభుత్వ వాదనలను ఆ దేశ పౌరులే తప్పుబడుతున్నారు. ప్రధాని జస్టిన్ ట్రూడోను రక్షించుకోవడంలో భాగంగానే కెనడా ప్రభుత్వం ఇదంతా చేస్తున్నట్టు కనపడుతోంది!

అన్నీ అబద్ధాలే!

ఈ నెల పదకొండో తేదీన లావోస్‌లో జరిగిన ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా తనకు, ప్రధాని మోదీకి మధ్య కొంతసేపు చర్చలు జరిగాయని ట్రూడో చెప్పుకొచ్చారు. ఆయన ప్రకటనను భారత ప్రభుత్వ ప్రతినిధి తీవ్రంగా తప్పుపట్టారు. ట్రూడో, మోదీల నడుమ చెప్పుకోదగినంతగా సంప్రతింపులేవీ జరగలేదని తేల్చిచెప్పారు. "కెనడా భూభాగంలో భారత వ్యతిరేక ఖలిస్థానీ కార్యకలాపాలేవీ జరగకుండా నిరోధించాలని, తీవ్రవాదాన్ని ప్రేరేపిస్తున్నవారిపై గట్టి చర్యలు తీసుకోవాలని మా ప్రభుత్వం ఆకాంక్షిస్తోంది" అని మన ప్రతినిధి పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య పెరిగిన భేదాభిప్రాయాలు.. ఇరుపక్షాల ఇటీవలి ప్రకటనల్లో తేటతెల్లమయ్యాయి. నిజ్జర్ హత్యలో భారత ప్రమేయానికి సంబంధించి ఆధారాలను సమర్పించామని కెనడా ప్రభుత్వం చెబుతోంది. అదంతా బూటకమని భారత్ స్పష్టీకరిస్తోంది. భారత ప్రభుత్వం ఖలిస్థాన్ వాదులకు వ్యతిరేకంగా బిష్ణోయి గ్యాంగ్‌ను వినియోగిస్తోందని రాయల్ కెనడా మౌంటెడ్ పోలీస్ అధినేత ప్రకటించారు. విచిత్రమేంటంటే, బిష్ణోయి ముఠా సభ్యుల్ని తమకు అప్పగించాలని భారత ప్రభుత్వం 2022లోనే కోరింది. ఆ అభ్యర్థనను కెనడా అప్పట్లో తోసిపుచ్చింది. ఇప్పుడు అదే ముఠా సభ్యులు భారత దౌత్యాధికారులతో కలిసి పనిచేస్తున్నారని కెనడా ప్రభుత్వం ఆరోపిస్తోంది!

కెనడా రాజకీయాల్లో విదేశీ జోక్యం పెరిగిపోయిందన్న విమర్శలు ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్నాయి. వాటిని, దారిమళ్లించేందుకే ట్రూడో ప్రభుత్వం తనను నిజ్జర్ హత్య వివాదంలోకి లాగుతోందని ఇండియా చెబుతోంది. విదేశీ జోక్యంపై నియమించిన కమిషన్ ముందు వాంగ్మూలం ఇవ్వడానికి కొద్దిరోజుల ముందు ట్రూడో తనకు వ్యతిరేకంగా ప్రకటన చేశారని భారత్ అభిప్రాయపడింది.

ట్రూడోకు ప్రస్తుతం కెనడా పార్లమెంటులో మెజారిటీ లేదు. ఖలిస్థాన్ మద్దతుదారైన జగ్మీత్‌సింగ్‌కు చెందిన న్యూ డెమొక్రటిక్ పార్టీ ట్రూడో ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది. క్విబెక్‌లో ఇటీవల జరిగిన ఒక ఉప ఎన్నికలో కెనడా అధికార పార్టీ ఓటమి చవిచూసింది. దానికి బాధ్యత వహిస్తూ ట్రూడో ప్రభుత్వం రాజీనామా చేయాలని ఆయన పార్టీకి చెందిన 20 మంది ఎంపీలు డిమాండ్ చేశారు. కెనడాలో ట్రూడో వ్యతిరేక ఎంపీల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. లావోస్ పర్యటనలో మోదీతో సంప్రతింపులు జరిపినట్టు ఆయన ప్రకటించాక స్వపక్షం నుంచే రాజీనామా డిమాండ్ గట్టిగా వినిపించింది. ఈ క్రమంలో లావోస్ నుంచి స్వదేశానికి తిరిగొచ్చిన వెంటనే భారత్‌పై ఆయన ఆరోపణలు ఎక్కుపెట్టారు. ఆ వెంటనే భారత్, కెనడా ప్రభుత్వాలు పరస్పరం దౌత్యవేత్తల్ని బహిష్కరించుకున్నాయి. కెనడాలో వచ్చే సంవత్సరం ఎన్నికలు జరగనున్నాయి. ట్రూడో అనుసరించిన ఆర్థిక, వలస విధానాల వైఫల్యం కారణంగా ఆయన పార్టీ పునాదులు కదిలిపోయాయి. ట్రూడోను సొంత పార్టీ ఎంపీలే పదవి నుంచి బలవంతంగా దించేస్తారా, లేక ఆయనే పదవీ త్యాగానికి సిద్ధపడతారా అన్నది వేచి చూడాలి.

ప్రాబల్యం పెంచుకోవాలని...

సిక్కు కెనెడియన్లలో ట్రూడోకు బలముంది. అందుకే దిల్లీలో జరిగిన రైతుల ఆందోళనకు మద్దతు తెలిపారు. నకిలీ పాస్‌పోర్టులతో తమ దేశానికి వచ్చి, స్వదేశంలో తమపై దురాగతాలు జరిగాయని చెప్పుకొన్న వారికి పెద్ద సంఖ్యలో కెనడా పౌరసత్వం ఇచ్చారు. నిజ్జర్‌ను కడతేర్చిందని భారత్‌పై ఆరోపణలు చేయడం ద్వారా సిక్కుల్లో తనకున్న ప్రాబల్యాన్ని పెంచుకోవాలని ట్రూడో చూస్తున్నారు. జగ్మీత్‌సింగ్ వంటి నాయకులు దూరమైనా సిక్కు సమాజం.. ముఖ్యంగా ఖలిస్థానీ వర్గాలు తనకు మద్దతు తెలుపుతాయని భావిస్తున్నారు.

స్పష్టమైన వైఖరి

తన వైఫల్యాలపై విమర్శలు వెల్లువెత్తిన ప్రతిసారీ ట్రూడో భారత వ్యతిరేక ప్రకటనలు గుప్పించి తప్పించుకొంటున్నారు. ట్రూడో తీరు గురించి ప్రధాని మోదీ ఏనాడూ ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. ఆ బాధ్యతను ఆయన విదేశీ వ్యవహారాల శాఖకే వదిలేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ భారత్ తలవంచబోదని తద్వారా మోదీ స్పష్టం చేస్తున్నారు. ట్రూడో ప్రధానిగా ఉన్నంతకాలం భారత్, కెనడా సంబంధాలు మెరుగుపడటం కష్టమే. ఆయన ప్రధానిగా మరెంతో కాలం నిలిచి ఉండే అవకాశం లేదు. ట్రూడో తెరమరుగైన మరుక్షణం కెనడాతో సంబంధాలను భారత్ పునరుద్ధరించుకుంటుందని అనడంలో ఎలాంటి సందేహం లేదు.

చైనా, పాక్‌లతో దోస్తీ


ఖలిస్థాన్ ఉగ్రవాదానికి మద్దతు అందించే లక్ష్యంతో కెనడాలో గూఢచర్య కార్యకలాపాలకు పాకిస్థాన్ పాల్పడుతూ ఉంటుందని కెనెడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ డైరెక్టర్ వెనెస్సా లాయ్డ్ చెప్పారు. ఆమె ప్రకటనలో భారత్ ప్రస్తావన లేకపోవడం గమనార్హం. ఖలిస్థాన్ వాదాన్ని బలపరిచేందుకు కెనడా ప్రభుత్వం పాకిస్థాన్‌తో కలిసి పనిచేస్తోందన్నది ఆమె మాటల్లో స్పష్టమవుతోంది. మరి కెనడాను ఉగ్రవాద మద్దతుదారుగా భావించవచ్చా? కెనడా పౌరసత్వం స్వీకరించిన చైనీయులను భయభ్రాంతులకు గురిచేసేందుకు డ్రాగన్ ప్రభుత్వం అక్కడ పోలీస్ స్టేషన్లను ఏర్పాటుచేసింది. వాటి గురించి ట్రూడో ఏనాడూ ప్రస్తావించలేదు. కెనడాలో చైనా జోక్యానికి సంబంధించి బలమైన సాక్ష్యాధారాలున్నాయి. వాటిని కప్పిపెట్టడానికే కెనడా ప్రభుత్వం మొగ్గుచూపుతోంది. ప్రధాని ట్రూడోకు చెందిన లిబరల్ పార్టీకి బీజింగ్ ప్రభుత్వంతో ఉన్న గట్టి సంబంధాలే దానికి కారణం.



హర్ష కాకడ్
విశ్రాంత మేజర్ జనరల్

ఓజోన్... నేలమీదా!

భారతీయ నగరాలను మరో కొత్త సమస్య నిశ్శబ్దంగా చుట్టుముడుతోంది. కంటికి కనిపించని ఓజోన్ వాయుకాలుష్యం పది ప్రధాన నగరాల్లో ప్రజారోగ్యం పాలిట పెనుప్రమాదం కానుందని హెచ్చరిస్తోంది సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ అధ్యయనం. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ముంబయి, పుణె, దిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, లఖ్‌నవూ నగరాల్లో భూమిమీద ఓజోన్ స్థాయులు విపరీతంగా పెరుగుతున్నట్లు ఈ అధ్యయనం చెబుతోంది. తీవ్రమైన ప్రతిచర్య జరిపే వాయువు కావడంతో ఆరోగ్యం మీద ఓజోన్ ప్రభావం ఎక్కువ. ఘాటైన వాసనతోనే కణాలను చంపేయగలదు. దీనివల్ల శ్వాస సమస్యలు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్, బ్రాంకైటిస్ కేసులు పెరగటమే కాక ఆస్థమా బాధితులు తరచూ ఆస్పత్రిలో చేరాల్సి రావచ్చు. పుట్టుకతోనే ఊపిరితిత్తుల సమస్య ఉన్న పిల్లలకు, వృద్ధులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. మరోపక్క ఇది భూతాపాన్నీ పెంచుతోందని అమెరికా శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



ఇప్పటివరకూ ఆకాశంలో ఓజోన్ పొరకి పడిన రంధ్రమే సమస్య అనుకుంటే ఇప్పుడిక నేలమీద కూడా ఈ వాయువు సవాలు విసురుతోంది. సూర్యుడి అతినీలలోహిత కిరణాల నుంచి భూమిని రక్షించే ఓజోన్ పొరకి పడిన రంధ్రమూ, ప్రజారోగ్యానికి ముప్పుతెచ్చేలా భూమిమీద ఓజోన్ శాతమూ రెండూ పెరుగుతున్నాయి.

మరణాల్లో పెరుగుదల

స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ నివేదిక- 2024 ప్రకారం ఓజోన్ కారణంగా శ్వాససంబంధ సమస్యలతో సంభవిస్తున్న మరణాలు గత దశాబ్దంలో 25శాతం పెరిగాయి. వాటిల్లో అధికభాగం మన దేశంలోనే సంభవించాయి. సీజన్లవారీగా రోజు మొత్తంలో ఓజోన్ ఎక్కువగా ఉండే ఎనిమిది గంటల సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటే 2010-2017 మధ్య ఇది 17శాతం పెరిగింది. భూమికి ఎగువన స్ట్రాటో ఆవరణంలో(30-50కి.మీ.లు) ఒక పొరలా వ్యాపించి ఉండాల్సిన ఓజోన్ అసలు అంతకన్నా కిందికి ట్రోపో ఆవరణంలోకి ఎలా వస్తోంది? అసలీ గ్రౌండ్ లెవెల్ ఓజోన్ తయారవడానికి ప్రత్యేక కారణమంటూ లేదు. పలు రసాయనాలూ వాయువుల మధ్య చర్య వల్ల అది ఉత్పత్తవుతోంది. వాహనాలూ విమానాలూ విద్యుదుత్పత్తి కేంద్రాలూ పరిశ్రమల నుంచి వెలువడే వాయువులు, ఇతర మానవచర్యల కారణంగా ఓలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్(బాష్పశీల సేంద్రియ పదార్థాలు) వెలువడతాయి. అవి సూర్యరశ్మి కింద నైట్రోజన్ ఆక్సైడ్‌లతో ప్రతిచర్య జరిపినప్పుడు ఓజోన్ ఉత్పత్తవుతుంది. ఈ కాంపౌండ్స్ ఒక్కోసారి మొక్కల నుంచి కూడా వెలువడతాయి. దాంతో ఓజోన్ సమస్యకు కేవలం మానవ చర్యలే కారణమని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. ఇతర దేశాల్లో పారిశ్రామిక కాలుష్యాన్ని తగ్గించినప్పుడు దిగువ ట్రోపో ఆవరణంలో ఓజోన్ తగ్గింది కానీ ఎగువ ట్రోపో ఆవరణంలో తగ్గలేదు. దీన్ని బట్టి మానవచర్యలే ప్రధాన కారణమైనప్పటికీ ఇతర కారణాలూ ఉన్నాయన్న నిర్ధారణకు వచ్చారు. పైగా ఇది వాయువుల ఒత్తిడి లేని చోటుకి వ్యాపించి అక్కడే ఉండిపోవడం వల్ల పచ్చదనంతో పరిశుభ్రంగా ఉండే ప్రాంతాలూ కలుషిత ప్రాంతాలుగా మారుతున్నాయి.

కఠిన నియమాలు కావాలి

ఇప్పటివరకూ ఓజోన్ తీవ్రతను అంచనా వేయడానికి గంట(ఘనపు మీటరుకు 180 మైక్రోగ్రాములు), ఎనిమిది గంటల (100మై.గ్రా.) ప్రమాణాలను నిర్దేశించారు. చాలా ప్రాంతాల్లో దీనికన్నా ఎన్నోరెట్లు ఎక్కువగా కాలుష్యం నమోదైంది. గత వేసవిలో ఓజోన్ కాలుష్యం లఖ్‌నవూలో అత్యధికంగా సగటున 15.7 గంటలపాటు ఉంది. దిల్లీ, ముంబయి, హైదరాబాద్‌లలో 12-14 గంటల మధ్య ఉంది. సాధారణంగా రాత్రివేళ సూర్యరశ్మి ఉండదు కాబట్టి గ్రౌండ్ లెవెల్ ఓజోన్ అసలు ఉండకూడదు. కానీ ఈ నగరాల్లో రాత్రివేళ అది ఎక్కువైంది. గత ఏడు నెలల్లో ముంబయిలో అత్యధికంగా 171 రాత్రుల్లో ఓజోన్ అధిక స్థాయులు నమోదు కాగా హైదరాబాద్‌లో 94 రాత్రులు నమోదయ్యాయి. ఈ పది నగరాల్లోనూ పనిచేస్తున్న దాదాపు 200 అధికారిక స్టేషన్ల నుంచి డేటా తీసుకుని ఈ లెక్కలు తేల్చారు. నిజానికి రోజువారీ గాలి నాణ్యత సూచీలో గ్రౌండ్ లెవెల్ ఓజోన్‌ని కొలవడం సాధ్యం కాదు. నగరవ్యాప్తంగా కొన్ని గంటల సగటు తీయడం వల్ల సమస్య తీవ్రత తెలియడం లేదు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ రెండో దశకి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో- బహుళ కాలుష్యాల మీద దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ఈ పరిస్థితులు సూచిస్తున్నాయి. పీఎం 2.5తోపాటు ఓజోన్, నైట్రోజన్ ఆక్సైడ్స్, ఇతర వాయువుల తీవ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. పరిశ్రమలూ వాహనాల నుంచి కర్బన ఉద్గారాలను నియంత్రించాలి. అందుకు కఠిన నియమాలు విధించి, పక్కాగా అమలుచేయాలి.

– డి.పద్మశ్రీ

ఆలోచించండి..!

ఇద్దరు అన్నదమ్ములు ఒక ఆవు విషయంలో నాదంటే.. నాదని గొడవపడతారు. చివరికి ఆ పంచాయతీ రాజు దగ్గరికి చేరుతుంది. ఆయన బాగా ఆలోచించి.. 'మీ ఇద్దర్నీ మూడు ప్రశ్నలు అడుగుతాను. వాటికి సరైన సమాధానాలు చెప్పిన వారికి ఆవు సొంతమవుతుంది' అని చెబితే సరే అంటారు. 'ఈ సృష్టిలో ఉన్న అన్నింట్లో కడుపు నింపేది ఏది? అన్నింటి కన్నా వేగవంతమైంది ఏంటి? మనిషికి మహా సంతోషాన్నిచ్చేది ఏది?'... ఇవీ ఆ మూడు ప్రశ్నలు. 'బాగా ఆలోచించుకుని రేపు వచ్చి జవాబులు చెప్పండి' అని రాజు వాళ్లను పంపించేస్తాడు.

దారిలో నడుచుకుంటూ వెళ్తుండగా పెద్దవాడు 'ఏంటో ఈ పిచ్చి ప్రశ్నలు. వీటి గురించి ఆలోచించడానికి ఏముంది. కడుపు నింపేది అన్నం. వేగవంతమైంది వేట కుక్క. సంతోషాన్నిచ్చేది డబ్బు' అనుకుంటాడు. తమ్ముడు మాత్రం దీర్ఘంగా ఆలోచిస్తూ ఇంటికి చేరతాడు. నిద్రపోయే ముందూ బుర్రలో ఆ ప్రశ్నలే తిరుగుతాయి. పొద్దున లేచి ఇద్దరూ రాజు దగ్గరికి వెళ్తారు. జవాబులు దొరికాయా.. అని రాజు అడగ్గానే పెద్దవాడు తడుముకోకుండా.. . అన్నం, వేటకుక్క, డబ్బు అని చెప్పేస్తాడు. ఆ సమాధానాలు తప్పని చెప్పి తమ్ముడికేసి చూస్తాడు రాజు.



'కడుపు నింపేది భూమాత. భూమిమీద పండిన పంటలే అందరి ఆకలి తీరుస్తాయి. వేగవంతమైంది మనసులోని ఊహ.. అది మనల్ని రెప్పపాటులో ఎక్కడికైనా తీసుకుపోతుంది. ఇక, సంతోషాన్నిచ్చేది నిద్ర. ఎందుకంటే మనిషి తన బాధలూ సమస్యలూ అన్నీ మర్చిపోయేది నిద్రలోనే' తమ్ముడి సమాధానాలకు ముగ్ధుడైపోయిన రాజు ఆవు అతనిదేనని తీర్పిస్తాడు.

అన్నదమ్ములిద్దరిలో చిన్నవాడు ఆలోచించబట్టే రాజుని మెప్పించగలిగాడు. పెద్దవాడు కనీసం ఆ ప్రయత్నం కూడా చేయకపోవడంతో ఆవును దక్కించుకోలేకపోయాడు.

ఆలోచన మనిషికి పుట్టుకతో లభించిన వరం. ప్రతి ఒక్కరి జీవిత గమనాన్ని అదే నిర్దేశిస్తుంది. మనిషిని మేధావిగా మారుస్తుంది. సదాలోచనలు సాధారణ వ్యక్తిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయి. మనిషి దుఃఖానికి కారణమేంటని ఆలోచించిన బుద్ధుడు సత్యాన్వేషిగా మారాడు. మంచి ఆలోచనలు మనల్ని ప్రపంచానికి పరిచయం చేస్తాయి. ప్రతికూల ఆలోచనలు ఆత్మన్యూనత భావాన్ని కలిగించి ఎదుగుదలను దెబ్బతీస్తాయి. అలాగని ఏదైనా విషయం గురించి అతిగా ఆలోచించినా- ఆ పని ఎప్పటికీ పూర్తి చేయలేరు. క్రమశిక్షణతో కూడిన ఆలోచనలు ప్రతి ఒక్కరినీ గమ్యంవైపు నడిపిస్తాయి. లక్ష్యం చేరుకునేందుకు దోహదపడతాయి. 'మీ ఆలోచనలు మార్చుకుంటే.. మీ ప్రపంచాన్ని మార్చుకోగలరు' అని అంటారు 'ది పవర్ ఆఫ్ పాజిటివ్ థింకింగ్' పుస్తక రచయిత నార్మన్ విన్సెంట్ పీలే.

– ర్యాలి హేమంత్ కుమార్

తల్లికోతి పాఠం

హాయ్! బుజ్జీ!!

ఓ అడవిలో ఒక కోతి దాని పిల్లతో నివాసం ఉండేది. ఆ పిల్లకోతి ఇప్పుడిప్పుడే చెట్లు ఎక్కడం నేర్చుకుంటోంది. 'నెమ్మదిగా ఆడుకో. లేకపోతే పడిపోతావు' అంటూ జాగ్రత్తలు చెప్పింది తల్లికోతి. ఒకరోజు ఎప్పటిలాగే చెట్ల కొమ్మల మీద గెంతుతూ సంబరపడిపోతుంది పిల్లకోతి. అలా చెట్టు చిటారుకొమ్మ వరకు వెళ్లింది. దాంతో అది విరిగిపోయి.. అంత ఎత్తు నుంచి కిందపడింది. కాలు విరగడంతో.. ఆ పిల్లకోతి ఇక ఏడవటం మొదలుపెట్టింది. తల్లి పరిగెత్తుకుంటూ వచ్చి.. అక్కడే వైద్యం చేసే ఎలుగుబంటి దగ్గరకు తీసుకెళ్లింది. 'నీకు ఎన్నిసార్లు చెప్పాను. జాగ్రత్తగా ఆడుకోమని. అలా చెట్టుకొమ్మల చివరి వరకు వెళ్లకూడదని. ఇప్పుడు చూడు.. ఏం జరిగిందో?'



అంటూ గద్దించింది తల్లికోతి. 'ఆ కొమ్మ విరుగుతుందని నాకేం తెలుసమ్మా..! దాని మీదే చిలుకలు కూడా వాలాయి. ఎంచక్కా వాటితో ఆడుకోవచ్చని వెళ్లాను' అని బదులిచ్చింది పిల్లకోతి. 'చిలుక ఎగిరే స్వభావం కలిగింది.. ఎక్కడైనా వాలగలదు. కానీ మనం అలా కాదు.. కొమ్మ మన బరువు మోయలేనప్పుడు అది విరిగిపోతుంది. మనం ఇబ్బంది పడాల్సి వస్తుంది. అదే అటువైపు వెళ్లకుండా ఉంటే.. ఆనందంగా ఉంటాం. ఎప్పుడైనా సరే.. స్థాయికి మించి ఇతరులతో పోల్చుకోకూడదు. వాళ్లు ఉన్నచోట మనం లేము.. వాళ్లు చేసే పని చేయలేకపోతున్నాం అని బాధపడకూడదు. ఒకరి పరిస్థితి ఇంకొకరికి పూర్తి భిన్నంగా ఉంటుంది. కాబట్టి మన హద్దుల్లోనే.. ఉన్నతంగా, ఆనందంగా ఉండేలా చూసుకోవాలి అర్థమైందా' అని చెప్పింది తల్లికోతి. 'అర్థమైందమ్మా.. ఇక నుంచి నువ్వు చెప్పినట్లే వింటాను' అని బదులిచ్చింది పిల్లకోతి.

– కోనే నాగవెంకట ఆంజనేయులు



email:hai@eenadu.in

ఉద్యోగ అవకాశాలు

నిర్మాణ సంస్థ కార్యాలయంలో ఐటీ సోదాలు

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ నిర్మాణ సంస్థ అన్విత గ్రూప్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆదాయ పన్ను(ఐటీ) శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. గురువారం ఉదయం సీఆర్‌పీఎఫ్ భద్రతతో గచ్చిబౌలిలోని సంస్థ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న అధికారులు రాత్రి వరకూ తనిఖీలు జరిపారు. సోదాల్లో భాగంగా కొన్ని కీలకపత్రాలు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. శుక్రవారం కూడా సోదాలు కొనసాగే అవకాశముంది. హైదరాబాద్‌తోపాటు దుబాయ్, అమెరికాలలో ఈ సంస్థ నిర్మాణ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

అలహాబాద్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ అంబటి లక్ష్మణరావు కన్నుమూత



ఈనాడు, హైదరాబాద్: అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అంబటి లక్ష్మణరావు(90) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని నివాసంలో కన్నుమూశారు. ఆయన గుంటూరు జిల్లా పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామంలో 1934 జనవరి 14న జన్మించారు. గుంటూరు హిందూ కళాశాల నుంచి బీఎస్సీ, బీఎల్, మద్రాసు యూనివర్సిటీ నుంచి న్యాయ డిగ్రీ పొందారు. 1959 జనవరిలో న్యాయవాద వృత్తి చేపట్టారు. 1982 డిసెంబరు 10న ఏపీ హైకోర్టులో శాశ్వత జడ్జిగా నియమితులయ్యారు. 1992 జులై 1 నుంచి అక్టోబరు 12 వరకు ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారు. ఆ తరువాత 1995 ఫిబ్రవరి 24న అలహాబాద్ హైకోర్టు సీజేగా నియమితులై.. 1996 జనవరి 14న పదవీ విరమణ చేశారు. తర్వాత అవినీతి నిర్మూలన, ఎన్నికల సంస్కరణలు, రైతు సంక్షేమం, మద్యం నియంత్రణ తదితర సామాజిక అంశాలపై దృష్టి సారించారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్‌గా పనిచేశారు. అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం విస్పర్ వ్యాలీ సమీపంలోని మహాప్రస్థానంలో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. మాజీ క్రికెటర్ అంబటి రాయుడుకు జస్టిస్ లక్ష్మణరావు పెద్దనాన్న.

గ్రామంలో మద్యపాన నిషేధంలో క్రియాశీలక పాత్ర

వెల్లలూరులో మద్యం వల్ల చిన్న కుటుంబాలు ఛిన్నాభిన్నమయ్యాయి. దీంతో గ్రామపెద్దలు, మహిళల సహకారంతో మద్యపాన నిషేధం విధించడంలో జస్టిస్ లక్ష్మణరావు క్రియాశీలక పాత్ర పోషించారు. గ్రామంలో 14 ఏళ్లకు పైగా మద్యపాన నిషేధం అమలవుతోంది. గ్రామస్థుల సహకారంతో రూ.75 లక్షలతో చేపట్టిన శ్మశానవాటిక నిర్మాణ పనుల్లో, పలు దేవాలయాల నిర్మాణంలో ఆయన ప్రముఖ పాత్ర వహించారు.

దశలవారీగా జాతీయ విద్యావిధానం అమలు

● రాష్ట్ర ఉన్నత విద్యామండలి నూతన ఛైర్మన్ బాలకిష్టారెడ్డి



బాలకిష్టారెడ్డిని అభినందిస్తున్న లింబాద్రి. చిత్రంలో శ్రీరాం వెంకటేశ్

ఈనాడు, హైదరాబాద్: మన విద్యార్థులు అంతర్జాతీయంగా పోటీపడాలంటే జాతీయ నూతన విద్యావిధానాన్ని దశలవారీగా అమలు చేయాల్సి ఉంటుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నూతన ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి అభిప్రాయపడ్డారు. అందులోని అన్నీ కాకున్నా తప్పనిసరిగా చేయాల్సినవి, కొన్ని మంచివి అనుకున్న వాటినైనా అమలు చేస్తామని.. దీనిపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ముందుకెళ్తామని చెప్పారు. నూతన ఛైర్మన్‌గా ఆయన, వైస్ ఛైర్మన్‌గా ఆచార్య ఇటిక్యాల పురుషోత్తం గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం తాజా మాజీ ఛైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి, వైస్ ఛైర్మన్ పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్‌లతో కలిసి బాలకిష్టారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్నత విద్యారంగంలో ఎన్నో సమస్యలు, సవాళ్లు ఉన్నాయన్నారు. మన విద్యార్థులను అంతర్జాతీయంగా పోటీపడేలా తీర్చిదిద్దడం తమ ముందున్న లక్ష్యమన్నారు. అది జరగాలంటే విశ్వవిద్యాలయాల పాత్ర కీలకమని, అయితే అవి ఆచార్యుల ఖాళీలు, నిధుల లేమి, మౌలిక వసతుల కొరత తదితర సమస్యలను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. వర్సిటీల్లో నియామకాలపై దృష్టి పెడతామన్నారు. కొన్ని ప్రత్యేక నైపుణ్య కోర్సులు(వాల్యూ యాడెడ్), సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు ప్రవేశపెట్టడం, కన్సల్టెన్సీ పనులు చేయడం ద్వారా చాలావరకు వర్సిటీలు ఆర్థికంగా ప్రభుత్వాలపై ఆధారపడకుండా నిధుల సమస్యను చాలావరకు అధిగమించవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి చర్యల వల్లే నల్సార్ వర్సిటీ నిధుల సమస్యను అధిగమించిందని చెప్పారు. కొవిడైజేషన్‌తో(కొవిడ్ తర్వాత) అన్ని రంగాల్లో సాంకేతికత వినియోగం పెరిగిందని, అందుకే ఆన్‌లైన్ కోర్సులను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

భారాస పాలనలో ఐడీసీ నిర్వీర్యం

ముువ్వా విజయబాబు

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రంలో 643 చిన్నతరహా ఎత్తిపోతల పథకాల కింద 5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన నీటిపారుదల అభివృద్ధి సంస్థ(ఐడీసీ) భారాస పాలనలో నిర్వీర్యమైందని సంస్థ ఛైర్మన్ మువ్వా విజయబాబు పేర్కొన్నారు. ఐడీసీ బోర్డు సమావేశాన్ని గురువారం ఆయన అధ్యక్షతన హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. అందిన సమాచారం ప్రకారం.. రాష్ట్రంలోని భారీ లిఫ్టులకు ఒకరు చొప్పున, చిన్న లిఫ్టులైతే మూడు నాలుగింటికి ఒకరు చొప్పున టెక్నీషియన్‌లను, అన్ని లిఫ్టులకు లస్కర్‌లను నియమించే అంశంపై, పథకాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. బంజారాహిల్స్‌లోని ఐడీసీ భవనంలో ఖాళీగా ఉన్న అంతస్తులను అద్దెకివ్వాలని నిర్ణయించారు. అనంతరం విజయబాబు విలేకరులతో మాట్లాడారు. 'తొమ్మిదో షెడ్యూల్ ప్రకారం నీటిపారుదల శాఖలో ఐడీసీని విలీనం చేయడానికి వీల్లేదు. అయినా గత ప్రభుత్వం జీవో ద్వారా బలవంతంగా విలీనం ముద్ర వేసింది. పూర్తిస్థాయిలో కలపలేదు.. స్వయం ప్రతిపత్తి హోదాను తొలగించనూ లేదు. నిర్వహణ లోపాలతో 300 పథకాలు పనిచేసే స్థితిలో లేవు. 100 పథకాలకు మరమ్మతులు అవసరం. ఇందుకు సుమారు రూ.400 కోట్లు కావాలి. దీనిపై సీఎం, నీటిపారుదల శాఖ మంత్రితో చర్చిస్తాం' అని పేర్కొన్నారు. సమావేశంలో ఎండీ విద్యాసాగర్, సభ్యులు సీతా మధుసూదన్‌రావు, లత వినోద్, బి.వి.కృష్ణారెడ్డి, జనరల్ మేనేజర్ ఎండీ ఆరిఫ్ పాల్గొన్నారు.

23 నుంచి డీఈఈసెట్ వెబ్ ఆప్షన్లు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో డీఎడ్ కోర్సుల్లో చేరేందుకు 23 నుంచి 26 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని డీఈఈసెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీనివాసాచారి గురువారం తెలిపారు. 30న సీట్లు కేటాయిస్తామన్నారు. అగ్నిమాపక శాఖ ఎన్‌వోసీ సమర్పించని 7 ప్రైవేట్ డీఈడీ కళాశాలలకు ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు ఈసారి అనుమతి నిరాకరించారు.

ఉత్సాహంగా 'పోలీస్ డ్యూటీమీట్'

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత రాష్ట్రంలో తొలిసారి నిర్వహిస్తున్న 'పోలీస్ డ్యూటీమీట్' ఉత్సాహంగా సాగుతోంది. పోలీస్ అకాడమీలో గురువారం నిర్వహించిన సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్, డాగ్‌స్క్వాడ్, కంప్యూటర్ అవేర్‌నెస్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర ఈవెంట్లకు సంబంధించిన పరీక్షల్లో 154 మంది పాల్గొన్నారు. వివిధ ఈవెంట్లలో హైదరాబాద్ కమిషనరేట్‌కు చెందిన ఆరుగురు పోలీసులు, సైబరాబాద్ కమిషనరేట్‌కు చెందిన అయిదుగురు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఇంటెలిజెన్స్ విభాగాల నుంచి ఇద్దరు చొప్పున, సీఐడీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్స్, జోగులాంబ గద్వాల జోన్ పోలీసులు ఒక్కొక్కరు చొప్పున ప్రతిభ కనబరిచారు.

23న మంత్రివర్గ సమావేశం

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 23న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. సచివాలయంలో సాయంత్రం నిర్వహించనున్న క్యాబినెట్ సమావేశంలో మూసీ ప్రాజెక్టు, ధరణి, ధాన్యం సేకరణ, రేషన్ కార్డులు, జాబ్ క్యాలెండర్ తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిసింది.

మహిళాభివృద్ధి గురించి మాట్లాడే అర్హత భారాసకు లేదు: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, న్యూస్‌టుడే: మహిళాభివృద్ధి గురించి మాట్లాడే అర్హత భారాస నేతలకు లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బతుకమ్మ చీరలు ఇవ్వకుండా ప్రభుత్వం అవమానించిందంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై గురువారం ఆయన ఒక ప్రకటనలో స్పందించారు. మొదటి క్యాబినెట్‌లో మహిళకు అవకాశం కల్పించకుండా అవమానించింది భారాసనే అని పేర్కొన్నారు. మహిళలను కించపరిచేలా మాట్లాడుతున్నదీ హరీశ్‌రావు, కేటీఆర్‌లే అన్నారు. భారాస ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరలు ఎలా ఉండేవో మహిళలకు తెలుసన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇద్దరు మహిళలకు మంత్రివర్గంలో చోటు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. భారాస హయాంలో మత్స్యశాఖలో జరిగిన అవినీతి కేసులో హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు జైలుకు వెళ్లడం ఖాయమని ఫిషర్‌మెన్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్ అన్నారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో మాట్లాడారు.

తెలంగాణ ప్రభుత్వం
(ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్)
ART సెంటర్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్,
హైదరాబాద్ వద్ద మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్స్ & DEO నియామకం కొరకు ప్రకటన.
(Rc.No.3083/TS/ART/CST/TSACS/2023-24, తేది: 24.09.2024 ఆఫ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, తెలంగాణ రాష్ట్రం)

నియామక ప్రకటన

ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్ వద్ద గల యాంటి రెట్రోవైరల్ థెరపీ సెంటర్ (ART సెంటర్)లో పని చేయుటకు అర్హులైన మరియు తగిన యోగ్యత గల అభ్యర్థులు ART సెంటర్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్ వారికి కావలెను. అర్హతాప్రమాణాలు మరియు అవసరమైన విద్యార్హతలు దిగువ పట్టికలో ఇవ్వబడినవి. సదరు ప్రకటనలో తెలిపిన ఉద్యోగానికి అర్హతాప్రమాణాలు నెరవేర్చిన ఆసక్తిగల అభ్యర్థులు సూపరింటెండెంట్/ నోడల్ ఆఫీసర్, ART సెంటర్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్ వారికి దరఖాస్తు చేసుకోవల్సిందిగా విజ్ఞప్తి. అభ్యర్థులు ఈ ఆసుపత్రి ఇన్‌వార్డ్ సెక్షన్ వద్ద వారి బయోడేటా ఫారం మరియు జత చేయబడిన విద్యార్హతల అటెస్టెడ్ జిరాక్స్ కాపీలను 18.10.2024 నుండి 25.10.2024 వరకు ఉ.10.30 గం. నుండి సా.5.00 గం. మధ్య దాఖలు చేయవలెను.

క్ర.సం - ఉద్యోగం పేరు - ఉద్యోగాల సంఖ్య - అవసరమైన విద్యార్హతలు & యోగ్యత - నెలకు స్థిర ప్రతిఫలం: 1 - మెడికల్ ఆఫీసర్, వయోపరిమితి: 70 సం.లు - 03 - మెడిసిన్ లేదా ఏదేని ఇతర క్లినికల్ డిసిప్లిన్‌లో MD లేదా కనీసం 3 సంవత్సరాల అనుభవంతో MBBS + ఏదేని క్లినికల్ డిసిప్లిన్‌లో డిప్లొమా కలిగిన అభ్యర్థులు పరిశీలించబడతారు లేదా 3 సంవత్సరాల అనుభవంతో MBBS + HIV మెడిసిన్‌లో ఫెలోషిప్/ పబ్లిక్ హెల్త్‌లో డిప్లొమా కలిగిన అభ్యర్థులు పరిశీలించబడతారు - రూ.72,000/-; 2 - స్టాఫ్ నర్స్, వయోపరిమితి: 18-44 సం.లు - 01 - జనరల్ నర్సింగ్ (GNM)/ BSc. నర్సింగ్, GNM/ BSc.లో 5 సం.ల అనుభవం మరియు HIV/ AIDS రంగంలో 1 సంవత్సరం అనుభవం. నోడల్ అధికారి ఆదేశాలు మరియు అవసరాన్ని బట్టి అతను/ ఆమె స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ మరియు కౌన్సెలర్‌గా పనిచేయుటతో కలుపుకొని మల్టీటాస్కింగ్ కలిగి ఉండవలెను. ఈ ఉద్యోగానికి ఆధునిక కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన అభ్యర్థులకు కూడా ప్రాధాన్యత ఇవ్వబడును - రూ.21000/-; 3 - DEO, వయోపరిమితి: 18-44 సం.లు - 01 - 1. ఏదేని గ్రాడ్యుయేట్ (ప్రధానంగా కంప్యూటర్స్/ మ్యాథమెటిక్స్/ స్టాటిస్టిక్స్/ బిజినెస్ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేటివ్ లేదా ఏదేని సంబంధిత సబ్జెక్ట్) 2. కంప్యూటర్ MS ఆఫీస్, MS Excel, ఇంటర్నెట్ వాడకం, ఇమెయిలింగ్స్‌లో అనుభవం, డాటా మేనేజ్‌మెంట్‌లో శిక్షణ, హెల్త్ సంబంధ సాఫ్ట్‌వేర్‌లో పరిజ్ఞానం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును - రూ.21000/-.

సం/- సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్
DIPR R.O.No. 5438-PP/CL/ADVT/1/2024-25, తేది: 17.10.2024


జేఈఈ మెయిన్‌లో ఛాయిస్ ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

సెక్షన్ ఏలో 20 ప్రశ్నలకు మొత్తం జవాబులు రాయాలి. సెక్షన్ బీలో 10 ఇచ్చి అయిదు ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేలా ఛాయిస్ ఇస్తున్నారు. ఈసారి నుంచి ఆ ఛాయిస్‌ను విరమించుకుంటున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది.

యువతా.. ఫిట్‌గా ఉన్నారా?

ట్రెడ్‌మిల్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చిందంటే.. గుండె రక్తనాళాల్లో బ్లాక్‌లు 70 శాతం ఉన్నట్లే! ఒకవేళ ముందస్తు పరీక్షల ద్వారా 5 శాతం బ్లాక్ ఉన్నప్పుడే గుర్తిస్తే చికిత్స సులభమవుతుంది. లేదంటే అది ముదిరి, ప్రాణాపాయం సంభవిస్తుంది. అందుకే ముందస్తు పరీక్షలు మేలు.



నేను వ్యక్తిగతంగా నమ్మేదేంటంటే.. సంపదకు, ఆరోగ్యానికి ఉన్న సంబంధాన్ని దూరం చేసే దేశంగా ప్రపంచంలో భారత్ మొదటిది అవుతుంది. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందే రోజులు రానున్నాయి. దేశ సంపదకు, కుటుంబ సంపదకు సంబంధమే లేకుండా పోతుంది. వచ్చే ఐదు, పదేళ్లలో ఇది కచ్చితంగా జరిగి తీరుతుంది.

'ఈనాడు' ముఖాముఖీలో 'నారాయణ హెల్త్' ఛైర్మన్ డాక్టర్ దేవిశెట్టి

? చిన్నారుల గుండె శస్త్రచికిత్స నిపుణులుగా మీరు విశేష సేవలందిస్తున్నారు. దేశంలో చిన్న పిల్లల గుండె చికిత్సలకు అవసరమైన వైద్య సదుపాయాలున్నాయా..

జవాబు: దేశంలో ఏటా 2.4 కోట్ల మంది శిశువులు జన్మిస్తున్నారు. వీరిలో ప్రతి 140 మందిలో ఒకరు గుండెజబ్బుతో బాధపడుతున్నారు. వేలమంది చిన్నారులకు గుండె చికిత్సలు అవసరమవుతున్నాయి. గుండెజబ్బులకు సంబంధించిన ఆసుపత్రులు, వైద్యుల సంఖ్య పెరగాలి. మాతో సహా దేశంలో కొద్ది నగరాల్లో మాత్రమే పిల్లల గుండె శస్త్రచికిత్సలు చేయగలిగే పరిస్థితులున్నాయి. దీంతో బాధితులు చికిత్స కోసం తమ సొంత రాష్ట్రం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటి ఆసుపత్రుల సంఖ్య అన్ని నగరాలకూ విస్తరించాలి. ఏటా పిల్లలు, పెద్దల్లో కలిపి 10 లక్షల శస్త్రచికిత్సలు చేయాల్సి ఉండగా, 1.5-2 లక్షల వరకు మాత్రమే చేయగలుగుతున్నాం. ఈ దిశగా మరింత వృద్ధి సాధించాల్సి ఉంది.

? ప్రభుత్వ రంగంలో మెరుగైన వైద్యసేవలు అందించలేకపోవడానికి కారణాలు..

ప్రజల నుంచి వసూలు చేసే పన్నుల నుంచి ఆరోగ్య రంగానికి కొంత కేటాయించి, అందరికీ ఉచితంగా వైద్యం అందించాలన్నది లక్ష్యం. అనేక దేశాలు ఇలాగే చెబుతున్నాయి. కానీ ఆచరణలోనే సమస్య. ప్రపంచంలో వేలు, లక్షల జనాభా కలిగిన కొన్ని దేశాలు మాత్రమే ఈ సదుపాయాన్ని ఇవ్వగలుగుతున్నాయి. జనాభా 2, 3 కోట్లు దాటితే అమలు కష్టమే. ఇంగ్లండ్ ఫ్రీ హెల్త్‌కేర్ ఇస్తున్నా ఇప్పుడు ఇబ్బంది పడుతోంది. ధనిక దేశమైన అమెరికాయే ఉచిత వైద్యం అందించలేకపోతోంది. భారతదేశంలో అయితే అది సాధ్యమే కాదు. కొన్ని దేశాలకు జీడీపీలో 25 నుంచి 40 శాతం మేర పన్ను వసూళ్లు ఉంటాయి. మన దేశంలో అది 11.5 శాతం మాత్రమే. మన ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉండే నిధులతో అమలు చేసే పరిస్థితి లేదు. అనేక దేశాలు జీడీపీలో 10 నుంచి 18 శాతం వరకు ఆరోగ్యరంగానికి కేటాయిస్తున్నాయి. భారత్‌లో ఇది రెండు శాతానికి మించడంలేదు.

? ప్రభుత్వరంగంలో పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. ప్రైవేటు రంగంలో ఖర్చును మధ్యతరగతి ప్రజలు కూడా భరించలేరు. ప్రత్యామ్నాయం ఏమిటి?

ప్రత్యామ్నాయాలున్నాయి. భారతదేశ జనాభా 140 కోట్లు. అత్యధిక జనాభా ఉన్నప్పుడు ఆరోగ్యబీమా పనిచేస్తుంది. మన దేశ ప్రజలు వైద్య చికిత్సను భరించలేకున్నా.. బీమాకు ఖర్చు చేయగలరు. తక్కువ ఖర్చుతో ఆరోగ్యబీమా అందించడం, అన్ని రకాల సర్జరీలకు అవకాశం ఉండడంతోపాటు, మెడికల్ ట్రీట్‌మెంట్ ఉండేలా, ప్రీమియం భరించగలిగేలా ఉంటే ఆరోగ్య రంగంలో సమూల మార్పు లొస్తాయి.

? నారాయణ హృదయాలయ ఆరోగ్యబీమాను ప్రారంభించింది కదా, అది ఎలా ఉండబోతోంది?

దేశంలో ఆరోగ్య బీమా కంపెనీ ప్రారంభించడానికి అనుమతి పొందిన మొదటి ఆసుపత్రి మాది. దేశవ్యాప్తంగా గుండె సర్జరీల్లో 16 శాతం మా ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయి. మా ఆరోగ్య బీమా కుటుంబంలో నలుగురికి వర్తిస్తుంది. అంటే భార్యాభర్తలు, వారి ఇద్దరు పిల్లలకు అన్ని రకాల శస్త్రచికిత్సలకు రూ.కోటి వరకు.. ఇతర వైద్య చికిత్సలకు రూ.5 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. ప్రీమియం ఏడాదికి రూ.10 వేలు. ఎంత ఎక్కువమంది హాస్పిటల్ బీమా పాలసీలో చేరితే.. కొంత కాలానికి ప్రీమియం కూడా అంతగా తగ్గుతుంది. దేశంలో ఈ తరహా హాస్పిటల్ ఆరోగ్య బీమా తేవడం ఇదే తొలిసారి. ఈ విధానాన్ని అన్ని ఆసుపత్రులూ అనుసరిస్తే రోగులకు వైద్యఖర్చులు తగ్గి.. ఎక్కువమంది చికిత్సలకు జంకకుండా ముందుకు వస్తారు. అలా ఆసుపత్రుల ఆదాయం కూడా పెరుగుతుంది. దీనికి అనుగుణంగా అవి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి. డిజిటల్ విధానాలతో పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ఆసుపత్రికి వచ్చిన రెండు, మూడు గంటల్లోగా రోగులు తిరిగి వెళ్లేలా మార్పులు చేయాలి.

? కొవిడ్ తర్వాత యువతలో గుండెపోటు మరణాలు ఎక్కువయ్యాయన్నది ఎంతవరకు వాస్తవం..

యువతలో గుండెపోటు మరణాలకు చాలామంది కొవిడ్‌ను, వ్యాక్సీన్లను కారణంగా ఆపాదిస్తున్నారు. కానీ అవి కారణం కాదనేది నా బలమైన విశ్వాసం. వ్యాక్సీన్‌ను తప్పు పట్టడం సరైంది కాదు. మేం పెద్దసంఖ్యలో గుండెజబ్బు బాధితులను చూస్తున్నాం. కొవిడ్ అనంతరం.. ఆరోగ్యంపై అవగాహన, పరీక్షలు చేయించుకోవడం పెరిగింది. ఎప్పుడూ ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేయించుకోని అనేకమంది.. కొవిడ్ తర్వాత ఆ పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇలా పరీక్షలు చేయించుకునేవారి సంఖ్య పెరగడంతో గుండె జబ్బులు బయటపడడమూ ఎక్కువైంది.

? భారత్‌లో కొత్తగా ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలు, పరిష్కారాలు..

ఆరోగ్య సంరక్షణపై ఇటీవలే 'కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా' మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందులో ప్రధానమైంది.. మన దేశంలో 18 ఏళ్ల వయసులో ప్రతి ఒక్కరూ 'లిపిడ్ ప్రొఫైల్' పరీక్ష చేయించుకోవాలని. దీనివల్ల రక్తంలో కొలెస్ట్రాల్ ఎంత ఉందో తెలుస్తుంది. యువత ఆ వయసులోనే ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి. వారికి తమ హెల్త్ నంబర్లు తెలిసి ఉండాలి. ఆ వయసులో సాధారణంగా తాను 'ఫిట్ పర్సన్' అనే భావనలో ఉంటారు. ఒక మైలు దూరం ఆయాసం లేకుండా పరుగెత్తాను కాబట్టి.. ఫిట్ పర్సన్ అంటే కుదరదు. ఫిట్‌గా ఉన్నారో లేదో తెలుసుకోవడానికి కచ్చితంగా కొన్ని పరీక్షలు చేయించుకోవాల్సిందే. రక్త పరీక్షలు, ఈసీజీ, 2డీ ఎకో కార్డియోగ్రామ్, క్యాల్షియం, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, కిడ్నీలు, కాలేయం, థైరాయిడ్ పనితీరు.. ఇలా కొన్ని ముఖ్యమైన పరీక్షలను 18 ఏళ్ల వయసులోనే చేయించాలి. దేశ ఆరోగ్య సంరక్షణ కోసం మనమిచ్చే నినాదం.. 'నో యువర్ నంబర్స్'. యుక్త వయసులో నీ హెల్త్ నంబర్లు (ఆరోగ్య పరామితులు) తెలిస్తే వాటిని మార్చుకోవడానికి అవకాశం ఉంటుంది. కానీ ఆరోగ్య సమస్యలేవీ లేనప్పుడు ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడానికి ఎవరూ ఆసక్తి చూపించరు. గుండెపోటు, పక్షవాతం, క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన జబ్బులు ఒక్కసారిగా విరుచుకుపడేంతవరకు పరీక్షల గురించే ఆలోచించరు. ఒక్కసారి ఈ జబ్బుల బారినపడితే కోలుకోవడం కష్టం. చిన్న పిల్లల్లో ఎక్కువగా ఎదురయ్యే సమస్య గుండెలో రంధ్రం. వీళ్లలో వచ్చే సమస్యలను 2డీ ఎకో ద్వారా గుర్తించవచ్చు. కొందరిలో మాత్రమే.. పుట్టుకతో గుండెజబ్బున్నా పెరిగిన తర్వాత తెలుస్తుంది.



ఆసుపత్రే ఆరోగ్య బీమా కంపెనీని నిర్వహిస్తే గణనీయమైన మార్పులొస్తాయి. ఉదాహరణకు.. మేమే ఆరోగ్య బీమా కంపెనీ నిర్వహిస్తే.. ప్రజలు గుండె జబ్బుల బారినపడకుండా కృషి చేయాల్సి ఉంటుంది. వారు ఆరోగ్యంగా ఉంటే.. మేం బీమా రూపేణా చేయాల్సిన ఖర్చు తగ్గుతుంది కదా. అందుకే బీమా ఇచ్చే ఆసుపత్రులే ప్రజల ఆరోగ్య బాధ్యతను స్వీకరిస్తాయి. ముందు జాగ్రత్తలపై వారిలో అవగాహన కల్పించడంపై దృష్టిపెడతాయి. బీమా సొమ్ము కోసం అవసరం లేకున్నా ఆపరేషన్ చేస్తారేమో అనే అనుమానాలు కూడా తొలగిపోతాయి. అవసరం మేరకే చికిత్స చేస్తారనే నమ్మకం ప్రజల్లో ఏర్పడుతుంది. దేశంలోని అన్ని ఆసుపత్రులూ సొంత బీమా విధానాలు అమలు చేస్తే వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులొస్తాయి. దేశంలో కనీసం 10 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య బీమా అందాలనేది మా లక్ష్యం

? భారత్‌లో మెరుగైన ఆరోగ్య విధానానికి ఏ విధానం సరైంది? అమెరికా.. లేక యూకే మోడల్? మనకంటూ సొంత విధానం ఎలా..

అమెరికా, యూకేల్లోని ఆరోగ్య విధానాలు భారత్‌కు సరిపోవు. మన దేశానికంటూ ప్రత్యేక పాలసీ ఉండాలి. ఆరోగ్య బీమాను ఎక్కువ ప్రాచుర్యంలోకి తీసుకురావాలి. దేశంలో సుమారు 25 కోట్ల కుటుంబాలున్నాయి. దాదాపు 10 కోట్ల కుటుంబాలు వైద్య ఖర్చులు భరించే స్థితిలో ఉంటాయి. వాటికి బీమా అవసరం ఉండదు. మరో 10 కోట్ల కుటుంబాల్లో అత్యధికులు డ్రైవర్లు, వంట మనుషులు, తోటమాలీలు, ఇతర కార్మికులు ఉంటారు. వీరి ఆరోగ్యబీమా బాధ్యతను యజమానులే తీసుకోవాలి. ఉదాహరణకు డ్రైవర్ ఉదయం నుంచి రాత్రి వరకూ పనిచేస్తే, యజమాని అదనంగా రూ.100-200 ఇస్తుంటారు. ఇలా ఏడాదికి రూ.5-6 వేల వరకూ చెల్లిస్తారనుకుంటే.. ఆ డబ్బును రోజువారీ ఖర్చుల్లో వాడేయకుండా.. వారికి అవగాహన కల్పించి, హెల్త్ సేవింగ్ అకౌంట్‌లో జమ చేయాలి. కార్మికుల సొంత సొమ్ము మరో రూ.మూడు, నాలుగువేలు జోడించి బీమాకు వెచ్చించవచ్చు. దీనివల్ల వారికి ఏటా రూ.కోటి విలువైన వైద్యబీమా లభిస్తుంది. అమెరికా, సింగపూర్ తదితర దేశాల్లో ఈ పద్ధతి ఉంది. ఇక మిగిలిన ఐదు కోట్లు, ఆ పైన ఉండే కుటుంబాల బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి.

? వైద్యరంగంలో ప్రభుత్వాలు తక్షణం చేయాల్సిన మార్పులేమిటి..

భారత్‌లో జనాభా నిష్పత్తితో పోలిస్తే.. సుమారు 20 లక్షల మంది వైద్యులు తక్కువగా ఉన్నారు. దేశంలో వచ్చే ఐదేళ్లలో 75 వేల కొత్త ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి తెస్తున్నామని ప్రధానమంత్రి మోదీ ప్రకటించడం విప్లవాత్మకమైన నిర్ణయమే. కానీ మొత్తం 75 వేల సీట్లూ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉండాలి. సీట్లతోపాటు ఫీజులూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండాలి. 500 పడకల కంటే ఎక్కువ ఉన్న ప్రైవేటు ఆసుపత్రులకు వైద్యకళాశాల మంజూరు చేయాలి. దీనిపై ప్రభుత్వానికి నియంత్రణ ఉండాలి. ఫీజులు, విద్యార్థుల ప్రవేశాలు ప్రభుత్వ అజమాయిషీలో ఉంటే వైద్యరంగంలో అనూహ్యమైన మార్పులొస్తాయి.

? సహజంగా నయమయ్యే అనేక జబ్బులను ప్రజలు సంక్లిష్టం చేసుకుని అధికంగా డబ్బు ఖర్చయ్యే పరిష్కారాలను వెతుక్కుంటున్నారని మీరు పలు సందర్భాల్లో అన్నారు..

ఇది వాస్తవమే. మన దేశంలో చాలామంది జీవనశైలి వ్యాధులతో బాధపడుతున్నారు. ఉదాహరణకు షుగర్ జబ్బుకు ప్రధాన కారణాల్లో ఊబకాయం ఒకటి. ఒబెసిటీతో ఉన్నవారు షుగర్‌తోపాటు గుండెపోటు, పక్షవాతం, అధిక రక్తపోటు వంటి అనేక వ్యాధుల బారినపడడానికి అవకాశాలెక్కువ. చిన్నతనం నుంచే శారీరక వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను అలవర్చుకుంటే జాగ్రత్తపడొచ్చు. మరొకటి పొగాకు వాడకం. భారత్‌లో అత్యధిక దవడ, నోటి క్యాన్సర్లకు ముఖ్య కారణం పొగాకు వాడకమే. ఇలాంటి వాటిని నియంత్రించుకుంటే.. ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

? వైద్యరంగం పురోగమనంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పాత్ర ఎలా ఉండబోతోంది..

రోగిని వైద్యుడు పరీక్షించి, రిపోర్టులను పరిశీలించాల్సిన సందర్భాల్లో.. కొన్నిసార్లు 30-40 రకాల రిపోర్టులను క్రోడీకరించాల్సి వస్తుంది. కొన్నిసార్లు సరిగ్గా క్రోడీకరించలేకపోవచ్చు. అదే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ 3-4 వేల రిపోర్టులను కూడా కచ్చితత్వంతో క్రోడీకరిస్తుంది. రోగ నిర్ధారణలో వైద్యుడికి సహకరిస్తుంది. రోగికి మెరుగైన చికిత్స అందించడంలో వైద్యులకు ఏఐ దోహదపడుతుంది.

- ఈనాడు, హైదరాబాద్

ఇంటి వద్దకే ఎల్వీపీఈఐ నేత్ర వైద్య సేవలు

- 3 రాష్ట్రాల్లోని విజన్ సెంటర్ల పరిధిలో అందుబాటులోకి
- ప్రారంభించిన సంస్థ ప్రతినిధులు
- వృద్ధులు, దివ్యాంగులు, పిల్లలకు తొలి ప్రాధాన్యమిస్తామని వెల్లడి



ఇంటి వద్దకే సేవలను ప్రారంభిస్తున్న ఎల్వీపీఈఐ వైస్ ఛైర్ డాక్టర్ పి.రాజీవ్‌రెడ్డి, స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంకు సస్టెయినబిలిటీ విభాగాధిపతి కరుణా భాటియా, ఎల్వీపీఈఐ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ సూర్యనాథ్ రథ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత్‌గార్గ్

ఈనాడు, హైదరాబాద్: ఆసుపత్రులకు రాలేని వికలాంగులు, వృద్ధులు, చిన్నారులకు ప్రాధాన్యమిస్తూ... ప్రతి ఒక్కరికి ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్వీపీఈఐ) ఇంటి వద్దకే నేత్ర సంరక్షణ సేవలను అందుబాటులోకి తెచ్చింది. స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంకు భాగస్వామ్యంతో ఈ సేవలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాలోని ఎల్వీపీఈఐ విజన్ సెంటర్ల పరిధిలో ప్రవేశపెట్టింది. గురువారం హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఎల్వీపీఈఐ వైస్ ఛైర్ డాక్టర్ పి. రాజీవ్‌రెడ్డి, ఇతర ప్రతినిధులతో కలిసి ఈ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతానికి మూడు రాష్ట్రాల్లో ఉన్న విజన్ సెంటర్లకు 10-25 కిలోమీటర్ల దూరం పరిధిలో ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందిస్తామని పేర్కొన్నారు. 'దివ్యాంగులు, మంచం మీద నుంచి కదల్లేని వారు, వృద్ధులు, చిన్న పిల్లలకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఆయా విజన్ సెంటర్లకు ఫోన్ చేయడమో లేదా ఎల్వీపీఈఐ వెబ్‌సైట్‌లో సంప్రదించడం ద్వారా సేవలు పొందొచ్చు. పేదలు, వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వారికి ఉచితంగానే సేవలు అందిస్తాం. ఇంటి వద్దకే సేవల్లో భాగంగా రోగి నేత్ర సమస్యల చరిత్ర, టార్చిలైట్ పరీక్ష, రిఫ్రాక్షన్ పరీక్ష, యాంటీరియర్ సెగ్మెంట్ పరీక్ష, ఇంట్రాఆక్యులర్ ఒత్తిడి పరీక్ష, ఫండస్ మూల్యాంకనం, అవసరమైతే అల్ట్రాసౌండ్ బి-స్కాన్, ఆప్టికల్ కొహెరెన్స్ టోమోగ్రఫీ(ఒసిటి-రెటీనా) తదితరాలు, మధుమేహ సంబంధిత రెటీనోపతి, గ్లకోమాకు ఏఐ ఆధారిత పరీక్షలు నిర్వహిస్తాం. వాయిస్ లేదా వీడియో కాల్ ద్వారా టెలికన్సల్టేషన్ సేవలూ అందిస్తాం. అవసరమైన వారు ఎల్వీపీఈఐ ఆప్టికల్ సేవల ద్వారా వైద్యులు సూచించిన కళ్లద్దాలను ఇంటికే తెప్పించుకోవచ్చు. పరీక్షల అనంతరం అర్హులైన రోగులకు ఉచితంగా శుక్లాల శస్త్ర చికిత్సలు చేస్తాం' అని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని కేంద్రాలను అందుబాటులోకి తెస్తామన్నారు.

ఛార్జీలు ఇలా

హైదరాబాద్‌లో..
- ◆ వ్యక్తిగత అపాయింట్‌మెంట్ కోసం...రూ.1,500 (25 కి.మీ పరిధిలో)
- ◆ గ్రూపు అపాయింట్‌మెంట్ ఛార్జీలు (ఒక్కరికి)- రూ. 1,000 (25 కి.మీ పరిధిలో)

బ్రహ్మపుర, సిరిసిల్ల, మదనపల్లెలో..
- ◆ వ్యక్తిగత అపాయింట్‌మెంట్ ఛార్జీలు.. రూ.400 (25 కి.మీ పరిధిలో)

ఇక 60 రోజులే

(మొదటి పేజీ తరువాయి)

సగటున 21% మంది ఆ తర్వాత వివిధ కారణాల వల్ల వాటిని రద్దు చేసుకుంటున్నారు. మరో 4-5% మంది ప్రయాణికులు తమ టికెట్లు రద్దు చేసుకోవడం లేదు.. ప్రయాణం కూడా చేయడంలేదు. దీనివల్ల బెర్తులు వృథా కావడం, ఒకరి బదులు మరొకరు ప్రయాణించడం, కొందరు రైల్వే సిబ్బంది లబ్ధి పొందడం వంటివి జరుగుతున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. నిజమైన ప్రయాణికులకు అవకాశం కల్పించడానికే ముందస్తు రిజర్వేషన్ గడువును తగ్గించినట్లు పేర్కొంది. ప్రత్యేక రైళ్లపై ప్రణాళిక రూపొందించడం వీలవుతుందని పేర్కొంది. బెర్తుల వృథాను అరికట్టవచ్చని, అక్రమ బుకింగ్‌లు తగ్గి, నిజమైన ప్రయాణికులకు ఎక్కువ టికెట్లు అందుబాటులోకి వస్తాయని తెలిపింది.

దన్ను ఇచ్చిన వారిపై కన్ను

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో గత పదేళ్లలో జరిగిన ఆక్రమణలకు సంబంధించి రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహ సమాచారం ఆధారంగా ప్రభుత్వం వివరాలు సేకరించింది. ఓఆర్ఆర్ లోపల పదేళ్లలో 44 నీటి వనరులు పూర్తిగా, 127 పాక్షికంగా ఆక్రమణలకు గురైనట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు కారకులపై రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ తదితర శాఖల సహకారంతో హైడ్రా సమాచారం సేకరించింది. అడ్డగోలుగా అనుమతులిచ్చినట్లు గుర్తించింది. ప్రాథమిక ఆధారాల మేరకు మొత్తం ఆరుగురు అధికారులపై పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసింది. చందానగర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎం.రాజ్‌కుమార్, చందానగర్ సర్కిల్ 21 డిప్యూటీ కమిషనర్ ఎన్.సుధామ, నిజాంపేట మున్సిపల్ కమిషనర్ పి.రామకృష్ణారావు, బాచుపల్లి ఎమ్మార్వో పూల్‌సింగ్, మేడ్చల్ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ కె. శ్రీనివాసులు, హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి సుధీర్‌కుమార్‌లపై కేసులు నమోదయ్యాయి. వీరిపై దర్యాప్తు జరుగుతోంది. హైడ్రా పరిశీలనలో ఇప్పటివరకు కూలగొట్టిన అక్రమ కట్టడాల మొత్తం విస్తీర్ణం 114 ఎకరాలు. నీటిపారుదల, రెవెన్యూ, నగరపాలక, హెచ్ఎండీఏ వంటి అన్ని ప్రభుత్వశాఖల్లో అవినీతిపరులైన కొందరు అధికారులు, సిబ్బంది.. ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కై ఈ అక్రమాలకు సహకరించినట్లు హైడ్రా గుర్తించింది. ఇదంతా రూ.వందల కోట్ల వ్యవహారం కావడంతో అనుమతులిచ్చిన సిబ్బంది అక్రమార్జనపై అనిశాతో విచారణ చేయించనున్నారని సమాచారం.

హమాస్ అగ్రనేత యాహ్యా సిన్వర్ హతం

(మొదటి పేజీ తరువాయి)

బందీలను సురక్షితంగా తీసుకురావడమే తమ ధ్యేయమని తెలిపారు. ఇక ఎంత మాత్రం గాజాను హమాస్ నియంత్రించలేదని అన్నారు. తమ నాయకుడి మరణంపై హమాస్ ఇంకా స్పందించలేదు. అయితే కీలక నేతలంతా హతమైన వేళ.. సిన్వర్ మృతి హమాస్‌కు భారీ దెబ్బగానే విశ్లేషకులు భావిస్తున్నారు. దక్షిణ గాజాలో బుధవారం ముగ్గురు హమాస్ మిలిటెంట్లను ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) హతమార్చింది. ఇందులో ఓ వ్యక్తికి సిన్వర్ పోలికలు ఉన్నాయని గుర్తించిన ఐడీఎఫ్... డీఎన్ఏ, దంత నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి హమాస్ నేత మరణాన్ని ధ్రువీకరించుకుంది. గాజా యుద్ధానికి కారణమైన అక్టోబరు 7 మారణహోమానికి సూత్రధారి సిన్వరేనని తొలి నుంచి ఇజ్రాయెల్ బలంగా విశ్వసిస్తోంది. గతేడాది ఇజ్రాయెల్ సరిహద్దులపై హమాస్ జరిపిన దాడిలో 1200 మంది మృతి చెందారు. 250 మందిని బందీలుగా గాజాకు తీసుకువెళ్లింది. ఇంకా హమాస్ దగ్గర 100 మంది బందీలు ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఏడాదిగా సిన్వర్ కోసం గాజా సొరంగాల్లో ఐడీఎఫ్ వేట కొనసాగిస్తోంది. కొన్ని సార్లు దొరికినట్లే దొరికి తప్పించుకున్నాడని పలుమార్లు పేర్కొంది. తనను ఇజ్రాయెల్ హతమార్చకుండా బందీల మధ్య సిన్వర్ తలదాచుకుంటున్నట్లు అమెరికా నిఘా వర్గాలు కూడా ఇటీవల పేర్కొన్నాయి. అయితే బుధవారం తాము నిర్వహించిన దాడిలో మృతి చెందిన ముగ్గురు ఉగ్రవాదులు.. బందీల మధ్యలో లేరని ఐడీఎఫ్ వివరణ ఇచ్చింది. బందీలకు ఎలాంటి హాని జరగలేదని పేర్కొంది. హమాస్ అగ్రనేత మృతికి సంబంధించిన సమాచారాన్ని అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో ఇజ్రాయెల్ పంచుకుంది.

శత్రువులంతా అంతమైనట్లే!

గాజాపై యుద్ధం ప్రారంభించినప్పుడే.. హమాస్ అగ్రనేతలందరినీ హతమారుస్తామని ఇజ్రాయెల్ ప్రతిజ్ఞ చేసింది. ఒకొక్కరిని వేటాడుతూ వచ్చింది. హమాస్ రాజకీయ వ్యవహారాల అధిపతి ఇస్మాయెల్ హనియెను ఇటీవల టెహ్రాన్‌లో హతమార్చింది. మరో నేత మహమ్మద్ డెయిఫ్‌నూ మట్టుబెట్టింది. కొన్ని నెలలుగా గాజాపై చేస్తున్న దాడుల్లో దాదాపు కీలక కమాండర్లందరినీ చంపేసింది. ఇటీవల బీరుట్‌లోని హెజ్‌బొల్లా కార్యాలయంపై వైమానిక దాడులు నిర్వహించి...ఆ సంస్థ అధినేత నస్రల్లాను హతమార్చి కలకలమే సృష్టించింది. ఇప్పుడు సిన్వర్ మృతితో శత్రుశేషం దాదాపు పూర్తయినట్లే. మరోవైపు ఉత్తరగాజాలో గురువారం అబూ హుస్సేన్ పాఠశాలపై ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో 15 మంది చనిపోయారు. ఇందులో ఐదుగురు చిన్నారులు ఉన్నారు.



ఝుమ్మంది నాదం.. రామప్ప వైభవం

రామప్ప శిల్పకళా సౌందర్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురువారం కూచిపూడి, పేరిణి సంప్రదాయాల్లో నిర్వహించిన 'ప్రైడ్ ఆఫ్ రామప్ప' నృత్య ప్రదర్శన ఆద్యంతం అలనాటి వైభవాన్ని కళ్లకు కట్టింది.

- న్యూస్‌టుడే, రవీంద్రభారతి

సౌర విద్యుత్తు బాటలో..

సర్కారీ భవనాలు



ఈనాడు, హైదరాబాద్ : నగరంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, జాతీయ పరిశోధన కేంద్రాలు సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు వేగంగా అడుగులు వేస్తున్నాయి. సంస్థలకు కావాల్సిన విద్యుత్తులో గరిష్ఠంగా సోలార్‌ను వినియోగించుకుంటున్నాయి. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద కార్యాలయాలు, ఇళ్లపై సౌర పలకలతో కాలుష్య రహిత విద్యుదుత్పత్తికి ప్రాధాన్యమిస్తున్నాయి.


జీఎస్ఐలో 150 కిలోవాట్ల సౌర ప్లాంట్లు

బండ్లగూడలోని జియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) శిక్షణ కేంద్రంలో 300 వరకు సౌర పలకలు ఏర్పాటుచేశారు. 150 కిలోవాట్ల సామర్థ్యమున్న సౌర ప్లాంట్లు బిగించారు. మింట్ కాంపౌండ్‌లో ఐదంతస్తుల టీఎస్ రెడ్కో భవనం నిర్మాణంలో ఉంది. వంద శాతం కరెంటును సౌర, పవన విద్యుత్తు వంటి పునరుద్ధరణీయ ఇంధన వనరులతో మాత్రమే వాడతారు. ఈ భవనంలోనే టీజీఎస్పీడీసీఎల్ మెట్రో జోన్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. కొత్త భవనంలో పూర్తిగా నెట్ జీరో అనేది ఇదే మొదటిసారి.

బడ్జెట్‌లో ఘనం.. ఇచ్చింది తృణం

- కేటాయించిన దాంట్లో ఇప్పటివరకు పదో వంతే విడుదల
- నిధులు లేక బల్దియాలో నిలిచిన అభివృద్ధి పనులు

ఈనాడు-సిటీ బ్యూరో
ప్రధాన ప్రతినిధి



రాష్ట్ర బడ్జెట్‌లో బల్దియాకు రూ.3,200 కోట్లు కేటాయించినా.. ఆ నిధులను విడుదల చేసేందుకు ఆర్థిక శాఖ ముందుకురావడం లేదు. ప్రభుత్వం కేటాయించిన మొత్తంలో ఇప్పటివరకు కేవలం పదోవంతు మాత్రమే విడుదలయ్యాయి. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో జీహెచ్ఎంసీలో అభివృద్ధి ఎక్కడకక్కడే ఆగిపోయింది. పన్నుల రూపంలో వస్తున్న ఆదాయం ఉద్యోగుల జీతాలు, వివిధ రకాల నిర్వహణ పనులకే సరిపోతుండడంతో..రోడ్లు, నాలాలు ఇతరత్రా పనులు చేపట్టడానికి వీలుపడటం లేదు. దీనిపై క్షేత్రస్థాయిలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. అత్యవసరంగా రూ.వెయ్యి కోట్ల నిధులను ఆర్థిక శాఖ విడుదల చేయాలని బల్దియా అధికారులు కోరుతున్నారు.

పనులు నిలిపేసిన గుత్తేదారులు..

గత ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినా నిధులు మాత్రం పూర్తిగా విడుదల చేయలేదు. దీంతో బల్దియాలోని అన్ని విభాగాల్లో పనులు చేసిన గుత్తేదారులకు పెద్దఎత్తున బకాయి పడింది. రూ.1500 కోట్లు రోడ్ల నిర్మాణాలు చేపట్టిన గుత్తేదారులకే ఇవ్వాల్సి ఉంది. బకాయిలు ఇవ్వకపోవడంతో ఏడాదిగా పనులు నిలిపివేశారు. వివిధ పనులకు పలుమార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదు. మరోవైపు రూ.2500 కోట్లు రెండు పడక గదుల ఇళ్ల గుత్తేదారులకు ఇవ్వాల్సి ఉంది. దీంతో 35 వేల ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఆగిపోయాయి. ఈ ఇళ్లను మూసీ నిర్వాసితులకు కేటాయించాలని అనుకున్నారు. అసంపూర్తిగా ఉండడంతో కేటాయించలేని పరిస్థితి. నిర్వాసితుల కోసం రెండు పడక గదుల ఇళ్లను సిద్ధం చేయడానికి రూ.1000 కోట్లు కేటాయించాలని పురపాలక శాఖ ప్రభుత్వానికి నివేదించింది.

ఏ మూలకూ చాలక..

బల్దియాలో దాదాపు పనులన్నీ నిలిచిపోవడంతో పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ చొరవ తీసుకుని హెచ్ఎండీఏతోపాటు ఇతర విభాగాల్లో ఉన్న నిధుల్లో దశల వారీగా రూ.300 కోట్లు విడుదల చేయించారు. ఈ మొత్తం నిధులు దేనికీ సరిపోవడం లేదని గ్రేటర్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఎస్సార్డీపీ కింద చేపట్టిన వంతెనల పనులను గుత్తేదారులు ఆపేశారు. కాలనీ రోడ్ల నిర్మాణాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల హెచ్ఎండీఏ విడుదల చేసిన రూ.150 కోట్ల నిధుల్లో ఒక్కో జోన్‌కు రూ.20 కోట్ల చొప్పున ఆరు జోన్లకు రూ.120 కోట్లు కేటాయించారు. కానీ ఆ నిధులతో పూర్తిస్థాయిలో పనులు ప్రారంభించ లేని పరిస్థితి. ఒక్కో జోన్‌కు రూ.300 కోట్లను విడుదల చేస్తే అన్ని పనులు మొదలుపెట్టడానికి అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ప్రీకాస్ట్ దిమ్మెలతో

వరద నిల్వ ట్యాంకులు

ఈనాడు, హైదరాబాద్: వరద నీటిని ఒడిసి పట్టే భూగర్భ జలాశయాల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు జీహెచ్ఎంసీ కొత్త పద్ధతిపై దృష్టిపెట్టింది. ప్రీకాస్ట్ పద్ధతిలో వేర్వేరు సామర్థ్యాలు కలిగిన ట్యాంకులను నిర్మించేందుకు సిద్ధమైంది. వేగంగా పనులను పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ప్రీకాస్ట్ పద్ధతిని ఎంపిక చేసుకుంటున్నామని, నిర్ణీత ప్రమాణాలతో తక్కువ ధరకు దిమ్మెలను సరఫరా చేసే సంస్థలకు టెండర్లు పిలిచామని ఇంజినీరింగ్ విభాగం వెల్లడించింది.

జాప్యం లేకుండా..

ఇప్పటికే 5లక్షలు, పది లక్షల లీటర్ల నీటిని నిల్వ చేయగల సామర్థ్యంతో జీహెచ్ఎంసీ 12 చోట్ల భూగర్భ జలాశయాల నిర్మాణాన్ని ప్రారంభించింది. తరచుగా వర్షాలు కురుస్తుండటంతో పురోగతి పడకేసింది. ఆ అనుభవంతో.. ఇకపై ప్రీ కాస్ట్ పద్ధతిలో ట్యాంకులు నిర్మించాలని ఇంజినీర్లు నిర్ణయించారు. అందుకోసం 50 ప్రాంతాలను ఎంపిక చేశామని, స్థలాన్ని పరిశీలించి.. అక్కడ ఎన్ని లక్షల లీటర్ల ట్యాంకులు నిర్మించాలో నిర్ణయిస్తామంటున్నారు. ప్రీకాస్ట్ పద్ధతిలో తయారు చేసి, వాటిని నేరుగా ఆయా ప్రాంతాల్లో అమర్చాలని, వారంలో పని మొత్తం పూర్తయ్యేట్లు కార్యక్రమాన్ని రూపొందించామని జీహెచ్ఎంసీ చెబుతోంది.



రానున్న పండగలను పురస్కరించుకొని కేపీహెచ్‌బీకాలనీలోని ఓ మాల్‌లో గురువారం పలువురు చెఫ్‌లు, యువతులు కేక్ మిక్సింగ్ చేస్తూ సందడి చేశారు. –న్యూస్‌టుడే, కేపీహెచ్‌బీకాలనీ

ట్రాఫిక్ నియంత్రణకు హైడ్రా

ఈనాడు- హైదరాబాద్: నగరంలో విపరీతంగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి హైడ్రా రంగంలోకి దిగుతోంది. వాహన రద్దీ సమస్యతో పాటు ఫుట్‌పాత్, రహదారి ఆక్రమణలపై నగర ట్రాఫిక్ విభాగంతో కలిసి పనిచేయాలని నిర్ణయించింది. ఇరు విభాగాలు కలిసి ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఆక్రమణలను తొలగించనున్నాయి. హైడ్రా ఆధీనంలోని విపత్తు స్పందన బృందాలు ట్రాఫిక్ నియంత్రణలో పాలుపంచుకోనున్నాయి. ఈ మేరకు ఇరు విభాగాలు సంయుక్తంగా పనిచేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ పి.విశ్వప్రసాద్ నిర్ణయించారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులతో కలిసి పనిచేసేందుకు డీఆర్ఎఫ్ బృందాలకు శిక్షణ ఇవ్వనున్నారు.



మాట్లాడుతున్న రంగనాథ్. చిత్రంలో విశ్వప్రసాద్

- ఇరు విభాగాలు కలిసి పనిచేయాలని నిర్ణయం
- ఫుట్‌పాత్, రోడ్ల ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్

హైడ్రా అధికారులు, నగర ట్రాఫిక్ డీసీపీ, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లతో రంగనాథ్, విశ్వప్రసాద్ గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నెలకోసారి ఇరు విభాగాలు భేటీ కావాలని నిర్ణయించారు.

డీఆర్ఎఫ్ బృందాలకు శిక్షణ

- ప్రధాన రహదారులు, కాలనీల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన శాశ్వత దుకాణాల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి. దుకాణదారులకు ముందస్తు సమాచారం ఇచ్చి తొలగించాలి.
- ఫుట్‌పాత్‌ల మీద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, టెలిఫోన్ డక్టులు, జీహెచ్ఎంసీ చెత్తడబ్బాలు తొలగించాలి. పాదచారులు సాఫీగా వెళ్లేలా ఫుట్‌పాత్‌లను మార్చాలి. ట్రాఫిక్ విధులపై డీఆర్ఎఫ్ బృందాలకు శిక్షణ ఇవ్వడం.
- నగరంలోని రహదారులపై 144 నీరు నిలిచే పాయింట్లుండగా అందులో 65 హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉన్నాయి. వీటిని ప్రాధాన్యక్రమంలో పరిష్కరించాలి.
- వరద నీరు వెంటనే తొలగించేందుకు భారీ మోటార్లు వినియోగించాలి. ఈ ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారానికి కొత్తపైపులైన్లు ఏర్పాటు చేయాలి. వరద కాలువలు, పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలి.
- కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లు, కొమ్మల్ని గుర్తించి తొలగించాలి.

నగరంలో విధులు.. ఆంధ్రప్రదేశ్‌లో డీఎడ్

- ఉపాధ్యాయ కొలువుకు ఎంపికైన 11మంది పొరుగు సేవల సిబ్బంది
- నియామకాలను నిలిపివేసిన హైదరాబాద్ కలెక్టర్

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ కొలువు సాధించాలన్న లక్ష్యంతో హైదరాబాద్ జిల్లాలో ఓ ప్రభుత్వ విభాగంలో పొరుగు సేవల కింద విధులు నిర్వహిస్తున్న అభ్యర్థులు.. ఆంధ్రప్రదేశ్‌లో డీఎడ్ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) పూర్తిచేశారు. డీఎడ్ అర్హతతో ఎస్జీటీ పోస్టుకు దరఖాస్తు చేసి, పరీక్ష రాశారు. ఉద్యోగానికి అర్హత సాధించడంతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. అయితే నియామకపు పత్రాలు ఇచ్చేటప్పుడు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆధ్వర్యంలో మరోమారు పరిశీలించగా.. 11 మంది పొరుగుసేవల విభాగంలో విధులు నిర్వహించినట్లు తేలడంతో నియామకపు పత్రాలు నిలిపివేశారు. వారు సమర్పించిన విద్యార్హత పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఉత్తర్వులు జారీచేశారు.

తరగతులకు హాజరు కాకుండా..

ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైన 11 మంది తాము ఆంధ్రప్రదేశ్‌లో డీఎడ్ పూర్తి చేసినట్టు ధ్రువపత్రాలు సమర్పించారు. అయితే పొరుగు సేవల విభాగంలో విధులు నిర్వహిస్తూ.. నెలనెలా జీతాలు తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న వీరంతా.. పక్క రాష్ట్రంలో డీఎడ్ ఎలా చదివారని కలెక్టర్ అనుదీప్ సందేహాన్ని వ్యక్తంచేశారు. ఈ 11 మంది తరగతులకు హాజరుకాకుండా బీఎడ్ పూర్తి చేశారని, పరీక్షల సమయంలోనే అక్కడికి వెళ్లి ఉంటారని విచారణ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

నకిలీ బోనఫైడ్‌లతో మరో 21 మంది..

హైదరాబాద్‌లో ఉపాధ్యాయ పోస్టులు ఎక్కువగా ఉండడంతో కొందరు అభ్యర్థులు తప్పుడు బోనఫైడ్ పత్రాలను సమర్పించి పరీక్షలు రాశారు. వీరిలో 21 మంది ఎంపికయ్యారు. తుదిదశ పరిశీలనలో బోనఫైడ్ పత్రాలు నకిలీవని ప్రాథమికంగా తేలింది. మూతపడిన ప్రైవేటు పాఠశాలల్లో చదివినట్లు బోనఫైడ్ పత్రాలు సమర్పించారు. ఎప్పుడో మూతబడిన పాఠశాలల్లో.. ఎలా చదివారనే అనుమానంతో వారికి అధికారులు నియామక పత్రాలు ఇవ్వలేదు. ఇదే తరహాలో మరికొందరు అభ్యర్థులు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనూ దరఖాస్తులు చేసినట్లు తెలిసింది. ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు అంతర్గతంగా విచారణ చేస్తున్నట్టు సమాచారం. హైదరాబాద్‌లో మొత్తం 32 మంది అభ్యర్థులకు నియామకపు పత్రాలు ఇవ్వలేదని, వారు సమర్పించిన ధ్రువపత్రాలపై విచారణ చేస్తున్నామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.



చిల్లర చిక్కులకు చెల్లు

- రెండు నెలల్లో బస్సుల్లో పూర్తిస్థాయి డిజిటల్ చెల్లింపులు
- ప్రత్యేక యాప్ రూపకల్పనపై ఆర్టీసీ దృష్టి

ఈనాడు, హైదరాబాద్



ఆర్టీసీ ప్రయాణికులకు చిల్లర కష్టాలు తీరనున్నాయి. బస్సుల్లో కండక్టర్, ప్రయాణికులకు మధ్య చిల్లర గొడవలు నిత్యకృత్యమయ్యాయి. ఈ సమస్యను తీర్చేందుకు పూర్తిస్థాయి డిజిటల్ చెల్లింపుల ప్రక్రియకు సంస్థ సమాయత్తమైంది. ఇందుకు సంబంధించి బండ్లగూడ, దిల్‌సుఖ్‌నగర్ డిపోల్లోని 140 బస్సుల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన డిజిటల్ చెల్లింపుల ప్రక్రియకు విశేష స్పందన రావడంతో రెండు నెలల్లో గ్రేటర్‌లోని అన్ని డిపోల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్టీసీ సన్నాహాలు చేస్తోంది. అవసరమైన 4,500 ఇంటలిజెంట్ టికెటింగ్ యంత్రాలను(ఐటిమ్స్)ను సమకూర్చుకుంటోంది. ఇంటర్నెట్ ఆధారంగా ఇవి పనిచేయనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 10,000 ఐటిమ్స్ యంత్రాలు అవసరమవుతుండగా సగం మేర గ్రేటర్‌లోనే వినియోగించనున్నారు. తద్వారా క్యూఆర్ కోడ్ స్కానింగ్, కార్డు స్వైపింగ్‌తో ప్రయాణికులు టికెట్ కొనే వెసులుబాటు కలుగనుంది.

పెద్దనోట్లతో పరేషాన్

గ్రేటర్‌లో మెజార్టీ ప్రయాణికులు డిజిటల్ చెల్లింపులకు అలవాటుపడ్డారు. బస్సుల్లో టికెట్ కొనుగోలుకు రూ.100, రూ.200 నోట్లు ఇస్తుండటంతో కండక్టర్లకు ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతోంది. రూ.10 నాణేలను తీసుకోవడంలోనూ కండక్టర్లు, ప్రయాణికుల మధ్య వాగ్వాదం జరుగుతోంది. ఈ నాణేన్ని తీసుకోవాలని ఆర్బీఐ కోరుతున్నా, స్వయంగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశించినా కొన్ని బస్సుల్లో తీసుకోవడం లేదంటూ ప్రయాణికులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు ప్రారంభమైతే చిల్లర కష్టాలు తీరిపోనున్నాయి.

విద్యార్థుల బస్‌పాస్‌కు యాప్..

గ్రేటర్ పరిధిలో 5లక్షల మందికి పైగా విద్యార్థులు వేర్వేరు కళాశాలల్లో చదువుతున్నారు. వీరంతా బస్‌పాస్ రెన్యువల్ కోసం ప్రతినెలా వరుసలో ఉండాల్సిన సమస్య తీరనుంది. ఇందుకు ఆర్టీసీ ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టే యోచనలో ఉంది. యాప్‌తో బస్‌పాస్‌లు పొందే వెసులుబాటు కలగనుంది. తద్వారా పాస్‌ను కండక్టర్‌కు మొబైల్‌లోనే చూపించి ప్రయాణించొచ్చు.

రచ్చగా మారిన ఫిర్యాదు వ్యవహారం



మాట్లాడుతున్న బాధితులు

లాలాపేట: ఓయూ ఠాణాలో ఓ ఫిర్యాదు వ్యవహారంలో పోలీసులు స్క్వేర్ స్పోర్ట్స్ నిర్వాహకులను పిలిపించడం రచ్చగా మారింది. పోలీసులకు వారికి మధ్య మాటామాట పెరిగింది. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్, నిర్వాహకులు పరస్పరం చేయిచేసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. తార్నాక హనుమాన్‌నగర్ కాలనీలోని స్క్వేర్ స్పోర్ట్స్ వద్దకు గురువారం పెట్రోలింగ్ వాహనం వెళ్లి నిర్వాహకుడు సందీప్‌రెడ్డికి ఫోన్ చేసి మీపై ఫిర్యాదు వచ్చిందని, ఓయూ ఠాణాకు ఏసీపీ రమ్మంటున్నారని బలవంతం చేశారు. తన భార్యను ఆసుపత్రికి తీసుకెళ్లి వస్తానని చెప్పినా.. వెంటే వెళ్తూ వాహనంలోకి ఎక్కాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో సందీప్‌రెడ్డి తన సోదరులు సంతోష్‌రెడ్డి, శివరాంరెడ్డితో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమపై వచ్చిన ఫిర్యాదు ఏమిటని ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌ను అడిగారు. ఈ సందర్భంగా వారి మధ్య వాగ్వాదం జరిగింది. అది కాస్తా తోపులాటకు దారితీసింది. ఈ సమయంలో ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. అనంతరం ఏసీపీ జగన్, ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌పై స్పోర్ట్స్ నిర్వాహకులు అదనపు డీసీపీ నర్సయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా కాగా.. పోలీసులు మాత్రం స్పందించలేదు. ఫిర్యాదు లేకుండానే స్టేషన్‌కు పిలిపించి 15 మంది పోలీసులు బాగా కొట్టారని, తరువాత పొరపాటు జరిగిందని క్షమాపణ చెబుతున్నారని సందీప్‌రెడ్డి తెలిపారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి బాధ్యతల స్వీకరణ



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జీహెచ్ఎంసీ కమిషనర్‌గా కె.ఇలంబర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, యాదగిరిరావు, వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, పంకజ, రవికిరణ్ ఉపేందర్‌రెడ్డి, వెంకన్న సీసీపీ శ్రీనివాస్, సీసీపీఆర్ఓ మహమ్మద్ ముర్తుజా అలీ, చీఫ్ ఎంటమాలజిస్ట్ డా.రాంబాబు, ఓఎస్డీ వేణుగోపాల్, ఆయా విభాగాల సీనియర్ అధికారులు కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కాసులుంటేనే ఆటలు

- బల్దియా క్రీడా ప్రాంగణాలు ప్రైవేటుకు
- సౌకర్యాలు పెంచి రుసుము వసూలుకు అనుమతి

ఈనాడు, హైదరాబాద్



నగరంలోని స్పోర్ట్స్ కాంప్లెక్సులు, మైదానాల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు ఇచ్చేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. సౌకర్యాల పెంపు, ఆధునిక హంగులు ఇతరత్రా లక్ష్యాలతో పనులు ప్రారంభించింది. మొదటి దశలో ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 9 స్పోర్ట్స్ కాంప్లెక్సులు, 200లకుపైగా మైదానాలను పీపీపీ(ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) పద్ధతిలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అందుకు ప్రణాళిక ఇవ్వాలంటూ కన్సల్టెన్సీలను ఆహ్వానిస్తూ జోనల్ సూపరింటెండెంట్ ఇంజినీరు తాజాగా ఆర్ఎఫ్‌పీ(రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) టెండరు నోటిఫికేషన్ విడుదల చేశారు. క్రమంగా మిగిలిన జోన్లలోని క్రీడా కాంప్లెక్స్‌లను ప్రైవేటుకు ఇవ్వాలని బల్దియా భావిస్తోంది.

ఇప్పటికే ఫీజు వసూలు చేస్తున్న బల్దియా..

ఏడేళ్ల క్రితం జీహెచ్ఎంసీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదుతో స్పోర్ట్స్ కాంప్లెక్సులు, మైదానాలకు రుసుము వసూలు చేయడం ప్రారంభించింది. ఏటా రూ.5కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది. నెలవారీ రుసుము రూ.100నుంచి రూ.1000 వరకు ఉంది. మైదానాన్ని అద్దెకు తీసుకోవాలంటే రోజుకు రూ.7500 వరకు చెల్లించాలి.

కాంట్రాక్టు ప్రతిపాదన ఇలా..

అభివృద్ధి చేసి ఐదేళ్లపాటు నిర్వహించుకునేందుకు అనుమతి, పరిస్థితులను బట్టి కాంట్రాక్టు పొడిగింపుపై జీహెచ్ఎంసీ నిర్ణయం తీసుకుంటుంది. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ నిపుణులైన శిక్షకులతో కేంద్రాలు నిర్వహించాల్సి ఉంటుంది. అన్నిరకాల రుసుములను ఏటా 5-7శాతం మేర పెంచుకోవచ్చు. ప్రాంగణంలో ఆహారం, క్రీడా వస్తువుల విక్రయ కేంద్రాలు, ఫిట్‌నెస్ కేంద్రాలు నిర్వహించుకోవచ్చు.

పేద, మధ్య తరగతిపై భారం..

పలువురు ఇంజినీర్లు, గేమ్ ఇన్‌స్పెక్టర్లు కలిసి స్పోర్ట్స్ కాంప్లెక్సులు, ఈత కొలనులు, ఇతర మైదానాలకు మరమ్మతులంటూ ఏటా రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలున్నాయి. సరైన నిఘా పెట్టి, నిధులు సద్వినియోమయ్యేలా చర్యలు తీసుకుంటే.. స్పోర్ట్స్ కాంప్లెక్సులు ఆరోగ్యవంతమైన హైదరాబాద్‌ను సాకారం చేస్తాయి. ప్రభుత్వమే స్పోర్ట్స్ కాంప్లెక్సులను ఆధునికీకరించాలని యువత కోరుతోంది. ప్రైవేటుకు ఇస్తే పేద, మధ్య తరగతి వారు మైదానానికి దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఖైరతాబాద్

● ఖైరతాబాద్ ● జూబ్లీహిల్స్

కుల గణన సర్వేకు సహకరించండి

● బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: త్వరలో ప్రారంభమయ్యే కులగణన సర్వేకు 80వేల మంది సిబ్బందిని నియమించామని, ఇళ్లకు వచ్చే అధికారులు, సిబ్బందికి ప్రజలు పూర్తి సమాచారం ఇవ్వాలని, లేకపోతే రిజర్వేషన్లలో నష్టపోయే ప్రమాదం ఉందని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో 'వాల్మీకి జయంత్యుత్సవం' ఘనంగా నిర్వహించారు. ఆహ్వాన కమిటీ ఉపాధ్యక్షుడు బోయ నగేష్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథి నిరంజన్ మాట్లాడుతూ.. ఇది కేవలం బీసీ కులగణన సర్వే మాత్రమే కాదని, అన్ని కులాల కులగణన సంబంధించి సర్వే జరుగుతుందన్నారు. రాష్ట్ర బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ కుల గణన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు ఫులే బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు, కమిటీ ప్రతినిధులు గోపి జోయ, రేపల్లె కృష్ణ, గట్టు కృష్ణ, వెంకటేష్, ఎ.కొండయ్య, మూర్తి నాయుడు, రమణ తదితరులున్నారు.

సదర్ వేడుకలకు ఆహ్వానం

ఎల్లారెడ్డిగూడ, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిగూడలో ఏటా వైభవంగా నిర్వహించే సదర్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్థానిక కాంగ్రెస్ నేతలు కోరారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, పార్టీ నేత కిరణ్‌యాదవ్ గురువారం సీఎంని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి వేడుక వివరాలు తెలియజేశారు.



సీఎం రేవంత్‌రెడ్డితో అంజన్‌కుమార్, కిరణ్‌యాదవ్

గౌడ హాస్టల్ భవనంపై మరో అంతస్తు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: హిమాయత్‌నగర్ డివిజన్ గౌడ హాస్టల్ భవనంపై రూ.52 లక్షలతో మరో అంతస్తు నిర్మించనున్నారు. ఇటీవల కార్పొరేటర్ మహాలక్ష్మీమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. గురువారం జీహెచ్ఎంసీ అధికారులు కొలతలు తీసుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

బంజారాహిల్స్, ఖైరతాబాద్, న్యూస్‌టుడే

? బంజారాహిల్స్ రోడ్డు 5లోని ఓ వార్తా ఛానెల్ కార్యాలయం సమీపంలో పలు వీధిదీపాలు పగలు కూడా వెలుగుతున్నాయి.
– శ్రీకాంత్, ప్రైవేటు ఉద్యోగి, బంజారాహిల్స్

✓ సాంకేతికలోపం కారణం కావచ్చు. సమస్య పరిష్కరిస్తాం. – సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్–18

? ఖైరతాబాద్, ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్ ప్రభుత్వ పాఠశాల వీధిలో రెండు వారాలుగా వీధి దీపాలు వెలగడం లేదు. ఆన్‌లైనులో ఫిర్యాదు చేస్తే రెండో రోజు పరిష్కరించమని సందేశం వచ్చింది. అదే విషయం అధికారికి చెప్తే చివరునామా పంపండి చూస్తామన్నారు. ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. – కృష్ణారెడ్డి, ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్

✓ బంజారాహిల్స్ రోడ్డు నం.4 నుంచి దేవరకొండబస్తీకి వెళ్లే దారిలో వీధిదీపాలు వెలగడం లేదు.
– రవి, స్థానికుడు, బంజారాహిల్స్.

? బంజారాహిల్స్ దేవరకొండబస్తీలోని పోచమ్మ గుడి పక్క వీధిలో వీధి దీపాలు వెలగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.
– ప్రజనీష్, బంజారాహిల్స్

✓ ఆయా సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
– సుష్మ, ఎలక్ట్రికల్ ఏఈ, జీహెచ్ఎంసీ

నెలలు గడుస్తున్నా.. మరమ్మతులు సున్నా



శ్రీకృష్ణానగర్ హనుమాన్ మందిరానికి వెళ్లే వీధిలో

● అధ్వానంగా రహదారులు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: యూసుఫ్‌గూడ, సోమాజిగూడ, వెంకటేశ్వరకాలనీ పరిధిలోని కొన్ని చోట్ల రహదారులు అధ్వానంగా మారాయి. సోమాజిగూడ డివిజన్ పరిధిలోని శాలివాహననగర్ కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతనెలలో గణపతి నిమజ్జన సమయంలో సమస్యను ఖైరతాబాద్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్తే మరుసటిరోజే మరమ్మతులు చేయిస్తామన్నా ఇంతవరకు స్పందించలేదు.



ఎ-బ్లాకులోని పెద్దయ్య గిర్ని సమీపంలో..

ప్రస్తుతం దసరా సందర్భంగా మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల నిమజ్జనం సైతం పూర్తయ్యింది. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రహదారులపై గుంతల్లో నీరు నిలుస్తోంది. దసరా పండగకు బంధువుల ఇళ్లకు వచ్చిన వారు ఈ గుంతల కారణంగా ప్రమాదాలబారిన పడుతున్నారు.

కొన్నిచోట్ల ఇదీ పరిస్థితి


● శ్రీకృష్ణానగర్‌లోని ఎ-బ్లాకులో సమస్య తీవ్రంగా ఉంది. హనుమాన్ మందిరం వీధి, పెద్దయ్య పిండి గిర్ని వీధి గుంతలమయంగా మారాయి. శ్రీసాయిరామ్ పాఠశాల సమీపంలోని వీధులు సైతం దెబ్బతిన్నాయి. అక్కడక్కడా మ్యాన్‌హోళ్లు పొంగుతుండటంతో మురుగు ఆయా గుంతల్లో చేరుతోంది. వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పుడు మురుగు నీరు పాదచారులపై చిమ్ముతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు.

● యూసుఫ్‌గూడ గణపతి కాంప్లెక్స్ చుట్టుపక్కల రహదారుల పరిస్థితి ఇదే విధంగా ఉంది. వర్షాలకు తారు రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతల్లో వరద నిలిచి రాకపోకల స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

● శ్రీనగర్‌కాలనీ శ్రీసత్యసాయి నిగమాగమం ప్రధాన ద్వారం ఎదురుగా శాలివాహననగర్‌కాలనీ ప్రధాన రహదారికి మధ్యలో రోడ్డు దెబ్బతింది. నెలరోజుల క్రితం అధికారులకు ఫిర్యాదు చేస్తే మరుసటి రోజే చేయిస్తామని చెప్పినా ఇంతవరకు పట్టించుకోలేదని వాపోతున్నారు.

సరిచేయమంటే.. తవ్వి వదిలేశారు

శ్రీనగర్‌కాలనీ ప్రధాన పార్కు వెనుక ఇటీవల కొత్తగా సీసీ రోడ్డు నిర్మించారు. నిబంధనలు పాటించకపోవడంతో ఓ చోట పల్లంగా మారి వర్షం కురిసినప్పుడు నీరు నిలుస్తుంది. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సమస్యను తెలియజేయంతో గుత్తేదారు మరమ్మతుల పేరిట ఓ చోట రోడ్డును ఇలా తవ్వి వదిలేశారు. దాదాపు పది రోజులు అవుతున్నా పనులు చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయండి



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. నారాయణగూడ ఫ్లైఓవర్ కూడలి నుంచి వైఎంసీఏ కూడలి వరకు జరిగిన ఈ ర్యాలీలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, సహాయ కార్యదర్శి దామర కిరణ్, జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి మాట్లాడారు. ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.8,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల బకాయలు ఉన్నాయన్నారు. బకాయిలు రాక, నిర్వహణ భారమవుతోందని ప్రైవేటు యాజమాన్యాలు కళాశాలలకు తాళాలు వేసిన పరిస్థితి నెలకొందన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే సచివాలయం, ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, ఉపాధ్యక్షుడు స్టాలిన్, నాగేందర్, ప్రశాంత్, చరణ్, శ్రీ, జిల్లా కమిటీ సభ్యులు సహన, భగత్ శివ తదితరులున్నారు.

రహదారి విస్తరణ బాధితులకు తాఖీదులు

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ ప్రాంతంలో రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోయే వారికి జీహెచ్ఎంసీ భూసేకరణ విభాగం తాఖీదులు అందజేస్తోంది. యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు నుంచి రహ్మత్‌నగర్ కూడలి మీదుగా మధురానగర్ ఠాణా వరకు రహదారిని 80 అడుగులకు విస్తరించాలన్న ప్రతిపాదనపై దశాబ్దాలుగా కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా ప్రభావితమయ్యే 61 ఆస్తులకు సంబంధించి గతనెలలో కొంత మందికి నోటీసులు జారీచేసిన అధికారులు తాజాగా రెండురోజుల నుంచి మిగిలిన వారికి అందజేస్తున్నారు. విస్తరణలో భాగంగా రహ్మత్‌నగర్ కూడలి అభివృద్ధి ప్రణాళికను అమలు చేయనున్నారు. మొదటి విడతలో నోటీసులపై ఏమైనా అభ్యంతరాలుంటే నవంబరు 11న, రెండోవిడతలో తాఖీదులు అందినవారు 21న జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని భూసేకరణ విభాగంలో సంప్రదించవచ్చునని సర్కిల్-19 పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపి జనలీల కృష్ణవేణి తెలిపారు.

లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి

పంజాగుట్ట: లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం జయా గార్డెన్స్‌లో పంజాగుట్ట, మధురానగర్ పోలీసు స్టేషన్ల పరిధిలోని హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాడ్జీల్లో బస చేసేవారి పూర్తి వివరాలను, గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. అనుమానితుల వివరాలను పోలీసులకు చేరవేయాలని సూచించారు. ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. నిబంధనలు పాటించని నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డైటీషియన్ అదృశ్యం

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సోదరుడికి సందేశం పంపించి డైటీషియన్ అదృశ్యమైన ఘటన ఫిల్మ్‌నగర్ ఠాణాలో పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదియానగర్‌కు చెందిన యువతి (27) లోటస్‌పాండ్ పార్కు సమీపంలోని ఓ పునరావాస కేంద్రంలో డైటీషియన్‌గా పనిచేస్తోంది. ఈనెల 14న విధులకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. అదే రోజు సాయంత్రం తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సోదరుడు ప్రణయ్‌కుమార్ ఫోన్‌కు సందేశం పింపించింది. వెంటనే ఆమెకు ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ వచ్చింది. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. యువతితో కొన్నాళ్లుగా చనువుగా ఉంటున్న ఓ యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో యువతి..

యువతి అదృశ్యమైన ఘటన ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జ్ఞానీజైల్‌సింగ్‌నగర్‌కు చెందిన ఓ యువతి ఫిల్మ్‌నగర్‌లోని ఓ రెస్టారెంట్‌లో వెయిటర్‌గా పనిచేస్తోంది. ఈనెల 10న ఉదయం విధులకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకి కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని మోసం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: పార్శిల్‌లో మాదకద్రవ్యాలున్నాయని ఓ యువకుడిని బుడిరీ కొట్టించిన సైబర్ మోసగాళ్లు రూ.90వేలు కాజేశారు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ ప్రాంతంలో నివాసముంటున్న శివకుమార్ ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 16న ఫెడెక్స్ కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నామని సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. కాల్‌ను ముంబయిలోని సైబర్ క్రైమ్ బ్రాంచి పోలీసులకు బదిలీచేస్తున్నట్లు నమ్మించారు. మీరు పంపిన పార్శిల్‌లో మాదకద్రవ్యాలతో పాటు, ఆధార్ నంబరుతో ముంబయిలో 3 బ్యాంకు ఖాతాలున్నాయని, వాటి ద్వారా మనీ ల్యాండరింగ్ జరిగిందని బెదిరించారు. పోలీసు కేసు నుంచి మినహాయింపు కావాలంటే డబ్బు పంపాలని హెచ్చరించారు. దీంతో వారు చెప్పిన ఖాతాకు రెండు విడతలుగా రూ.90వేలు పంపించాడు. అనంతరం మోసపోయానని గ్రహించి ఆన్‌లైన్‌లో సైబర్ క్రైం విభాగానికి, మధురానగర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చరవాణులు చోరీ చేస్తున్న యువతి రిమాండ్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: రద్దీ ప్రదేశాల్లో చరవాణులు కొట్టేస్తున్న యువతిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. డీఐ మధుసూదన్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం... దసరా నవరాత్రుల్లో రద్దీగా ఉన్న పెద్దమ్మగుడి వద్ద సనత్‌నగర్‌లోని ఫతేనగర్ ప్రాంతానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి కొమ్మిరె మోర్లిన్ అలియాస్ మేరీ భక్తులకు చెందిన 13 చరవాణులను కాజేసింది. వాటిని బాలానగర్ ప్రాంతంలోని చరవాణులు మరమ్మతులు చేసే రాయలపురం వెంకటేష్, ఫతేనగర్‌కు చెందిన యుగంధర్ అలియాస్ యుగి, బాలానగర్ రాజుకాలనీకి చెందిన రేణుకకు ఇస్తోంది. ఈ ముగ్గురు చరవాణులను విక్రయించి వచ్చిన డబ్బులను మేరికి ఇచ్చారు. సీసీ కెమెరాల ఆధారంగా మేరీని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. చోరీలకు పాల్పడింది తానేనని అంగీకరించింది. ఆమె నుంచి 7 చరవాణులను స్వాధీనం చేసుకొని, ఆమెతో పాటు వెంకటేష్‌ను అరెస్టు చేశారు. యుగంధర్, రేణుక పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. అడ్మిన్ ఎస్సై హరీశ్వర్‌రెడ్డి, డీఎస్సై రాజశేఖర్ ఉన్నారు.

ప్రవాస నర్తకి వశిష్ఠ నృత్య ప్రదర్శన 19న

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ప్రవాసి యువ నృత్య కళాకారిణి వశిష్ఠ ఈనెల 19వ తేదీన సాయంత్రం 5 గంటలకు గచ్చిబౌలిలోని బ్రహ్మ కుమారీస్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో భరత నాట్య ప్రదర్శన ఇవ్వనున్నట్లు నాట్యగురువు డా. జయశ్రీ రాజగోపాలన్ తెలిపారు. ముంబయికి చెందిన నృత్యోదయ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఉంటుందని, త్రిదండి చిన శ్రీమన్నారాయణ జీయర్ స్వామి, పద్మ విభూషణ్ డా.పద్మా సుబ్రహ్మణ్యం, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, కళారత్న అశోక్ గుర్జాలే పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇల్లు కూల్చివేత

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ప్రధాన రహదారిపై ఎన్ఎస్‌బీ నగర్ ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇంటిని ఖైరతాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది గురువారం కూల్చివేశారు. తహసీల్దార్ ఎం.డి. నయీముద్దీన్ ఆదేశాల మేరకు ఎస్పీఆర్ హిల్స్‌కు చేరుకున్న ప్రత్యేక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్ రాజ్, చైన్‌మ్యాన్ మెహతాబ్ మధురానగర్ పోలీసుల బందోబస్తు మధ్య కూల్చివేత చేపట్టారు. ప్రభుత్వస్థలంలో బోర్డును తొలగించి ఇంటిని నిర్మించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆర్.ఐ.కిరణ్‌రాజ్ చెప్పారు.


తాగునీరు, సీవరేజీ పైపులు వేయండి

బంజారాహిల్స్: వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో అవసరమైన మంచినీటి, సీవరేజీ పైపులైను సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం బంజారాహిల్స్‌లోని జలమండలి డీజీఎం ఇంద్రశీలరాణి, బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ శివతో కార్పొరేటర్ సమావేశమయ్యారు. వెంకటేశ్వరనగర్‌లో అవసరమైన మంచినీటి పైపులైను, పాత వెంకటేశ్వరనగర్, గౌరీశంకర్‌నగర్ ప్రాంతాల్లో సీవరేజీ పైపులైన్ల పనులు పూర్తి చేయాలని కోరారు. చోటూభాయ్ గల్లీ సహా ఇతర ప్రాంతాల్లో అవసరమైన ఇతర ప్రాంతాల్లో ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులను కోరారు.

రామాయణంలో నీతి ఆదర్శనీయం

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఆదికవి వాల్మీకి మహర్షి జయంత్యుత్సవాన్ని వాల్మీకి కుల సంఘాల ఆధ్వర్యంలో గురువారం నారాయణగూడలోని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం కాంగ్రెస్ నాయకుడు జి.రామన్‌గౌడ్ మాట్లాడుతూ.. మానవ జీవన విధానం, నైతిక విలువలను రామాయణం చెబుతుందని, అందుకే ఆ మహాకావ్యం నేటికీ అందరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో కె.కొండయ్య, వెంకటేష్, సుధాకర్, బాబు, కె. మహేష్, వెంకటయ్య, నాగరాజు, జగదీష్, మల్లేష్, రాములు తదితరులున్నారు.

విద్యుత్తు శాఖ డీఈగా హనుమంతరెడ్డి



యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ బంజారాహిల్స్ డివిజన్ (ఆపరేషన్స్) నూతన డీఈగా పి.హనుమంతరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఆస్మాన్‌ఘడ్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన డీఈ ఎస్.నరేందర్‌రెడ్డి హైదరాబాద్ సౌత్ స్కాడా సర్కిల్‌కు వెళ్లారు.

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం: కేటీఆర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేటీఆర్

ఫిలింనగర్. న్యూస్‌టుడే: ఇందిరాపార్కు వద్ద తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ (జేఏసీ) ఆధ్వర్యంలో నవంబరు 5న జరగనున్న మహాధర్నా పోస్టర్‌ను భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బంజారాహిల్స్ నందినగర్‌లోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు భారాస అండగా ఉంటుందన్నారు. ఆటో డ్రైవర్లకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్, టీఏడీఎస్ ప్రధాన కార్యదర్శి ఎ.సత్తిరెడ్డి, ఉపాధ్యక్షుడు శాతం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాంసం వ్యర్థాలు రోడ్డుపై వేయొద్దు



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

జూబ్లీహిల్స్: మాంసం వ్యర్థాలను దుకాణం ముందు, రోడ్డుపై పడేయవద్దని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. ఠాణా పరిధిలోని మాంసం దుకాణదారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి దుకాణం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: మాంసం దుకాణాల నిర్వాహకులకు మధురానగర్ పోలీసుల గురువారం సూచనలు చేశారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారవేయద్దని, చెత్తను తరలించే వాహనాలకు ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ తెలిపారు.

26న టీజీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద మహాధర్నా

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఉద్యోగులు, ఆర్టిజన్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మింట్ కాంపౌండ్‌లోని టీజీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం ఆధ్వర్యంలో 26న మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి సాయిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై గడిచిన నాలుగేళ్లుగా అనేక పర్యాయములు వినతులు ఇచ్చామని, స్పందన లేకపోవడంతో క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. వెంటనే సమావేశం ఏర్పాటు చేసి సమస్యలన్నీ 25వ తేదీ లోపు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఎండీ కార్యాలయంలో ధర్నా నోటీస్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

20న హరిణి వనస్థలిలో పద్మశాలీ దసరా మేళా



కరపత్రికను ఆవిష్కరించిన వనం దుష్యంతల, కందగట్ల స్వామి, గుంటక రూప తదితరులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: పద్మశాలీ సంఘం (ఎల్బీనగర్ సర్కిల్) ఆధ్వర్యంలో ఈనెల 20న పద్మశాలి దసరా మేళా నిర్వహించనున్నట్లు అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల వెల్లడించారు. జింకల పార్కులోని అనన్య ఎకో పార్కు ఆవరణలో జరిగే ఈ మేళాకు పద్మశాలి మహిళలు తరలిరావాలని కోరారు. గురువారం నారాయణగూడలోని పద్మశాలి భవనంలో మేళా వివరాలు వెల్లడించారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటక రూప, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు పోరండ్ల శారద, ఎల్బీనగర్ పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు రావిరాల సంధ్యారాణి తదితరులతో కరపత్రాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఎన్నికల్లో జనాభా ప్రాతిపాదికన పద్మశాలీ మహిళలకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు సముచిత స్థానం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, సంఘ నాయకులు పాల్గొన్నారు.

డిగ్నిటీ హౌసింగ్ కాలనీలో సమస్యలు పరిష్కరించండి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న కాలనీ అధ్యక్షుడు అనిల్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్‌లోని ఇందిర నగర్ 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీలో ఆర్థిక సామాజిక సర్వే కోసం వచ్చిన అధికారుల బృందానికి కాలనీ సంక్షేమ సంఘం సమస్యల చిట్టా అందజేసింది. బుధవారం ఇంటింటికీ వెళ్లి సమాచారం సేకరించిన అధికారులు గురువారం మరోసారి అక్కడికి చేరుకుని స్థానికులతో సమావేశం ఏర్పాటుచేశారు. చాలా మంది ఇళ్లు అద్దెకు ఇచ్చినట్లు గుర్తించిన అధికారులు ఆరా తీయగా దూర ప్రాంతంలో ఉన్న యజమాని ఇక్కడ అద్దెకు ఇచ్చి అక్కడ అద్దె చెల్లిస్తున్నట్లు గుర్తించారు. వరుసగా ఇళ్లు ఖాళీగా ఉంటే సాంఘిక శక్తులు పెరిగే అవకాశం ఉండటంతో అక్యుపెన్సీ పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అనిల్ అధికారులకు వివరించారు. తాము సొంతంగా అన్ని వసతులు కల్పించుకొని పరిశుభ్రంగా ఉంచుతుంటే అధికారులు రోల్‌మోడల్‌గా చూపుతున్నారని, ఈ నేపథ్యంలో సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. ప్రధానం తాగు నీటి సమస్య వేధిస్తోందని, 80 ఫ్లాట్ల బ్లాక్‌కు ఒకే ఓవర్ హెడ్ ట్యాంకు ఉందని, జనరేటర్ ఇచ్చినా బిగించలేదని తెలిపారు. ఇళ్లకు సౌర విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు. ఇళ్ల సముదాయం చుట్టూ ఆక్రమణలను నియంత్రించాలని విన్నవించారు. నాలుగు బ్లాకుల్లోనూ కామన్ ఏరియాలో విద్యుత్ బిల్లులు మినహాయించాలని లిఫ్ట్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం సమర్పించారు. జీహెచ్ఎంసీ నోడల్ అధికారి పి.శ్రావణ్ కుమార్, సిటీ లెవల్ టెక్నికల్ అధికారులు నూర్జహాన్, కిషోర్ తదితరులు ఉన్నారు.

వానొస్తే.. నీరు తోడాల్సిందే



నిమ్స్ గేటు ముందు ఇలా..

పంజాగుట్ట, న్యూస్‌టుడే: చిన్నపాటి వర్షానికే నిమ్స్‌కు వెళ్లే దారిలో మోకాలి లోతు నీరు నిలుస్తోంది. ఆసుపత్రిలోకి వెళ్లాలన్నా, రావాలన్నా నీటిలోంచే నడవాల్సి వస్తోంది. చాలాకాలంగా ఈ సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ దృష్టి సారించడం లేదు. ప్రధాన రోడ్డు నుంచి నిమ్స్‌కు వెళ్లే గేటు వద్ద రోడ్డు పల్లంగా ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంటోంది. వర్షం వెలిసినప్పటికీ రోజుల తరబడి నీరు, బురద ఉండటంతో ప్రతీసారి మోటార్లతో తోడిపోస్తున్నారు. ఇలా నీటి నిల్వ వల్ల దోమల బెడద ఎక్కువగా ఉంటోందని స్థానిక దుకాణదారులు చెబుతున్నారు. శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మోటారు ద్వారా ఇలా..

తొలి చూపే.. చివరిదైంది

● కుమారుడ్ని చూసేందుకు వచ్చి దుర్మరణం



సింహగిరి

కొమరాడ, న్యూస్‌టుడే: కుటుంబ పోషణ కోసం పొరుగు రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారు.. భార్య ప్రసవించినా.. సెలవులు దొరకకపోవడంతో సకాలంలో ఇంటికి రాలేకపోయారు. ఎట్టకేలకు దాదాపు మూడు వారాలు దాటాక స్వగ్రామానికి చేరుకున్నారు. కుమారుడ్ని కళ్లారా చూశారు. కానీ ఆ సంతోషం ఎంత సేపూ నిలవలేదు. చెరువు రూపంలో మృత్యువు వెంటాడింది. ఈ ఘటనలో హోంగార్డు దుర్మరణం చెందారు. ఏఎస్సై నాయుడు వివరాల ప్రకారం.. కొమరాడ మండలం చంద్రంపేట గ్రామానికి చెందిన జి.సింహగిరి(42) ఖైరతాబాద్ పోలీసు ఠాణాలో హోంగార్డుగా పనిచేస్తున్నారు. అతని భార్య భారతి ఇటీవల మగబిడ్డకు జన్మనిచ్చారు. దీంతో సింహగిరి సెలవుపై స్వగ్రామానికి వచ్చారు. గురువారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని చెరువుకు వెళ్లారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా. . ఈక్రమంలో చెరువులో విగతజీవిగా కనిపించారు. మృతదేహాన్ని బయటకు తీసి, జిల్లా ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుత్తు చీఫ్ ఇంజినీర్ల బదిలీ

ఈనాడు, హైదరాబాద్: నగరంలో విద్యుత్తు చీఫ్ ఇంజినీర్లు సమూలంగా బదిలీ అయ్యారు. ఆపరేషన్ విభాగంలో ఉన్నవారిని కార్యాలయ పోస్టులకు, ఇన్నాళ్లు కార్యాలయాలకే పరిమితమైన వారిని ఆపరేషన్ విభాగాలకు బదిలీ చేస్తూ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ బుధవారం అర్ధరాత్రి బదిలీ ఉత్వర్వులు జారీ చేశారు. వీరిలో పలువురు గురువారం ఉదయమే కొత్తపోస్టుల్లో బాధ్యతలు చేపట్టారు.

ఇందిరమ్మ కమిటీల్లో ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలను విస్మరించారు



మాట్లాడుతున్న గడీల కుమార్ గౌడ్, చిత్రంలో మోహన్‌రెడ్డి, అశోక్ కుమార్, దేవి రవీందర్, సంగన్న, దేవేందర్, యాదగిరి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలను విస్మరించిందని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గడీల కుమార్ గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు దేవి రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు పనిచేస్తామని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన తీసుకొచ్చిన ఎంపీటీసీలకు ఇందిరమ్మ కమిటీలో భాగస్వామ్యం లేకపోవడం వారిని అవమానించడమే అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజల చేత ఎన్నికైన వారికి సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఎంపీటీసీల సంఘం నాయకులు మన్నె రాజు, తమన్నగారి సంగన్న, హరిగే అశోక్, మోహన్‌రెడ్డి, యాదగిరి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోవా.. రైలు వేళలు మారవా?

ప్రయాణికుల అసహనం.. మార్చాలని వినతులు



ఈనాడు, హైదరాబాద్

కొత్తగా ప్రారంభించిన సికింద్రాబాద్ - గోవా (వాస్కోడిగామ) రైలు ప్రయాణంపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. రైలు వేళలతో ప్రయాస పెరుగుతోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. సెలవు రోజుల్లో ప్రయాణం పెట్టుకుంటే రెండు రోజులు రాకపోకలకే సరిపోతోందని, రైళ్ల వేళలు మారిస్తే ఉపయుక్తంగా ఉంటుందని చెబుతున్నారు. ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌లో రైలెక్కితే మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు గోవా (వాస్కోడిగామ) చేరుతుందని, హోటల్ బుకింగ్, ఇతర ప్రయాణాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైళ్ల వేళలు మార్చడంతోపాటు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సాయంత్రానికి మార్చితే..

ఏటా 80 లక్షల మంది గోవా వెళ్తుంటే అందులో 20 శాతం తెలుగు రాష్ట్రాల వారున్నారు. దమ రైల్వే అక్టోబరు మొదటివారంలో గోవాకు బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును ప్రారంభించింది. బుధ, శుక్రవారాల్లో గోవాకు, గురు, శని వారాల్లో సికింద్రాబాద్‌కు ఈ రైలు రాకపోకలు సాగిస్తోంది. ప్రారంభించిన వారం రోజుల్లోనే ఆక్యుపెన్సీ 70 శాతం చేరుకునాన వేళలు అనుకూలంగా లేవంటున్నారు. వెళ్లి వచ్చేందుకు 38 గంటలు పడుతోందంటున్నారు. ఉదయాన్నే 5.45 గంటలకు వాస్కోడిగామ స్టేషన్‌లో దిగిన తర్వాత హోటల్ బుకింగ్‌కు మధ్యాహ్నం వరకు వేచి చూడాల్సి వస్తోందట. హోటళ్లలో మధ్యాహ్నం 2 వరకు కొత్త బుకింగ్‌లు తీసుకోవడం లేదన్నారు. సాయంత్రం 5 గంటలకు మార్చితే మరుసటిరోజు ఉదయం 11కల్లా గోవా చేరుకోవచ్చంటున్నారు.

వేళలు మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం

– శ్రీధర్, సీపీఆర్వో, దక్షిణమధ్య రైల్వే



రైలు వేళలు మార్చాలంటూ ప్రయాణికుల నుంచి వినతులు వస్తున్నాయి. ఈ అంశంపై సౌత్ వెస్ట్రన్ రైల్వే అధికారులకు గతంలోనే లేఖ రాశాం. అక్కడి రైళ్ల వేళలు, ట్రాఫిక్‌కు అనుగుణంగా సర్దుబాటు జరిగితే ప్రస్తుత సమయం మార్చడానికి వీలవుతుంది. వారి సమన్వయంతో ప్రయాణికులకు అనుకూలంగా ఉండే సమయానికి మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

అగ్నిమాపక.. శ్రద్ధ చూపక..



ఈనాడు, హైదరాబాద్: అగ్నిమాపక సిబ్బందికి సరైన వసతులు లేక బిక్కుబిక్కుమంటూ పనిచేస్తున్నారు. 10 నుంచి 15 మంది సిబ్బంది పని చేసే కేంద్రాల్లో తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదు. రేకుల షెడ్డులో అగ్నిమాపక కేంద్రం, స్టేషన్ ఫైర్ అధికారికి ఒక గది మినహా ఇతర సదుపాయాలుండవు. రాత్రివేళ అగ్నిప్రమాదం జరిగితే నీటి సేకరణ కష్టమే. జలమండలి నుంచి వాహనాలు అందుబాటులో ఉన్నా రాత్రివేళ డ్రైవర్లు అందుబాటులో లేక సకాలంలో నీరు దొరకని పరిస్థితి.



లంగర్‌హౌజ్‌లో ఇరుకైన గది ఉండటంతో స్టేషన్ బయటే వంట

లంగర్‌హౌజ్‌లో దయనీయ పరిస్థితులు..

- లంగర్‌హౌజ్‌లోని ఫైర్‌స్టేషన్‌లో 15 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. స్టేషన్‌కు అవసరమైన పరికరాలు, సామగ్రి అంతా అదే ఇరుకైన గదిలో భద్రపరచాలి. గత 20 ఏళ్లుగా ఈ స్టేషన్‌ను అద్దె గదిలో నిర్వహిస్తుండడం గమనార్హం. అగ్నిమాపక శాఖకు అత్యవసరమైన నీటి సంపు ఇక్కడ లేదు.
- గతంలో గాంధీ ఆసుపత్రి వద్ద అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో ఆసుపత్రుల వద్ద అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలని అప్పట్లో ఉన్నతాధికారులు నిర్ణయించారు. అక్కడే ఆసుపత్రి అధికారులు స్థలాన్ని ఇవ్వగా అక్కడే అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- ఉస్మానియా ఆసుపత్రిలోనూ రోగుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ప్రమాదాల నివారణకు అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే అప్పటికే యాకుత్‌పురాలో ఏర్పాటు చేయాలనుకున్న స్టేషన్‌ను ఆసుపత్రి ఆవరణకు మార్చారు. తాత్కాలికంగా అక్కడ స్థలం ఇవ్వగా షెడ్డు ఏర్పాటు చేసి అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

'సదర్' సమ్మేళనం 27న



నృత్యం చేస్తున్న అంజన్‌కుమార్ యాదవ్, ఆయన మిత్రుడు

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఇందిరాపార్కు వద్ద ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 27న ఉదయం 11 గంటలకు 'సదర్ సమ్మేళనం' నిర్వహించనున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్ యాదవ్ తెలిపారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం నిర్వహించనున్న సమ్మేళనానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజాప్రతినిధులతోపాటు అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్ తదితరులు పాల్గొంటున్నారన్నారు. 'ధనక్.. ధనక్.. ధనక్ త్రూ'.. ప్రత్యేక బ్యాండ్ వాయిద్య సంగీతానికి అనుగుణంగా హాకీ కర్రతో మాజీ ఎంపీ స్టెప్పులేశారు.

మహిళా వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ బాధ్యతల స్వీకరణ



ధనావత్ సూర్య

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం(సీఐఎంవీ) ఇన్‌ఛార్జి ఉపకులపతి(వీసీ)గా ధనావత్ సూర్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ప్రొ.విజ్జులత బదిలీ అయ్యారు. పూర్వ ఇన్‌ఛార్జి వీసీ పొ.విజ్జులతను సన్మానించి వీడ్కోలు పలికారు.

తెలుగు వర్సిటీలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ 23 నుంచి

నారాయణగూడ: తెలుగు విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికిగాను యూజీ, పీజీ కోర్సుల కౌన్సెలింగ్ ఈనెల 23 నుంచి నిర్వహించనున్నట్లు వర్సిటీ సెంట్రల్ అడ్మిషన్ కమిటీ డైరెక్టర్ డా.బి.రాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడొచ్చన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. రిజర్వేషన్ పొందే విద్యార్థులు కుల ధ్రువీకరణ, ప్రస్తుత సంవత్సర ఆదాయ పత్రాలతో రావాలన్నారు. 23న వరంగల్ ప్రాంగణంలో ఎంఏ తెలుగు, హైదరాబాద్ బాచుపల్లి ప్రాంగణంలో ఎంఏ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, 24న ఎంఏ హిస్టరీ, కల్చర్ అండ్ టూరిజం, 25న ఎంఏ తెలుగు, ఎంఏ జ్యోతిష్యంలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

గ్రంథాలయంతో విజ్ఞానం



నాగారం సెరినిటీ పాఠశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఆకర్షణ, జంగిరెడ్డి

నాగారం, న్యూస్‌టుడే: చిన్ననాటి నుంచే పుస్తకాలను సేకరించి చదవడం అలవాటని, తోటి విద్యార్థులకు ఏదైనా చేయాలన్న తపనతో గ్రంథాలయాల్ని ఏర్పాటు చేస్తున్నట్టు 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్' సాధించిన ఆకర్షణ సతీష్ పేర్కొన్నారు. గురువారం నాగారంలో సెరినిటీ పాఠశాలలో తన 13వ ఏట 17వ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఇప్పటికే తెలంగాణలో 14, తమిళనాడులో 3 గ్రంథాలయాలను ఏర్పాటు చేశానన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంలా తాను శాస్త్రవేత్త కావాలనుకుంటున్నానంది. 25వ గ్రంథాలయ ప్రారంభోత్సవానికి వస్తానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని తెలిపింది.

17 ఏళ్ల నాటి ప్రాజెక్టుకు మోక్షం

ఈనాడు, హైదరాబాద్: దాదాపు 17 ఏళ్ల నాటి ప్రాజెక్టు.. కేవలం 0.6 కిలోమీటర్ల టన్నెల్ పూర్తిచేస్తే చాలు ఏళ్ల నాటి మురుగు సమస్యకు పరిష్కారం దొరకుతుంది. గుత్తేదారు మధ్యలోనే చేతులెత్తేయడంతో ఏళ్లుగా ఆగిపోయింది. జీహెచ్ఎంసీ కార్యాలయంనుంచి నింబోలిఅడ్డా వరకు చేపట్టిన సివరేజ్ ట్రంక్ మెయిన్ ప్రాజెక్టుదీ పరిస్థితి. ఎట్టకేలకు దీనికి మోక్షం లభిస్తోంది. 90 రోజుల సీవరేజ్ డ్రైవ్ పనుల్లో భాగంగా ఈ ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి నిర్ణయించారు. ఓ ఏజెన్సీకి పనులప్పగించారు. గతంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి నింబోలి అడ్డా వరకు 1800 ఎంఎం వ్యాసంతో సివరేజ్ ట్రంక్ మెయిన్ ప్రాజెక్టు చేపట్టాలని జలమండలి నిర్ణయించింది. రాజ్‌భవన్, సచివాలయం నుంచి అబిడ్స్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, బర్కత్‌పుర, బాగ్‌లింగంపల్లి ప్రాంతాల్లోని మురుగు నీరు నాలాల్లో నేరుగా కలవకుండా అంబర్‌పేట్ ఎస్టీపీకి తరలించి, అక్కడ శుద్ధిచేసి మూసీలోకి వదలాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో, నింబోలి అడ్డా నుంచి అంబర్‌పేట్ వరకు రోడ్డు తవ్వకుండా టన్నెల్ నిర్మించాలని నిర్ణయించారు. 2007లో పనులు ప్రారంభించి 5 కి.మీ.కిగాను 4.4 కి.మీ. మేర పూర్తిచేశారు. చాలా ప్రాంతాల్లో భూగర్భంలో బండలు తేలడంతో ప్రాజెక్టు వ్యయం పెరిగి గుత్తేదారు చేతులెత్తేశాడు. గురువారం ఎండీ అశోక్‌రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్ పనులను పరిశీలించారు.




ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న ఎండీ అశోక్‌రెడ్డి ఇతర అధికారులు

కన్న కూతుర్ని కీచకులకు అప్పగించాలని..

అల్వాల్, న్యూస్‌టుడే: నోరులేని పక్షులు, జీవాలు సైతం తమ పిల్లలను ప్రకృతి విపత్తుల నుంచి, శత్రువుల బారి నుంచి నిరంతరం కాపాడుకుంటాయి. కానీ కొందరు మనుషులు మాత్రం తమ పిల్లలను బలిపశువులుగా మార్చేందుకు సిద్ధమవుతున్నారు. అల్వాల్ జేజేనగర్ సమీపంలో నివసించే మహిళ(37)కు ఇద్దరు కుమార్తెలు. మహిళను భర్త వదిలేయడంతో చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుమార్తెలను పోషిస్తోంది. ఆర్థికంగా ఎదగాలన్న ఆశతో పెద్ద కుమార్తెను ఇప్పటికే వ్యభిచారంలోకి దింపింది. చిన్న కుమార్తె(14)ను ఐదో తరగతి వరకూ చదివించి ఇంటి వద్దనే ఉంచుతోంది. వ్యభిచారం చేయాలని కొన్నిరోజులుగా వేధిస్తోంది. దీంతో బాలిక ఇంట్లో నుంచి వెళ్లిపోయి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. మనసు మార్చుకొని తల్లికి బుద్ధి చెప్పాలని బుధవారం రాత్రి పోలీసులను ఆశ్రయించడంతో బాధితురాలిని సఖి కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న తల్లి గురువారం ఠాణాకు వచ్చి పోలీసులపై దురుసుగా ప్రవర్తించింది. కానిస్టేబుళ్లు, ఎస్సైలను దుర్భాషలాడింది. అనంతరం పరారైంది. నిందితురాలిపై పోక్సో కేసు నమోదైంది.

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న డా.ఎ.వి.గురువారెడ్డి

బేగంపేట, న్యూస్‌టుడే: సరైన అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రి ఎండీ డా.ఎ.వి.గురువారెడ్డి అన్నారు. ప్రపంచ ట్రామాడే సందర్భంగా గురువారం ఆసుపత్రిలో అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఏటా 1.3 మిలియన్ల మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ చట్టాల అమలు, మౌలిక సదుపాయాలు, వాహనాలు, రహదారి భద్రతా చర్యలపై దృష్టిసారించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. సర్వేజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సొసైటీ టూ ప్రివెంట్ ఆక్సిడెంట్ అనే నినాదంతో రానున్న దశాబ్దకాలంలో దేశంలో 5 శాతం రోడ్డు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

పన్ను పెంపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: దేవాలయాల సొమ్ముపై పన్ను పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని భాజపా ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అన్నావజ్జుల సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. ఇప్పటికే 5 శాతం ఉన్న కామన్ గుడ్‌ఫండ్(సీజీఎఫ్) కాంట్రిబ్యూషన్‌ను 12 శాతానికి పెంచాలని నిర్ణయించడం అన్యాయమని.. ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. గురువారం అంబర్‌పేటలో మాట్లాడుతూ.. సీజీఎఫ్ కాంట్రిబ్యూషనే రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి నిధులివ్వకుండా.. శిథిలావస్థకు చేరినవాటిని పునరుద్ధరించకుండా తిరిగి వాటి నుంచే పన్నును ఎలా వసూలు చేస్తారంటూ ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు.

బాధ్యతలు సమర్థంగా నిర్వహించాలి



డీఎంఈ డా.వాణికి కార్యవర్గ జాబితా ఇస్తున్న ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు

సుల్తాన్‌బజార్: ఉద్యోగులు బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీజీవోఏ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు సూచించారు. నూతన టీఎంహెచ్‌జీవోఏ కార్యవర్గం గురువారం కొలువుదీరింది. కోఠి డీఎంహెచ్ఎస్ ఆవరణలోని సంఘ కార్యాలయంలో టీజీవోఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు బి.శ్యామ్ సమక్షంలో టీఎంహెచ్‌జీవోఏ అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సునీల్‌రాజ్, అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు, కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఎ.చంద్రప్రకాశ్ బాధ్యతలు చేపట్టారు.

బాలికను చంపాడు.. తెలివిగా నటించాడు

ఈనాడు, హైదరాబాద్: సూరారం ఠాణా పరిధిలో ఏడేళ్ల బాలిక హత్య కేసులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. బాలికను దారుణంగా చంపాననే కనీస పశ్చాత్తాపం నిందితుడికి లేదు. కనిపించకుండా పోయిన బిడ్డ కోసం కుటుంబ సభ్యులు తల్లడిల్లుతుంటే వారితోనే ఉన్నాడు. బాలికను వెతుకుతున్నట్లు నటించాడు. బాలిక తల్లిని సొంతం చేసుకోవడానికి ఆమె ఇద్దరు కుమార్తెలు, సహజీవనం చేస్తున్న ప్రభాకర్‌ను అడ్డు తొలగించుకోవాలన్నది నిందితుడి పథకం. ఇందులో భాగంగా ఈనెల 12న ఇంటి ముందు ఆడుకుంటున్న పెద్దకుమార్తె(7)ను కిడ్నాప్ చేసి మేడ్చల్‌లోని బాసరగడి ప్రాంతంలో హత్య చేశాడు. మరుసటిరోజు సాయంత్రం వరకూ వారితోనే ఉన్నాడు. చివరకు ఈనెల 15న పోలీసులకు చిక్కాడు.

'బీసీ మహిళలకు ఉప కోటా కల్పించేలా చొరవ చూపండి'



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న భాగ్యలక్ష్మి

గోల్నాక, న్యూస్‌టుడే: పార్లమెంటులో ఆమోదం పొందిన మహిళా బిల్లులో బీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలని తెలంగాణ బీసీ మహిళా సంఘాల సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు, జాతీయ వెనుకబడిన కులాల మహిళా సమాఖ్య ఛైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అభ్యర్థించారు. గురువారం ఆయన్ను కలిసి వినతిపత్రాన్ని అందజేశామన్నారు.

ప్రజా సంబురాలకు సిద్ధం



ఈనెల 20న నిర్వహించనున్న 'ప్రజా సంబురాలు' సందర్భంగా కేబీఆర్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బెలూన్ ఆకట్టుకుంటోంది. ఆరోజు మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నారు.

దవాఖానా.. ఇంత రద్దీనా?



ఇది జాతీయ రహదారి కాదు. నిమ్స్ ప్రాంగణమే. కొత్త నిర్మాణాల కారణంగా పార్కింగ్ స్థలం తగ్గడంతో వాహనాలను ఇలా రహదారికి ఇరువైపులా నిలిపారు. మరోవైపు పంజాగుట్ట నుంచి బంజారాహిల్స్ వెళ్లే వాహనదారులు నిమ్స్‌లో నుంచి వెళ్తుండటంతో ఇలా రద్దీ నెలకొంది.

చిరాకుల్లేని చిరాన్ కుంట



నగరం నడిబొడ్డున కబ్జాదారుల కన్ను పడని, 'హైడ్రా' అవసరం లేని చెరువుందంటే నమ్మగలరా? కేబీఆర్ పార్కులోని చిరాన్‌కుంట చెరువు ఇది. 15 ఎకరాల ఎఫ్‌టీఎల్, 3 ఎకరాల బఫర్ జోన్ ఉన్న ఈ చెరువుపై 140 రకాల పక్షులు, 15 రకాల ఇతర జీవజాలం ఆధారపడి ఉంది.

చికెన్ ధరలు			
ఫాంరేటు	120–00	డ్రెస్డ్	206–00
రిటైల్	142–00	స్కిన్‌లెస్	234–00

విద్యుత్తు చీఫ్ ఇంజినీర్ల బదిలీలు

ఈనాడు, హైదరాబాద్: నగరంలో విద్యుత్తు చీఫ్ ఇంజినీర్లు సమూలంగా బదిలీ అయ్యారు. ఆపరేషన్ విభాగంలోని వారిని కార్యాలయ పోస్టులకు, ఇన్నాళ్లు కార్యాలయాలకే పరిమితమైన వారిని ఆపరేషన్ విభాగాలకు బదిలీ చేస్తూ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ బుధవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

సైన్స్‌లో ఇప్పటికీ వెనకబడే ఉన్నాం

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలోని పలు చిన్నదేశాలు విభిన్న అంశాల్లో ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయని, 140 కోట్లకుపైగా జనాభా కలిగిన భారత్ ఈ విషయంలో ఇంకా వెనకబడి ఉందని త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డి అన్నారు. రక్షణ శాఖ మంత్రి, మాజీ శాస్త్రీయ సలహాదారు, డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ జనరల్, బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్, ఓయూ మొదటి తెలుగు ఉపకులపతి డాక్టర్ సూరి భగవంతం 115వ జయంతి గురువారం ఓయూలోని దూరవిద్యాకేంద్రం ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా ఇంద్రాసేనారెడ్డి మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ఏఎన్ఆర్ఎఫ్ 2023లో శాస్త్ర, పరిశోధనలకు రూ.50 వేల కోట్లు కేటాయించిందని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రక్షణ రంగంలో అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా మన దేశం స్వయం సమృద్ధి సాధించడం వెనక డీఆర్‌డీవో డీజీగా డాక్టర్ సూరి భగవంతం వేసిన పునాదే కారణమని డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి కొనియాడారు. అన్ని ప్రాంతాల్లో భౌగోళిక ప్రాంతాలనుబట్టి 25 వరకు ప్రయోగశాలలు ఏర్పాటు ఆయన హయాంలోనే జరిగిందన్నారు.



మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

ఐదుగురికి ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం.. ఈ సందర్భంగా డాక్టర్ సూరి భగవంతం ఎక్సలెన్స్ అవార్డులను ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్.మూర్తి, ఇస్రో-ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌చౌహన్, ఇంటిలిజెంట్ డిజైన్ ఏఐ సీఈవో, సీటీవో రవి నిమ్మగడ్డకు ప్రదానం చేశారు. డీఆర్‌డీవో మిసైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డీజీ యు.రాజబాబు స్థానంలో డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జి.ఎ.ఎస్.మూర్తికి, రవి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ మొచ్చెర్ల శశిభూషణ్ స్థానంలో శరత్‌కు అవార్డులను బహూకరించారు. ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, డీఆర్‌డీవో మాజీ డీజీ వి.భుజంగరావు, డాక్టర్ సూరి భగవంతం ఫౌండేషన్ వ్యవస్థాపక డైరెక్టర్ ఎస్.బి.రామ్ మాట్లాడారు.



అవార్డులు పొందిన బి.ఎస్.మూర్తి, జి.ఎ.ఎస్.మూర్తి, ప్రకాశ్‌చౌహన్, రవి నిమ్మగడ్డ

ఏటీసీ.. భవితకు దశదిశ

ప్రభుత్వ ఐటీఐలకు మహర్దశ ● 19 వరకు తక్షణ ప్రవేశాలు



రోబో వెల్డింగ్ మెషీన్లు

కార్వాన్, విజయనగర్‌కాలనీ: ప్రభుత్వ ఐటీఐల్లో పారిశ్రామిక రంగ అవసరాలను తీర్చేలా ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్లు) అందుబాటులోకి వస్తున్నాయి. మల్లేపల్లి ప్రభుత్వ మోడల్ ఐటీఐలో ఏర్పాటు చేసిన ఏటీసీలో తరగతులు ప్రారంభమయ్యాయి.

ఇవీ కోర్సులు.. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్), మెకానికల్ బ్యాటరీ, ఎలక్ట్రికల్ వాహనాలు తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐతో పాటు ఇదే ప్రాంగణంలోని శాంతినగర్, సనత్‌నగర్, ఖైరతాబాద్, విజయనగర్‌కాలనీ ఐటీఐల్లోనూ ఏటీసీలు కేంద్రాలను నెలకొల్పుతున్నారు.

రూ.36 కోట్లతో నిర్మాణం.. ఒక్కో ఏటీసీ కేంద్రాన్ని 13500 చదరపు అడుగుల స్థలంలో ఏర్పాటు చేస్తున్నారు. భవనం, సామగ్రికి కలిపి రూ.36 కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఏటీసీల్లో శిక్షణ పొందే వారికి మన దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

విద్యార్థులకు అవకాశాలు

– పి.నర్సయ్య, డిప్యూటీ డైరెక్టర్, ఉపాధి శిక్షణ శాఖ



ఏటీసీల్లో శిక్షణ పొందే విద్యార్థులకు వంద శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయి. ఈ నెల 19 వరకు తక్షణ ప్రవేశాలు పొందొచ్చు. ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు తగ్గట్లు కొత్త కోర్సుల్ని ప్రవేశపెట్టాం.

'మంద కృష్ణమాదిగ 60 రోజులు ఓపిక పట్టండి'



మాట్లాడుతున్న రవి


బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి 60 రోజుల గడువుతో ఏక సభ్య కమిషన్ వేయడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని మాదిగ జేఏసీ ఛైర్మన్ పిడమర్తి రవి తెలిపారు. మంద కృష్ణమాదిగ సహా మాదిగ సంఘాలు అప్పటివరకు ఉద్యమాలకు దూరంగా ఉండి సహకరించాలని కోరారు. ఈ నెల 22 నుంచి 60 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'మాదిగ సమ్మేళనాలు' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. గజ్జల కాంతం, గోరరాజయ్య, ఓ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చెట్టు కూలి వ్యక్తి దుర్మరణం

ఐఎస్ సదన్, న్యూస్‌టుడే: చెట్టు కూలి వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఐఎస్ సదన్ ఠాణా పరిధిలో బుధవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు వివరాల ప్రకారం.. జియగూడకు చెందిన బాలప్రకాశ్(57), కుమారుడు నవనీత్(27)తో కలిసి బంధువుల పెళ్లికి రాత్రి 10 గంటల సమయంలో సాగర్ రింగ్ రోడ్డు వైపు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో నైటింగేల్ ఆసుపత్రి దాటుతుండగా రోడ్డు పక్కన ఉన్న వేప చెట్టు వారిపై కూలింది. బాలప్రకాశ్ తలకు తీవ్ర గాయం కావడంతో డీఆర్‌డీవో అపోలో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందారని వైద్యులు ధ్రువీకరించారు. వాహనం నడుపుతున్న కుమారుడు శిరస్త్రాణం ధరించడంతో త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. నవనీత్ సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

వేగంగా ఎందుకెళ్తున్నావని ప్రశ్నించినందుకు దాడి

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



అల్వాల్: వేగంగా ఎందుకు వెళ్తున్నావని ఓయువకుడిని ప్రశ్నించడమే ఆ వృద్ధుడికి మరణశాసనమైంది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. టెంపుల్ అల్వాల్‌కు చెందిన **ఆంజనేయులు**(69) సెప్టెంబరు 30న బస్సు దిగి రోడ్డు దాటుతుండగా ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలో పనిచేసే దీపక్(35) బైక్‌పై వేగంగా వెళ్తూ ఆంజనేయులును స్వల్పంగా ఢీకొట్టాడు. నెమ్మదిగా వెళ్లొచ్చుగా అని ఆంజనేయులు ప్రశ్నించడంతో ఆగ్రహం చెందిన దీపక్ దాడి చేసి తోసేయడంతో పడిపోయాడు. తలకు గాయం కావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

ఫైర్, హెల్త్‌సేఫ్టీ కోర్సుల్లో శిక్షణ

అంబర్‌పేట, న్యూస్‌టుడే: నేషనల్ సెంటర్ ఫర్ ఫైర్, సేఫ్టీ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఫైర్, హెల్త్‌సేఫ్టీ కోర్సులలో గ్రేటర్ పరిధిలోని విద్యార్థుల శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 25లోపు www.ncttindia.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 63023 55872 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గ్రూప్-I పరీక్షలకు 17,762 మంది

మేడ్చల్ కలెక్టరేట్: జిల్లా నుంచి గ్రూప్-1 మెయిన్ పరీక్షలకు 17,762 మంది హాజరవుతున్నారని,అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టినట్లు జిల్లా (స్థానిక సంస్థల) అదనపు కలెక్టర్ రాధికాగుప్తా తెలిపారు. గురువారం కలెక్టరేట్ నుంచి డీఆర్వో హరిప్రియతో కలిసి టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి నిర్వహించిన జిల్లా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి

కాచిగూడ: రైల్వేలోని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని రైల్వే మజ్దూర్ యూనియన్ (ఆర్ఎంయూ) దక్షిణ మధ్య రైల్వే జోనల్ ప్రధాన కార్యదర్శి టి.ప్రభు చరణ్ డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికులకు నష్టం కలిగిస్తున్న రైల్వే ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. దేశవ్యాప్తంగా డిసెంబరు 4, 5, 6 తేదీల్లో జరగనున్న రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల నేపథ్యంలో.. గురువారం ఉద్యోగులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు.

వాల్మీకి, కుమురం భీంలకు సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో వాల్మీకి జయంతి, కుమురం భీం వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం వారికి నివాళులర్పించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో వాల్మీకి, కుమురం భీం చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి గొప్పదనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. గాంధీభవన్‌లో వాల్మీకి, కుమురం భీం చిత్రపటాలకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు టి.కుమార్‌రావు, గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి: తమ్మినేని

ఈనాడు, హైదరాబాద్: గురుకుల భవనాల అద్దె సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 'ప్రభుత్వం అద్దెలు చెల్లించకపోవడంతో యజమానులు భవనాలకు తాళాలు వేయడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. చదువులకు ఆటంకం లేకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదే. గత భారాస ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సొంత భవనాలు కట్టలేదు. అద్దెలు చెల్లించలేదు. సరకుల ధరలు పెరిగినా మెస్‌ఛార్జీలు పెంచాలన్న ఆలోచనా ప్రభుత్వం చేయట్లేదు' అని ఆక్షేపించారు. విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా సొంత భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తమ్మినేని గురువారం ప్రకటనలో కోరారు.

సికింద్రాబాద్‌లోని మెట్రోపోలీస్ హోటల్ సీజ్

- మత విద్వేషాలకు వేదికగా మారిందంటూ చర్యలు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: మత విద్వేషాలకు వేదికగా నిలుస్తోందంటూ పోలీసులు చేసిన సిఫారసు మేరకు సికింద్రాబాద్‌లోని మెట్రో పోలీస్ హోటల్‌ను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఇక్కడికి వ్యక్తిత్వ వికాస శిక్షణ కోసం వచ్చిన ఓ వ్యక్తి అక్కడి వారి ప్రసంగాలకు ప్రేరేపితుడై ఇటీవల కుమ్మరిగూడలోని ఓ ప్రార్థన మందిరంపై దాడి చేసినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

హోటల్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ప్రాథమికంగా లభ్యమైన ఆధారాల ప్రకారం మెట్రో పోలీస్ హోటల్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు వేదికగా మారిందని, పోలీసుల అనుమతులు లేకుండా నెలరోజులుగా అక్కడ మత విద్వేష ప్రసంగాలు జరిగినట్టు తేలిన నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్, సికింద్రాబాద్ ఆర్డీవోకు సిఫారసు చేశారు. దీంతో సికింద్రాబాద్ తహసీల్దార్ పాండునాయక్, పోలీసు అధికారులతో కలిసి గురువారం హోటల్‌ను సీజ్ చేశారు. గదుల్లో ఉన్న వారిని ఖాళీ చేయించారు. హోటల్‌లోని రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

మారతాడని పంపిస్తే... అదే తీరు

వ్యక్తిత్వ వికాస శిక్షణ పేరుతో ఓ వివాదాస్పద మోటివేషనల్ స్పీకర్ విద్యార్థులు, యువకులకు మెట్రో పోలీస్ హోటల్‌లో తరగతులు నిర్వహిస్తున్నాడు. మొబైల్, మాదకద్రవ్యాలకు బానిసలైన యువకులను, ఇతరుల పట్ల విద్వేషం ఉన్న వారిని ఆయా జాడ్యాల నుంచి బయటపడేయాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు శిక్షణకు పంపిస్తున్నారు. నెల రోజుల శిక్షణకు రుసుంగా రూ.20 వేలు, గది అద్దె పేరుతో రూ.30 వేలు వసూలు చేస్తుంటారు. ఒక విడతలో 100 నుంచి 150 మంది శిక్షణ కోసం వస్తుంటారు. కుమ్మరిగూడలో ప్రార్థన మందిరంపై దాడి చేసిన వ్యక్తి ఈ నెల ఒకటిన ముంబయి నుంచి నగరానికి వచ్చాడు. అప్పట్నుంచే పలు ప్రార్థనా మందిరాలను పరిశీలిస్తూ వచ్చిన అతను, ఈ నెల 14న హోటల్ గోడ దూకి బయటికి వచ్చి దాడికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. ముంబయిలోనూ ఈ తరహా దాడులకు పాల్పడిన అతనిపై రెండు కేసులు నమోదైన నేపథ్యంలో కౌన్సెలింగ్ ఇప్పించాలని అక్కడి పోలీసులు సూచించిన మీదట కుటుంబ సభ్యులు అతన్ని ఇక్కడికి పంపించారని, అతనిలో మార్పు రాకపోగా ఇక్కడా అదే పని చేశాడని పోలీసు వర్గాలు తెలిపాయి.

తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా!

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తి నియామక ప్రక్రియను ప్రస్తుత సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ప్రారంభించారు. వచ్చే నెల 10న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆనవాయితీ ప్రకారం తన స్థానంలో ఎంపిక చేయాల్సిన న్యాయమూర్తి పేరును సిఫార్సు చేస్తూ జస్టిస్ చంద్రచూడ్ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. న్యాయమూర్తుల్లో సీనియారిటీపరంగా రెండో స్థానంలో ఉన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ప్రతిపాదించారు. కేంద్రం ఆమోదం తర్వాత నవంబరు 11న జస్టిస్ ఖన్నా నూతన సీజేఐగా ప్రమాణం చేస్తారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది నవంబరు 11 నుంచి 2025 మే 13వ తేదీ వరకు సీజేఐ పదవిలో కొనసాగుతారు. 1983లో దిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్న సంజీవ్ ఖన్నా ఇక్కడి తీస్ హజారీ జిల్లా కోర్టు, హైకోర్టు, ట్రైబ్యునళ్లలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2005లో దిల్లీ హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2006లో అక్కడే శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. జస్టిస్ ఖన్నా ప్రస్తుతం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా, భోపాల్‌లోని నేషనల్ జ్యుడిషియల్ అకాడెమీ పాలకమండలి సభ్యుడిగానూ ఉన్నారు. ఆయన సుమారు ఆరు నెలలపాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హోదాలో కొనసాగుతారు.

తీరం దాటిన వాయుగుండం

- విశాఖ, కాకినాడల్లో ఎగసిపడిన అలలు



కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం సూరాడపేట వద్ద తీరంలో ఉద్ధృతి

ఈనాడు, విశాఖపట్నం: పుదుచ్చేరి-నెల్లూరు మధ్య తడ సమీపంలో గురువారం తెల్లవారుజామున నాలుగున్నర సమయంలో వాయుగుండం తీరం దాటినట్లు వాతావరణ శాఖ (ఐఎండీ) పేర్కొంది. తర్వాత అది తీవ్ర అల్పపీడనంగా, సాయంత్రానికి అల్పపీడనంగా బలహీనపడింది. వాయుగుండం ప్రభావంతో బుధవారం రాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు పడ్డాయి. దక్షిణ కోస్తాంధ్రలో భారీ వర్షాలు, రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. విశాఖ, కాకినాడ తీరాల్లో సముద్ర అలలు పెద్దఎత్తున ఎగసిపడ్డాయి. విశాఖలో ఆర్కే బీచ్ వద్ద కెరటాలు దుకాణాలను తాకాయి. నైరుతి రుతుపవనాల తిరోగమన సమయంలో అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో వెనువెంటనే వాయుగుండాలు ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. రెండూ పశ్చిమ-వాయవ్య దిశగా కదిలాయని, ఐఎండీ అంచనాల ప్రకారం రెండూ తీరం దాటినట్లు పేర్కొంది. అరేబియా సముద్రంలో వాయుగుండం జీవిత కాలం 54 గంటలు కాగా, బంగాళాఖాతంలో 34 గంటలుగా పేర్కొంది.

రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకురాలు స్టెల్లా తెలిపారు.

మూడు రోజులు ఓ మోస్తరు వర్షాలు

- వాతావరణ శాఖ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో శుక్ర, శని, ఆదివారాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని, ఇతర జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశాలున్నాయని తెలిపింది. మరోవైపు బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో 7.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేటలో 5.6 సెం.మీ., కరీంనగర్ జిల్లా కేంద్రంలో 5.6, కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఎలుపుగొండలో 5.3 సెం.మీ. వర్షపాతం కురిసింది.



ప్రతి విషయంపైనా స్పందించడం మానండి

సామాజిక మాధ్యమాల వినియోగం పెరిగిన తర్వాత యువతలో పుట్టుకొచ్చిన కొత్త సమస్య ఏంటంటే, ప్రతి విషయంపైనా స్పందిస్తూ ఆగ్రహావేశాలకు, ఆందోళనలకు లోనవడం. దీనివల్ల మానసిక భారం పెరిగిపోతోంది. తమ జీవితానికి ఏమాత్రం ఉపయోగపడని విషయాలను విస్మరించడం నేర్చుకుంటే ఈ సమస్య తొలగుతుంది. విచక్షణతో ఆలోచించి తమకేం ముఖ్యమో తెలుసుకొని, వాటికి మాత్రమే ప్రాధాన్యమివ్వడం అలవాటు చేసుకోవాలి.

– కోడీ శాంచెజ్, బిజినెస్ కన్సల్టెంట్

రైతు కుటుంబాల విద్యార్థులేరి?

- వ్యవసాయ, ఉద్యాన వన కోర్సుల్లో మిగిలిన సీట్లు
- రేపటితో ముగియనున్న ప్రవేశాల కౌన్సెలింగ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశాలలో రైతు కుటుంబాలకు చెందిన విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించినప్పటికీ, అభ్యర్థుల కొరతతో భారీగా సీట్లు మిగిలిపోయే పరిస్థితి కన్పిస్తోంది. గతంలో కౌన్సెలింగ్ ఆరంభంలోనే ఈ సీట్లు భర్తీ అయిపోయేవి. ఈసారి మాత్రం స్పందన అంతంత మాత్రంగానే ఉంది. వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో మొత్తం సీట్లలో 40 శాతం రైతు కుటుంబాల విద్యార్థుల కోటా కింద భర్తీ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎకరానికి తక్కువగాకుండా భూమి ఉన్న రైతుల పిల్లలకు ఈ రిజర్వేషన్ వర్తిస్తోంది. గతంలో రైతు కుటుంబాల నుంచి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోవడంతో మొదటి విడత కౌన్సెలింగ్‌లోనే సీట్లు భర్తీ అయ్యేవి. ఈ ఏడాది ఈ నెల 14న మొదలైన కౌన్సెలింగ్ చివరి దశకు చేరినప్పటికీ ఇంకా వ్యవసాయ, ఉద్యాన, మత్స్య కోర్సుల్లో 90 సీట్లు మిగిలాయి. ఇందులో 90 శాతం మేరకు రైతు కుటుంబాలకు కేటాయించినవేనని సమాచారం. శనివారం కౌన్సెలింగ్ ముగియనున్న నేపథ్యంలో సీట్లు భర్తీ అవుతాయా లేదా అనే ఆందోళన ఆయా వర్సిటీల వర్గాల్లో నెలకొంది. మరోవైపు తెలంగాణలో మూడు పశువైద్య కళాశాలల్లో బీవీఎస్సీ కోర్సుల్లో సీట్లన్నీ గురువారం నాటికి భర్తీ అయ్యాయి. వీటిలో 25 శాతం సీట్లను రైతు కుటుంబాల విద్యార్థులకు కేటాయించగా, వాటిల్లోనూ చేరారు.

అంతర్జాతీయ వైద్యుల సదస్సుకు టికెట్లు ఇప్పిస్తానని మోసం

ట్రావెల్స్ ఏజెన్సీ టోకరా.. కేసు నమోదు



సుభాష్‌చంద్ర గుప్తా

కాచిగూడ, న్యూస్‌టుడే: ముంబయిలో జరిగిన అంతర్జాతీయ వైద్యుల సదస్సుకు హాజరయ్యే వారికి విమాన టికెట్లు ఇప్పిస్తానంటూ డబ్బులు తీసుకుని మోసగించిన ట్రావెల్స్ ఏజెన్సీ ఉదంతమిది. హైదరాబాద్‌లోని కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత నెలలో ఈ సంఘటన జరగగా, మధ్యవర్తిగా ఉన్న వ్యక్తి అంబర్‌పేటలోని తూర్పు మండలం డీసీపీ బాలస్వామికి ఫిర్యాదు చేయడంతో తాజాగా వెలుగులోకి వచ్చింది. సెప్టెంబరు 26 నుంచి 29 వరకు జరిగిన అంతర్జాతీయ వైద్యుల సదస్సుకు హాజరయ్యేందుకు అమెరికా, సింగపూర్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఆఫ్రికా తదితర దేశాలకు చెందిన 42 మంది వైద్యులు ఆసక్తి చూపగా, వారికి విమాన టికెట్లు సమకూర్చేలా హైదరాబాద్‌లోని సాయివృందా ఏజెన్సీ మేనేజర్ శాఖమూరి హరీశ్ అంగీకారం కుదుర్చుకున్నాడు. విమాన టికెట్ల కోసం కాచిగూడ కుత్బిగూడలోని ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకుడు సుభాష్‌చంద్ర గుప్తాను సంప్రదించాడు. సదస్సుకు మూడు నెలల ముందే రూ.26.59 లక్షలు చెల్లించాడు. సదస్సు రెండు, మూడు రోజుల ముందు సుభాష్‌చంద్రగుప్తా తన కార్యాలయానికి తాళం వేసి పరారయ్యాడని, తాను రెట్టింపు డబ్బులు చెల్లించి వైద్యులకు విమాన టికెట్లను సమకూర్చాల్సి వచ్చిందంటూ హరీశ్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సుభాష్‌చంద్రగుప్తాపై మూడు కేసులు నమోదు చేసినట్లు డీసీపీ బాలస్వామి గురువారం తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నామన్నారు. దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ వైశ్య సమాఖ్య సదస్సుకు వెళ్లేందుకు విమాన టికెట్లను ఇప్పిస్తానంటూ గతంలోనూ సంబంధిత ఏజెన్సీ పలువురిని మోసగించినట్లు ఆరోపణలున్నాయి.

న్యూజిలాండ్‌తో టీమ్‌ఇండియా తొలి టెస్టు.. మొదటి రోజు వర్షం ఎప్పుడు ఆగుతుందా అని అభిమానులు ఎదురు చూశారు. కానీ ఆట రద్దవడంతో నిరాశ తప్పలేదు.

రెండో రోజు వర్షం ఎప్పుడు వస్తుందా, ఆట ఆగుతుందా అని ఆశగా చూసే పరిస్థితి అభిమానులది. పాపం పడ్డ బాధకంటే ఈ వేదన తప్పేదనే బాధ. అందుకు కారణం.. భారత బ్యాటింగ్!

స్వదేశంలో టీమ్‌ఇండియాకు తిరుగు లేదు.. వరుసగా 18 టెస్టు సిరీస్ విజయాలు.. ఏ ప్రత్యర్థి వచ్చినా చిత్తుచేసి పంపుతుందనే పేరు.. కానీ గురువారం అంతా తలకిందులైంది. కలలోనూ ఊహించనిది జరిగింది.

ఆడుతోంది బెంగళూరులోనా.. న్యూజిలాండ్‌లోనా? అనే సందేహం కలిగేలా బంతి మాయ చేస్తుంటే.. ప్రత్యర్థి పేసర్లు బెంబేలెత్తిస్తుంటే టీమ్‌ఇండియా అత్యంత దారుణమైన బ్యాటింగ్ ప్రదర్శనతో చెత్త రికార్డులు మూటగట్టుకుంది.

అయిదుగురు డకౌట్.. ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోరు.. అత్యధికం 20.. పరుగుల సంగతి పక్కనపెడితే ఆరుగురు బ్యాటర్లు కనీసం 10 బంతులు కూడా ఆడలేదు. మొత్తానికి 46 పరుగులకే కుప్పకూలి.. స్వదేశంలో టెస్టు ఇన్నింగ్స్‌లో అత్యల్ప స్కోరు చేసింది. భారత టెస్టు క్రికెట్ చరిత్రలో మరో పీడకలగా ఈ రోజు మిగిలిపోతుంది.

అనంతరం సాధికారికంగా ఆడిన కివీస్ చేతిలో ఏడు వికెట్లు ఉండగా ఇప్పటికే 134 పరుగుల ఆధిక్యం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఓటమి నుంచి తప్పించుకోవాలంటే భారత్ అద్భుతమే చేయాలి!

46కే ధమాల్

వణికించిన హెన్రీ, విలియమ్

● చేతులెత్తేసిన భారత బ్యాటర్లు
● అయిదుగురు డకౌట్ ● కివీస్ 180/3



రోహిత్ బౌల్డ్

ఛాంపియన్



దక్షిణాఫ్రికా క్రికెటర్ల ఆనందం

ఆస్ట్రేలియా ఔట్

● సెమీఫైనల్లో చిత్తు ● చెలరేగిన బాష్

● ఫైనల్లో దక్షిణాఫ్రికా ● మహిళల టీ20 ప్రపంచకప్

దుబాయ్: మహిళల టీ20 ప్రపంచకప్‌లో సంచలనం. ఆరుసార్లు ఛాంపియన్, తిరుగులేని ఫేవరెట్ ఆస్ట్రేలియాకు పరాభవం. ఏడో టైటిల్‌పై కన్నేసిన ఆ జట్టు సెమీస్‌లోనే ఇంటిముఖం పట్టింది. గురువారం జరిగిన పోరులో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన దక్షిణాఫ్రికా 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తుగా ఓడించి, తొలిసారి ఈ టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. మొదట ఆస్ట్రేలియా 5 వికెట్లకు 134 పరుగులు చేసింది. బెత్ మూనీ (44; 42 బంతుల్లో 2×4) టాప్‌స్కోరర్. ఎలిస్ పెర్రీ (31; 23 బంతుల్లో 2×4), తాలియా (27; 33 బంతుల్లో 3×4) రాణించారు. అయబొంగా ఖాకా (2/24) కంగారూలను కట్టడి చేసింది. అనెకె బాష్ (74 నాటౌట్; 48 బంతుల్లో 8×4, 1×6) మెరుపు ఇన్నింగ్స్‌తో లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 17.2 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి అందుకుంది. ఛేదనలో అయిదో ఓవర్లోనే ఓపెనర్ బ్రిట్స్ (15)ను దక్షిణాఫ్రికా కోల్పోయింది. కానీ మరో ఓపెనర్ వోల్వార్ట్ (42; 37 బంతుల్లో 3×4, 1×6) అండగా నిలవగా.. బాష్ చెలరేగిపోయింది. అడపాదడపా బౌండరీలు బాదేస్తూ జట్టును వేగంగా లక్ష్యం దిశగా తీసుకెళ్లింది. వోల్వార్ట్, బాష్ రెండో వికెట్‌కు 65 బంతుల్లో 96 పరుగులు జోడించారు. 15వ ఓవర్లో జట్టు స్కోరు 121 వద్ద వోల్వార్ట్ వెనుదిరిగింది. కానీ అప్పటికే దక్షిణాఫ్రికా విజయం ఖాయమైంది. ట్రయాన్ (1 నాటౌట్)తో కలిసి బాష్ లాంఛనాన్ని పూర్తి చేసింది. టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై గెలవడం దక్షిణాఫ్రికాకు ఇదే తొలిసారి. బాష్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికైంది.

సంక్షిప్త స్కోర్లు.. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: 134/5 (మూనీ 44, పెర్రీ 31, తాలియా 27, లిచ్‌ఫీల్డ్ 16 నాటౌట్; ఖాకా 2/24, మరిజేన్ కాప్ 1/24); దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: 17.2 ఓవర్లలో 135/2 (బాష్ 74 నాటౌట్, వోల్వార్ట్ 42, బ్రిట్స్ 15; అనాబెల్ సదర్లాండ్ 2/26)

న్యూజిలాండ్ × విండీస్ రాత్రి 7.30 నుంచి
నేడే రెండో సెమీఫైనల్ ● మహిళల టీ20 ప్రపంచకప్



బెంగళూరు

స్వదేశంలో తిరుగులేని భారత్‌కు షాక్! న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో మొదటి ఇన్నింగ్స్‌లో అన్ని రకాలుగా విఫలమైన ఆ జట్టు వెనుకబడింది. తొలి ఇన్నింగ్స్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి 180/3తో నిలిచిన కివీస్ 134 పరుగుల ఆధిక్యంలో ఉంది. డెవాన్ కాన్వే (91; 105 బంతుల్లో 11×4, 3×6) మెరిశాడు. రచిన్ రవీంద్ర (22 బ్యాటింగ్), డరిల్ మిచెల్ (14 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో పేకమేడలా కుప్పకూలిన టీమ్‌ఇండియా 31.2 ఓవర్లలో 46 పరుగులకే ఆలౌటైంది. పంత్ (20; 49 బంతుల్లో 2×4) టాప్‌స్కోరర్. పరిస్థితులు చక్కగా ఉపయోగించుకుని రెచ్చిపోయిన కివీస్ పేసర్లు మ్యాట్ హెన్రీ (5/15), విలియమ్ ఒరోర్క్ (4/22) వికెట్ల పండుగ చేసుకున్నారు. ఫీల్డింగ్‌లోనూ అదరగొట్టిన ఆ జట్టు.. జైస్వాల్, కోహ్లి, సర్ఫరాజ్, బుమ్రా, కుల్‌దీప్ క్యాచ్‌లను గొప్పగా అందుకుంది. మూడో రోజు ప్రత్యర్థిని త్వరగా ఆలౌట్ చేయకపోతే ఈ మ్యాచ్‌పై భారత్ ఆశలు వదులుకోవాల్సిందే.



పడగొట్టలేక: ఉదయం ప్రత్యర్థి పేసర్లకు దాసోహమన్న భారత్.. అనంతరం కివీస్ బ్యాటర్లను పడగొట్టలేకపోయింది. మన పేసర్లు ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయారు. మధ్యాహ్నం నుంచి ఎండ కాయడంతో పిచ్‌లో మార్పు వచ్చింది. బంతి ప్రభావం తగ్గింది. భారత ఇన్నింగ్స్‌లో 31.2 ఓవర్ల పాటు బంతి సగటు సీమ్ కదలిక 0.87 డిగ్రీలుగా ఉంటే.. కివీస్ ఇన్నింగ్స్‌లో అన్నే ఓవర్లలో అది 0.65గా మారింది. ఆ పరిస్థితులను చక్కగా అన్వయించుకుని న్యూజిలాండ్ బ్యాటింగ్ కొనసాగించింది. ముఖ్యంగా వన్డే తరహాలో ఆడిన కాన్వే భారత్‌ను మరింత కష్టాల్లోకి నెట్టాడు. పేసర్లను సమర్థంగా ఎదుర్కొన్న అతను.. స్పిన్నర్లపై ఎదురుదాడికి దిగాడు. స్వీప్, రివర్స్‌స్వీప్‌లతో పరుగులు రాబట్టాడు. మరోవైపు మూడు క్యాచ్‌లు, రెండు స్టంపింగ్, ఓ రనౌట్ అవకాశాలు చేజారడం టీమ్‌ఇండియాను దెబ్బతీసింది. లేథమ్ (15)తో కలిసి తొలి వికెట్‌కు కాన్వే 67 పరుగులు జోడించాడు. అప్పటికే ఆ జట్టు ఆధిక్యంలోకి వెళ్లింది. పిచ్ కాస్త స్పిన్నర్లకు అనుకూలంగా మారడంతో కుల్‌దీప్, అశ్విన్, జడేజా దాడి చేశారు. లేథమ్‌ను కుల్‌దీప్ (1/57) వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. అయినా విల్ యంగ్ (33)తో కలిసి కాన్వే ఇన్నింగ్స్ నడిపించాడు. స్వల్ప వ్యవధిలో యంగ్‌తో పాటు కాన్వేను ఔట్ చేసిన భారత్ కాస్త పట్టుబిగించే ప్రయత్నం చేసింది. సెంచరీకి 9 పరుగుల దూరంలో అశ్విన్ (1/46) బంతిని రివర్స్‌స్వీప్ ఆడాలని ప్రయత్నించిన కాన్వే బౌల్డయ్యాడు. కానీ ఆ తర్వాత రచిన్, డరిల్ మిచెల్ కలిసి మరో వికెట్ పడకుండా ఆట ముగించారు.

బ్యాట్లెత్తేశారు..: ఓ వైపు వర్షం.. మరోవైపు మబ్బు పట్టిన ఆకాశం.. పేసర్లకు అనుకూలమైన వాతావరణం.. ఈ పరిస్థితుల్లో టాస్ గెలిచిన రోహిత్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఇంకేముంది పేసర్లకు సహకరిస్తున్న పిచ్‌పై న్యూజిలాండ్ ఫాస్ట్‌బౌలర్లు చెలరేగారు. హెన్రీ, విలియమ్, సౌథీ (1/8) కలిసి భారత బ్యాటర్ల పనిపట్టారు. స్వింగ్ చేస్తూ, బౌన్స్ రాబడుతూ ప్రతి బంతికి బ్యాటర్లను పరీక్షించారు. ఊహించిన దాని కంటే ఎక్కువగా బంతి స్వింగ్ అవడం.. కదలిక అధికంగా ఉండటంతో బ్యాటింగ్ కష్టంగా మారింది. తొలి సెషన్‌లో 34 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన భారత్.. రెండో సెషన్‌లో మరో 12 పరుగులే చేసి ఆలౌటైంది. పంత్, జైస్వాల్ (63 బంతుల్లో 13) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. క్రీజులో ఉన్నంతసేపు అసౌకర్యంగానే కనిపించిన రోహిత్ (2) ఓపిక కోల్పోయి ముందుకు వచ్చి షాట్ ఆడదామనుకున్నాడు కానీ సౌథీ సీమ్‌కు స్టంప్స్ ఎగిరిపోయాయి. అక్కడి నుంచి ఏ దశలోనూ వికెట్ల పతనం ఆగలేదు. యశస్వి, పంత్ తప్ప ఏ బ్యాటరూ క్రీజులో నిలబడాలనే పట్టుదల ప్రదర్శించలేదు. గాయంతో గిల్ దూరమవడంతో 2016 తర్వాత తొలిసారి టెస్టులో మూడో స్థానంలో బ్యాటింగ్ వచ్చిన కోహ్లి (0)ని వ్యూహం ప్రకారం ఔట్ చేశారు. అతని కోసమే బౌలింగ్‌కు వచ్చిన విలియమ్ బంతిని బౌన్స్ చేశాడు. ఆన్‌సైడ్ ఆడాలని చూసిన కోహ్లి గ్లోవ్స్‌కు తగిలిన బంతి లెగ్‌గల్లీలో ఫీల్డర్ చేతుల్లో పడింది. సర్ఫరాజ్ (0) పరిస్థితులను పట్టించుకోకుండా చెత్త షాట్ ఆడి, కాన్వే పట్టిన సూపర్ క్యాచ్‌కు నిష్క్రమించాడు. భారత్ 13/3తో నిలిచిన సమయంలో మళ్లీ వచ్చిన వర్షం అలాగే కొనసాగినా బాగుండేదేమో! కానీ సుమారు 40 నిమిషాల విరామం తర్వాత మొదలైన ఆటలో టీమ్‌ఇండియాది అదే తడబాటు. క్రీజులో పాతుకుపోయేందుకు విశ్వప్రయత్నం చేసిన యశస్వి.. పాయింట్‌లో అజాజ్ పట్టిన చక్కటి క్యాచ్‌కు వెనుదిరగక తప్పలేదు. ఆ తర్వాత మిగతా బ్యాటర్లంతా డ్రెస్సింగ్ గదిలో ఏదో ముఖ్యమైన పని ఉన్నట్లు వెళ్లిపోయారు. కేఎల్ రాహుల్ (0), జడేజా (0), అశ్విన్ (0) ఖాతా కూడా తెరవలేదు. కుల్‌దీప్ (17 బంతుల్లో 2), సిరాజ్ (16 బంతుల్లో 4 నాటౌట్) ప్రధాన బ్యాటర్ల కంటే మెరుగ్గా కనీసం కొన్ని ఓవర్ల పాటైనా క్రీజులో నిలబడ్డారు. కుల్‌దీప్‌ను ఔట్ చేసి హెన్రీ అయిదో వికెట్ దక్కించుకోవడంతో భారత ఇన్నింగ్స్ ముగిసింది.

అది నా నిర్ణయమే

"మొదట బ్యాటింగ్ చేయాలన్నది కెప్టెన్‌గా నా నిర్ణయమే. 46 పరుగుల స్కోరు చూస్తే బాధ కలుగుతోంది. పిచ్‌ను అర్థం చేసుకోలేకపోయానన్నది స్పష్టమవుతోంది. పిచ్‌ను సరిగ్గా చదవలేకపోయా. అందుకే ఈ పరిస్థితిలో ఉన్నాం. అయినప్పటికీ 365 రోజుల్లో రెండు లేదా మూడు చెత్త నిర్ణయాలుంటే పర్లేదనుకుంటా. ఎదురైన సవాలుకు మేం ఉత్తమంగా స్పందించలేకపోయాం. ఈ రోజు మాది కాదు. పిచ్‌పై ఎక్కువ పచ్చిక లేదు. తొలి రెండు సెషన్ల తర్వాత స్పిన్‌కు అనుకూలిస్తుందని భావించాం. భారత్‌లో ఎప్పుడు ఆడినా తొలి సెషన్ తర్వాత పిచ్ కుదురుకుని, స్పిన్నర్లకు సహకరిస్తుంది. ఈ పిచ్ మందకొడిగా ఉందనుకుని కుల్‌దీప్‌ను తీసుకున్నాం. మూడో స్థానంలో ఆడే బాధ్యతను విరాట్ తీసుకున్నాడు. సాధారణంగా నాలుగు, అయిదు, ఆరు స్థానాల్లో ఆడే సర్ఫరాజ్‌ను నాలుగో స్థానంలో ఆడించాం. పంత్, రాహుల్ స్థానాలను మార్చాలనుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలా బౌలింగ్ చేయాలో కివీస్ పేసర్లకు బాగా తెలుసు. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టును కట్టడి చేయాలి. రెండో ఇన్నింగ్స్‌లో మేం భారీ స్కోరు సాధించాలి. పంత్ మోకాలుపై బంతి నేరుగా తాకింది. అదే మోకాలికి గతంలో శస్త్రచికిత్స జరిగింది. ఇప్పుడు కాస్త వాచింది. ముందు జాగ్రత్తగా అతను మైదానం వీడాడు. మేం అతణ్ని ప్రమాదంలోకి నెట్టాలనుకోవడం లేదు. మూడో రోజు అతను మైదానంలో దిగుతాడని ఆశిస్తున్నా"

– రోహిత్ శర్మ

ఇదేం బ్యాటింగ్?

ఈనాడు క్రీడావిభాగం

2020 డిసెంబర్ 19.. భారత టెస్టు క్రికెట్ చరిత్రలో చెరగని మచ్చగా మిగిలిపోయిన రోజు. టీమ్‌ఇండియా అభిమానులు మర్చిపోవాలనుకునే రోజు. ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో భాగంగా రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 36 పరుగులకే కుప్పకూలిన రోజు. మళ్లీ నాలుగేళ్ల తర్వాత గురువారం బెంగళూరులో భారత జట్టు అలాంటి పేలవ ప్రదర్శన చేసింది. అప్పుడంటే ఆడింది ఆస్ట్రేలియాలో, అక్కడి పరిస్థితులు క్లిష్టంగా ఉన్నాయని అనుకోవచ్చు. కానీ ఇప్పుడు ఆడుతోంది భారత్‌లో. మనకు తిరుగులేని సొంతగడ్డపై. భారత్ అంటే బలమైన జట్టు. అయినా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 46 పరుగులకే ఆలౌటైందంటే మన బ్యాటర్ల బాధ్యతారాహిత్యం కూడా కారణమే. న్యూజిలాండ్ పేసర్లు పరిస్థితులను సద్వినియోగం చేసుకుని గొప్పగా బంతులేశారనడంలో సందేహం లేదు. బంతిని బయటకు స్వింగ్ చేసిన సౌథీ.. సీమ్‌ను ఉపయోగించి లోపలికి కూడా పంపించాడు. సీమ్‌కు పేస్‌ను జతచేసి హెన్రీ రెండు వైపులా బంతులను పంపించాడు. 6.4 అడుగుల ఎత్తున్న విలియమ్ మంచి బౌన్స్ రాబట్టాడు. ప్రాథమిక అంశాలకు కట్టుబడి కచ్చితమైన లైన్, క్లిష్టమైన లెంగ్త్‌లతో వీళ్లు బౌలింగ్ చేశారు. ఇక వాళ్ల ఫీల్డింగ్ అయితే మరోస్థాయిలో ఉంది. ప్రతి క్యాచ్‌ను గొప్పగా ఒడిసిపట్టారు. అయితే ఇందులో మన బ్యాటర్ల వైఫల్యమూ ఉంది. పరిస్థితులను అర్థం చేసుకోకుండా, పిచ్‌ను బట్టి బ్యాటింగ్ చేయకుండా, అనవసర షాట్లతో వికెట్లు పారేసుకున్నారు. టెక్నిక్‌ను మర్చిపోయారు. కోహ్లి, సర్ఫరాజ్, కేఎల్ రాహుల్, జడేజా, అశ్విన్ డకౌటయ్యారు. మొదట లెంగ్త్‌లో పడ్డ బంతిని రోహిత్ ముందుకు వచ్చి ఆడాల్సిన అవసరం లేదు. కానీ అప్పటివరకూ ఓపికతో ఉన్న రోహిత్ ముందుకు వచ్చి బంతిని ఆడాడు. అది లోపలికి స్వింగ్ అయి స్టంప్స్‌ను ముద్దాడింది. కోహ్లి ప్రత్యర్థి వ్యూహంలో చిక్కాడు. అసలే జట్టులో చోటు కోసం తీవ్రమైన పోటీ ఉంది. ఇలాంటి నేపథ్యంలో వచ్చిన అవకాశాన్ని సర్ఫరాజ్ పారేసుకున్నాడు. క్రీజులో కుదురుకోవాల్సింది పోయి షాట్‌కు ప్రయత్నించాడు. కేఎల్ రాహుల్ లెగ్‌సైడ్ వెళ్తున్న బంతిని వదిలేస్తే సరిపోయేది. కానీ ఆడి వికెట్ కీపర్‌కు చిక్కాడు. జడేజా కూడా అనవసర షాట్ ఆడాడు. బంతిని చూడకుండానే అతను ఫ్లిక్ చేసినట్లు అనిపించింది. కాస్తో కూస్తో పోరాడిన పంత్ బంతి కదలికను తప్పుగా అంచనా వేసి దొరికిపోయాడు. చక్కగా బ్యాట్ మీదకు బంతి వస్తుంటే ఏ బ్యాటరైనా ఆడతాడు. బ్యాటర్లకు అసలైన పరీక్షగా నిలిచే ఇలాంటి పరిస్థితుల్లోనే పరుగులు చేయాల్సి ఉంటుంది. అలాంటిది కనీసం క్రీజులో నిలబడలేకపోయారు. రోహిత్ (16 బంతులు), కోహ్లి (9), సర్ఫరాజ్ (3), రాహుల్ (6), జడేజా (6), అశ్విన్ (1) కంటే కుల్‌దీప్ (17) ఎక్కువ బంతులాడటం గమనార్హం. సిరాజ్ కూడా 16 బంతులాడాడు. బ్యాటర్లు తమ డిఫెన్స్ టెక్నిక్‌ను నమ్మినట్లు కనిపించలేదు. ప్రత్యర్థి బౌలర్ల వ్యూహాలను వీళ్లు అర్థం చేసుకోలేదు. లెగ్‌గల్లీలో ఫీల్డర్‌ను పెట్టినా కోహ్లి జాగ్రత్తపడలేదు. ఈ సిరీస్ తర్వాత టీమ్‌ఇండియా.. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లాల్సి ఉంది. బ్యాటింగ్ ఇలాగే కొనసాగితే పరాయి గడ్డపై పరాభవం తప్పదు. ఈ ఇన్నింగ్స్ నుంచి పాఠాలు నేర్చుకోవడం అత్యవసరం.

పంత్‌కు గాయం



అసలే తొలి ఇన్నింగ్స్‌లో పేలవ ప్రదర్శనతో కష్టాల్లో పడ్డ టీమ్‌ఇండియాకు మరో దెబ్బ తగిలింది. వికెట్ కీపింగ్ చేస్తూ పంత్ గాయపడ్డాడు. జడేజా వేసిన ఇన్నింగ్స్ 37వ ఓవర్ చివరి బంతి తక్కువ ఎత్తులో వచ్చి పంత్ కుడి మోకాలికి బలంగా తగిలింది. నొప్పితో విలవిల్లాడిన పంత్ మైదానంలో కూలబడ్డాడు. ఫిజియో వచ్చి పరీక్షించి అతణ్ని సిబ్బంది సహాయంతో బయటకు తీసుకెళ్లారు. ఆ తర్వాత ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ చేశాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటపడ్డ పంత్‌కు ఈ కుడి మోకాలికి శస్త్రచికిత్స జరిగింది. బంగ్లాదేశ్‌తో టెస్టుల్లోనే అతను సుదీర్ఘ ఫార్మాట్లో పునరాగమనం చేశాడు. మళ్లీ ఇప్పుడు అతను కుంటుతూ మైదానం వీడటంతో గాయం తీవ్రతపై ఆందోళన నెలకొంది.

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (సి) అజాజ్ (బి) విలియమ్ 13; రోహిత్ (బి) సౌథీ 2; కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) విలియమ్ 0; సర్ఫరాజ్ (సి) కాన్వే (బి) హెన్రీ 0; పంత్ (సి) లేథమ్ (బి) హెన్రీ 20; కేఎల్ రాహుల్ (సి) బ్లండెల్ (బి) విలియమ్ 0; జడేజా (సి) అజాజ్ (బి) హెన్రీ 0; అశ్విన్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 0; కుల్‌దీప్ (సి) బ్రేస్‌వెల్ (బి) హెన్రీ 2; బుమ్రా (సి) హెన్రీ (బి) విలియమ్ 1; సిరాజ్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం: (31.2 ఓవర్లలో ఆలౌట్) **46**; వికెట్ల పతనం: 1-9, 2-9, 3-10, 4-31, 5-33, 6-34, 7-34, 8-39, 9-40; **బౌలింగ్:** సౌథీ 6-4-8-1; మ్యాట్ హెన్రీ 13.2-3-15-5; విలియమ్ ఒరోర్క్ 12-6-22-4

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లేథమ్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 15; కాన్వే (బి) అశ్విన్ 91; విల్ యంగ్ (సి) కుల్‌దీప్ (బి) జడేజా 33; రచిన్ బ్యాటింగ్ 22; డరిల్ మిచెల్ బ్యాటింగ్ 14; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం: (50 ఓవర్లలో 3 వికెట్లకు) **180;** వికెట్ల పతనం: 1-67, 2-142, 3-154; **బౌలింగ్:** బుమ్రా 10-4-23-0; సిరాజ్ 7-1-21-0; అశ్విన్ 11-1-46-1; కుల్‌దీప్ 12-1-57-1; జడేజా 10-0-28-1

1 ఆసియా ఖండంలో ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో జట్టు చేసిన అత్యల్ప స్కోరు (46) ఇదే. 1986లో ఫైసలాబాద్‌లో పాకిస్థాన్‌పై వెస్టిండీస్, 2002లో షార్జాలో ఆస్ట్రేలియాపై పాకిస్థాన్ 53 పరుగులకు ఆలౌటయ్యాయి.

46 స్వదేశంలో ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో భారత్ చేసిన అత్యల్ప స్కోరు ఇదే. గత రికార్డు 75 (1987లో వెస్టిండీస్‌పై). ఓవరాల్‌గా ఇది మూడో అతి తక్కువ స్కోరు. 2020లో అడిలైడ్‌లో ఆస్ట్రేలియాపై 36, 1974లో లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌పై 42 పరుగులకే టీమ్‌ఇండియా కుప్పకూలింది.

వివాన్‌కు రజతం..



దిల్లీ: ఐఎస్‌ఎస్‌ఎఫ్ ప్రపంచకప్ ఫైనల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ మరో రెండు పతకాలను సొంతం చేసుకుంది. ట్రాప్‌లో వివాన్‌కపూర్ రజతం నెగ్గగా.. స్కీట్‌లో అనంత్‌జీత్ సింగ్ కాంస్యం గెలుచుకున్నాడు. ట్రాప్ ఫైనల్లో వివాన్ 44 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. యింగ్ కి (చైనా, 47) స్వర్ణం, టోల్గా టన్సర్ (తుర్కియే, 35) కాంస్య పతకాలు సాధించారు. స్కీట్ తుదిపోరులో అనంత్‌జీత్ (43) కంచు కైవసం చేసుకున్నాడు. ఇటలీ షూటర్లు టమారో (57), రోసెటి (56) వరుసగా స్వర్ణ, రజతాలు ఖాతాలో వేసుకున్నారు. ఈ టోర్నీలో భారత్ గెలిచిన పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటికే మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో సోనమ్ మస్కర్ రజతం, పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో అఖిల్ షెరోన్ కాంస్యం నెగ్గారు.

క్వార్టర్స్‌లో సింధు

ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు 18-21, 21-12, 21-16తో నాలుగో సీడ్ హాన్ యూ (చైనా)పై విజయం సాధించింది. 63 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో సింధు గొప్పగా పుంజుకుని ప్రత్యర్థిని చిత్తుచేసింది. నువ్వానేనా అన్నట్లు సాగిన తొలి గేమ్‌లో సింధుపై హాన్ పైచేయి సాధించింది. రెండో గేమ్‌లో సింధు చెలరేగింది. మూడో గేమ్ 16 పాయింట్ల వరకు స్కోరు సమమవుతూ వెళ్లింది. ఈ సమయంలో ఒక్కసారిగా గేరు మార్చిన సింధు వరుసగా 5 పాయింట్లతో హాన్ పోరాటానికి తెరదించింది. హాన్‌పై తన గెలుపోటముల రికార్డును 7-1తో సింధు మరింత మెరుగుపరుచుకుంది.



కూతకు వేళాయె

నేడు పీకేఎల్-11 ప్రారంభం

రాత్రి 8 నుంచి

ఈనాడు, హైదరాబాద్: కబడ్డీ కూతకు వేళైంది. ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్ 11కు శుక్రవారం తెరలేవనుంది. అందుకు వేదిక హైదరాబాద్. గచ్చిబౌలి స్టేడియంలో తెలుగు టైటాన్స్, బెంగళూరు బుల్స్ మ్యాచ్‌తో లీగ్ మొదలవనుంది. మరో మ్యాచ్‌లో దబంగ్ దిల్లీతో యు ముంబా ఢీకొననుంది. ఆటగాళ్లు మారినా.. పది సీజన్లు గడిచినా.. ఇప్పటివరకూ పీకేఎల్ టైటిల్‌ను తెలుగు టైటాన్స్ దక్కించుకోలేకపోయింది. కానీ ఈ సారి మాత్రం కథ మారుస్తామని ఆ జట్టు కెప్టెన్ పవన్ ధీమా వ్యక్తం చేశాడు. సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తామని పవన్ చెప్పాడు.

దిల్లీ సహాయక బృందంలో వేణు, బదాని

దిల్లీ: భారత మాజీ క్రికెటర్లు హేమంగ్ బదాని, వేణుగోపాలరావు ఐపీఎల్ ఫ్రాంఛైజీ దిల్లీ క్యాపిటల్స్ ప్రధాన కోచ్, డైరెక్టర్లుగా నియమితులయ్యారు. 47 ఏళ్ల బదాని భారత్ తరపున 4 టెస్టులు, 40 వన్డేలు ఆడాడు. 2021-23 సీజన్లలో అతడు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫీల్డింగ్, బ్యాటింగ్ కోచ్‌గా సేవలందించాడు. లంక ప్రిమియర్ లీగ్, ఎస్‌ఏ20 లీగ్స్‌లోనూ బదాని కోచ్‌గా పని చేశాడు. తాజాగా ఐఎల్‌టీ20లో దుబాయ్ క్యాపిటల్స్‌కు ప్రధాన కోచ్‌గా వ్యవహరించాడు. మరోవైపు భారత్‌కు 16 వన్డేలు ఆడిన వేణుగోపాలరావు 2009లో ఐపీఎల్ విజేతగా నిలిచిన డెక్కన్ ఛార్జర్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. దిల్లీ డేర్‌డెవిల్స్ తరపున అతడు మూడు సీజన్లలో ఆడాడు. ఐఎల్‌టీ20లో దుబాయ్ క్యాపిటల్స్‌కు మార్గనిర్దేశకుడిగా వ్యవహరించాడు. 2021లో రన్నరప్‌గా నిలిచిన దిల్లీ.. తర్వాత మూడు సీజన్లలో లీగ్ దశలోనే నిష్క్రమించింది.

జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ డైరెక్టర్‌గా గంగూలీ: టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ డైరెక్టర్‌గా నియమితుడయ్యాడు. ఐపీఎల్ దిల్లీ జట్టు సహ జేఎస్‌డబ్ల్యూకు చెందిన అన్ని క్రికెటింగ్ కార్యకలాపాలను అతడు చూసుకోవాల్సివుంటుంది. ఐపీఎల్, మహిళల ప్రిమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో దిల్లీ క్యాపిటల్స్‌కు జేఎస్‌డబ్ల్యూ సహ యజమాని. జీఎంఆర్‌తో కలిసి ఈ ఫ్రాంఛైజీలను నడిపిస్తోంది.

సన్‌రైజర్స్‌ను వీడిన స్టెయిన్

ముంబయి: సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ కోచ్ బాధ్యతల నుంచి దక్షిణాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్ తప్పుకున్నాడు. వచ్చే సీజన్‌లో సన్‌రైజర్స్‌కు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించట్లేదని చెప్పాడు. అయితే ఎస్‌ఏ20 జట్టు సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌తో తన బంధం కొనసాగుతుందని తెలిపాడు. ఎస్‌ఏ20లో వరుసగా రెండు సీజన్‌లలో సన్‌రైజర్స్ విజేతగా నిలిచింది. "ఐపీఎల్‌లో సన్‌రైజర్స్‌కు బౌలింగ్ కోచ్‌గా అవకాశమిచ్చిన ఫ్రాంఛైజీకి కృతజ్ఞతలు. దురదృష్టవశాత్తు 2025 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్‌కు కోచ్‌గా ఉండట్లేదు. సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌తో కలిసి పనిచేస్తా" అని స్టెయిన్ తెలిపాడు.

పాక్‌పై భారత్ ఘన విజయం

ఖట్మాండు: శాఫ్ మహిళల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టు ఓ ఘన విజయాన్ని అందుకుంది. గురువారం 5-2తో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. విరామ సమయానికి భారత్ 4-1తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. డాంగ్‌మయ్ (5వ), కయాన్ (18వ), బాలా (36వ), డాంగ్‌మయ్ (43వ) గోల్స్ కొట్టారు. పాక్ తరపున హిరాణి (50వ) గోల్ సాధించింది. 77వ నిమిషంలో సిద్ధికి గోల్ చేయడంతో పాక్ 2-4తో నిలిచినా.. నిమిషం వ్యవధిలో జ్యోతి బంతిని నెట్‌లోకి పంపి భారత్ ఆధిక్యాన్ని మరింత పెంచింది.

హర్మన్‌ప్రీత్‌కే సారథ్యం

దిల్లీ: టీ20 ప్రపంచకప్‌లో భారత్ సెమీఫైనల్ చేరడంలో విఫలమైనా.. సెలక్టర్లు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌పై నమ్మకముంచారు. ఈనెల 24న న్యూజిలాండ్‌తో ఆరంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌కు జట్టును నడిపించే బాధ్యతలను ఆమెకే అప్పగించారు. స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. తేజల్, సయాలి, ప్రియ, సైమా ఈ జట్టులో కొత్త ముఖాలు.

భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి (వైస్ కెప్టెన్), షెఫాలి వర్మ, హేమలత, దీప్తిశర్మ, జెమీమా, యాస్తిక, ఉమ ఛెత్రి, సయాలి, అరుంధతి రెడ్డి, రేణుక, తేజల్, సైమా ఠాకూర్, ప్రియ మిశ్రా, రాధ, శ్రేయంక పాటిల్

పట్టుబిగించిన పాక్

ముల్తాన్: ఇంగ్లాండ్‌తో రెండో టెస్టుపై పాకిస్థాన్ పట్టుబిగించింది. రెండో ఇన్నింగ్స్‌లో పాక్‌ను కట్టడి చేసినప్పటికీ ఇంగ్లాండ్ ఓటమి ముప్పును ఎదుర్కొంటోంది. ఓవర్‌నైట్ స్కోరు 239/6తో మూడో రోజు, గురువారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లాండ్.. 291 పరుగులకు ఆలౌటైంది. స్పిన్నర్ సాజిద్ ఖాన్ (7/111) ఆ జట్టు పతనాన్ని శాసించాడు. 75 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన పాక్... 221 పరుగులకు ఆలౌటైంది. సల్మాన్ ఆఘా (63) టాప్ స్కోరర్. బషీర్ (4/66), జాక్ లీచ్ (3/67) పాక్‌ను కట్టడి చేశారు. అనంతరం 297 పరుగుల ఛేదనలో ఇంగ్లాండ్ తడబడింది. ఆట ముగిసే సమయానికి 36 పరుగులకే ఓపెనర్లు క్రాలీ, డకెట్ వికెట్లను చేజార్చుకుంది. గెలవాలంటే ఇంగ్లాండ్ ఇంకా 261 పరుగులు చేయాలి. కానీ పాక్ స్పిన్నర్లను కాచుకోవడం ఆ జట్టుకు కష్టమైన పనే. ఒలీ పోప్ (21), రూట్ (12) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 366 పరుగులు చేసింది.

భారతమాతకు జైకొడుతూ..

జాతీయ పతాకానికి సెల్యూట్ చేయండి

పాక్ అనుకూల నినాదాలు చేసిన వ్యక్తికి బెయిలిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశం

భోపాల్: పొరుగుదేశం పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేసిన వ్యక్తికి బెయిల్ మంజూరు చేస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు షరతులు విధించింది. నిందితుడిలో దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కేసు విచారణ ముగిసే వరకు పోలీస్‌స్టేషన్‌లోని జాతీయ జెండాకు సెల్యూట్ చేయాలని, ఆ సందర్భంగా 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేయాలని జస్టిస్ డి.కె.పలివాల్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది.



భోపాల్‌లోని మిస్రోద్ పోలీస్ స్టేషన్ పరిధి నివాసి ఫైజల్ అలియాస్ ఫైజాన్ ఈ ఏడాది మే నెలలో పాక్ అనుకూల నినాదాలు చేశారంటూ పోలీసులు అరెస్ట్ చేశారు. భారత్‌కు అగౌరవపరుస్తూ, సమాజంలోని వివిధ వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరించారంటూ అభియోగాలను మోపారు. విచారణ సందర్భంగా రూ.50వేల పూచీకత్తుపై ఫైజాన్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టు బెయిల్‌ను మంజూరు చేసింది. బెయిల్ షరతుల్లో భాగంగా ఫైజాన్ ప్రతినెలా తొలి, నాలుగో మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని ఆదేశించింది. అలా వెళ్లిన ప్రతిసారీ జాతీయ జెండాకు 21 సార్లు సెల్యూట్ చేయాలని, భారత్ మాతాకీ జై అని రెండుసార్లు నినదించాలని తెలిపింది.

పౌరసత్వ చట్టంలోని

సెక్షన్ 6(ఎ) రాజ్యాంగబద్ధమే

- అస్సాం వలసలకు సంబంధించి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు



దిల్లీ: అస్సాం వలసలకు సంబంధించి ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 4-1తో గురువారం కీలక తీర్పును వెలువరించింది. భారత పౌరసత్వ చట్టం-1955లోని సెక్షన్ 6(ఎ)కు రాజ్యాంగబద్ధత ఉందని స్పష్టం చేసింది. సెక్షన్ 6(ఎ) ప్రకారం.. జనవరి 1, 1966 - మార్చి 25, 1971 మధ్య అస్సాంలోకి ప్రవేశించిన వలసదారులు భారత పౌరసత్వానికి అర్హులు. బంగ్లాదేశ్ వలసలతో అస్సాంలో పెరుగుతున్న ఉద్రిక్తతలను చల్లార్చడానికి 1985లో ఓ ఒప్పందం జరిగింది. దీనిపై కేంద్రం తరఫున నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ.. అల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ (అసు) ప్రతినిధులు సంతకం చేశారు. ఈ ఒప్పందం ఆధారంగా పౌరసత్వ చట్టానికి సవరణ చేసి సెక్షన్ 6(ఎ)ను చేర్చారు. కేవలం అస్సాం రాష్ట్రానికి మాత్రమే వర్తించేలా చేసిన ఈ సవరణ రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగ పీఠికలోని సౌభ్రాతృత్వ భావనకు వ్యతిరేకమని పేర్కొంటూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించింది. సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం తిరస్కరించింది. అయితే ధర్మాసనంలోని జస్టిస్ జె.బి.పార్దీవాలా మాత్రం సెక్షన్ 6(ఎ) ఏకపక్షంగా ఉందని, రాజ్యాంగపరంగా చెల్లుబాటు కాదంటూ మైనారిటీ తీర్పును వెలువరించారు. ఈ సందర్భంగా సీజేఐ "అక్రమ వలసలకు అస్సాం ఒప్పందం ఓ రాజకీయ పరిష్కారం. అదే సమయంలో సెక్షన్-6ఎ అనేది చట్టబద్ధమైన మార్గం. ఈ నిబంధనలు రూపొందించడంలో మెజార్టీతో కూడిన పార్లమెంటుకు శక్తి ఉంది. మానవీయ ఆందోళనలను పరిష్కరించడంతోపాటు.. స్థానికుల ప్రయోజనాలను కాపాడే సమతుల్యత ఈ సెక్షన్‌కు ఉంది. ఇక దీనిలోని కటాఫ్ డేట్‌గా నిర్ణయించిన 1971 మార్చి 25 అనేది సరైనదే. ఎందుకంటే అప్పటికే బంగ్లాదేశ్ యుద్ధం ముగిసింది. బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలోనే ఈ సెక్షన్ తీసుకొచ్చిన విషయాన్ని ఇది చెబుతోంది. ఈ సెక్షన్ అంతే ఎక్కువగా జనాభాను ప్రభావితం చేసుకోలేదు.. మరి తక్కువగానూ వివక్ష చేసుకోలేదు" అని పేర్కొన్నారు. అయినా వలసలు అరికట్టేందుకు ఇంకా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. కేవలం అస్సాంకే ఈ నిబంధన పరిమితం చేయడాన్ని కూడా సీజేఐ సమర్థించారు. మిగతా రాష్ట్రాల కంటే అస్సాం ఎక్కువగా వలసలతో ప్రభావితమవుతుందని.. కాబట్టి ఇందులో హేతుబద్ధత ఉందని తెలిపారు.

హరియాణా సీఎంగా సైనీ ప్రమాణం

- హాజరైన మోదీ, అమిత్ షా, చంద్రబాబు, ఎన్డీయే నేతలు



సీఎంగా ప్రమాణం చేసిన అనంతరం ప్రధాని మోదీ ఆశీస్సులు తీసుకుంటున్న సైనీ. చిత్రంలో గవర్నర్ దత్తాత్రేయ

చండీగఢ్: హరియాణా ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ గురువారం పంచకులలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎన్డీయే నేతలు, భారీ జన సందోహం మధ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణం చేయించారు. దసరా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. సైనీతో పాటు 13 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం వాల్మీకి జయంతి కావడం విశేషం. ప్రమాణం అనంతరం సైనీకి ప్రధాని మోదీ ఆశీస్సులు అందజేశారు. 54ఏళ్ల సైనీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి. గత మార్చిలో మనోహర్‌లాల్ ఖట్టర్‌ను మార్చి ఆయనను భాజపా అధిష్ఠానం సీఎంను చేసింది. ఇటీవల జరిగిన హరియాణా ఎన్నికల్లో విజయం సాధించడంతో మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు. మంత్రులుగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనిల్ విజ్, అహిర్వర్గం నేత రావ్ నర్బీర్ సింగ్, జాట్ నేత మహిపాల్ ఢండా, భాజపాలో చేరిన కాంగ్రెస్ నేత శ్రుతి చౌధరి, తొలిసారి ఎమ్మెల్యే అయిన ఆర్తి సింగ్ తదితరులున్నారు.

ప్రమాణ స్వీకారానికి హాజరైన వారిలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా, ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, హిమంత బిశ్వ శర్మ, విష్ణుదేవ్ సాయ్, భూపేంద్ర పటేల్, పుష్కర్ సింగ్ ధామి తదితరులు హాజరయ్యారు.

ప్రమాణస్వీకారాన్ని అడ్డుకోవాలన్న పిటిషనరుపై సుప్రీం ఆగ్రహం

దిల్లీ: హరియాణా ముఖ్యమంత్రిగా సైనీ ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకోవాలని కోరిన పిటిషనరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఇదేమి పిటిషన్.. దీనిని డిస్మిస్ చేస్తున్నాం' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. హరియాణా ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఈవీఎంలలో లోటుపాట్లు చోటుచేసుకున్నాయని పిటిషనరు తరఫు న్యాయవాది కోర్టుకు తెలపగా.. ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికైన ప్రభుత్వ ప్రమాణ స్వీకారాన్ని ఎలా అడ్డుకోగలమని ప్రశ్నించింది.

బాంబు బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలే

- కేంద్ర మంత్రి రామ్మోహన్ స్పష్టీకరణ

దిల్లీ: జాతీయ, అంతర్జాతీయ విమానాలకు కొద్ది రోజులుగా వస్తున్న బాంబు బెదిరింపులను నియంత్రించేందుకు కేంద్రం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ఇందుకోసం ఇప్పటికే ఉన్న నిబంధనలను సవరించే యోచనలో ఉన్నట్లు పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఉత్తుత్తి బెదిరింపు ఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వరుస బాంబు బెదిరింపుల వెనుక కుట్ర దాగి ఉందా అన్న ప్రశ్నకు.. 'ప్రస్తుతం వచ్చినవన్నీ వ్యక్తులు, మైనర్లకు సంబంధించిన బెదిరింపులే' అని తెలిపారు. బాంబు బెదిరింపులకు పాల్పడిన వారిపై విమానయాన నిషేధం విధించే ఆలోచన ఉందని వివరించారు.

★ ముంబయి-లండన్ ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు రావడంతో ముందు జాగ్రత్త చర్యగా రాయల్ ఎయిర్ ఫోర్స్ టైఫూన్ ఫైటర్ జెట్ రంగంలోకి దిగింది. గురువారం మధ్యాహ్నం దానిని పంపినట్లు ఆ సంస్థ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఆ తర్వాత ఎయిరిండియా విమానం లండన్‌లో సురక్షితంగా దిగింది.

ఝార్ఖండ్ తొలి విడతకు నేటి నుంచి నామినేషన్లు

రాంచీ, చండీగఢ్: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కానుంది. 43 నియోజకవర్గాలకు నవంబరు 13న జరిగే పోలింగ్ కోసం ఈ నెల 25 వరకూ నామినేషన్లను స్వీకరిస్తారు. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల మధ్య నామినేషన్ల దాఖలును అనుమతిస్తారు. ఈ నెల 30లోగా నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు.

★ హరియాణా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్ పార్టీని వీడారు. ఏఐసీసీ ఓబీసీ ఛైర్మన్ పదవికీ ఆయన రాజీనామా చేశారు.



ఈ నాలుగింటితోనే పరిపూర్ణ ఆనందం

జీవితంలో నాలుగు అంశాలుంటేనే పరిపూర్ణమైన ఆనందాన్ని పొందగలం. అవేంటంటే.. 1.జీవితానికి ఓ పరమార్థం ఉండేలా చూసుకోవడం. 2.ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆశావహ దృక్పథంతో ఉండటం. 3.ప్రకృతితో అనుసంధానమై జీవించడం. 4.ప్రేమపూర్వక బంధాలను కలిగి ఉండటం. ఇవి లేకపోతే ఎంత సంపద ఉన్నా, ఎన్ని సౌకర్యాలు ఉన్నా జీవితంలో వెలితి ఉంటుంది.

– డేనియల్ ఆరోన్, లైఫ్ కోచ్

భర్త ఆగ్రాలో.. భార్య దిల్లీలో ఆత్మహత్య

- ఇద్దరూ.. ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ అధికారులు
- రెండేళ్లలో విషాదంగా ముగిసిన ప్రేమపెళ్లి

దిల్లీ: భారత సాయుధ దళాల్లో పనిచేస్తున్న ఓ జంట ఒకరోజు వెనుకాముందు వేర్వేరు నగరాల్లో ఆత్మహత్యకు పాల్పడింది. వీరిద్దరిదీ ప్రేమపెళ్లి కావడం గమనార్హం. వాయుసేన, ఆర్మీలలో విధులు నిర్వహిస్తున్న వీరి విషాదాంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీన్‌దయాళ్ దీప్ (32) ఆగ్రాలో ఐఏఎఫ్ ఫ్లైట్ లెఫ్టినెంటుగా పనిచేస్తున్నారు. అక్కడే సైనిక ఆసుపత్రిలో ఆయన భార్య రేణు తన్వర్ ఆర్మీ కెప్టెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అక్టోబరు 14న (సోమవారం) తన తల్లికి వైద్యచికిత్స కోసం తన్వర్ దిల్లీకి వెళ్లారు. ఈ నేపథ్యంలో అదేరోజు రాత్రి భోజనం తర్వాత గదిలోకి వెళ్లిన దీన్‌దయాళ్.. మంగళవారం ఉదయం బయటకు రాకపోవడంతో సహోద్యోగులు క్వార్టర్సు తలుపు పగలగొట్టి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించారు. మరోవైపు.. తన్వర్ కూడా దిల్లీ కంటోన్మెంటులోని అధికారుల మెస్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మంగళవారం ఆమె దిల్లీ ఎయిమ్స్‌లో ఉండగా భర్త మరణం గురించి తెలిసి షాక్‌కు గురయ్యారని, ఆ తర్వాత అతిథిగృహానికి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రేణు తన్వర్ బలవన్మరణానికి పాల్పడినట్లు దిల్లీ డీసీపీ సురేంద్రకుమార్ చౌదరి ధ్రువీకరించారు. పోలీసులు తన్వర్ మృతదేహం పక్కన లేఖను స్వాధీనం చేసుకున్నారు. తన మరణానికి ఎవరూ కారణం కాదని పేర్కొన్న ఆమె.. భర్త మృతదేహంతో కలిపి అంతిమ సంస్కారాలు చేయాలని అందులో కోరారు.

హసీనాపై అరెస్టు వారెంట్

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా సహా ఆమె పార్టీ అవామీ లీగ్‌కు చెందిన అగ్ర నాయకులు 45 మందిపై అరెస్టు వారెంట్ జారీ అయింది. నవంబరు 18లోగా వారందరిని తమ ఎదుట హాజరుపరచాలని దేశ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసీటీ) ఛైర్మన్ జస్టిస్ మహ్మద్ గోలం మొర్తుజా మజుందార్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. తర్వాత నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, హత్యలు, ఇతర నేరాల ఆరోపణలపై హసీనా, ఆమె పార్టీ నేతలు, 14 పార్టీల మిత్రపక్ష నేతలకు వ్యతిరేకంగా ఐసీటీకి 60 ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రైబ్యునల్ దర్యాప్తు ప్రారంభించింది. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.

ఆసియా పసిఫిక్ ఏబీసీ ఛైర్మన్‌గా మసానీ



దిల్లీ: భారత ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) సెక్రటరీ జనరల్ హెచ్‌బీ మసానీ.. ఆసియా పసిఫిక్ ఆడిట్ బ్యూరోస్ ఆఫ్ సర్టిఫికేషన్ (ఏపీఏబీసీ) అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిని చేపట్టడం ఐదోసారి. ఈ మేరకు ఏబీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఆడిట్ బ్యూరోస్ ఆఫ్ సర్టిఫికేషన్ (ఐఎఫ్ఏబీసీ) సర్వసభ్య సమావేశంలో మసానీ ఐఎఫ్ఏబీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్ (గౌరవ కోశాధికారి)గా కూడా వరుసగా తొమ్మిదోసారి ఎన్నికయ్యారు. ఐఎఫ్ఏబీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డులో భారత్‌తోపాటు, ఆస్ట్రియా, బ్రెజిల్, ఫ్రాన్స్, జర్మనీ, రొమేనియా, స్పెయిన్, బ్రిటన్, అమెరికా దేశాల బ్యూరోల ప్రతినిధులు ఉన్నారు. 2008 నుంచి ఐఎఫ్ఏబీసీ కార్యనిర్వాహక మండలిలో ఏబీసీ-ఇండియాకు మసానీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

మనీలాండరింగ్ కేసులో తమన్నాను విచారించిన ఈడీ



గువాహటీ: నగదు అక్రమ చలామణి (మనీ లాండరింగ్) కేసులో సినీనటి తమన్నా భాటియాను గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు విచారించారు. బిట్‌కాయిన్లు, ఇతర క్రిప్టోకరెన్సీల మైనింగ్ పేరిట పలువురిని మోసగించిన వ్యవహారంలో 'హెచ్‌పీజడ్ టోకెన్' మొబైల్ యాప్ పాత్ర ఉంది. ఈ కేసులో వెలుగులోకి వచ్చిన మనీలాండరింగ్ ఆరోపణలపై తమన్నా వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు ఈడీ విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. యాప్ కంపెనీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు తమన్నా కొంత సొమ్ము తీసుకున్నారని, అయితే ఆమెపై ఎటువంటి నేరారోపణ అభియోగాలు మోపలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

బిష్ణోయ్ భాయ్.. ఫోన్ నంబర్ ఇస్తారా!

- గ్యాంగ్‌స్టర్‌కు సల్మాన్‌ఖాన్ మాజీ ప్రేయసి సందేశం



ముంబయి: బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ లక్ష్యంగా తరచూ బెదిరింపులకు పాల్పడే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరు ఇటీవల జరిగిన ఎన్సీపీ నేత, మాజీ మంత్రి బాబా సిద్దీఖీ హత్యతో మరోసారి మారుమోగింది. ముంబయిలో జరిగిన సిద్దీఖీ హత్య అనంతరం సల్మాన్‌తో సన్నిహితంగా ఉంటున్నవారందరికీ బిష్ణోయ్ గ్యాంగ్ హెచ్చరికలు చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆ గ్యాంగ్‌స్టర్ పేరును ప్రస్తావిస్తూ మాజీ మోడల్, నటి సోమీ అలి (48) ఇన్‌స్టాగ్రాం వేదికగా ఒక సందేశం పెట్టారు. ఈమె గతంలో సల్మాన్‌తో రిలేషన్‌షిప్‌లో ఉండేవారని సమాచారం. సోమీ అలి పోస్టు ఇప్పుడు నెట్టింట్లో వైరల్‌గా మారింది. "నమస్తే లారెన్స్ బిష్ణోయ్ భాయ్! జైలు నుంచి కూడా మీరు జూమ్‌కాల్స్ చేస్తారని తెలిసింది. నేను కొన్ని విషయాలు మాట్లాడాలని అనుకొంటున్నా. మిమ్మల్ని ఎలా సంప్రదించాలి? ఈ ప్రపంచంలో రాజస్థాన్ నాకు ఇష్టమైన ప్రదేశం. ముందు మీతో జూమ్‌కాల్‌లో మాట్లాడిన తర్వాత అక్కడికి వెళ్లాలని అనుకొంటున్నా. నన్ను నమ్మండి.. ఇదంతా మీ మంచి కోసమే. మీ మొబైల్ నంబరు ఇస్తే.. సంతోషిస్తా" అంటూ ఆమె తన పోస్టులో రాసుకొచ్చారు. అలాగే బిష్ణోయ్ ఫొటో షేర్ చేశారు. ఈ గ్యాంగ్‌స్టర్ ప్రస్తుతం గుజరాత్‌లోని సబర్మతి జైల్లో ఉన్నాడు. పాకిస్థానీ అమెరికన్ నటి అయిన సోమీ అలి పలు బాలీవుడ్ చిత్రాల్లో నటించారు. ఒక దశలో సల్మాన్‌తో సన్నిహితంగా మెలిగిన ఈమె ఆ తర్వాత అతడు 'శాడిస్ట్' అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. సిద్దీఖీ హత్యకు నిందితులు వరుసగా 10 సార్లు ప్రయత్నించి, అక్టోబరు 12న కాల్చి చంపినట్లు దర్యాప్తు బృందంలోని అధికారి వెల్లడించారు. అలాగే సల్మాన్‌ఖాన్ హత్యకు కుట్ర పన్నిన బిష్ణోయ్ ముఠాకు చెందిన సభ్యుడు సుఖ్బీర్ బల్బీర్ సింగ్‌ను హరియాణాలోని పానీపత్‌లో అరెస్టు చేసినట్లు నవీ ముంబయి పోలీసులు గురువారం వెల్లడించారు.

పది లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది విద్యా రుణాల రద్దు

- అమెరికా అధ్యక్షుడు బైడెన్ నిర్ణయం



వాషింగ్టన్: అమెరికాలోని ప్రభుత్వ ఉద్యోగుల విద్యా రుణాలను రద్దు చేస్తూ అధ్యక్షుడు బైడెన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల 10 లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. ఉపాధ్యాయులు, అగ్ని మాపక సిబ్బంది, నర్సుల, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు వారి విద్యా రుణాలను రద్దు చేస్తున్నామని గురువారం బైడెన్ ప్రకటించారు. 10ఏళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగిన వారికి ఈ రుణ రద్దు పథకం వర్తించనుంది.

ప్రభుత్వ ఉద్యోగుల విద్యా రుణాల రద్దు కార్యక్రమం అమెరికాలో 2007లో ప్రారంభమైంది. వారు చదువుకునేప్పుడు తీసుకున్న విద్యా రుణాలు ఉద్యోగంలో చేరిన పదేళ్ల తర్వాత రద్దవుతాయి. అయితే 2017లో కొన్ని నిబంధనల కారణంగా 99శాతం మంది దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో కేవలం 7,000 మందికే గతంలో రద్దయ్యాయి. రిపబ్లికన్ పార్టీ అనుసరించిన విధానాలవల్లే రుణాలు రద్దు కాలేదు. దీంతో అధ్యక్షుడు బైడెన్ 2022 నుంచి ఈ రుణాల రద్దుపై దృష్టి సారించారు. తాజాగా ఏకమొత్తంగా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో 74 బిలియన్ డాలర్ల రుణాలు రద్దయ్యాయి. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి దాకా 50 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు 175 బిలియన్ డాలర్ల రుణాలను రద్దు చేసినట్లు విద్యాశాఖ మంత్రి మిగెల్ కార్డోనా తెలిపారు. 20,000 డాలర్ల వరకూ ఉన్న 4 కోట్ల మంది అమెరికన్ల విద్యా రుణాలను రద్దు చేయాలని బైడెన్ సర్కారు గతంలో భావించింది. అయితే గత ఏడాది సుప్రీంకోర్టు ఈ నిర్ణయాన్ని నిలిపేసింది. దీంతో ప్రత్యామ్నాయ న్యాయ అంశాలను పరిశీలించాలని విద్యాశాఖను బైడెన్ ఆదేశించారు.

ట్రంప్ కంటే హారిస్ గెలిస్తేనే మంచిది: చైనా

బీజింగ్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ కంటే కమలా హారిస్ గెలిస్తేనే మంచిదని కోరుకుంటున్నామని చైనా జాతీయ సలహా విభాగం సీనియర్ సభ్యుడు జియా క్వింగ్ స్పష్టం చేశారు. గతంలో ట్రంప్ హయాంలో అమెరికా, చైనా సంబంధాలు దెబ్బతిన్నాయని అభిప్రాయపడ్డారు. అమెరికా ఎన్నికలపై వ్యాఖ్యానించే ఉద్దేశం తమకు లేదని గురువారం ఆయన పేర్కొన్నారు. హారిస్, ట్రంప్‌లపై చైనా ప్రజల్లో భిన్నాభిప్రాయాలున్నాయని, అయితే తాము హారిస్ గెలవాలనే కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. బైడెన్‌తోనూ సమస్యలున్నాయని, అయితే ట్రంప్ అంత కాదని పేర్కొన్నారు.

వలస సమస్యల పరిష్కార బిల్లుపైనే తొలి సంతకం

కమలా హారిస్ స్పష్టీకరణ



వాషింగ్టన్: అధ్యక్షురాలిగా ఎన్నికైతే వలసల వ్యవస్థను సరి చేసే బిల్లుపైనే తొలి సంతకం చేస్తానని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ పేర్కొన్నారు. 'అమెరికాలో వలసల సమస్య ప్రధానమైంది. దీనిపై మేం దృష్టి సారించాం. అధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన గంటల్లోనే ఈ వలసల వ్యవస్థను సరి చేసే బిల్లుపై సంతకం చేస్తా. ఈ బిల్లులో వలసల సమస్య పరిష్కారానికి వనరులను పెంచడం, ఎక్కువ మంది న్యాయమూర్తులను నియమించడం వంటి అంశాలుంటాయి. సరిహద్దుల బలోపేతానికి కాంగ్రెస్‌లోని సంప్రదాయ సభ్యులతో సహా ద్వైపాక్షిక ప్రయత్నానికి మద్దతుగా 1,500 మంది బోర్డర్ ఏజెంట్లను నియమిస్తాం. ఇది అక్రమ వలసలను నియంత్రించడంతోపాటు, సరిహద్దుల వెంట దేశంలోకి వస్తున్న మాదక ద్రవ్యాలను నిరోధించేందుకు ఉపయోగపడుతుంది. మరో 20 రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో ఈ సమస్యను పరిష్కరించగలిగే అధ్యక్షుడు ఎవరనేది ప్రజలు నిర్ణయిస్తారు' అని హారిస్ పేర్కొన్నారు. ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.



వాల్మీకి ఆలయంలో ఖర్గే, రాహుల్ ప్రార్థనలు

దిల్లీ: మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం దిల్లీలోని మందిర్ మార్గ్‌లోని వాల్మీకి ఆలయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలు వేర్వేరు సమయాల్లో ప్రార్థనలు చేశారు. "ఆర్థిక, విద్యా రంగాల్లో దేశవ్యాప్తంగా వాల్మీకి సామాజిక వర్గం అత్యంత బలహీనంగా ఉంది. ఈ సామాజిక వర్గాన్ని పైకి తీసుకురావాలంటే.. వారి విద్యపై మనమంతా దృష్టి పెట్టడం అత్యంత ముఖ్యం" అని ఖర్గే పేర్కొన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా దిల్లీలోని ఆయన ఆలయాన్ని సందర్శించినట్లు తెలుపుతూ రాహుల్‌గాంధీ ఫేస్‌బుక్‌లో హిందీలో ఓ పోస్టు పెట్టారు. ఈ ఆలయంలో మహాత్మా గాంధీ చాలా సమయం గడిపారని, తానూ బాపూ నివాస్‌లో కొద్దిసేపు ఉండి స్ఫూర్తి పొందానని వెల్లడించారు. వాల్మీకి ఆలయంలో పూజలు చేస్తున్న చిత్రాలనూ పంచుకున్నారు. అనంతరం 10 జన్‌పథ్‌లో వాల్మీకి సామాజికవర్గ ప్రతినిధులతో రాహుల్ సమావేశమయ్యారు.

జేఎంఎం మిత్రపక్షంగానే ఝార్ఖండ్‌లో కాంగ్రెస్ పోటీ

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మిర్ వెల్లడి

రాంచీ: ఝార్ఖండ్ శాసనసభ ఎన్నికల్లో ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) మిత్రపక్షంగానే కాంగ్రెస్ పార్టీ పోటీచేస్తుందని, రెండు పార్టీల మధ్య సీట్ల పంపకాల విషయమై త్వరలోనే తుది నిర్ణయం వెలువడనుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మిర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఝార్ఖండ్ వ్యవహారాల బాధ్యుడిగా వ్యవహరిస్తున్న ఆయన గురువారం రాంచీలో విలేకరులతో మాట్లాడారు. "2019లో మాదిరిగానే రాష్ట్రంలో మేం మా భాగస్వామ్య పార్టీతో కలిసి పోటీచేస్తాం. సీట్ల పంపకాలపై చర్చలు దాదాపు కొలిక్కి వచ్చాయి. తుదినిర్ణయం త్వరలో వెలువడుతుంది. అక్టోబరు 19 తర్వాత, ప్రత్యేకంగా రాహుల్ రాష్ట్రంలో పర్యటించిన అనంతరం కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేస్తాం'' అని చెప్పారు. ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు సహా వివిధ సామాజిక, ఇతర సంఘాలతో రాహుల్ ఈ నెల 19న సమావేశం కానున్నారని వెల్లడించారు. జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ సర్కారు చేపట్టిన అభివృద్ధి పనుల అండతో మరోమారు రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని గులాం అహ్మద్ మిర్ ధీమా వ్యక్తం చేశారు.

శబరిమల ప్రధాన పూజారిగా అరుణ్‌కుమార్

తిరువనంతపురం: కేరళలోని ప్రఖ్యాత శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయ ప్రధాన పూజారి (మెల్‌సంథి)గా గురువారం అరుణ్ కుమార్ నంబూద్రి ఎంపికయ్యారు. అయ్యప్ప ఆలయానికి 100 మీటర్ల దూరంలో కొలువైన మాలికాపురం ఆలయ ప్రధాన పూజారిగా కొజికోడ్‌కు చెందిన వాసుదేవన్ నంబూద్రి నియమితులయ్యారు. శబరిమల ఆలయంలో ఉషాపూజ అనంతరం నిర్వహించిన సంప్రదాయ డ్రా విధానంలో పూజారుల ఎంపిక జరిగింది. శబరిమల ఆలయానికి 25 మంది, మాలికాపురం కోవెలకు 15 మంది పూజారులతో కూడిన ప్రాథమిక జాబితా నుంచి ఈ ప్రధాన పూజారులను ఎంపిక చేస్తుంటారు.

మహిళా ఐపీఎస్‌పై సీబీఐ ఫోర్జరీ కేసు

ముంబయి: మహారాష్ట్రలోని ఓ మహిళా ఐపీఎస్ అధికారిపై సీబీఐ ఫోర్జరీ కేసు నమోదు చేసింది. రూ.1,200 కోట్ల కుంభకోణానికి సంబంధించిన దర్యాప్తు వ్యవహారంలో ఆమె ఫోర్జరీ, నేరపూరిత కుట్రకు పాల్పడటమే అందుకు కారణంగా తెలుస్తోంది. ఈ విషయాన్ని సీబీఐ తాజాగా వెల్లడించింది. జల్గావ్ జిల్లాలోని భైచంద్ హీరాచంద్ రైసోనీ క్రెడిట్ సొసైటీ.. ఫిక్స్‌డ్ డిపాజిట్ల పేరుతో అనేక మందిని మోసం చేసింది. రూ.1,200 కోట్లకుపైగా కుంభకోణానికి పాల్పడింది. ఇది 2015లో వెలుగులోకి వచ్చింది. ఈ కేసు 2020లో సీబీఐకి బదిలీ అయింది.

బహ్రాయిచ్ అల్లర్ల కేసులో అయిదుగురి అరెస్ట్

- పోలీసు కాల్పుల్లో ఇద్దరికి గాయాలు



కాల్పుల్లో గాయపడిన నిందితుల తరలింపు

బహ్రాయిచ్ (యూపీ): ఉత్తర్‌ప్రదేశ్‌లోని బహ్రాయిచ్‌లో గత ఆదివారం జరిగిన యువకుడి (22) హత్య దరిమిలా చెలరేగిన అల్లర్లకు సంబంధించిన కేసులో అయిదుగురు అనుమానితులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు బహ్రాయిచ్ జిల్లా సరిహద్దు దాటి నేపాల్‌లోకి వెళ్లే ప్రయత్నంలో ఉండగా పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు గాయపడినట్లు అదనపు డీజీపీ అమితాబ్ యశ్ తెలిపారు. బహ్రాయిచ్‌లో జరిగిన హత్య, అల్లర్లతో నేపాల్‌లో ఉన్న ఒక నిందితుడికి సంబంధం ఉన్నట్లు పోలీసులు ఇప్పటికే నిర్ధారించినట్లు వెల్లడించారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నాలుగు రోజుల అనంతరం బహ్రాయిచ్ జిల్లాలో ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించిన పోలీసులు వదంతులు వ్యాప్తి చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ప్రజల దృష్టి మళ్లించేందుకే ఎదురుకాల్పుల ఘటన అని సమాజ్‌వాదీ పార్టీ మీడియా సెల్ 'ఎక్స్' ద్వారా విమర్శించింది.



అస్సాంలో పట్టాలు తప్పిన రైలు

అగర్తల-ముంబయి లోక్‌మాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ గురువారం తెల్లవారుజామున అస్సాంలోని దిబలాంగ్ స్టేషన్ వద్ద పట్టాలు తప్పింది. ఇంజిన్ సహా 8 పెట్టెలు ప్రమాదానికి గురికాగా అదృష్టవశాత్తూ ప్రాణనష్టం వాటిల్లలేదు.

ఉత్తరాఖండ్ గ్రామంలో రాత్రి బస చేసిన సీఈసీ

దిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు విచిత్ర అనుభవం ఎదురైంది. ఉత్తరాఖండ్‌లోని ఓ మారుమూల గ్రామం రాలంలో చుట్టుపక్కల ఎక్కడా జనావాసాలు లేని ఓ గృహంలో బుధవారం రాత్రి ఆయన గడపాల్సి వచ్చింది. ఈ సందర్భంగా ఇద్దరు పైలట్లు, మరో ఇద్దరు ఎన్నికల అధికారులు కూడా ఆయనకు జత కలిశారు.

సీఈసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో బుధవారం అత్యవసరంగా ఆ గ్రామంలో దించడంతో ఈ పరిస్థితి ఎదురైంది. పితోరాగఢ్ దాని చుట్టుపక్కల 14 గ్రామాల్లోని మారుమూల పోలింగ్ కేంద్రాల పరిశీలనకు సీఈసీ బయలుదేరిన సందర్భంగా వాతావరణం అనుకూలించలేదు. ఈ క్రమంలో గురువారం ఉదయం వాతావరణం చక్కబడటంతో సీఈసీతో అంతా ఆ గ్రామ సమీపంలోని మున్స్యారీ తహశీల్‌కు చేరుకున్నారు.

జమ్మూకశ్మీర్ రాష్ట్రహోదా పునరుద్ధరణపై పిటిషన్

పరిశీలిస్తామన్న సీజేఐ

దిల్లీ: నిర్ణీత వ్యవధిలో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారణ జాబితాలోకి చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ పిటిషన్‌ను జమ్మూకశ్మీర్‌కు చెందిన విద్యావేత్త జహూర్ అహ్మద్ భట్, సామాజిక, రాజకీయ కార్యకర్త అహ్మద్ మాలిక్ దాఖలు చేశారు. గతేడాది డిసెంబరు 11న అధికరణం 370 రద్దు సమంజసమేనంటూ తీర్పు ఇచ్చిన సర్వోన్నత న్యాయస్థానం.. జమ్మూకశ్మీర్ రాష్ట్రహోదాను త్వరగా పునరుద్ధరించాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో దాఖలైన ఈ పిటిషన్ పరిశీలిస్తానని గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తెలిపారు.

వరద ముప్పు... సొరంగంతో తప్పింది!

జపాన్... ప్రపంచంలోనే ప్రకృతి విపత్తులకు అత్యధికంగా గురయ్యే దేశం. ముఖ్యంగా దాని రాజధాని టోక్యో మరింత సున్నిత నగరం. దీని మీదుగా చిన్నా, పెద్దవి కలిపి ఏకంగా 100 నదులు ప్రవహిస్తాయి. మారిన వాతావరణ పరిస్థితులు, ఏటేటా పెరుగుతున్న వర్షపాతంతో ఆయా నదులు ఇళ్లను ముంచెత్తేవి. ఈ ముప్పు నుంచి ప్రజలను రక్షించేందుకు అక్కడి ప్రభుత్వం 18ఏళ్ల కిందట టోక్యో ఉత్తర భాగంలోని జాతీయ రహదారి కింద భారీ సొరంగాన్ని నిర్మించింది. దీనికి వరద కాలువలను అనుసంధానం చేసింది. అప్పట్నుంచి నగరాన్ని ఆ సొరంగం రక్షిస్తోంది. ఏకంగా 90% వరద నష్టం తగ్గింది. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు టోక్యో వెళ్లి టన్నెల్‌ను పరిశీలించి వచ్చారు.

- టోక్యోలో 6.3 కి.మీ. భూగర్భ టన్నెల్
- 50 మీటర్ల లోతులో నిర్మాణం
- జపాన్ రాజధానికి 90% తగ్గిన వరద సమస్య
- పరిశీలించిన జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు



టోక్యోలో జాతీయ రహదారి కింద నిర్మించిన భారీ సొరంగం

హైదరాబాద్ మహానగరంలో చేపట్టాల్సిన వరద నియంత్రణ చర్యలకు నిధులు ఇవ్వాలంటూ గతంలో జపాన్ అంతర్జాతీయ సహకార బ్యాంకు(జైకా)ను జీహెచ్‌ఎంసీ ఆశ్రయించింది. దీంతో ఏడాది కిందట జపాన్ ప్రతినిధులు హైదరాబాద్‌కు వచ్చి నగరాన్ని పరిశీలించారు. వారి సూచనతో ఇటీవల జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు జపాన్ రాజధాని టోక్యోకు వెళ్లారు. వరద ముప్పును పక్కాగా అడ్డుకుంటున్న భారీ సొరంగాన్ని చూశారు. ఆ స్థాయి నిర్మాణాలు హైదరాబాద్‌కు అవసరం లేదని, సాంకేతికత, ఆలోచన, వాటి స్ఫూర్తిని అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు.

ఇళ్లను ముంచెత్తకుండా ఏర్పాట్లు

జనావాసాలను వరద ముంచెత్తకుండా జపాన్ ఇంజినీర్లు నాలాలను సొరంగానికి అనుసంధానం చేశారు. వరద ఎంత ఉద్ధృతంగా వచ్చినా సొరంగంలోకి వెళ్లాక నిదానంగా ప్రవహించాల్సిందే. సొరంగం లోపల ఉన్న పిల్లర్లు వాటి వేగాన్ని నియంత్రిస్తాయి. ఒక్కో పిల్లరు బరువు 500 టన్నులకుపైగా ఉంటుంది. ఈ వరదంతా చివరన ఉండే 'ఆదొగవ' అనే నదిలో కలుస్తుంది. ఈ సొరంగం నిర్మాణానికి అప్పట్లో రూ. 1.7 బిలియన్ల డాలర్లు... అంటే రూ.14,285 కోట్లు ఖర్చు అయిందని, వరద నష్టాన్ని తగ్గించడం ద్వారా గత 18 ఏళ్లలో తమకు 150 బిలియన్ డాలర్లకుపైగా అంటే సుమారు రూ.1.26 లక్షల కోట్లకుపైగా ఆదా అయినట్లు అక్కడి అధికారులు వివరించారు. పైగా ఈ టన్నెల్‌ను చూసేందుకు ఏటా 50 వేల మంది పర్యాటకులు వస్తున్నట్లు తెలిపారు.



వరద పెరిగితే టన్నెల్ నుంచి ఎత్తిపోయడానికి ఏర్పాటు చేసిన మోటార్లు

టోక్యో ప్రాజెక్టు స్వరూపం

- ✦ సొరంగం పొడవు: 6.3 కి.మీ.
- ✦ లోతు: భూమికి 50 మీటర్ల కింద
- ✦ వెడల్పు: 10 మీటర్లు
- ✦ ఎత్తు: 18 మీటర్లు
- ✦ ఖర్చు: రూ.14,285 కోట్లు (1.7 బిలియన్ డాలర్లు)
- ✦ పనులు పూర్తయిన ఏడాది: 2006

- ఈనాడు, హైదరాబాద్

ఇక్కడ భారీ భూగర్భ జలాశయాలు నిర్మిస్తాం

వరదను మళ్లించడానికి రోడ్ల కింద సొరంగాలను తవ్వితే... భవిష్యత్తులో వాహనాల కోసం అండర్ పాస్‌లు, ఇతరత్రా పనులు చేపట్టడం కష్టమవుతుందని జపాన్ ఇంజినీర్లు ముందే ఆలోచించారు. దానికి పరిష్కారంగా భూమికి 50 మీటర్ల లోతున సొరంగాన్ని నిర్మించారు. అవి కూడా నిండిపోతే భారీ మోటార్లతో నీటిని సముద్రంలోకి ఎత్తిపోసే వ్యవస్థను కూడా ఏర్పాటు చేశారు. ఈ తరహా నిర్మాణాలను ఇటీవల హైదరాబాద్‌లోనూ చేపట్టాం. రోడ్లపై నిలిచే వరదను దారి మళ్లించేందుకు 5 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేయగల భూగర్భ జలాశయాలను కడుతున్నాం. టోక్యోలోని కట్టడాలను చూశాక... మనవద్ద మరింత పెద్ద ట్యాంకులను నిర్మించవచ్చనే ఆలోచన వచ్చింది.

– కోటేశ్వరరావు, చీఫ్ ఇంజినీరు, జీహెచ్‌ఎంసీ

సుందరీకరణ కాదు.. పునరుజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)

అంతకుముందు మూసీ పునరుజ్జీవంపై డీపీఆర్ రూపొందించడానికి ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలకు సంబంధించిన ప్రజంటేషన్ చూపించారు. కంపెనీలు కూడా ప్రజంటేషన్ ఇచ్చాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. "ప్రజలు పేదరికంలోనే మగ్గాలని కోరుకునేవారు ఎప్పుడూ ఉంటారు. అధికారం కోల్పోయిన నిస్పృహతో కొందరు ఏదేదో మాట్లాడుతున్నారు. 'హైడ్రా' పేరు చెప్పి ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారు. హైడ్రా ఏమైనా భూతమా? మూసీ పరీవాహకంలో ఇప్పటివరకూ ఒక్క ఇటుక పెళ్లను కూడా ప్రభుత్వం కూల్చలేదు. హైడ్రా అటువైపు కన్నెత్తి చూడలేదు. అనవసరంగా కోర్టుకెళ్తే.. అసలు పేదలు ఆర్థికంగా మరింత నష్టపోతారు.

ఆరున్నర ఏళ్లలో పూర్తి చేయాలన్న లక్ష్యం

ప్రపంచంలో అద్భుతమైన కట్టడాలు నిర్మించిన ఐదు సంస్థలు.. మూసీ నది పునరుజ్జీవానికి ఏం చేయాలనే సమగ్ర ప్రాజెక్టు రిపోర్ట్(డీపీఆర్)ను 18 నెలల్లో అందజేస్తాయి. ప్రాజెక్టుకు అవసరమయ్యే నిధుల అంచనా, సేకరణ ప్రణాళికలను రూపొందిస్తాయి. ఆరున్నర సంవత్సరాల్లో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు మూసీ నదికి సంబంధించి డీపీఆర్ సమర్పించేందుకు జరిగిన ఒప్పందం విలువ రూ.141 కోట్లు మాత్రమే. మరి రూ. 1.50 లక్షల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? మీలా రూ.లక్ష కోట్లు దిగమింగడానికి ఇదేమైనా కాళేశ్వరమా? హైదరాబాద్‌లోని అద్భుతమైన చారిత్రక కట్టడాలను కాలగర్భంలో కలిపేయాలని కొందరు కంకణం కట్టుకు తిరుగుతున్నారు. వారు ఏ సంస్థల గురించైతే చిల్లరమల్లర వ్యాఖ్యలు చేస్తున్నారో.. అవే కంపెనీలు గుజరాత్‌లో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్ని, హైదరాబాద్‌లో సమతామూర్తి రామానుజాచార్యుల విగ్రహాన్ని నిర్మించాయి. అప్పుడు లేని అభ్యంతరం మూసీ అభివృద్ధి విషయంలోనే ఎందుకు? వాళ్లు చేస్తే గొప్ప.. మేం చేస్తే తప్పా? 'ఈ నగరం ఏమైపోతే మాకేంటి? మా రాజకీయాలు మాకు ముఖ్యం' అని అనుకుంటే.. మేము చూస్తూ ఊరుకోవాలా?



మూసీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని మంత్రులకు ఆదేశాలిచ్చా. అఖిలపక్ష సమావేశాన్ని కూడా నిర్వహించాలని సూచించా. అందరి అభిప్రాయాలను, సలహాలు, సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. మూసీ పరీవాహకంలో ఇళ్లు ఉన్నవారికి ఎలా మేలు చేయొచ్చో సలహాలు ఇవ్వాలని కోరుతున్నాం.

హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడం విపక్షాలకు ఇష్టం లేదా? చెరువులు, కుంటలు, నాలాల్లాగా మూసీ కూడా కాలగర్భంలో సమాధి కావాలా? ఉప్పెనలా వరదలొస్తే నగరమే మిగలదు. బెంగళూరు, చెన్నై, ముంబయి వంటి నగరాల్లో ఏం జరుగుతోందో చూడడం లేదా? మూసీలో కొంత భాగాన్ని మేమేమైనా తీసుకుపోతామా? ఇదేమైనా గజ్వేల్ ఫాంహౌసా? లేదా ధరణి లాంటి మాయాజాలమా? మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో నా స్వార్థం లేదు. ఆదాయాన్ని పెంచి పేదలకు పంచడమే మా ప్రభుత్వ ఆలోచన.

మూసీ పరీవాహక ప్రజలను ఆదుకోవాలనే..

కాంగ్రెస్ దార్శనికత వల్లే దేశానికి ప్రపంచంతో పోటీపడే శక్తి లభించింది. ఆనాడు నెహ్రూ, రాజీవ్, పీవీలు ప్రవేశపెట్టిన పాలసీలను కొందరు వ్యతిరేకించారు. కానీ, ఆ విధానాలే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాయి. తెలంగాణ ప్రజల భవిష్యత్‌ను, రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే కార్యాచరణను ప్రభుత్వం తీసుకుంది. 33 బృందాలు మూసీ పరీవాహక ప్రాంతంలో ప్రతి ఇంటికి వెళ్లి.. పేదల సమస్యలను తెలుసుకున్నాయి. విధిలేని పరిస్థితుల్లో.. దుర్గంధంలో దుర్భర జీవితాలను గడుపుతున్న పేదలను ఎలా ఆదుకోవాలనేది ప్రభుత్వం ఆలోచన. ప్రపంచంతో పోటీపడే నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం. యువతకు ఉపాధి కల్పించాలనేది సంకల్పం.

మీలా మేము చేయడం లేదు

మధ్యలో నదీ ప్రవాహం ఉన్న నగరం దేశంలో ఎక్కడా లేదు. మూసీ గర్భంలో 1,600 ఇళ్లున్నాయి. అధికారులు ఇంటింటికీ వెళ్లి సమాచారం సేకరించారు. దసరా నేపథ్యంలో 200కి పైగా కుటుంబాలకు రెండు పడకగదుల ఇళ్లు, ఖర్చులకు రూ.25 వేల డబ్బులిచ్చి తరలించాం. బఫర్ జోన్‌లో ఉన్న 10 వేల కుటుంబాలకూ పునరావాసం కల్పిస్తాం. భారాస హయాంలో నిర్వాసితులకు ఏం చేశారు? ఎలా చేశారనేది అక్కడి ప్రజలను అడుగుదాం. కొండపోచమ్మ ప్రాజెక్టులో మునిగిన 14 గ్రామాల్లో ఏ ఒక్కరికైనా ఇళ్లు ఇచ్చారా? మిడ్ మానేరు ముంపు బాధితులకు ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేసింది మీరు. ఈ విషయంపై ఎక్కడికైనా నేను సెక్యూరిటీ లేకుండా వస్తా. కేసీఆర్.. మీ నియోజకవర్గానికీ వస్తా. మీరూ రండి. రచ్చబండ నిర్వహిద్దాం. కూర్చుని చర్చిద్దాం.

ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెడదాం

మూసీ పరీవాహక ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నది పునరుజ్జీవంపై చర్చకు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు పెడదాం. వారిని ఎలా ఆదుకోవాలో సూచనలు ఇవ్వండి. ఈ విషయంలో ముందుకు రావాలని కేసీఆర్, కేటీఆర్, కిషన్‌రెడ్డి, ఈటలకు విజ్ఞప్తి చేస్తున్నా. అవసరమైతే న్యాయ నిపుణుల సలహా తీసుకుని.. ఎంపీల అభిప్రాయాలను అసెంబ్లీ రికార్డుల్లోకి తీసుకుందాం. ఎంఐఎం, భాజపా, భారాస, కమ్యూనిస్టు పార్టీల అధ్యక్షులకు కూడా ఇదే విజ్ఞప్తి చేస్తున్నా. మూసీ పునరుజ్జీవంపై ఎలాంటి అనుమానాలున్నా నాకు ప్రశ్నల రూపంలో పంపించండి. ప్రభుత్వం మీకు రాతపూర్వక వివరణ ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. ఈ శనివారంలోగా దీనికి సంబంధించిన కార్యాచరణ ఇవ్వాలని కోరుతున్నా. త్వరలో కొందరు మీడియా సంపాదకులతోనూ సమావేశం నిర్వహిస్తా. దీనిపై క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేస్తాం. పర్యావరణవేత్తలతోనూ సమావేశమవుతాం.

హైదరాబాద్ వరద సాయంలో అవినీతిపై విచారణ జరిపించాలా?


నేవీ రాడర్ కేంద్రం ఏర్పాటుకు అనుమతులన్నీ భారాస ప్రభుత్వ హయాంలో 2017లోపే ఇచ్చారు. ఇప్పుడేమో గగ్గోలు పెడుతున్నారు. దేశభద్రతకు సంబంధించిన ఈ ప్రాజెక్టును అడ్డుకునేవారు కసబ్‌తో సమానం. హైదరాబాద్‌లో వరదలొచ్చినప్పుడు.. బాధితులను ఆదుకోవడానికి ఇంటికి రూ.10 వేల చొప్పున సాయంగా భారాస ప్రభుత్వం ప్రకటించింది. అందులో గ్రౌండ్ ఫ్లోర్‌లో నీట మునిగినవారికి ఇవ్వకుండా.. మూడో అంతస్తులో ఉన్న తమ పార్టీ కార్యకర్తలకు ఇచ్చారు. ఇందులో ఎంత మోసం జరిగిందో ఏసీబీతో విచారణ జరిపించాలా? మూసీ పునరుజ్జీవానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఆర్థిక సాయం కోరుతాం. ఇస్తే సరే. ఇవ్వకపోయినా ముందుకెళ్తాం. మూసీ పునరుజ్జీవం అనంతరం పరీవాహకంలో బహుళ అంతస్తులు ఎలా నిర్మిస్తారని కొందరు అవగాహన లేమితో ప్రశ్నిస్తున్నారు. నదీ గర్భంలో.. నదీ ఒడ్డున నిర్మించం. పరీవాహకంలో ఖాళీ ప్రదేశాలున్న చోట నిర్మిస్తారు. ఉదాహరణకు ఉస్మానియా ఆసుపత్రి, హైకోర్టు లాంటి చోట్ల అభివృద్ధి చేస్తారు. మరోసారి చెబుతున్నా.. మూసీ నిర్వాసితులకు, నివాసితులకు.. ఎవరికీ ప్రభుత్వం నష్టం కలిగించదు. అన్ని రకాలుగా పునరావాసం కల్పిస్తాం" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

మూసీ ఆక్రమణ ప్రమాదకరం..

మూసీ విషం హైదరాబాద్ నగరాన్నే కాదు.. నల్గొండనూ విషతుల్యం చేస్తోంది. మనుషులు జీవించడానికి అనువైన ప్రాంతం కాదని నల్గొండ గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ఇవ్వలేదా? ఏవిధంగానైనా మూసీ పరీవాహకాన్ని పునరుజ్జీవింపజేయడం నేరమెలా అవుతుంది? మూసీ సుందరీకరణ అంటే మేము అందాల భామలతో కలిసి పనిచేయడం లేదు. ఒక తెలంగాణ కవి తన నలుగురు కూతుళ్లకు గంగ, యమున, సరస్వతి, కృష్ణవేణి అని పేర్లు పెట్టుకున్నారు. మూసీ నది పేరు పెట్టుకోకపోవడానికి గత పాలకుల ద్రోహం కారణం కాదా? దాన్ని ఇలాగే కొనసాగిద్దామా? దేశద్రోహం కంటే ఇది పెద్ద నేరం. హిరోషిమా, నాగసాకీల్లో జరిగిన విధ్వంసం కంటే.. మూసీ ఆక్రమణ ప్రమాదకరం. అందులో మమ్మల్ని కూడా నేరగాళ్లుగా మారుద్దామనుకుంటున్నారా?

వరదతో అంధకారం.. ఆపన్నహస్తాలే సహకారం

కష్టమే పెట్టుబడిగా జీవన పోరాటం చేస్తున్న నిరుపేదలు అపురూపంగా దాచుకున్న సామగ్రి అంతా కళ్లముందే వరదపాలయ్యింది. అర్ధాకలితో గడుపుతున్న కుటుంబాల ఆశలన్నీ ఆవిరయ్యాయి. వస్తువులన్నీ బురదమయమై, ఆవాసాలు ధ్వంసమై వారు దిక్కుతోచని స్థితికి చేరారు. ఆ నిర్భాగ్యులను ఆదుకునేందుకు మేమున్నామంటూ దాతలు ముందుకొస్తున్నారు. విరాళాలను అందించి తోడుగా నిలుస్తున్నారు.



రత్నం విట్టోబాయి
విశాఖపట్నం
విరాళం:
రూ.1,00,000

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
స్వగృహ మోతీ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్, మోతీనగర్, హైదరాబాద్	45,000
శ్రీ విద్యానికేతన్ (ఇంగ్లిష్ మీడియం) హైస్కూల్, చిన్న కాపవరం, పశ్చిమగోదావరి జిల్లా	25,000
పూల ఫణిగోపాల్ (కీ.శే.పూల సరస్వతమ్మ గారి జ్ఞాపకార్థం), విశాఖపట్నం	11,000
సోంపాళ్యం కళాధర్ నాయుడు (టీసీఎస్, బెంగళూరు), చౌడసముద్రం, అన్నమయ్య జిల్లా	10,000
అనసూయ, నిడదవోలు, పశ్చిమగోదావరి జిల్లా	10,000
దోనేపూడి లక్ష్మీ ఈశ్వరమ్మ, హైదరాబాద్	10,000
కోదాటి శేషగిరిరావు, హైదరాబాద్	5,000
పెందుర్తి రాజారావు, హైదరాబాద్	5,000
వీరమాచినేని జవహర్‌లాల్, హైదరాబాద్	5,000
దాసరి వెంకటరమణ, హైదరాబాద్	5,000
బొబ్బా రామమోహనరావు, హైదరాబాద్	5,000
బొబ్బా నాగభూషణం, హైదరాబాద్	5,000
రాపర్ల వాసుబాబు, హైదరాబాద్	5,000
ఇంటూరి అమర్‌చంద్ర చౌదరి, హైదరాబాద్	5,000
గోగినేని కిశోర్‌కుమార్, హైదరాబాద్	5,000
కొత్తపల్లి తిరుమల వేణుమాధవ్, హైదరాబాద్	5,000
అడబాల శ్రీమన్నారాయణమూర్తి (కీ.శే.అడబాల సత్యనారాయణమూర్తి గారి జ్ఞాపకార్థం), అమలాపురం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా	5,000
ఎం.రామమూర్తి, విశాఖపట్నం	5,000
డా.వంకాయల కామేశ్వరరావు, విశాఖపట్నం	5,000

వణికించిన జల విలయం.. కదలివస్తోంది జన హృదయం

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు

ఈనాడు రిలీఫ్ ఫండ్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

1690 వైద్య పోస్టులకు వచ్చే నెలలో నోటిఫికేషన్!

ఈనాడు, హైదరాబాద్: వైద్య ఆరోగ్య శాఖలో మరో 1690 వైద్యుల పోస్టుల భర్తీకి ఆ శాఖ కసరత్తు చేస్తోంది. వైద్య విధానపరిషత్‌లో కీలకమైన జిల్లా, ఏరియా ఆసుపత్రుల్లో వైద్యుల కొరత నేపథ్యంలో ఆర్థికశాఖ అనుమతించిన 1690 పోస్టులకు నోటిఫికేషన్ జారీకి సిద్ధమవుతోంది. నవంబరులో నోటిఫికేషన్ ఇచ్చి మార్చి లేదా ఏప్రిల్ నాటికి పోస్టులు భర్తీ చేయాలని భావిస్తోంది. వీరు అందుబాటులోకి వచ్చేవరకూ కాంట్రాక్ట్ వైద్యుల నియామకానికి ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపింది.


- రాష్ట్రంలోని దంత వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటాలో మిగిలిన ఎండీఎస్ సీట్ల భర్తీకి చివరి విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం తెలిపింది. ఈ సీట్లకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలలోపు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలని ప్రకటించింది.



బాధితులుగా భావించొద్దు.. బాధ్యత తీసుకోండి

పరాజయాలకు ఇతరులను లేదా పరిస్థితులను కారణంగా చూపుతూ తమను తాము బాధితులుగా చిత్రీకరించుకోవడం వల్ల ఓటమి కన్నా ఎక్కువ నష్టం కలుగుతుంది. ఈ ధోరణి వల్ల ఇతరుల సానుభూతి దక్కుతుందేమో గానీ, మీ జీవితాన్ని చక్కదిద్దుకోకుండా అది మిమ్మల్ని అడ్డుకుంటుంది. అందుకే ఫలితాలతో సంబంధం లేకుండా బాధ్యత వహించడం నేర్చుకోవాలి. మీరు నియంత్రించదగ్గ విషయాలు, చేయదగ్గ మార్పులపై దృష్టి పెట్టాలి. అడ్డంకులను అవకాశాలుగా భావించేలా మీ దృక్పథాన్ని మార్చుకోండి.

– లూయిస్ హోవెస్, రచయిత



ఎన్డీయే సీఎంల సమావేశంలో ప్రధాని మోదీతో కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్, నడ్డా, యూపీ, ఏపీ, మహారాష్ట్ర సీఎంలు యోగి, చంద్రబాబు, ఏక్‌నాథ్ శిందే. వెనుక వరుసలో ఉపముఖ్యమంత్రులు విజయ్ సిన్హా, సామ్రాట్ చౌధరి, పవన్ కల్యాణ్, అజిత్ పవార్, దేవేంద్ర ఫడణవీస్ తదితరులు

దేశాభివృద్ధి, పేదల సాధికారతకు కట్టుబడి ఉన్నాం

- ఎన్డీయే సమావేశంలో ప్రధాని మోదీ వెల్లడి
- హాజరైన చంద్రబాబు, ఇతర నేతలు
- 6 తీర్మానాలకు ఏకగ్రీవ ఆమోదం

చండీగఢ్: దేశాభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడంతోపాటు పేదల సాధికారతకు ఎన్డీయే కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రజానుకూల విధానాల దిశగా సుపరిపాలనతో ముందుకు సాగే ప్రయత్నాలు జరగాలని ఆకాంక్షించారు. గురువారం చండీగఢ్‌లో జరిగిన ఎన్డీయే రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు చంద్రబాబు సహా 17 మంది ముఖ్యమంత్రులు, 18 మంది ఉప ముఖ్యమంత్రులు హాజరయ్యారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేపీ నడ్డా పాల్గొన్నారు. సదస్సులో 6 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సదస్సు అనంతరం వివరాలను మీడియాకు జేపీ నడ్డా వివరించారు. సుపరిపాలన గురించి మోదీ నొక్కిచెప్పారని తెలిపారు. 50 ఏళ్ల కిందట విధించిన ఎమర్జెన్సీ గురించి సదస్సులో అమిత్ షా తీర్మానం ప్రవేశపెట్టారని, అప్పటి దురాగతాలపై చర్చించామని వివరించారు. రాజ్యాంగ అమృత్ మహోత్సవాన్ని వచ్చే ఏడాది నిర్వహించే తీర్మానాన్ని రాజ్‌నాథ్ ప్రవేశపెట్టారని తెలిపారు. వచ్చే ఏడాది వాజ్‌పేయీ శత జయంతి, బిర్సా ముండా, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని నిర్వహించాలని నిర్ణయించామని వెల్లడించారు.

హైడ్రా పేరుతో వసూళ్ల దందా

- హామీలు అమలు చేయలేక ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం: ఈటల



ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: హైడ్రా పేరుతో సామాన్య ప్రజలను, స్థిరాస్తి వ్యాపారులను రాష్ట్ర ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తోందని, వసూళ్ల దందాకు పాల్పడుతోందని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఖమ్మంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ చెరువుల్లోని పట్టా భూముల్లో చాలామంది ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు, భవనాలు నిర్మించుకున్నారని తెలిపారు. వాటిని తొలగించాలంటే అక్కడి పట్టా భూములను ప్రభుత్వం సేకరించాలని, భూయజమానులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత నిర్ణయాలతో మూసీ తీరప్రాంత ప్రజలు బెంబేలెత్తుతున్నారని చెప్పారు. ఆరు గ్యారంటీల్లో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మాత్రమే ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. హామీలను అమలు చేయలేక ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటివరకు రూ.17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసినట్లు ప్రభుత్వమే చెబుతోందన్నారు. రైతులకు, కౌలు రైతులకు రైతుభరోసా పథకాన్ని ఎప్పటిలోగా అమలు చేస్తారని ప్రశ్నించారు. దొడ్డు వడ్లకు సైతం రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో మున్నేరు వరదలకు 10 వేలకుపైగా ఇళ్లు నష్టపోగా.. కొందరికి మాత్రమే రూ.16,500 చొప్పున ఇచ్చి చేతులు దులిపేసుకొన్నారని విమర్శించారు. బాధితులందరికీ పరిహారం ఇవ్వాలన్నారు. రైతులకు ఫసల్ బీమా అమలుకు కేంద్రం సిద్ధంగా ఉందని, రాష్ట్ర వాటా చెల్లించాలని సూచించారు.

తెలంగాణ ప్రజల గొంతుక... భారాస

- డీఎంకేలా మరో 70 ఏళ్ల పాటు బలంగా ఉండేలా తీర్చిదిద్దుతాం
- కేసీఆర్ నాయకత్వం, గులాబీ జెండాతోనే రాష్ట్రానికి రక్షణ
- బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్



ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని వర్గాలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఆయన పాలన అత్యంత అధ్వానంగా తయారైందని ధ్వజమెత్తారు. సాధారణంగా గుంపు మేస్త్రీ అంటే ఇళ్లు కట్టేవారని, ముఖ్యమంత్రి మాత్రం ఇళ్లు కూలగొడుతున్నారని అన్నారు. భారాస విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో గురువారం ఆ విభాగం ప్రతినిధుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. "భారాస అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు. తెలంగాణ ప్రజల గొంతుక. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష. కేసీఆర్ నాయకత్వం, గులాబీ జెండాతోనే తెలంగాణకు రక్షణ. భారాసను డీఎంకే మాదిరిగా మరో 70 ఏళ్ల పాటు బలంగా ఉండేలా తీర్చిదిద్దుతాం.

మరింత ప్రమాదకర పార్టీ భాజపా

ముఖ్యమంత్రి లోపభూయిష్ట విధానాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పరీక్షలు రాస్తామో రాయమోనన్న అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కాంగ్రెస్‌నే శత్రువుగా చూడాల్సిన అవసరం లేదు. తెలంగాణ సమాజానికి మరింత ప్రమాదకర పార్టీ భాజపా. మతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తోంది. తెలంగాణకు అది చేసిందేమీ లేదు. కేంద్ర ప్రభుత్వం మెడికల్, నర్సింగ్ కాలేజీలు కానీ చివరికి ఒక్క నవోదయ పాఠశాల కానీ ఇవ్వలేదు" అని కేటీఆర్ విమర్శించారు.

కేసులకు ఎవరూ భయపడొద్దు...

"అన్ని జిల్లాలలో బీఆర్ఎస్వీ సమావేశాలు జరగాలి. మండల, నియోజకవర్గ స్థాయిలో కమిటీలు వేస్తాం. సోషల్ మీడియాలో క్రియాశీలక పాత్ర పోషించాలి" అని విద్యార్థి ప్రతినిధులకు కేటీఆర్ సూచించారు. కేసులకు ఎవరూ భయపడొద్దని, లీగల్ సెల్‌ను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్వీ లేని కాలేజీ రాష్ట్రంలో ఎక్కడా ఉండొద్దని ఉద్బోధించారు. ముఖ్యమంత్రికి ఏమీ తెలియదని, భాక్రానంగల్ తెలంగాణలో ఉందని, విప్రో సీఈవో సత్య నాదెళ్ల అంటున్నారని ఎద్దేవా చేశారు. సీఎం 25సార్లు దిల్లీ వెళ్లి 25 పైసలు కూడా తేలేదన్నారు. అంబేడ్కర్‌ను అవమానించేలా ప్రభుత్వం రిజర్వేషన్లలో మోసం చేస్తోందని, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లలో విద్యార్థులకు అన్యాయం జరిగేలా వ్యవహరిస్తోందన్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు.

- మూసీ బాధితులు పలువురు గురువారం కేటీఆర్‌ను కలిశారు. తమకు న్యాయం చేయాలని, ఇళ్లను హైడ్రా కూల్చకుండా కాపాడాలని కోరారు. అండగా ఉంటామని కేటీఆర్ వారికి భరోసా ఇచ్చారు.

వైద్య సిబ్బంది భద్రతకు పెద్దపీట

- ఆసుపత్రుల్లో వసతుల కల్పన ● పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీలు
- స్థానిక పోలీస్ స్టేషన్లకు సీసీటీవీల ఫీడ్
- ఉద్యోగులకు గుర్తింపు కార్డులు, సందర్శకులకు విజిటర్ పాస్‌లు
- వైద్య, ఆరోగ్యశాఖ ఉత్తర్వులు



ఈనాడు, హైదరాబాద్: వైద్య కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది భద్రతకు పెద్దపీట వేస్తూ.. వారు సురక్షితమైన వాతావరణంలో విధులు నిర్వహించేలా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ పటిష్ఠమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. సిబ్బందిపై దాడులను అరికట్టడంతోపాటు, ఆసుపత్రుల ఆస్తులకు నష్టం కలగకుండా ప్రత్యేకచర్యలు చేపట్టనున్నారు. ఆసుపత్రుల వద్ద అవసరమైన వసతుల కల్పన, మరమ్మతులు వంటివి చేపడతారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కమిటీల ఏర్పాటుతో పాటు సదుపాయాల కల్పన తదితర అనేక అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తారు. ఇందులో భాగంగా ఆసుపత్రి భద్రత కమిటీ, ఆసుపత్రి వయొలెన్స్ ప్రివెన్షన్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీలకు ప్రత్యేక బాధ్యతలను అప్పగిస్తారు. ఆసుపత్రుల్లో భద్రత ఏర్పాట్లను అవి పర్యవేక్షిస్తాయి. కోల్‌కతా వైద్య కళాశాల ఘటన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలో అవసరమైన చర్యలు చేపట్టేందుకు గాను వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు ఉత్తర్వులు జారీచేశారు. కమిటీలు పని చేయడం ప్రారంభించాలని ఆదేశించారు. డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బందికి విధిగా గుర్తింపు కార్డులు అందజేయడం వంటి చర్యలను చేపట్టాలని స్పష్టం చేశారు. భద్రత చర్యలను పూర్తిస్థాయిలో సమీక్షించాలని.. డీఎంఈ, వైద్య విధానపరిషత్ కమిషనర్ వసతులు, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎంహెచ్‌వోలు, సూపరింటెండెంట్లు, జిల్లా కలెక్టర్లు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీల ఛైర్‌పర్సన్లు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. అలాగే ఆరోగ్య ఉపకేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లోనూ వసతులను సమీక్షించి అవసరమైన నిర్మాణాలు, మరమ్మతు పనులు చేపట్టాలని.. సీసీ టీవీలను ఏర్పాటుచేయాలని.. అందుబాటులో ఉన్న కేంద్ర ప్రభుత్వ నిధులు ఉపయోగించుకోవాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్, ప్రజారోగ్యశాఖ డైరెక్టర్‌లను ఆదేశించారు.

మూడు నెలలకోసారి సమావేశం..

మెడికల్ సూపరింటెండెంట్ ఛైర్మన్‌గా ఉండే కమిటీలో ఆర్‌ఎంవో కన్వీనర్‌గా ఉంటారు. పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, నర్సింగ్ సూపరింటెండెంట్, బయో మెడికల్ ఇంజినీర్ సహా డాక్టర్లు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బందితో కూడిన 8 మంది సభ్యులు ఉంటారు. కమిటీ 3 నెలలకోసారి ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ ఛైర్మన్‌తో సమావేశమై నివేదిక అందించాలి. కమిటీ లక్ష్యాలు, విధులివి..

- ✦ భద్రత ఆడిట్‌ను నిర్వహించడం. ఆసుపత్రి వెలుపల, లోపల మూడు షిఫ్టుల్లో తగినంత భద్రత సిబ్బంది ఉండేలా చర్యలు. ఆసుపత్రిలోకి ప్రవేశించే మార్గాల్లో బ్యారికేడింగ్ ఏర్పాటు.
- ✦ రోగుల సహాయకులు, బంధువులకు విజిటర్ పాస్ విధానం అమలు. ఎంట్రీ, ఎగ్జిట్‌లపై ప్రత్యేక పర్యవేక్షణ.. క్యూలు ఉండేలా చూడటం, బ్యాగుల తనిఖీ, బ్యాగేజీ డిపాజిట్, ఆసుపత్రి లోపలికి అభ్యంతరకరమైనవి తీసుకెళ్లకుండా నియంత్రించడం. అసాంఘిక శక్తులు ప్రవేశించకుండా చర్యలు.
- ✦ ఆసుపత్రి లోపల.. వెలుపలా తగినంత వెలుతురు ఉండేలా చూడటం. డాక్టర్లు, నర్సులు ఇతర సిబ్బందికి నిబంధనల మేరకు డ్యూటీ, రెస్ట్ రూంలు.. టాయిలెట్లు వేర్వేరుగా ఉండేలా ఏర్పాట్లు.
- ✦ పూర్తిస్థాయిలో సీసీ టీవీల ఏర్పాటు. అవి పనిచేసేలా చూడటం. భద్రత చర్యల కోసం స్థానిక పోలీసులతో సమన్వయం. సీసీ టీవీ లైవ్‌ఫీడ్‌ను స్థానిక పోలీసులకు అందుబాటులో ఉంచడం. నిర్దేశించిన సమయం వరకు ఫుటేజిని భద్రపరచడం.
- ✦ అత్యవసర పరిస్థితుల్లో ఫైర్‌సేఫ్టీ, ఇతర భద్రతా చర్యలు. ఎమర్జెన్సీ ఎవాక్యుయేషన్ డ్రిల్ నిర్వహించడం. మెడికల్, నర్సింగ్, ఇతర ఆరోగ్య సిబ్బందితో సమావేశాలు నిర్వహించి భద్రతపై సమీక్షించడం.

వయొలెన్స్ ప్రివెన్షన్ కమిటీ..

మెడికల్ సూపరింటెండెంట్ ఛైర్‌పర్సన్‌గా, సీనియర్ మెడికల్ ఆఫీసర్ కన్వీనర్‌గా ఉండే కమిటీలో ఆరుగురు సభ్యులుంటారు. లక్ష్యాలు, విధులివి..

- ✦ 24 గంటలూ పనిచేసేలా స్థానిక పోలీసులతో సమన్వయం. కంట్రోల్‌రూం ఏర్పాటు. చట్టంపై సంపూర్ణ అవగాహన కల్పించడం.
- ✦ పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు అవకాశం లేకుండా అవగాహన కల్పించడం. హింసకు సంబంధించి నమోదైన కేసుల సమీక్ష.
- ✦ డాక్టర్లు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బందిపై దాడులు జరిగినపుడు స్థానిక పోలీసులకు 24 గంటల్లోపు ఫిర్యాదు చేయడం. జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వడం. డాక్టర్లు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బంది క్లిష్ట సమయాల్లో తగు రీతిలో స్పందించాల్సిన అంశాలపై అవగాహన కల్పించడం.

‘మేడిగడ్డ’పై విచారణ డిసెంబరు 27కు వాయిదా

భూపాలపల్లి, న్యూస్‌టుడే: మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి దాఖలైన పిటిషన్‌పై కోర్టు విచారణ డిసెంబరు 27కు వాయిదా పడింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి నాటి ప్రభుత్వమే కారణమంటూ భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి జిల్లా కోర్టులో పిటిషన్ వేయగా దానిపై ఈ నెల 5న కేసు విచారణ జరిగింది. పిటిషన్‌దారు ఆరోపించిన వారి తరఫున వాదించేందుకు ఎవరూ కోర్టుకు హాజరు కాకపోవడంతో జిల్లా జడ్జి పి.నారాయణ బాబు 17కు విచారణను వాయిదా వేశారు. గురువారం కేసును విచారించగా.. మాజీ సీఎం కేసీఆర్, ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ తరఫున ఎవరూ కోర్టుకు హాజరు కాలేదు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతర అధికారుల తరఫున కొందరు న్యాయవాదులు హాజరయ్యారు. దీంతో కేసు విచారణ తిరిగి డిసెంబరు 27కు వాయిదా పడింది.

‘స్థానికం’లో బీసీలకు 42% సీట్లు కేటాయించాలి

- బీసీ ఇంటలెక్చువల్ ఫోరం నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవులు. వేదికపై తీన్మార్ మల్లన్న, బండా ప్రకాశ్, శ్రీనివాస్‌గౌడ్, మధుసూదనాచారి, చెరుకు సుధాకర్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కులగణన చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం సీట్లు కేటాయించాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ హబ్సిగూడలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం నేతలు గురువారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 18 కొంత ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ.. ఎన్నికల్లో బీసీల వాటా తేల్చకుండా బీసీ వర్గ ప్రజలకు అన్ని పార్టీలు అన్యాయం చేశాయన్నారు. రానున్న రోజుల్లో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తమ హక్కును సాధించుకుంటామని తెలిపారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎర్ర సత్యనారాయణ, చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వెబ్‌సైట్‌ని ఆవిష్కరించారు.

ఆసుపత్రుల్లో సౌకర్యాల కల్పనపై నివేదికివ్వండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల ఏర్పాటు, సిబ్బంది నియామకం తదితర సౌకర్యాల కల్పనపై నివేదిక సమర్పించాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుల ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస సదుపాయాలను కల్పించకపోవడంతోపాటు నియామకాలు చేపట్టకపోవడాన్ని సవాల్ చేస్తూ కె.అఖిల్ శ్రీగురుతేజ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు తీర్పు, భారత వైద్య ప్రమాణాలు-2022 ప్రకారం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రులతోపాటు ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, కమ్యూనిటీ సెంటర్లు, మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆసుపత్రుల్లో తగినన్ని సౌకర్యాలు కల్పించడం, ఖాళీలను భర్తీ చేయడంతోపాటు పారామెడికల్ సిబ్బందిని నియమించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది పొట్టిగారి శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మౌలిక వసతుల కల్పనపై నివేదిక సమర్పించడానికి గడువు కావాలని కోరారు. దీనికి ధర్మాసనం అనుమతిస్తూ.. వీటితోపాటు కన్సల్టేషన్ గదులు, డయాలసిస్ యూనిట్లు, హెచ్‌డీయూ, ఐసీయూ బెడ్‌లు, ఎస్‌ఎన్‌సీయూ, ఎన్‌ఐసీయూ బెడ్‌లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, మందుల పంపిణీ కౌంటర్లు, రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల్లో నర్సుల శాతం, సీటీస్కాన్, ఎక్స్‌రే, టెలిఫోన్, బ్లడ్‌బ్యాంక్ సౌకర్యాల కల్పన, ఫిర్యాదుల పరిష్కార విభాగాల ఏర్పాటుపై కూడా నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసింది.



లక్ష్యాలు ఎలా ఉండాలంటే..

జీవితంలో లక్ష్యాలు ఉండాల్సిందే. వాటిని సాధించినప్పుడు ఆనందాన్ని పంచుకోవడమూ ముఖ్యమే. అయితే లక్ష్యసాధన క్రమంలో తీవ్ర ఒత్తిడికి, ఆందోళనకు గురవడం మానసిక, శారీరక ఆరోగ్యానికి మంచిది కాదు. జీవితంలో ఆనందాన్ని, ప్రశాంతతను హరించేవి లక్ష్యాలు కారాదు. అలాంటి వాటిని అందుకున్నా ఏదో సాధించామన్న భావన కలగదు. మన శక్తిసామర్థ్యాలకు తగ్గవి, మన అభిరుచులకు దగ్గరగా ఉన్నవాటినే లక్ష్యాలుగా పెట్టుకోవాలి.

– ముత్తుకృష్ణన్, ఫైనాన్షియల్ ప్లానర్

రేవంత్‌ను నమ్మం.. వదలం

- 25 నుంచి మాదిగల ధర్మయుద్ధ కార్యాచరణ
- మంద కృష్ణమాదిగ



ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నమ్మక ద్రోహం చేశారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. ఇకపై ఆయనను నమ్మబోమని, వదలబోమని వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణ చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేదన్నారు. గురువారం ఆయన హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ‘‘డిసెంబరులోగా గ్రూపు 1, 2 ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం ఇటీవల చెప్పారు. దీన్ని బట్టి వర్గీకరణ లేకుండానే వాటిని భర్తీ చేస్తారని తెలుస్తోంది. అవసరం అయితే ఆర్డినెన్సు తెస్తామని చెప్పిన రేవంత్. మంత్రివర్గ ఉపసంఘం, కమిషన్ పేరుతో జాప్యం చేస్తున్నారు. ఇదంతా కాంగ్రెస్ అగ్రనేత ఖర్గే కుట్రగా భావిస్తున్నాం. ప్రభుత్వంపై పోరాటంలో భాగంగా ఈ నెల 25 నుంచి 31 వరకు మాదిగల ధర్మయుద్ధ జిల్లా మహాసభలు, నవంబరు 4 నుంచి 14 వరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో దీక్షలు, నవంబరు 16 నుంచి డిసెంబరు 20 వరకు ధర్మయుద్ధ యాత్ర, డిసెంబరు 21న చలో హైదరాబాద్ పేరిట మహా ప్రదర్శన నిర్వహిస్తాం’’ అని తెలిపారు.


పోచారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం పరిరక్షణకు కమిటీ

ఈనాడు, దిల్లీ: మెదక్, కామారెడ్డి జిల్లాల సరిహద్దులోని పోచారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం చుట్టూ ఉన్న పర్యావరణ సున్నిత ప్రాంత పర్యవేక్షణకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ గురువారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఓ పర్యవేక్షణ కమిటీని ఏర్పాటుచేసింది. ఇందులో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతినిధి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి, ఆ ప్రాంత సీనియర్ టౌన్‌ప్లానర్/చీఫ్ అర్బన్ ప్లానర్/సిటీ ప్లానర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల డివిజనల్ అటవీ అధికారులు, రాష్ట్ర జీవవైవిధ్య మండలి సభ్యుడు, మెదక్ వన్యప్రాణి సంరక్షణ విభాగానికి చెందిన డివిజనల్ అటవీ అధికారి, మెదక్ జిల్లా వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఎక్స్‌అఫీషియో మెంబర్లుగా ఉంటారు. తెలంగాణ ప్రభుత్వం నియమించే ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, పర్యావరణరంగ నిపుణుడు సభ్యులుగా కొనసాగుతారు. పర్యావరణ సున్నితమైనదిగా ప్రకటించిన ప్రాంతంలో సాగే కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ నిబంధనలకు విరుద్ధంగా జరిగే పనులను అడ్డుకోవడం ఈ కమిటీ బాధ్యత. దీని పదవీకాలం మూడేళ్లు.

‘మణుగూరు-రామగుండం’ లైన్ నిర్మాణ పర్యవేక్షణకు అధికారుల నియామకం

ఈనాడు, దిల్లీ: మణుగూరు-రామగుండం స్టేషన్ల మధ్య 207.80 కిలోమీటర్ల మేర కొత్తగా నిర్మించే బ్రాడ్‌గేజ్ లైన్ పర్యవేక్షణకు కేంద్ర రైల్వే శాఖ గురువారం జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలకు ముగ్గురు అధీకృత అధికారులను నియమించింది. ఇందులో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్, కాటారం మండలాల్లో జరిగే పనుల బాధ్యతలను కాటారం సబ్‌కలెక్టర్‌కు, ఘన్‌పూర్, భూపాలపల్లి మండలాల్లో జరిగే పనుల పర్యవేక్షణను భూపాలపల్లి ఆర్డీవోకు అప్పగించింది. పెద్దపల్లి జిల్లా ముత్తారం, మంథని, రామగిరి, కమాన్‌పూర్, పెద్దపల్లి మండలాల్లో జరిగే పనుల బాధ్యతలను పెద్దపల్లి అదనపు కలెక్టర్(రెవెన్యూ)కు అప్పగించింది. బ్రాడ్‌గేజ్ లైన్ నిర్మాణ పనులు, నిర్వహణ బాధ్యతలను సంబంధిత అధీకృత అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది.

పత్తి కొనుగోళ్లలో కేంద్రం ద్వంద్వ నీతి: హరీశ్‌రావు



హైదరాబాద్, న్యూస్‌టుడే: పత్తి కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ నీతి అవలంబిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘వన్ నేషన్- వన్‌ట్యాక్స్, వన్ నేషన్- వన్ ఎలెక్షన్, వన్ నేషన్- వన్ రేషన్‌కార్డ్, వన్ నేషన్- వన్ మార్కెట్.. అంటూ ఊదరగొట్టే కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్- వన్ ఎంఎస్‌పీ అని ఎందుకు అనడం లేదని ఆయన గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పత్తికి కేంద్రం చెల్లించే మద్దతు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఎందుకు ఉందన్నారు. నాణ్యమైన పత్తిని పండిస్తున్న తెలంగాణ రైతులపై వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. గుజరాత్ పత్తికి క్వింటాకు రూ.8,257 చెల్లిస్తున్న కేంద్రం. తెలంగాణలో పండిస్తున్న పత్తికి రూ.7,521 మాత్రమే చెల్లించడం దుర్మార్గమన్నారు. ‘వై నాట్.. వన్ నేషన్- వన్ ఎంఎస్‌పీ’ అంటూ ‘ఎక్స్’ వేదికగా కూడా ఆయన ప్రశ్నించారు.

పెండింగ్ డీఏలు ఇవ్వాలి: ఈ నెల 23న నిర్వహించే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి.. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులకు 5 డీఏలను విడుదల చేయకపోవడం వల్ల ఒక్కొక్కరు నెలకు సుమారు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టపోవాల్సి వస్తోందన్నారు. ప్రతి ఏడాది బతుకమ్మ పండగ వేళ ప్రభుత్వం ఇచ్చే బతుకమ్మ చీరలను ఎందుకు నిలిపివేశారని ప్రశ్నిస్తే.. దానికి మంత్రి సీతక్క సమాధానం చెప్పకుండా పొంతన లేని వ్యాఖ్యలు చేయడం శోచనీయమని హరీశ్‌రావు పేర్కొన్నారు.

‘ఉపా’ను రద్దు చేసేవరకు పోరాటం ఆగదు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



రాంనగర్, న్యూస్‌టుడే: దేశంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా మోదీ సర్కారు వ్యవహరిస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా)తో హింసాకాండను అమలు చేస్తోందని మండిపడ్డారు. ఈ చట్టం రద్దుతోపాటు రాజకీయ ఖైదీల విడుదల కోరుతూ సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్కు సమీపంలోని ధర్నాచౌక్ వద్ద నల్లని దుస్తులు ధరించి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాకు మోదీ ప్రభుత్వం మరింత కోరలు పెంచిందని విమర్శించారు. దేశంలో నియంతృత్వం ఉన్నంత వరకు కమ్యూనిజం కొనసాగుతుందని చెప్పారు. ఉపాను రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగబోదని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ..ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కారణం ఎవరని ప్రశ్నించారు. ఉపా కింద అరెస్టు చేసిన వారిలో కేవలం మూడు శాతం మందిపైనే నేరాలను నిరూపించారని.. మిగిలిన వారిపై మాత్రం నిరూపణ కాలేదని ఆయన చెప్పారు. సీపీఐ రాష్ట్ర నాయకులు వీఎస్ బోస్, ఈటీ నర్సింహ, ప్రభాకర్, రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

EENADU Vol: 51, Iss: 68 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. A-1/1, Block No. 3, Industrial Development Area, Uppal, Hyderabad, Medchal District - 500 039, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy District - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223. RNI No. 27656/75. Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



సుప్రీంకోర్టు గ్రంథాలయంలో కొలువుదీరిన న్యాయదేవత కొత్త విగ్రహమిది. న్యాయదేవత ఒక చేత్తో త్రాసు, మరో చేత్తో భారత రాజ్యాంగాన్ని పట్టుకుని కిరీటం ధరించి కనిపిస్తోంది. ఇప్పటివరకు న్యాయదేవత విగ్రహం అనగానే కళ్లకు నల్లని గంతలు, చేతిలో కత్తి గుర్తుకొచ్చేవి. ఈ విగ్రహానికి ఆ రెండూ లేకపోవడం గమనార్హం.

మేం చెప్పిందే నిజమైంది

- ఆధారాల్లేవని కెనడా ప్రధాని అంగీకరించారు
- అనవసర ఆరోపణలతోనే ఉద్రిక్తత పెరిగింది: భారత్
- ఘర్షణ తమ ఉద్దేశం కాదన్న ట్రూడో

దిల్లీ, వాషింగ్టన్: ఎలాంటి ఆధారాల్లేకుండానే కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భారత్‌పై నిందలు వేస్తున్న విషయం ఆయన మాటల్లోనే తేటతెల్లమైందని విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) పేర్కొంది. సిక్కు వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసులో మనకు ఎలాంటి సంబంధం లేదని మొదటి నుంచి చెబుతూ వస్తున్నామని, నిఘా వర్గాల సమాచారం తప్పిస్తే పక్కా ఆధారాల్లేవని ఇప్పుడు స్వయానా ట్రూడోయే అంగీకరించారని ఎంఈఏ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ గుర్తుచేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారతదేశంపైనా, దౌత్యవేత్తలపైనా కెనడా తీవ్రమైన ఆరోపణలు చేసినా ఇంతవరకు ఎలాంటి ఆధారాలను చూపలేకపోయిందని పునరుద్ఘాటించారు. ట్రూడో సర్కారు చేస్తున్న ఆరోపణల వల్లనే రెండుదేశాల సంబంధాల్లో ఉద్రిక్తత పెరిగిందని చెప్పారు. కెనడా మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదని విమర్శించారు. 'ఒకే భారత్ (వన్ ఇండియా) విధానాన్ని' నమ్ముతున్నట్లు ట్రూడో చెప్పడాన్ని ఖండించారు. గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్య కేసులో అమెరికా ఇచ్చిన సమాచారాన్ని తీవ్రంగానే తీసుకున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా నిజ్జర్ హత్య కేసులో గతేడాది భారత్‌పై ట్రూడో ఆరోపణ తర్వాత.. నిషేధిత 'సిఖ్స్ ఫర్ జస్టిస్' నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ నుంచి ఆయనకు ఓ లేఖ వచ్చింది. అదిప్పుడు వైరల్‌గా మారింది. నిజ్జర్ హత్యలో భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ పాత్ర ఉందని ఆరోపిస్తూ, ఆయనను బహిష్కరించాలని ఆ లేఖలో పన్నూ కోరారు. అలా జరగకపోతే.. కెనడాలో చురుకుగా ఉన్న భారత ఏజెంట్ల చేతుల్లో మరికొంతమందికి హాని జరగొచ్చని భయపడుతున్నామని అందులో పేర్కొన్నాడు.



రణ్‌ధీర్ జైస్వాల్

ఉగ్రవాదాన్ని సీరియస్‌గానే తీసుకుంటున్నాం: ట్రూడో



హింస, ఉగ్రవాదం, ద్వేషాన్ని ఎగదోయడం వంటి వాటిని తాము తీవ్రంగా పరిగణించడం లేదని భారత్ భావిస్తున్నా, తాము మాత్రం వాటిని సీరియస్‌గానే తీసుకుంటున్నామని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చెప్పారు. తమ వ్యవహారాల్లో జోక్యం విషయంలో భారత ప్రభుత్వంలో ఉన్నతస్థాయిలో ఎవరెవరు ఉన్నారు, మరేదైనా దుష్టశక్తి ఉందా అనేది నిగ్గు తేల్చడంలో భారత్ సహకారాన్ని కోరామని ఆయన విచారణ కమిటీకి తెలిపారు. కెనడా సార్వభౌమత్వంలో జోక్యం చేసుకోవడం ద్వారా భయానక తప్పిదానికి భారత్ పాల్పడిందని, భద్రత కోణంలో తాము స్పందించాల్సి వచ్చిందని చెప్పారు. భారతదేశ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాలను గౌరవిస్తామన్నారు. కెనడాలో ఉన్న వేర్వేరు దేశాలవారు తమ రాజకీయ విశ్వాసాలను స్వేచ్ఛగా పాటించుకోవచ్చని చెప్పారు.



దిల్లీలో జరిగిన ఆయుర్వేద అంతర్జాతీయ సదస్సులో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకిస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, ఆయన సతీమణి కల్పనా దాస్

ఆయుర్వేదాన్ని నేను గట్టిగా ప్రోత్సహిస్తా

- సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్య

దిల్లీ: పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ఆయుర్వేదం దోహదం చేస్తుందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ గురువారం వ్యాఖ్యానించారు. కొవిడ్ మహమ్మారి కాలంలో తనకు ఆయుర్వేదంతో అనుబంధం ఏర్పడిందన్నారు. ఆయుర్వేదంపై పరిశోధనల్లో పురోగతులు, అంతర్జాతీయ అవకాశాలపై ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఏఐఐఏ) దిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సును ఉద్దేశించి జస్టిస్ చంద్రచూడ్ ప్రసంగించారు. కొవిడ్ రెండు, మూడో దశలు సహా తనకు కొవిడ్ సోకిన సమయంలో కూడా అలోపతి మందులను అస్సలు వాడలేదన్నారు. ఆయుర్వేదం, సంప్రదాయ జీవనశైలిని తాను గట్టిగా ప్రోత్సహిస్తానన్నారు.

మోదీ వస్తే బాగుండేది

- పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్

ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ పాల్గొనడంపై పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ స్పందించారు. ఇది సానుకూల పరిణామమని వ్యాఖ్యానించారు. ఈ సదస్సుకు ప్రధాని మోదీ వస్తే మరింత సంతోషించేవాడినని పేర్కొన్నారు. భారత్‌కు చెందిన ఓ వార్తా ఛానల్‌కు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇరు దేశాలు గతాన్ని పక్కన బెట్టి.. ఇంధనం, వాతావరణ మార్పుల వంటి భవిష్యత్తు సవాళ్లపై చర్చలు జరపవచ్చని అభిప్రాయపడ్డారు. మరోవైపు సదస్సు కోసం పాకిస్థాన్ వెళ్లిన భారత జర్నలిస్టులతో నవాజ్ షరీఫ్, ఆయన కుమార్తె మరియం నవాజ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. లాహోర్‌లోని ఆయన నివాసంలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. జైశంకర్ పాకిస్థాన్‌లో పర్యటించడం తొలి అడుగుగా అభివర్ణించారు.

యూపీ ఉప ఎన్నికల తేదీని 20కి మార్చండి

- ఈసీకి భాజపా, ఆర్ఎల్డీ విజ్ఞప్తి

లఖ్‌నవూ: ఉత్తర్ ప్రదేశ్‌లో నవంబరు 13న జరగాల్సిన ఉప ఎన్నికల పోలింగ్‌ను 20వ తేదీకి మార్చాలని ఎన్నికల సంఘానికి (ఈసీ) భాజపా, ఆర్ఎల్డీ విజ్ఞప్తి చేశాయి. 15వ తేదీన కార్తీక పౌర్ణమి స్నానాలు, పూజల కారణంగా ఈ వాయిదా కోరుతున్నామని తెలిపాయి. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్ నారాయణ్ శుక్లా నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం ఉత్తర్ ప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి వినతి పత్రం అందజేసింది.

కాంగ్రెస్ రెండు చోట్ల పోటీ: ఎస్పీ

ఉత్తర్‌ప్రదేశ్‌లో జరగనున్న 10 అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో 2 చోట్ల పోటీ చేసేందుకు కాంగ్రెస్ అంగీకరించిందని సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌధరి తెలిపారు. ఖైర్ (అలీగఢ్), గాజియాబాద్‌లలో ఆ పార్టీ పోటీ చేయనుందని గురువారం వెల్లడించారు. మిగిలిన చోట్ల తాము పోటీ చేస్తామని వివరించారు. అయితే ఈ విషయం తనకు తెలియదని కాంగ్రెస్ రాష్ట్రశాఖ అధ్యక్షుడు అజయ్ రాయ్ పేర్కొన్నారు. 5 సీట్లు అడుగుతున్నామని తెలిపారు.

ఉత్తరాఖండ్ మదర్సాల్లో సంస్కృత బోధనకు యోచన

దేహ్రాదూన్: మదర్సాల్లో సంస్కృత బోధనను ప్రవేశపెట్టాలని ఉత్తరాఖండ్ మదర్సా బోర్డు యోచిస్తోంది. రాష్ట్రంలోని 400 మదర్సాల్లో ఐచ్ఛిక ప్రాతిపదికన విద్యార్థులకు దీన్ని బోధించాలని భావిస్తోంది. ఇప్పటికే ప్రతిపాదనను సిద్ధం చేశామని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించగానే దీని అమలుపై ముందుకెళ్తామని బోర్డు ఛైర్మన్ ముఫ్తీ శమూన్ కాస్మీ గురువారం తెలిపారు. మదర్సాల్లోని పిల్లలకు ప్రధాన స్రవంతి విద్యను అందించాలన్న ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ ఆలోచనకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని మదర్సాల్లో ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ప్రవేశపెట్టడం వల్ల ఈ విద్యా సంవత్సరం 96 శాతం ఉత్తీర్ణతతో మంచి ఫలితాలు వచ్చాయని, మదర్సాకు వచ్చే విద్యార్థుల ప్రతిభకు లోటులేదని చెప్పడానికి ఇది నిదర్శనమన్నారు.

నవంబరు 26న 500 జిల్లాల్లో 'హెచ్చరిక' ర్యాలీలు

- సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన

దిల్లీ: పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయడంతోపాటు పలు డిమాండ్ల సాధన కోసం దిల్లీ సరిహద్దుల్లో చేపట్టిన ఉద్యమానికి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రైతులు ప్రత్యేక కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. నవంబరు 26న దేశ వ్యాప్తంగా 500 జిల్లాల్లో హెచ్చరిక (చెతావనీ) ర్యాలీలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నిర్ణయించింది. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే వచ్చే ఏడాది భారీ ఉద్యమాన్ని నిర్వహిస్తామని ప్రకటించింది. ఎస్‌కేఎం సర్వసభ్య సమావేశంలో పలు రైతు సంఘాల నేతలు ఈ నిర్ణయం తీసుకున్నారు. కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాలతో పాటు ఎస్‌కేఎం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో నవంబరు 7 నుంచి 25 వరకు 50 వేల గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎస్‌కేఎం ఈ సందర్భంగా వెల్లడించింది. ప్రతి జిల్లాలో 100 గ్రామాలను చుట్టివచ్చేలా వాహన జాతాలు, పాదయాత్రలు నిర్వహించి తమ డిమాండ్లను ఇంటింటికీ వివరిస్తామని రైతు నేతలు తెలిపారు. 'కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు అమలు చేయకుండా మోసం చేసింది. అందుకే నిరసనగా మేం దేశ వ్యాప్తంగా ఈ ర్యాలీలు చేపట్టాలని నిర్ణయించాం' అని ఏఐకేఎస్ నేత హన్నన్ మొల్లా తెలిపారు.



దిల్లీలో అంతర్జాతీయ అభిదమ్మ దివస్ సందర్భంగా బుద్ధుని విగ్రహానికి నమస్కరిస్తున్న ప్రధాని మోదీ ✦ కార్యక్రమానికి హాజరైన బౌద్ధ సన్యాసులు

బుద్ధుని ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు: మోదీ

దిల్లీ: పాళీకి ప్రాచీన భాష హోదా ఇవ్వడం ద్వారా బుద్ధుని సాంస్కృతిక వారసత్వాన్ని తమ ప్రభుత్వం గౌరవించిందని ప్రధాని మోదీ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. 'అంతర్జాతీయ అభిదమ్మ దివస్' సందర్భంగా గురువారం దిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ప్రతి దేశం తన సాంస్కృతిక వారసత్వంతో పెనవేసుకుని నడుస్తుంటే భారత్ దీనికి చాలా దూరంగా ఉండిపోయింది. స్వాతంత్ర్యం రాకముందు దేశంపైకి దండెత్తి వచ్చినవారు మన అస్తిత్వాన్ని తుడిచిపెట్టేయడానికి అనేక ప్రయత్నాలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బానిస మనస్తత్వం ఉన్నవారు దానినే కొనసాగించారు. దేశాన్ని తన ఆత్మకు వ్యతిరేకంగా తీసుకెళ్లడానికి ఓ వ్యవస్థే నడుస్తోంది' అని ఆయన చెప్పారు. బుద్ధుని ఆలోచనలకు అనుగుణంగానే తమ ప్రభుత్వ విధానాలను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

'యువ సంగం'లో పాల్గొనేందుకు దరఖాస్తుల ఆహ్వానం

దిల్లీ: ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర విద్యాశాఖ ప్రారంభించిన 'యువ సంగం' కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా దేశవ్యాప్తంగా యువత తమ రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందొచ్చని గురువారమిక్కడ కేంద్ర విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు ఐదో 'యువ సంగం' కార్యక్రమానికి సంబంధించి ఈ నెల 21 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు, ఎన్‌ఎస్ఎస్, ఎన్‌వైకేఎస్ వలంటీర్లు, ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్నవారు సహా 18 నుంచి 30 ఏళ్ల వయసువారు గడువులోగా యువ సంగం పోర్టల్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఉక్రెయిన్‌కు ఆస్ట్రేలియా నుంచి పాత ఎం1ఎ1 అబ్రామ్స్ ట్యాంకులు

బ్రసెల్స్: రష్యాతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్‌కు తమ దగ్గర ఉన్న పాత ఎం1ఏ1 అబ్రామ్స్ ట్యాంకులను ఇవ్వాలని ఆస్ట్రేలియా నిర్ణయించింది. 163 మిలియన్ డాలర్ల విలువైన 49 ట్యాంకులను కీవ్‌కు అందిస్తున్నట్లు తెలిపింది. ఎం1ఏ1 ట్యాంకుల స్థానంలో తమ సైన్యంలోకి 75 కొత్త తరం ఎం1ఏ2 ట్యాంకులు ప్రవేశపెట్టాలని ఆస్ట్రేలియా భావిస్తోంది. తాము సరఫరా చేయనున్న ట్యాంకులన్నీ మంచి స్థితిలోనే ఉన్నట్లు ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్ తెలిపారు.

రతన్ టాటా 'వజ్రాల చిత్రం' వేలానికి..

ముంబయి: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు బహూకరించేందుకు 12వేల వజ్రాలతో రూపొందించిన ఆయన చిత్రాన్ని త్వరలో వేలం వేయనున్నారు. రతన్‌టాటా పుట్టినరోజు సందర్భంగా డిసెంబర్ 28న ఆయనకు బహూకరించేందుకు ముంబయికి చెందిన కళాకారుడు శైలేశ్ ఆచ్రేకర్ ఈ చిత్రాన్ని రూపొందించారు.



అంతలో అక్టోబరు 9నే రతన్ టాటా తుదిశ్వాస విడిచారు. "రతన్‌జీ గౌరవార్థం ఆయనకు ఏదైనా కానుకగా ఇవ్వాలని ఆలోచన రాగానే.. దీనిని ప్రత్యేకంగా తీర్చిదిద్దాను. అందుకు ఆరు నెలల సమయం పట్టింది. పుట్టినరోజు నాడు ఆయన్ను వ్యక్తిగతంగా కలిసి ఈ బహుమతి ఇద్దామనుకున్నాను. కానీ ఆయన మరణంతో నా కల నెరవేరలేదు" అని విచారం వ్యక్తంచేశారు. "రతన్ టాటా అందించిన సేవలకు నివాళిగా దీనిని వేలం వేయాలని నిర్ణయించాం. అలా సేకరించిన మొత్తాన్ని స్వచ్ఛంద కార్యక్రమాలకు కేటాయించాలని భావిస్తున్నాం" అని శైలేశ్ తెలిపారు.

భారత్-మలావీల మధ్య

సహకారం పెంపునకు విస్తృత అవకాశాలు

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వ్యాఖ్య

లిలోంగ్వే, నక్‌షాట్: వ్యవసాయం, గనుల తవ్వకం, ఇంధన, పర్యాటకం తదితర అనేక రంగాల్లో భారత్, మలావీల మధ్య సహకారాన్ని పెంచుకునేందుకు విస్తృత అవకాశాలు ఉన్నందున రెండు దేశాలు ఒక్కటై ముందుకు సాగాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పేర్కొన్నారు. మూడు దేశాల పర్యటనలో చివరిదైన మలావీలో గురువారం ఆమె అడుగుపెట్టారు. 'వార్మ్ హార్ట్ ఆఫ్ ఆఫ్రికా'గా పిలిచే మలావీలో పర్యటిస్తున్న తొలి భారత రాష్ట్రపతి కావడాన్ని గౌరవప్రదంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. "మలావీ ప్రకృతి వనరులు, సారవంతమైన నేలలు పుష్కలంగా ఉన్నదేశం. అధిక జనాభా గల భారత్ తన ప్రజల కోసం రోజురోజుకు పెరుగుతున్న ఇంధన, ఖనిజ, ఆహార అవసరాలతో భారీ వినియోగదారుల స్థావరాన్ని కలిగి ఉంది. అందువల్ల రెండు దేశాలు అనేక రంగాల్లో కలిసి ముందుకు సాగాలి" అని భారత్-మలావీ వాణిజ్య సమావేశంలో రాష్ట్రపతి వెల్లడించారు. మలావీలో అతి పెద్ద పెట్టుబడిదారుల్లో భారత్ ఒకటని, వివిధ రంగాల్లో 500 మిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులను భారతీయులు పెట్టారన్నారు.

మారిటోనియాతో నాలుగు ఎంవోయూలు

వీసా మినహాయింపులు, దౌత్యవేత్తలకు శిక్షణ సహా వివిధ అంశాలకు సంబంధించి భారత్, మారిటోనియాల మధ్య గురువారం నాలుగు అవగాహనా ఒప్పందాలు (ఎంవోయూలు) కుదిరాయి. మూడు దేశాల పర్యటనలో భాగంగా రెండో దేశమైన మారిటోనియాకు బుధవారం విచ్చేసిన రాష్ట్రపతి గురువారం ఆ దేశ అధ్యక్షుడు మొహమ్మద్ ఒలుడ్ గజౌనీతో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య సంబంధాలను మరింతగా బలోపేతం చేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా ఒప్పందాలు కుదిరాయి. 1960లో స్వాతంత్ర్యం పొందిన మారిటోనియాలో పర్యటిస్తున్న భారతీయ అగ్ర నాయకురాలు ద్రౌపదీ ముర్ము కావడం విశేషం.



మారిటోనియా రాజధాని నక్‌షాట్‌లో ప్రవాస భారతీయ చిన్నారులతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

జైలు నుంచి విడుదలై.. ఏకు మేకై..

- ఇదీ సిన్వర్ ప్రస్థానం

బీరుట్: ఇజ్రాయెల్‌తో పోరులో ప్రాణాలు కోల్పోయిన యాహ్యా సిన్వర్.. హమాస్ మిలిటరీ విభాగంలో కీలక వ్యక్తి. శత్రువును అంచనా వేయడంలో దిట్ట. ఇజ్రాయెల్‌పై అక్టోబరు 7 నాటి ఘటనకు ఇతడే సూత్రధారి. ఆ ఘటనలో హమాస్ తీవ్రవాదులు 1,200 మంది ఇజ్రాయెల్ వాసులను దారుణంగా హతమార్చిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి సిన్వర్ కోసం ఇజ్రాయెల్ వేట మొదలుపెట్టింది. యాహ్యా అసలు పేరు 'యాహ్యా ఇబ్రహీం హస్సన్ సిన్వర్'. 1962లో గాజాలోని ఖాన్ యూనిస్‌లో శరణార్థి శిబిరంలో పుట్టాడు. అతడి పూర్వీకులు 1948 వరకు నేటి దక్షిణ ఇజ్రాయెల్‌లోని అష్కెలోన్‌లో ఉండేవారు. అప్పట్లో ఈ ప్రదేశం ఈజిప్టు ఆధీనంలో ఉండేది. ఆ తర్వాత సిన్వర్ కుటుంబం గాజాకు తరలివెళ్లింది. అతడు గాజా విశ్వవిద్యాలయం నుంచి అరబిక్ స్టడీస్‌లో డిగ్రీ పూర్తి చేశాడు.

కారాగారంలోనే రెండు దశాబ్దాలు

సిన్వర్ రెండు దశాబ్దాల పాటు ఇజ్రాయెల్ జైల్లో గడిపాడు. 1982లో విధ్వంసకర చర్యలకు పాల్పడుతున్న నేరంపై తొలిసారి అరెస్టయ్యాడు. 1985లో జైలు నుంచి విడుదలై, మరొకరితో కలిసి మజ్ద్ పేరిట ఓ సంస్థను ఏర్పాటు చేశాడు. కొత్తగా ఏర్పడ్డ హమాస్‌లో ఇది కీలక విభాగంగా మారింది. పాలస్తీనా ఉద్యమంలో ఉంటూ ఇజ్రాయెల్‌తో సంబంధాలు పెట్టుకొన్న వారిని హత్య చేసినట్లు మజ్ద్ విభాగం అభియోగాలు ఎదుర్కొంది. ఈ క్రమంలోనే సిన్వర్ 1988లో అరెస్టు కాగా.. 1989లో జీవిత ఖైదు పడింది. పలుమార్లు జైలు నుంచి తప్పించుకోవడానికి యత్నించి దొరికిపోయాడు. మెదడులో కణితి రావడంతో 2008లో శస్త్రచికిత్స చేశారు. 2006లో హమాస్ అపహరించిన గిలియద్ షలిట్ అనే సైనికుడి కోసం 2011లో ఇజ్రాయెల్ 1,026 మందిని విడుదల చేయాల్సి వచ్చింది. వీరిలో సిన్వర్ కూడా ఉన్నాడు. అలా బయటపడ్డ తర్వాత అతడు హమాస్‌లో వేగంగా అగ్రస్థానానికి చేరుకున్నాడు. అమెరికా విదేశాంగశాఖ 2015లో అతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. హమాస్‌లోని అల్ కస్సామ్ బ్రిగేడ్ల ఏర్పాటుకు ముందున్న సంస్థను ఇతడే ఏర్పాటు చేసినట్లు అమెరికా వెల్లడించింది. హమాస్ మిలటరీ విభాగంలో ఇవి కీలకమైనవి. 2017లో అతడు హమాస్‌కు అధిపతిగా ఎన్నికయ్యాడు.



సిన్వర్ మృతి ప్రపంచానికి మంచిరోజు

- అమెరికా అధ్యక్షుడు బైడెన్ వ్యాఖ్య

వాషింగ్టన్: ఉగ్రసంస్థ హమాస్ అగ్రనేత యహ్యా సిన్వర్‌ను ఇజ్రాయెల్ దళాలు మట్టుబెట్టడం ఆ దేశం, తమ దేశంతో పాటు యావత్ ప్రపంచానికి శుభదినమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అభివర్ణించారు. ఈ ఘటన హమాస్ చెరలో ఉన్న బందీల విడుదలకు, ఏడాదిగా సాగుతున్న గాజా యుద్ధ పరిసమాప్తికి బాటలు వేసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అల్‌ఖైదా అధినేత, సెప్టెంబరు 11, 2001 దాడుల సూత్రధారి ఒసామా బిన్ లాడెన్‌ను అంతమొందించిన ఘటనతో తాజా ఘటనను పోల్చారు. సిన్వర్ అంతంతో గాజా యుద్ధం ముగింపునకు మార్గం సుగమం అయిందని అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ పేర్కొన్నారు.

లక్ష మంది విద్యార్థులకు గ్రీన్ ఇంటర్న్‌షిప్‌లు

- 1ఎం1బీ స్కిల్స్ అకాడమీ- ఏఐసీటీఈ జట్టు

దిల్లీ: తమ గుర్తింపు పొందిన కళాశాలలు, విశ్వవిద్యాలయాల కోసం అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) పర్యావరణహిత ఇంటర్న్‌షిప్‌లు (గ్రీన్ ఇంటర్న్‌షిప్‌లు) ప్రకటించింది. ఇందుకోసం 1ఎం1బీ (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) గ్రీన్ స్కిల్స్ అకాడమీతో జట్టుకట్టింది. 2030 చివరికల్లా లక్ష మంది విద్యార్థులకు 1ఎం1బీ గ్రీన్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం అవకాశాలు కల్పించనుందని, ఇందులో భాగంగా తొలి ఏడాది 10,000 ఇంటర్న్‌షిప్‌లు ఇస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ హిత ప్రాంగణాలను ప్రోత్సహించే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ లక్ష్యాలకు అనుగుణంగా విద్యాసంస్థలను పర్యావరణ హిత ప్రాంగణాలుగా మార్చేందుకు విద్యార్థులు కృషిచేస్తారు.

జైళ్లలో ఖైదీల అధిక రద్దీని తగ్గించండి

- రాష్ట్రాలకు కేంద్రం నిర్దేశం

దిల్లీ: దేశంలోని కారాగారాల్లో వాటి సామర్థ్యానికి మించి ఖైదీలు ఉంటున్నారని, ఈ అధిక రద్దీని తగ్గించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. దీనిలో భాగంగా విచారణ ఖైదీలకు ఉపశమనం కలిగించాలని తెలిపింది. దీర్ఘకాలంగా జైళ్లలో మగ్గుతున్న విచారణ ఖైదీలకు అవసరమైతే ఆర్థిక, న్యాయ సహాయాన్ని అందించి సాధ్యమైనంత త్వరగా విడుదలయ్యేలా చూడాలని పేర్కొంది. దీనికోసం భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023 నిబంధనలను అమలు చేయాలని స్పష్టం చేస్తూ కేంద్ర హోంశాఖ లేఖ రాసింది.

కేవలం అనుమానంతో శిక్షించలేం

- మరణ దండన ఖైదీని నిర్దోషిగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు తీర్పు

దిల్లీ: కుమార్తెతో సహా కుటుంబ సభ్యులను హత్య చేశాడనే ఆరోపణలతో మరణ దండన ఎదుర్కొంటోన్న ఖైదీని సుప్రీంకోర్టు సంశయ లబ్ధి కింద నిర్దోషిగా ప్రకటించింది. కేవలం అనుమానంతో నిందితుడికి శిక్ష విధించడం తగదని జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది. పొరుగింటి వారి ప్రాసంగిక సాక్ష్యాల ఆధారంగా నిందితుడికి మరణ శిక్ష విధిస్తూ ట్రయల్ కోర్టు, బాంబే హైకోర్టు వెలువరించిన తీర్పును కొట్టివేసింది. అనుమానం ఎంత బలంగా ఉన్నప్పటికీ నిస్సందేహమైన సాక్ష్యంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. నేరం కచ్చితంగా నిరూపితమయ్యే వరకు నిందితుడిని నిరపరాధిగానే పరిగణించాలని తెలిపింది. పొరుగింటి వారు ఆపాదించిన ఉద్దేశాలను తిరస్కరించింది. సాక్షులు నేర ఘటనను ప్రత్యక్షంగా చూడలేదన్న విషయాన్ని ప్రస్తావించింది. మహారాష్ట్రలోని పుణె జిల్లాకు చెందిన విశ్వజీత్ మసాల్కర్ మరో మహిళను వివాహం చేసుకోవాలన్న తన అభీష్టాన్ని తిరస్కరించారనే కోపంతో కుటుంబ సభ్యులను హత్య చేశాడని సాక్షులు పేర్కొన్నారు. భార్యకు విడాకులివ్వాలని నిర్ణయించుకున్నాడనీ తెలిపారు. అయితే, 2012 అక్టోబరు 4న ఇంట్లో చోరీ జరిగిందని, తన తల్లి, భార్య, కుమార్తెను హత్య చేశారని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు విశ్వజీత్ మసాల్కర్ ఫోన్ చేసి తెలిపాడు. నగదు, ఆభరణాలు కూడా చోరీకి గురయ్యాయని పేర్కొన్నాడు. ఈ నేరాలు మసాల్కరే చేశాడని అనుమానిస్తూ అతనిని అరెస్టు చేశారు.

వైవాహిక అత్యాచారాన్ని గుర్తిస్తే వివాహవ్యవస్థ అస్థిరతకు గురవుతుందా..!

- పిటిషనర్లను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ: వైవాహిక అత్యాచారాన్ని గుర్తిస్తే వివాహవ్యవస్థ అస్థిరతకు గురవుతుందా..! అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. 18 ఏళ్లు దాటిన భార్యపై అత్యాచారాన్ని నేరంగా పరిగణించకుండా, ఐపీసీ, బీఎన్ఎస్‌లో భర్తకు ఇస్తున్న మినహాయింపులను కొట్టివేయాలంటూ దాఖలైన పిటిషన్లపై గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా వైవాహిక అత్యాచారానికి శిక్షలు విధిస్తే, వివాహ బంధం ప్రభావితమవుతుందంటూ కేంద్రం దాఖలు చేసిన ప్రమాణపత్రంపై పిటిషనర్ల అభిప్రాయాలను ధర్మాసనం కోరింది. వైవాహిక అత్యాచారానికి మినహాయింపునిచ్చే ఐపీసీ, బీఎన్ఎస్‌లోని నిబంధనలు రద్దు చేయాలని సీనియర్ న్యాయవాది కరుణా నంది వాదించారు. "మీరేమో అధికరణం 14 (సమానత్వ హక్కు), అధికరణం 19, అధికరణం 21 (జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ)కు భంగం కలుగుతుందని చెబుతున్నారు. పార్లమెంటేమో.. ఈ మినహాయింపిచ్చినప్పుడు 18 ఏళ్ల దాటిన భార్యతో శృంగారం అత్యాచారం కిందకు రాదని భావించింది." అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. భర్తకు రక్షణ కల్పించే నిబంధనను వ్యతిరేకిస్తూ.. రాజ్యాంగంలో పితృస్వామ్యానికి, స్త్రీ ద్వేషానికి తావు లేదని న్యాయవాది నంది తెలిపారు. మరో సీనియర్ న్యాయవాది కొలిన్ గొంజాల్వెస్ వాదిస్తూ.. "మహిళ వద్దు అంటే వద్దు.. మెట్టినింటిలో అత్యాచారం జరిగితే ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందే" అని అన్నారు. తదుపరి విచారణను ఈ నెల 22కు ధర్మాసనం వాయిదా వేసింది.

చైనా వీసా అవినీతి కేసులో.. కార్తీ చిదంబరంపై ఛార్జిషీటు

దిల్లీ: 2011లో పి.చిదంబరం కేంద్ర హోంమంత్రిగా ఉన్నప్పుడు ఆయన తనయుడు కార్తీ చిదంబరం ఓ విద్యుత్ కంపెనీ కోసం చైనా పౌరులకు వీసాలు ఇప్పించడంలో లంచం తీసుకున్నారనే ఆరోపణలపై సీబీఐ గురువారం పలువురిపై అభియోగ పత్రం దాఖలు చేసింది. దిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానంలో దాఖలు చేసిన ఛార్జిషీటులో శివగంగ నియోజకవర్గ ఎంపీ కార్తీ చిదంబరం, ఆయన సన్నిహితుడు ఎస్.భాస్కర రామన్, ముంబయికి చెందిన బెల్ టూల్స్ అనుబంధ సంస్థ తలవండి సాబో పవర్ లిమిటెడ్ (టీఎస్‌పీఎల్) పేర్లను సీబీఐ పేర్కొంది. నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ వంటి అభియోగాలను అవినీతి నిరోధక చట్టం ప్రకారం వారిపై మోపినట్లు సీబీఐ అధికారులు పేర్కొన్నారు. ఛార్జిషీటులోని ఇతర నిందితుల్లో విరాల్ మెహతా, అనూప్ అగర్వాల్, మన్సూర్ సిద్ధిఖీ, చేతన్ శ్రీవాస్తవ ఉన్నారు.

కల్తీ మద్యం ఘటనలో 25కు చేరిన మృతులు

- బిహార్‌లో 12 మంది అరెస్టు

పట్నా: బిహార్‌లో కల్తీ మద్యం తాగి మృతి చెందిన వారి సంఖ్య 25కు చేరింది. ఒక్క సివాన్ జిల్లాలోనే 20 మంది వరకూ చనిపోయారు. మరో 20 మందికిపైగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు గురువారం అధికారులు ప్రకటించారు. మరోవైపు కల్తీ మద్యం విక్రయిస్తున్న 12 మందిని అరెస్టు చేసినట్లు డీజీపీ అలోక్‌రాజ్ వెల్లడించారు. దుర్ఘటన నేపథ్యంలో రెండు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దుర్ఘటనపై సీఎం నీతీశ్ కుమార్ ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 8 సంవత్సరాలుగా మద్య నిషేధం అమలులో ఉన్న రాష్ట్రంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడ్డాయి.

కాలు దువ్వినవారు కష్టంలో ఉన్నా సాయపడిన దేశం మనది: భాగవత్

సూరత్: ఒకప్పుడు మనపై కాలు దువ్వినవారు ఇప్పుడు కష్టాల్లో ఉంటే వారికి సాయపడడం మన పూర్వీకులు ప్రబోధించిన సిద్ధాంతమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధిపతి మోహన్ భాగవత్ పేర్కొన్నారు. ఏ దేశంపైనా మన దేశం దాడులకు దిగదని, మనపై ఎవరైనా దాడికి ఒడిగడితే మాత్రం సహించదని చెప్పారు. గురువారం సూరత్‌లో జైన్ సమాజం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. 1999లో కార్గిల్‌లో పాక్ చేసిన దుస్సాహసానికి వెంటనే ప్రతీకారం తీర్చుకునే అవకాశం మన దేశానికి ఉన్నా అప్పటి ప్రభుత్వం మాత్రం సరిహద్దు దాటి వెళ్లవద్దంటూ సైన్యానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. మన భూభాగంలో ఉన్నవారినే (ముష్కరులనే) లక్ష్యంగా చేసుకోవాలని కూడా ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. పాకిస్థాన్ భూభాగంపై మెరుపుదాడులు జరిపినప్పుడు ఆ దేశం మొత్తంపై కాకుండా కేవలం సమస్యాత్మక వ్యక్తులపైనే మన సైనికులు గురిపెట్టారని భాగవత్ గుర్తుచేశారు.

ఇన్ఫోసిస్ లాభం రూ.6506 కోట్లు


- ఆదాయ అంచనాలు మరోసారి పెంపు
- 6 త్రైమాసికాల తరవాత పెరిగిన ఉద్యోగుల సంఖ్య

దిల్లీ: ఐటీ సేవల దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.6,506 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదే కాల లాభం రూ.6,212 కోట్లతో పోలిస్తే ఇది 4.7% అధికం. కార్యకలాపాల ఆదాయం రూ.38,994 కోట్ల నుంచి 5.1% పెరిగి రూ.40,986 కోట్లకు చేరింది. వడ్డీ, పన్నుకు ముందు లాభం (ఎబిట్) రూ.8,649 కోట్లుగా నమోదైంది.

ఆదాయ అంచనా 3.75-4.5%: పూర్తి ఆర్థిక సంవత్సరానికి (2024-25)కి స్థిర కరెన్సీ పద్ధతిన ఆదాయ అంచనాలను 3.75-4.5 శాతానికి ఇన్ఫోసిస్ పెంచింది. కీలక ఆర్థిక సేవల క్లయింట్ల నుంచి గిరాకీ పుంజుకోవడం, దాదాపు అన్ని విభాగాలూ రాణిస్తుండటం ఇందుకు కారణమంది. ఆర్థిక సంవత్సరం మొదట్లో ఆదాయ వృద్ధి అంచనాను 1-3 శాతంగా పేర్కొన్న సంస్థ, జూన్ త్రైమాసికంలో 3-4 శాతానికి సవరించింది. తాజాగా మళ్లీ పెంచింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి నిర్వహణ మార్జిన్ అంచనాలను 20-22 శాతంగా కొనసాగించింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో ఆపరేటింగ్ మార్జిన్ 21.1 శాతంగా, పెద్ద ఒప్పందాల విలువ 2.4 బి.డాలర్లుగా నిలిచింది.

రూ.21 మధ్యంతర డివిడెండు: ఒక్కో షేరుకు రూ.21 మధ్యంతర డివిడెండును ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఇందుకు రికార్డు తేదీ అక్టోబరు 29 కాగా, చెల్లింపు తేదీ నవంబరు 8.

రతన్ టాటాకు నివాళితోనే మొదలు: ఇన్ఫోసిస్ త్రైమాసిక ఫలితాల అనంతరం కాన్ఫరెన్స్ కాల్‌ను రతన్ టాటాకు నివాళి అర్పించడంతో సంస్థ ప్రారంభించింది. 2001లో ఇన్ఫీ క్యాంపస్‌ను, రతన్ సందర్శించిన వీడియోను ఈ సందర్భంగా ప్రదర్శించారు.



'ఆర్థిక సేవల్లో మంచి వృద్ధికి తోడు ఇతర విభాగాలూ రాణించాయి. మాకున్న అపార అనుభవంతో పాటు క్లౌడ్, జనరేటివ్ ఏఐ టెక్నాలజీల్లో ఉన్న అత్యుత్తమ సామర్థ్యాలతో క్లయింట్లను ఆకట్టుకోగలిగాం. భారీ ఒప్పందాలు 2.4 బి. డాలర్లకు చేరుకోవడం పరిశ్రమలో మా బలమైన స్థానాన్ని ప్రతిబింబిస్తోంది'

- ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్

2,500 నియామకాలు

వరుసగా 6 త్రైమాసికాల పాటు కంపెనీ ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ రాగా, సెప్టెంబరు త్రైమాసికంలో నికరంగా 2,500 మందిని సంస్థ జత చేసుకుంది. ఫలితంగా మొత్తం సిబ్బంది సంఖ్య 317,788కు చేరింది. వలసల రేటు త్రైమాసికం వారీగా 12.7% నుంచి 12.9 శాతానికి పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15,000-20,000 మంది తాజా ఉత్తీర్ణులను నియమించుకునే ప్రక్రియ కొనసాగుతోందని, గతంలో ఆఫర్ లెటర్లు పొందిన అందరినీ తీసుకుంటామని స్పష్టం చేసింది.

వారానికి 25,007 విమాన సర్వీసులు

శీతాకాల షెడ్యూల్ ప్రకటించిన డీజీసీఏ

దిల్లీ: భారతీయ విమానయాన సంస్థలు శీతాకాల షెడ్యూల్‌లో, 124 విమానాశ్రయాల నుంచి వారానికి 25,007 విమాన సర్వీసులు నడపబోతున్నట్లు విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ వెల్లడించింది. వేసవి షెడ్యూల్‌లో 125 విమానాశ్రయాల నుంచి నడిపిన 24,275 విమాన సర్వీసులతో పోలిస్తే ఇవి 3% ఎక్కువ. 2023 శీతాకాల షెడ్యూల్‌తో పోలిస్తే 5.37% అధికం. ప్రస్తుత శీతాకాల షెడ్యూల్ ఈ నెల 27న ప్రారంభమై 2025 మార్చి 29 వరకు ఉంటుంది.



✦ ఈ షెడ్యూల్‌లో ఇండిగో 13,691 విమానాలను నడపబోతోంది. వేసవి షెడ్యూల్‌లో 13,050 డిపార్చర్లతో పోలిస్తే ఇవి 4.91 శాతం ఎక్కువ.

✦ టాటా గ్రూప్‌లోని ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా కలిసి మొత్తం 7,611 సర్వీసులు నడుపుతాయి. ఇందులో ఎయిరిండియా 2,586, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ (ఏఐఎక్స్ కనెక్ట్ విలీనమైంది) 2,832, విస్తారా 2,193 విమాన సర్వీసులను నిర్వహిస్తాయి.

✦ స్పైస్‌జెట్ 1,297 సర్వీసులు, ఆకాశ ఎయిర్ 989 సర్వీసులు నడుపుతాయి.

జావా యెజ్డీ రూ.2 లక్షల బైక్

ఈనాడు, హైదరాబాద్: దేశంలో 250 సీసీ, ఆపై విభాగంలోని ప్రీమియం మోటార్ సైకిళ్ల విపణి వేగంగా విస్తరిస్తోందని జావా యెజ్డీ సీఈఓ ఆశిశ్ సింగ్ జోషి తెలిపారు. మోటార్ సైకిళ్ల వార్షిక అమ్మకాలు 2 కోట్ల వరకు ఉండగా, ఇందులో ప్రీమియం శ్రేణి వాటా 5 శాతమన్నారు. ఈ విభాగంలో ఏడాదికి 15-16% వృద్ధి కనిపిస్తోందని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో 350 జావా 42 ఎఫ్‌జే బైక్‌ను ఆయన ఆవిష్కరించారు. దీని ధర హైదరాబాద్‌లో రూ.2,02,142 (ఎక్స్ షోరూం) నుంచి ప్రారంభం అవుతుంది.



జావా యెజ్డీ ప్రస్తుతం 11 మోడళ్లను విక్రయిస్తుండగా, మార్చి కల్లా మరో 4 మోడళ్లను ఆవిష్కరిస్తామన్నారు. తెలంగాణలో 3, ఆంధ్రప్రదేశ్‌లో 8 కొత్త విక్రయ కేంద్రాలను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. విద్యుత్తు బైక్‌నూ ఆవిష్కరిస్తామన్నారు.

51% పెరిగిన సెంట్రల్ బ్యాంక్ లాభం

దిల్లీ: ప్రభుత్వరంగ సెంట్రల్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.913 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2023-24 ఇదే త్రైమాసిక లాభం రూ.605 కోట్లతో పోలిస్తే, ఇది 51% అధికం. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.8,412 కోట్ల నుంచి రూ.9,849 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ.3,028 కోట్ల నుంచి రూ.3,410 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ 3.29% నుంచి 3.44 శాతానికి పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 4.62% నుంచి 4.59 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.64% నుంచి 0.69 శాతానికి మెరుగయ్యాయి.

వింటేజ్ కాఫీ షేర్లు ఎన్‌ఎస్‌ఈలో నమోదు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుతం బీఎస్‌ఈలోనే ట్రేడ్ అవుతున్న వింటేజ్ కాఫీ అండ్ బెవరేజెస్ షేర్లు ఎన్‌ఎస్‌ఈ లోనూ ట్రేడ్ కానున్నాయి. ఎన్‌ఎస్‌ఈ మెయిన్ బోర్డులో ఈ షేర్ల నమోదుకు అనుమతి లభించిందని, శుక్రవారం (నేడు) నుంచి షేర్ల ట్రేడింగ్ మొదలవుతుందని బీఎస్‌ఈకి కంపెనీ తెలిపింది. ఒక్కో షేరు ముఖ విలువ రూ.10. కంపెనీ జారీ మూలధనం రూ.122.8 కోట్లు (12.28 కోట్ల షేర్లు)గా ఉంది.

విప్రో 1:1 బోనస్ షేర్లు

- రెండో త్రైమాసిక లాభంలో 21.2% వృద్ధి
- ఆఫర్ లెటర్ ఉన్న అందరికీ డిసెంబరులోగా ఉద్యోగం

దిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో తన వాటాదార్లకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేయాలని నిర్ణయించింది. అర్హులైన వాటాదార్లకు, వారి వద్ద ఉన్న రూ.2 ముఖ విలువ గల ప్రతి షేరుకు, ఇంకో షేరు బోనస్‌గా ఇవ్వాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు గురువారం నిర్ణయించింది. ఈ ఏడాది డిసెంబరు 15 కల్లా వాటాదార్ల ఖాతాలో బోనస్ షేర్లు జమయ్యే అవకాశం ఉంది.

✦ జులై- సెప్టెంబరు త్రైమాసికంలో విశ్లేషకుల అంచనాలను మించి విప్రో రాణించింది. కంపెనీ ఏకీకృత నికర లాభం రూ.3,208.80 కోట్లుగా నమోదైంది. 2023-24 ఇదే త్రైమాసిక లాభం రూ.2,646.30 కోట్ల కంటే ఇది 21.2% అధికం. కార్యకలాపాల ఆదాయం రూ.22,515.90 కోట్ల నుంచి 0.95% తగ్గి రూ.22,301.60 కోట్లకు పరిమితమైంది.

✦ ఐటీ సేవల విభాగాదాయం 2% తగ్గి 2,660.1 మిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈ ఏడాది ఏప్రిల్- జూన్‌తో పోలిస్తే ఇది 1.3% ఎక్కువ. అక్టోబరు- డిసెంబరులో ఈ విభాగ ఆదాయం 2607- 2,660 మిలియన్ డాలర్ల శ్రేణిలో నమోదుకావచ్చన్నది కంపెనీ అంచనా. అంటే స్థిరకరెన్సీ రూపేణా జులై- సెప్టెంబరుతో పోలిస్తే 0- 2% తగ్గే అవకాశం ఉంది. అక్టోబరు- డిసెంబరులో తక్కువ పనిరోజులు ఉండటం, ఆదాయంపై ప్రభావం చూపించొచ్చని విప్రో తెలిపింది.



'వ్యూహాలను సమర్థంగా అమలు చేయడం ద్వారా ఆదాయ వృద్ధి, మార్జిన్ల విషయంలో అంచనాలను అందుకున్నాం. పెద్ద కాంట్రాక్టుల బుకింగ్‌లు మరోమారు 100 కోట్ల డాలర్లను మించాయి. ఇప్పటికే కంపెనీ నుంచి ఆఫర్‌లెటర్ పొందిన వారికి, డిసెంబరులోగా ఉద్యోగావకాశం కల్పిస్తాం. ఏఐ విభాగాల్లో పెట్టుబడులు కొనసాగిస్తాం'

- శ్రీని పల్లియా, విప్రో సీఈఓ, ఎండీ

ఈ ఏడాది చివరికల్లా వాళ్లందరూ ఉద్యోగాల్లోకి: ఇప్పటికే సంస్థ నుంచి నియామక ఆఫర్ లెటర్ పొందిన వారందరినీ, ఈ సంవత్సరం చివరి కల్లా ఉద్యోగాల్లోకి చేర్చుకుంటామని విప్రో మానవ వనరుల అధికారి సౌరభ్ గోవిల్ తెలిపారు. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే తాజా ఉత్తీర్ణులను ఉద్యోగంలోకి చేర్చుకుంటున్నాం. తొలి అర్ధభాగంలో, ఒక్కో త్రైమాసికంలో 2,500- 3,000 మంది ఉద్యోగంలో చేరారని గోవిల్ చెప్పారు. ప్రస్తుతం విప్రో సిబ్బంది సంఖ్య 2,33,889గా ఉంది. 2024 సెప్టెంబరు నుంచే పనితీరు ఆధారిత వేతన పెంపును విప్రో అమలు చేసింది. కృత్రిమ మేధ (ఏఐ) విభాగంలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అడ్వాన్స్‌డ్ ఏఐలో ఇప్పటివరకు 44,000 మంది ఉద్యోగులకు విప్రో శిక్షణ ఇచ్చింది.

కరూర్ వైశ్యా బ్యాంకు లాభం రూ.473 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: కరూర్ వైశ్యా బ్యాంకు సెప్టెంబరు త్రైమాసికానికి రూ.473 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.378 కోట్లతో పోలిస్తే, ఇది 25.13% అధికం. నికర వడ్డీ ఆదాయం 15.85% పెరిగి రూ.1,060 కోట్లకు చేరగా, నికర వడ్డీ మార్జిన్ 4.11 శాతంగా ఉన్నట్లు బ్యాంకు వెల్లడించింది. డిపాజిట్ల వ్యయం 40 బేసిస్ పాయింట్లు పెరిగి 5.56% అయ్యింది. మొత్తం వ్యాపారం రూ.1,76,138 కోట్లకు చేరుకుంది. సమీక్షా త్రైమాసికంలో అన్ని విభాగాల్లో మెరుగైన పనితీరు నమోదు చేసినట్లు కరూర్ వైశ్యా బ్యాంకు ఎండీ, సీఈఓ బి.రమేష్ బాబు తెలిపారు. రిటైల్, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ విభాగాలకు ఆశించిన రీతిలో రుణాలు ఇవ్వగలుగుతున్నట్లు పేర్కొన్నారు.

యాక్సిస్ బ్యాంక్ ఆదాయం రూ.37,142 కోట్లు

దిల్లీ: యాక్సిస్ బ్యాంక్ జులై-సెప్టెంబరు త్రైమాసికంలో రూ.7,401.26 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదే కాల లాభంతో పోలిస్తే ఇది 19.29% ఎక్కువ. స్టాండలోన్ ప్రాతిపదికన నికర లాభం 18% పెరిగి రూ.6,917.57 కోట్లకు చేరింది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.31,660 కోట్ల నుంచి రూ.37,142 కోట్లకు పెరిగింది. బ్యాంక్ వడ్డీ ఆదాయం రూ.26,626 కోట్ల నుంచి రూ.30,420 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం 9% పెరిగి రూ.13,483 కోట్లకు చేరింది. వడ్డీయేతర/ఇతర ఆదాయం 34% పెరిగి రూ.6,722 కోట్లకు చేరింది. స్థూల నిరర్థక ఆస్తులు (జీ ఎన్‌పీఏలు) 1.73% నుంచి 1.44 శాతానికి; నికర ఎన్‌పీఏలు 0.36% నుంచి 0.34 శాతానికి మెరుగయ్యాయి.

ఎల్‌టీఐమైండ్‌ట్రీ డివిడెండు రూ.20

దిల్లీ: ఐటీ సేవల సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీ సెప్టెంబరు త్రైమాసికంలో రూ.1,251 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదే కాల లాభం రూ.1,161 కోట్లతో పోలిస్తే ఇది 7.75% అధికం. ఇదే సమయంలో ఆదాయం సైతం 5.91% వృద్ధితో రూ.8,905 కోట్లకు చేరుకుంది. త్రైమాసికం వారీగా చూస్తే లాభం, ఆదాయాలు వరుసగా 10.41%, 3.17% చొప్పున పెరిగాయి. రెండో త్రైమాసికంలో 2,504 మంది ఉద్యోగులను జత చేసుకోవడంతో, మొత్తం సిబ్బంది సంఖ్య 84,438కి చేరిందని కంపెనీ సీఈఓ, ఎండీ దేబాశీస్ ఛటర్జీ పేర్కొన్నారు. రూ.1 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.20 మధ్యంతర డివిడెండును బోర్డు ప్రకటించింది.

కోడి గుడ్లు

18న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	485
వరంగల్	487
విజయవాడ	510
గోదావరి	505
విశాఖపట్నం	505
చిత్తూరు	538


స్వల్పంగా తగ్గిన నెస్లే ఇండియా లాభం

దిల్లీ: దిగ్గజ ఎఫ్ఎంసీజీ సంస్థ నెస్లే ఇండియా, జులై- సెప్టెంబరు త్రైమాసికానికి రూ.899.49 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.908.08 కోట్లతో పోలిస్తే ఇది 0.94% తక్కువ. వినియోగదారుల నుంచి గిరాకీ తక్కువగా ఉండటం, కమొడిటీ ధరలు పెరగడం కంపెనీ లాభంపై ప్రభావం చూపాయి. ఉత్పత్తుల విక్రయాల ద్వారా ఆదాయం రూ.5,009.52 కోట్ల నుంచి 1.3% పెరిగి రూ.5,704.76 కోట్లకు చేరింది. దేశీయ అమ్మకాలు రూ.4,823.72 కోట్ల నుంచి 1.23% పెరిగి రూ.4,883.14 కోట్లుగా నమోదయ్యాయి. సవాళ్లతో కూడిన వ్యాపార పరిస్థితులు ఉన్నప్పటికీ.. మెరుగైన పనితీరును కొనసాగించామని నెస్లే ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టరు సురేశ్ నారాయణన్ తెలిపారు. తమ ప్రధాన 12 బ్రాండ్లలో 5 బ్రాండ్లు రెండంకెల వృద్ధిని నమోదు చేసినట్లు చెప్పారు.

భారత్‌లో రవాణా వ్యయాలు జీడీపీలో 9 శాతానికి తగ్గుతాయ్

రాబోయే రెండేళ్లపై మంత్రి గడ్కరీ

దిల్లీ: రాబోయే రెండేళ్లలో భారత్‌లో రవాణా వ్యయాలు జీడీపీలో 9 శాతానికి తగ్గుతాయని కేంద్ర రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. పలు హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలను ప్రభుత్వం నిర్మిస్తుండటం ఇందుకు దోహదం చేస్తుందని నీతిఆయోగ్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన చెప్పారు. ప్రస్తుతం భారత్‌లో రవాణా వ్యయాల వాటా జీడీపీలో 14% కాగా.. ఐరోపాలోని ప్రధాన దేశాలు, అమెరికాలో ఇవి సుమారు 12 శాతంగా ఉన్నాయని గడ్కరీ వెల్లడించారు. చైనాలో రవాణా వ్యయాలు కేవలం 8 శాతమేనని అన్నారు.



అగ్రగామిగా దేశీయ వాహన పరిశ్రమ: భారత వాహన పరిశ్రమను ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేర్చాలన్నది తన లక్ష్యమని గడ్కరీ చెప్పారు. గతేడాది జపాన్‌ను వెనక్కి నెట్టడం ద్వారా ప్రపంచంలో మూడో అతిపెద్ద వాహన విపణిగా భారత్ అవతరించింది. తొలి రెండు స్థానాల్లో అమెరికా, చైనా ఉన్నాయని గడ్కరీ తెలిపారు. 2013లో భారత వాహన పరిశ్రమ పరిమాణం రూ.7.5 లక్షల కోట్లు కాగా.. 2024లో రూ.18 లక్షల కోట్లకు చేరిందని మంత్రి వెల్లడించారు. గణనీయ స్థాయిలో ఉద్యోగాలను ఈ పరిశ్రమ సృష్టిస్తోందని చెప్పారు. రీసైకిల్డ్ టైర్ పౌడరు, ప్లాస్టిక్‌ను రహదారుల నిర్మాణంలో వాడుతున్నామని, దీని వల్ల బిటుమెన్ దిగుమతులపై ఆధారపడటం తగ్గుతోందని వివరించారు. వాతావరణ కాలుష్య నియంత్రణ, సంప్రదాయ ఇంధన దిగుమతులపై ఆధారపడటం తగ్గించుకునేందుకు ఓ విధానాన్ని భారత్ రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రత్యామ్నాయ ఇంధనం, బయో ఇంధనం ఎగుమతికి భారత్‌కు అపార అవకాశాలు ఉన్నాయని గడ్కరీ అన్నారు. మిథనాల్ తయారీకి తక్కువ నాణ్యత బొగ్గు ఉపయోగపడుతుందని తెలిపారు.

భారత్ @ 3

- 2030 కల్లా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ
- పెరుగుతున్న జనాభాతో సవాళ్లు
- ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్



దిల్లీ: ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ 2030 కల్లా ఎదిగే వీలుందని, అయితే పెరుగుతున్న జనాభాతో సవాళ్లు కూడా ఎదురవుతాయని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ అంటోంది. ప్రస్తుతం భారత్ అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. గురువారం విడుదల చేసిన నివేదికలో ఎస్ అండ్ పీ ఇంకా ఏమంటోందంటే..

2047 కల్లా 30 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి..: భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం 3.6 లక్షల కోట్ల డాలర్ల స్థాయిలో ఉండగా, 2047 కల్లా 30 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరాలన్న లక్ష్యంతో ఉంది. వచ్చే మూడేళ్లలో ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో, భారతే వేగవంత వృద్ధిని నమోదు చేయగలదు. 2030 కల్లా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగానూ అవతరించే వీలుంది. జేపీ మోర్గాన్‌కు చెందిన గవర్నమెంట్ ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లోకి ఈ ఏడాది భారత్ చేరింది. ఇందువల్ల భారత ప్రభుత్వానికి అదనంగా నిధులు లభిస్తాయి. దేశీయ క్యాపిటల్ మార్కెట్లో వనరులను పెంచుతుంది. మరిన్ని చర్యల కోసం మదుపర్లు ఎదురుచూస్తున్నారు.

కీలకం ఆసియా పసిఫిక్ దేశాలే..: వచ్చే దశాబ్ద కాలంలో వర్ధమాన మార్కెట్లు కీలక పాత్ర పోషించనున్నాయి. 2035 కల్లా ఇవి సగటున 4.06% జీడీపీ వృద్ధిని నమోదు చేయొచ్చు. అభివృద్ధి చెందిన దేశాల సగటు జీడీపీ వృద్ధి 1.59 శాతానికి పరిమితం కానుంది. 2035 కల్లా వర్ధమాన మార్కెట్లు అంతర్జాతీయ ఆర్థిక వృద్ధిలో 65% వాటాకు చేరుకోవచ్చు. ఆసియా పసిఫిక్‌లో చైనా, భారత్, వియత్నాం, ఫిలిప్పీన్స్ వంటివి ఈ వృద్ధిలో ఎక్కువ వాటా కలిగి ఉండొచ్చు.

భారత్ ఇలా చేయాలి: బలహీన ద్రవ్య లభ్యతకు ఊతమిచ్చేందుకు భారత్ తన మూలధన వ్యయాలను పెంచింది. దీర్ఘకాల వృద్ధికి మద్దతిచ్చే చర్యలూ తీసుకుంది. అయితే జనాభా వల్ల సవాళ్లు ఎదురుకావొచ్చు. దీని వల్ల ఉత్పాదకతను కొనసాగించడానికి పెట్టుబడులు పెంచాల్సి ఉంటుంది.

రూ.6 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరి

2 నెలల కనిష్ఠానికి సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు



ఎఫ్ఐఐల అమ్మకాలు: రూ.7,421 కోట్లు
డీఐఐల కొనుగోళ్లు: రూ.4,980 కోట్లు

సెన్సెక్స్ ▼495 81007 | నిఫ్టీ ▼221 24750

సమీక్ష

విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగడం, దేశీయంగా కార్పొరేట్ దిగ్గజాల సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహ పరుస్తున్నందున.. సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. ఇటీవలి ద్రవ్యోల్బణ గణాంకాలూ ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా బ్యాంకింగ్, వాహన షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఏర్పడింది. సెన్సెక్స్ 495 పాయింట్లు, నిఫ్టీ 221 పాయింట్ల మేర నష్టపోయాయి. ఈ రెండు సూచీలు 2 నెలల కనిష్ఠానికి చేరాయి. బ్యారెల్ ముడి చమురు ధర 0.27% పెరిగి 74.42 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 4పైసలు నష్టపోయి 84.06 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్ నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి.

✦ మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత సంస్థల మార్కెట్ విలువ గురువారం రూ.6 లక్షల కోట్లు తగ్గి రూ.457.25 లక్షల కోట్ల (5.44 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

సెన్సెక్స్ ఉదయం 81,758.07 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,501.36) సానుకూలంగా ప్రారంభమైంది. 81,781.40 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ, అక్కడ నుంచి నష్టపోయింది. ఒక దశలో 80,905.64 పాయింట్ల వద్ద కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 494.75 పాయింట్ల నష్టంతో 81,006.61 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 221.45 పాయింట్లు కోల్పోయి 24,749.85 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,728.90-25,029.50 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 21 షేర్లు నష్టపోయాయి. నెస్లే ఇండియా 3.35%, ఎం అండ్ ఎం 3.32%, అల్ట్రాటెక్ సిమెంట్ 2.70%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.28%, టైటన్ 1.99%, టాటా స్టీల్ 1.87%, మారుతీ సుజుకీ 1.86%, భారతీ ఎయిర్‌టెల్ 1.77%, యాక్సిస్ బ్యాంక్ 1.74%, టాటా మోటార్స్ 1.70%, హెచ్‌యూఎల్ 1.59%, ఎన్‌టీపీసీ 1.59%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.56%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 0.93%, ఐటీసీ 0.89%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.85%, ఏషియన్ పెయింట్స్ 0.78%, బజాజ్ ఫైనాన్స్ 0.76%, కోటక్ బ్యాంక్ 0.62% చొప్పున తగ్గాయి. ఇన్ఫోసిస్ 2.58%, టెక్ మహీంద్రా 2.39%, పవర్‌గ్రిడ్ 1.28%, ఎల్ అండ్ టీ 1.13%, ఎస్‌బీఐ 0.63% పెరిగాయి. బీఎస్ఈలో 1,219 షేర్లు సానుకూలంగా, 2,754 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి.

✦ తమిళనాడు ప్లాంటును రూ.1,500 కోట్లతో ఆధునికీకరించేందుకు ప్రీ-ఫీజుబులిటీ నివేదిక (పీఎఫ్ఆర్)ను హ్యుందాయ్ మోటార్ ఇండియా సమర్పించింది. ఈ విస్తరణతో అదనంగా 155 ఉద్యోగాలు రానున్నాయి. ప్లాంటు పరిమాణం 5.40 లక్షల చదరపు మీటర్ల నుంచి 7.21 లక్షల చ.మీ.కు పెరగనుంది.

✦ సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు మదుపర్లను మెప్పించలేకపోవడంతో **నెస్లే ఇండియా** షేరు బీఎస్ఈలో 3.35% తగ్గి రూ.2,379.70 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.7,959.11 కోట్లు తగ్గి రూ.2.29 లక్షల కోట్లకు పరిమితమైంది.

✦ **బజాజ్ ఆటో** నికర లాభం సెప్టెంబరు త్రైమాసికంలో 31% క్షీణించడంతో బీఎస్ఈలో షేరు 12.87% కోల్పోయి రూ.10,122.30 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.41,664.54 కోట్లు తగ్గి రూ.2.83 లక్షల కోట్లకు పరిమితమైంది.

✦ **విశాల్ మెగా మార్ట్** రూ.8,000 కోట్ల నిధుల సమీకరణ కోసం ఐపీఓకు వచ్చేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ప్రతిపాదిత ఐపీఓ మొత్తం ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిలో ఉండనుంది. ప్రమోటర్ సమయత్ సర్వీసెస్ ఎల్‌ఎల్‌పీ, ఈ ఇష్యూలో షేర్లను విక్రయించనుంది. తాజా షేర్ల జారీ లేదు.

✦ బీఎస్ఈ అనుబంధ సంస్థ అయిన **ఏషియా ఇండెక్స్** బీఎస్ఈ ప్రీమియం కన్సమ్షన్ అనే కొత్త థీమ్యాటిక్ ఇండెక్స్‌ను ప్రారంభించినట్లు గురువారం వెల్లడించింది. దేశంలో భవిష్యత్ వినియోగంపై మదుపర్లకు అవకాశం కల్పించేందుకే ఈ సూచీని ప్రారంభించినట్లు పేర్కొంది.

✦ **హ్యుందాయ్ ఐపీఓకు 2.37 రెట్ల స్పందన:** హ్యుందాయ్ మోటార్ ఇండియా రూ.27,870 కోట్ల తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ముగిసేసరికి 2.37 రెట్ల స్పందన లభించింది. యాంకర్ ఇన్వెస్టర్లకు 4 కోట్లకు పైగా షేర్లు కేటాయించిన సంస్థ, 9,97,69,810 షేర్లను ఐపీఓలో అందుబాటులో ఉంచింది. 23,63,26,937 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. అర్హులైన సంస్థాగత మదుపర్ల (క్యూఐబీ) విభాగం నుంచి 6.97 రెట్ల స్పందన లభించగా, సంస్థాగతేతర మదుపర్ల నుంచి 60%, రిటైల్ మదుపర్ల నుంచి 50% బిడ్లు మాత్రమే దాఖలయ్యాయి.

✦ **నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్** (ఎన్ఎస్‌డీఎల్) రూ.3.12 కోట్లను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి చెల్లించి, డిపాజిటరీ నిబంధనల ఉల్లంఘన కేసును పరిష్కరించుకుంది.

✦ ద్రవ్యోల్బణం మూడేళ్ల కనిష్ఠ స్థాయికి చేరడంతో, ఆర్థిక వృద్ధి కోసం **యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ)** కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 3.25 శాతానికి పరిమితం చేసింది.

✦ **అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్)** భవిష్యత్ వృద్ధి ప్రణాళికలో భాగంగా అర్హులైన సంస్థాగత మదుపర్ల (క్యూఐపీ)కు షేర్ల జారీ ద్వారా రూ.4,200 కోట్లు (500 మిలియన్ డాలర్లు) సమీకరించినట్లు గురువారం వెల్లడించింది. ఒక్కో ఈక్విటీ షేరును రూ.2,962 చొప్పున మొత్తం 1.41 కోట్ల షేర్లను కేటాయించింది.

✦ అర్హులైన సంస్థాగత మదుపర్ల (క్యూఐపీ)కు షేర్ల కేటాయింపు ద్వారా నిధుల సమీకరణ ప్రతిపాదనను ఈ నెల 22న జరిగే డైరెక్టర్ల బోర్డు సమావేశంలో పరిశీలిస్తామని ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ **జొమాటో** గురువారం వెల్లడించింది.

నేటి బోర్డు సమావేశాలు: హిందుస్థాన్ జింక్, జియో ఫైనాన్షియల్, టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్, ఐసీఐసీఐ లాంబార్డ్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్

కొత్త రుణాలు మంజూరు చేయకుండా 4 ఎన్‌బీఎఫ్‌సీలపై ఆర్‌బీఐ ఆంక్షలు

ముంబయి: ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన సచిన్ బన్సల్‌కు చెందిన నవీ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, దిల్లీకి చెందిన డీఎంఐ ఫైనాన్స్ ప్రై.లి., కోల్‌కతాకు చెందిన ఆరోహణ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, చెన్నైకు చెందిన ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థలపై **రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)** ఆంక్షలు విధించింది. అక్టోబరు 21న వ్యాపార వేళలు ముగిసిన తరవాత నుంచి కొత్త రుణాల మంజూరు, పంపిణీ చేయొద్దని ఆయా సంస్థలను ఆదేశించింది. వెయిటెడ్ యావరేజ్ లెండింగ్ రేట్ (డబ్ల్యూఏఎల్ఆర్) ఎక్కువగా ఉండటం, వడ్డీరేట్లు పరిమితికి మించి అధికంగా వసూలు చేస్తున్నాయని గమనించిన నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది.

అమెరికాకు మరిన్ని దేశీయ చిరుతిళ్లు

దీపావళి నేపథ్యంలో వాల్‌మార్ట్ ప్రణాళికలు


దిల్లీ: దీపావళి పండగ నేపథ్యంలో, భారతీయ బ్రాండ్లయిన బికానో, బ్రిటానియా, జయంతి స్పైసెస్ వంటి సంస్థల నుంచి ఆహారోత్పత్తులు, చిరుతిళ్లను అమెరికాకు తీసుకెళ్తున్నట్లు అమెరికా దిగ్గజ రిటైల్ సంస్థ వాల్‌మార్ట్ ప్రకటించింది. 2027 కల్లా, ఏటా 10 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 84,000 కోట్ల) విలువైన ఉత్పత్తులను భారత్ నుంచి సమీకరించాలని వాల్‌మార్ట్ లక్ష్యంగా పెట్టుకుంది. 'అమెరికాలో వాల్‌మార్ట్ వినియోగదార్లకు వైవిధ్యభరిత ఉత్పత్తులను అందించనున్నాం. ఇందులో ప్రీమియం టీ, రెడీ టు ఈట్- ఫ్రోజెన్ ఆహారాలు, సంప్రదాయ చిరుతిళ్లు, సుగంధ ద్రవ్యాలు, పండగ ప్యాక్‌లు (అభినందన్, షాహీ నజరానా..) వంటివి ఉంటాయ'ని వాల్‌మార్ట్ తెలిపింది.

జులై- సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2024-25	నికర లాభం/(నష్టం) 2023-24	మొత్తం ఆదాయం 2024-25	మొత్తం ఆదాయం 2023-24
జిందాల్ స్టెయిన్‌లెస్	609.42	764.03	9823.88	9828.97
హావెల్స్	267.77	249.08	4539.31	3900.33
ఐఓబీ	777	625	8484	6935
టాటా కమ్యూనికేషన్స్	227.23	220.66	5767.3	4872.5
టాటా కెమికల్స్	194	428	3999	3998
సియెట్	121	208	3304	3053

ఈనాడు సినిమా

హీరోగా కాదు.. హంతకుడిలా నటించాలనుకుంటున్నా



షారుక్ ఖాన్

"ఇప్పటి వరకూ ప్రేక్షకులకు నేను హీరోగానే పరిచయమయ్యాను. కానీ.. ఒక హంతకుడి పాత్రలో తెరపై కనిపించాలనేది నా కోరిక" అని అంటున్నారు బాలీవుడ్ అగ్రకథానాయకుడు షారుక్ ఖాన్. గతేడాది వరస హిట్లతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈయన.. ప్రస్తుతం తన రాబోయే సినిమాల విషయంలో ఆచితూచి అడుగులేస్తున్నారు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న షారుక్.. తనకిష్టమైన పాత్రల గురించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "నేను చిత్రపరిశ్రమకు వచ్చిన ఈ 30ఏళ్లలో పూర్తిస్థాయి యాక్షన్ సినిమాల్లో నటించాలనే నా కోరిక 'పఠాన్', 'జవాన్'లతో నెరవేరింది. ఇప్పటి వరకూ సినిమాల్లో షారుక్ అంటే అభిమానులకు హీరోననే తెలుసు. కానీ ఇప్పుడొక చెడ్డ వ్యక్తిలా.. హంతకుడి పాత్రలో తెరపై కనిపించాలనుకుంటున్నా. భవిష్యత్తులో ఇలాంటి పాత్రల్లో అవకాశం వస్తే అంగీకరించడానికి నేను సిద్ధమేన" ని తన మనసులో మాట బయటపెట్టారు షారుక్. దీంతో ఆయన తన కుమార్తె సుహానా ఖాన్‌తో కలిసి నటిస్తున్న 'కింగ్' అనే చిత్రంలో హంతకుడిగా కనిపించనున్నట్లు నెట్టింట్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

50 రోజుల్లో పుష్ప రూల్



అల్లు అర్జున్

ఎన్ని అంచనాలతో వచ్చినా సరే... అస్సలు తగ్గేదేలే అంటూ అందరినీ అలరించేందుకు చిత్రం ముస్తాబవుతోందని తెలిపాయి 'పుష్ప 2' చిత్రవర్గాలు. మరో యాభై రోజుల్లో పుష్ప రూల్ మొదలు కానుందని ప్రకటిస్తూ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశాయి. విజయవంతమైన 'పుష్ప: ది రైజ్'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమే 'పుష్ప 2 - ది రూల్'. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. రష్మిక కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. డిసెంబరు 6న అంటే మరో యాభై రోజుల్లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ విషయాన్ని ప్రకటిస్తూ పుష్ప అధికారిక ముద్రతో కూడిన పోస్టర్‌ని విడుదల చేశాయి సినీ వర్గాలు. ప్రస్తుతం ఈ సినిమా చివరి దశ చిత్రీకరణతోపాటు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. తొలి సగభాగం సినిమా ఇప్పటికే లాక్ అయ్యిందని, ఇటీవలే విడుదలైన పాటలకి, టీజర్‌కి ఎంత స్పందన వచ్చిందో అందుకు దీటుగా తదుపరి ప్రచార కార్యక్రమాల్ని నిర్వహిస్తామని సినీ వర్గాలు తెలిపాయి. ఫహాద్ ఫాజిల్, ధనంజయ, సునీల్, అనసూయ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, ఛాయాగ్రహణం: మిరోస్లా క్యూబా బ్రోజెక్.

రెండు భాగాలుగా అనుష్క సినిమా



అనుష్క

నటి అనుష్క ప్రస్తుతం రెండు సినిమాలతో సెట్స్‌పై తీరిక లేకుండా గడిపేస్తోంది. వాటిలో 'కథనార్ - ది వైల్డ్ సోర్సెరర్' ఒకటి. ఇది అనుష్కకు తొలి మలయాళ చిత్రం. రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. గోకులం గోపాలన్ నిర్మిస్తున్నారు. జయసూర్య కథానాయకుడిగా నటిస్తున్నారు. హారర్ ఫాంటసీ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా దీని చిత్రీకరణ పూర్తయిన సందర్భంగా ఈ విషయంపై చిత్రబృందం స్పష్టత ఇచ్చింది. 212 రోజుల పాటు 6 షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తి చేసినట్లు దర్శకుడు సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు. 9వ శతాబ్దపు క్రైస్తవ మత గురువు కడమత్తత్తు కథనార్ కథను ఆధారం చేసుకుని ఈ సినిమాని తెరకెక్కించారు. ఇందులో అనుష్క మునుపెన్నడూ చూడని విభిన్నమైన అవతారంలో కనిపించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జోరుగా సాగుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీపై స్పష్టత ఇవ్వనున్నారు. ఈ సినిమాకి సంగీతం: రాహుల్ సుబ్రహ్మణ్యం, ఛాయాగ్రహణం: నీల్ డి కున్హా.

'వేట్టయన్'కు ప్రీక్వెల్!



రజనీకాంత్

కథానాయకుడు రజనీకాంత్. దర్శకుడు టి.జె. జ్ఞానవేల్ కలయికలో రూపొందిన చిత్రం 'వేట్టయన్: ది హంటర్'. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. అమితాబ్ బచ్చన్, రానా, ఫహాద్ ఫాజిల్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు దర్శకుడు జ్ఞానవేల్. ఈ సినిమాకి ప్రీక్వెల్ చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. "వేట్టయన్.. అతియాన్ (రజనీకాంత్) గురించే చెబుతుంది. అయితే, తను ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ ఎలా అయ్యారన్న కథను ప్రీక్వెల్‌తో చెప్పాలని అనుకుంటున్నా. ఫహాద్ ఫాజిల్ దొంగగా, పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మారడం.. ఇలా ఈ కథలోని చాలా అంశాలకు బ్యాక్‌స్టోరీ చెప్పాలని ఉంది. అందుకే దీనికి ప్రీక్వెల్ చేసేందుకు ఎక్కువ ఆసక్తితో ఉన్నాను" అని జ్ఞానవేల్ వివరించారు. అలాగే ఆయన తదుపరి ప్రాజెక్ట్‌ను నవంబరు తొలి వారంలో ప్రకటిస్తానన్నారు.

రీటా రీలోడ్



కీర్తి సురేశ్

సాధారణ జీవితం గడుపుతున్న ఓ అమ్మాయి అనుకోని పరిస్థితుల్లో తుపాకీ చేతపట్టాల్సి వచ్చింది. మరి ఆ తర్వాత ఆమె ఎదుర్కొన్న సవాళ్లేంటి? అనేది తెలియాలంటే 'రివాల్వర్ రీటా' సినిమా చూడాల్సిందే అంటున్నాయి సినీవర్గాలు. కథానాయిక కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న నాయికా ప్రాధాన్య చిత్రమిది. కె.చంద్రు దీన్ని తెరకెక్కిస్తున్నారు. గురువారం కీర్తి పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'రీటా స్టైల్‌ను రీలోడ్ చేసే సమయమిది' అనే వ్యాఖ్యతో సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో ఓ మధ్యతరగతికి చెందిన రీటా అనే అమ్మాయిగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది కీర్తి. కామెడీ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో రాధికా శరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఆమె నటించిన తన తొలి హిందీ చిత్రం 'బేబీ జాన్' విడుదలకు సిద్ధంగా ఉంది.

ప్రేక్షకుల నవ్వులే ఆనందం



నరేశ్, శ్రీను వైట్ల, గోపీచంద్, వేణు దోనేపూడి

'విశ్వం'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు గోపీచంద్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీను వైట్ల తెరకెక్కించారు. వేణు దోనేపూడి, టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. కావ్య థాపర్ కథానాయిక. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేసింది చిత్ర బృందం. ఈ సందర్భంగా హీరో గోపీచంద్ మాట్లాడుతూ.. "ఈ చిత్ర విషయంలో దర్శకుడు శ్రీను వైట్లను నేను పూర్తిగా నమ్మాను. తను నాకు మంచి ఫలితాన్ని ఇచ్చారు. ఇందులో నటిస్తున్నప్పుడు నేను నవ్వుతూనే ఉన్నాను. ఈ రోజు థియేటర్లలో ప్రేక్షకుల నవ్వులు చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది" అన్నారు. "ఇది వందశాతం థియేట్రికల్ అనుభూతి అందించే సినిమా. థియేటర్స్‌లో ఫ్యామిలీతో కలిసి చూస్తేనే బాగా ఎంజాయ్ చేస్తారు. ఈ చిత్రాన్ని ఎంతగానో ప్రేమించిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు" అన్నారు దర్శకుడు శ్రీను వైట్ల. ఈ కార్యక్రమంలో గుహన్, చేతన్ భరద్వాజ్, నరేశ్ వి.కె, అమర్, అనిషా అంబ్రోస్ తదితరులు పాల్గొన్నారు.

వాళ్లు నా మాట వినకపోవడమే నా అదృష్టం



సమంత

మరి కొద్ది రోజుల్లో 'సిటాడెల్:హనీ బన్నీ'తో తనలోని యాక్షన్ కోణాన్ని చూపించడానికి సిద్ధమవుతోంది కథానాయిక సమంత. ఆమె, వరుణ్ ధావన్ జంటగా నటిస్తున్న వెబ్‌సిరీస్ ఇది. రాజ్ అండ్ డీకే తీర్చిదిద్దిన ఈ సిరీస్ ట్రైలర్ ఇటీవలే విడుదలై మంచి స్పందనను అందుకుంటోంది. ఇందులో స్పై ఏజెంట్‌గా కనిపించి తన యాక్షన్ సన్నివేశాలతో సినీప్రియుల్ని మురిపించిన సమంత.. అనారోగ్య కారణాల వల్ల మొదట్లో ఈ సిరీస్‌ను తిరస్కరించాలనుకుందట. తాజాగా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇందులో నటించడం గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుందామె. "సిటాడెల్' కథ నా దగ్గరికి వచ్చినప్పుడే నేను మయోసైటిస్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో ఇందులో బన్నీ పాత్రలో నటించలేనని ఈ సిరీస్‌ను తిరస్కరించాలని నిర్ణయించుకున్నా. అందుకే ఈ పాత్ర కోసం మరో నటిని తీసుకొమ్మని దానికి సరిపోయే ఓ నలుగురు కథానాయికల పేర్లను కూడా దర్శకులకు సిఫార్సు చేశాను. రాజ్ అండ్ డీకే నా సూచనను స్వీకరించడానికి నిరాకరించారు. నా ఆరోగ్యం కుదుటపడేవరకు ఎదురుచూశారు. కానీ ఇప్పుడీ సిరీస్ చూస్తుంటే నిజంగా ఆ సమయంలో దర్శకులు తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు. ఎందుకంటే నేను చెప్పినా కూడా మరొకరిని తీసుకోకుండా ఈ పాత్రను నాతో చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా" అని అంది సమంత. వచ్చే నెల 7న విడుదల కానుందీ సిరీస్.

వారి మద్దతే నా ధైర్యం..

ఇటీవల తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై సమంత స్పందిస్తూ.. "ఈ రోజు ఇక్కడ కూర్చోడానికి ఎంతో మంది మద్దతు కారణం. ఇండస్ట్రీకి చెందిన పలువురు సినీ ప్రముఖుల ప్రేమ, వారికి నాపై ఉన్న నమ్మకమే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. కష్టాలను ఎదుర్కోవడంలో వారి మద్దతు నాలో ధైర్యాన్ని నింపింది. వారు నా పక్షాన నిలవకపోతే ఈ సమస్యలను ఎదుర్కోవడానికి నాకు చాలా సమయం పట్టేది" అని చెప్పుకొచ్చింది.

మనసుల్ని బలంగా తాకే చిత్రమిది



శ్రావణి, కిరణ్ అబ్బవరం, అంజన్ రామచంద్ర

అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి జంటగా స్మరణ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'లవ్ రెడ్డి'. గీతాన్ష్ ప్రొడక్షన్స్, సెహరి స్టూడియో, ఎమ్జీఆర్ ఫిలిమ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఈ సినిమా మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ముందస్తు విడుదల వేడుకను నిర్వహించారు. హీరో కిరణ్ అబ్బవరం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మూడేళ్లుగా అంజన్ కుటుంబమంతా 'లవ్ రెడ్డి' కోసం పనిచేస్తున్నారు. వాళ్లంత కష్టపడి చేసిన ఈ చిత్రాన్ని కుటుంబ సమేతంగా చూసి ఆశీర్వదించండి. సినిమా మీద ఎంతో ప్రేమ ఉన్న ఇలాంటి టీమ్ సక్సెస్ కావాలి" అన్నారు. "కుటుంబ సమేతంగా చూడదగ్గ ప్రేమకథా చిత్రమిది. ఈ రోజుల్లో ఇలాంటి కథలు రాయడం, తెరకెక్కించడం చాలా కష్టం" అన్నారు అంజన్ రామచంద్ర. దర్శకుడు స్మరణ్ రెడ్డి మాట్లాడుతూ.. "మనసుల్ని బలంగా తాకే చిత్రంగా 'లవ్ రెడ్డి'ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. దీన్ని అందరూ చూసి ప్రోత్సహిస్తారని కోరుకుంటున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రావణి, తిలక్, జ్యోతి, మదన్ గోపాల్ రెడ్డి, యశస్విని తదితరులు పాల్గొన్నారు.

'ఎమర్జెన్సీ' విడుదలకు సన్నాహాలు



కంగనా రనౌత్

పలు విమర్శల మధ్య కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించిన 'ఎమర్జెన్సీ' విడుదల వాయిదా పడుతూ వస్తోంది. ఎట్టకేలకు సీబీఎఫ్‌సీ సర్టిఫికేట్‌ను జారీ చేసింది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించిన సందర్భం, ఆ సమయంలో ఆమె ఎదుర్కొన్న అసమానతల నేపథ్యంలో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఇందులో ఓ వర్గ ప్రజలను కించపరిచే సన్నివేశాలున్నాయంటూ విడుదలను నిలిపివేయాలని ఆరోపణలను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సీబీఎఫ్‌సీ సర్టిఫికేట్‌ను జారీ చేసిందని, మరికొద్ది రోజుల్లో విడుదల తేదీని ప్రకటిస్తామని సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు కంగన.

ప్రదీప్.. 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'



దీపిక, ప్రదీప్

'30రోజుల్లో ప్రేమించడం ఎలా?' చిత్రంతో హీరోగా తెరకు పరిచయమయ్యారు వ్యాఖ్యాత ప్రదీప్ మాచిరాజు. ఇప్పుడాయన హీరోగా రెండో సినిమాని ప్రకటించారు. దీన్ని నితిన్ - భరత్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి పవన్ కల్యాణ్ తొలి చిత్ర టైటిలైన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' అనే పేరుని ఖరారు చేశారు. ఈ మేరకు గురువారం ఈ చిత్ర ఫస్ట్‌లుక్, మోషన్ వీడియోను విడుదల చేశారు. "ఇదొక వినూత్నమైన లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. సివిల్ ఇంజినీర్ వర్క్ కోసం ఓ గ్రామానికి వచ్చిన హీరో అక్కడి అమ్మాయితో ప్రేమలో పడతాడు. మరి ఆ ప్రేమకథ ఎంత వినోదాత్మకంగా సాగింది.. అందులోని మలుపులు ఏంటన్నది ఆసక్తికరం" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాలో ప్రదీప్‌కు జోడీగా దీపికా పిల్లి సందడి చేయనుంది. వెన్నెల కిశోర్, సత్య తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

దుష్టశక్తితో దైవశక్తి యుద్ధం



మంచు లక్ష్మి

మంచు లక్ష్మి, ఎస్తేర్, శివ కంఠమనేని ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'ఆదిపర్వం' ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో అన్వికా ఆర్ట్స్, ఏఐ (అమెరికా ఇండియా) ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తోంది. గురువారం సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. "1974 - 90ల మధ్య కాలంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా, ఎర్రగుడి అమ్మవారి చుట్టూ అల్లుకున్న పీరియాడిక్ ప్రేమకథతో రూపొందించిన చిత్రమిది. 'అమ్మోరు', 'అరుంధతి' చిత్రాల తరహాలో దుష్టశక్తికీ, దైవశక్తికీ మధ్య యుద్ధం ఇందులో కీలకం. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, భారీ హంగులతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది. 500 థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేస్తామ"ని సినీ వర్గాలు తెలిపాయి. ఆదిత్య ఓం, సుహాసిని, శ్రీజిత ఘోష్, వెంకట్ కిరణ్, సత్యప్రకాశ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఎస్.ఎన్.హరీశ్.

సిరి

ఖాతాలో చిరునామా మార్చారా?



కొన్నేళ్ల క్రితం తీసుకున్న పొదుపు ఖాతా. ఇప్పుడు చిరునామా మారినా.. పాతదే కొనసాగిస్తుంటారు చాలామంది. ఇది పెద్ద పొరపాటు. మీరు చిరునామా మారినప్పుడల్లా బ్యాంకు ఖాతాలో ఆ వివరాలను నవీకరించడం తప్పనిసరి.

ఆర్థిక వ్యవహారాల్లో బ్యాంకు ఖాతా ఎంతో కీలకం. ఇందులో మన ఇంటి చిరునామా, మొబైల్ నంబరు, ఇ-మెయిల్‌లాంటివి ఎప్పుడూ 'అప్డేటెడ్'గా ఉండాలి. లేకపోతే బ్యాంకుల నుంచి వచ్చే సమాచారం మనకు అందకుండా పోతుంది. సైబర్ నేరాలు అధికమవుతున్నాయి. కాబట్టి, మన ఖాతాలో జరిగే ప్రతి లావాదేవీ సమాచారం వెంటనే అందేలా ఏర్పాటు ఉండాలి. మొబైల్ నంబరు, ఇ-మెయిల్‌లాంటివి సరిగా లేకపోతే ఈ సందేశాలు రావు. ఏటీఎం/డెబిట్ కార్డు గడువు ముగిసినప్పుడు బ్యాంకులు నేరుగా మన చిరునామాకే అవి పంపిస్తాయి. చిరునామా సరిగా లేకపోతే ఇబ్బంది పడాల్సింది ఖాతాదారేనని మర్చిపోవద్దు.

చిరునామాను మార్చాలనుకుంటే కొన్ని రుజువులు అవసరం అవుతాయి. ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు, బిల్లులు, అద్దె ఒప్పందంలాంటివి బ్యాంకుకు సమర్పించాల్సి ఉంటుంది.

నేరుగా బ్యాంకు శాఖకు వెళ్లడమే కాకుండా, ఆన్‌లైన్ లేదా మొబైల్ యాప్‌లోనూ చిరునామాను మార్చేందుకు అవకాశం ఉంటుంది. సొంతంగా మార్చుకునేటప్పుడు ఒకటికి రెండుసార్లు తనిఖీ చేయండి. మీ నుంచి అభ్యర్థన వచ్చిన తర్వాత బ్యాంకు మీ ధ్రువీకరణలను పరిశీలిస్తుంది. అన్ని వివరాలూ సరిపోతే, కొత్త చిరునామాను ఆమోదిస్తుంది. ఒకసారి మీ బ్యాంకు ఖాతాను పరిశీలించి, వివరాలన్నీ కొత్తవే ఉన్నాయా లేదా ధ్రువీకరించుకోండి.

మీకు 40 ఏళ్లా?



జీవితంలో నడి వయసు అంటే.. 40 ఏళ్లు ఎంతో కీలకమైన సంధి దశ. పదవీ విరమణ దగ్గరకు వస్తూ ఉంటుంది. పిల్లల చదువులు, ఇతర ఖర్చులు పెరుగుతుంటాయి. తల్లిదండ్రుల బాధ్యతా ఉంటుంది. మరోవైపు ఆరోగ్యంపైనా మరింత శ్రద్ధ పెట్టాలి. ఈ నేపథ్యంలో ఈ వయసు వారి ఆర్థిక ప్రణాళికలు ఎలా ఉండాలో తెలుసుకుందామా...

ఇప్పటి వరకూ ఒక లెక్క.. ఇప్పటి నుంచీ మరో లెక్క అన్నట్లు ఉంటుంది.. 40 ఏళ్లకు వచ్చేనాటికి. జీవితంపై ఒక స్పష్టత వస్తుంది. ఉద్యోగంలో స్థిరత్వం ఉంటుంది. ఆర్థిక బాధ్యతలూ పెరుగుతాయి. ఇల్లు కొనాలనే ఆలోచన ఉంటుంది. భవిష్యత్తుకు భరోసా కల్పించేలా పెట్టుబడులనూ పెట్టాలి. పదవీ విరమణ ప్రణాళికలూ వేసుకోవాలి.

ఖర్చులు తగ్గించుకోండి..

స్థిరమైన ఆర్థిక భవిష్యత్తు కోసం 40 ఏళ్లు దాటిన తర్వాత ఖర్చులను నియంత్రణలోకి తీసుకురావడం చాలా ముఖ్యం. మీ ఆదాయం, ఖర్చుల ఆధారంగా బడ్జెట్‌ను రూపొందించుకోవాలి. అంతగా అవసరం లేని వాటి కోసం ఒక్క రూపాయీ వెచ్చించకూడదు. పొదుపు ఆలోచన పెంచుకోవడం ఇప్పుడు చాలా విలువైనది. అప్పుడే భవిష్యత్తుపై దృష్టి పెట్టేందుకు వీలవుతుంది.

పిల్లల అవసరాలు తీర్చేలా...

పిల్లల భవిష్యత్తు కోసం ఆర్థిక ప్రణాళికలు రూపొందించాల్సిన వయసు ఇది. ఉన్నత చదువుల కోసం ప్రత్యేక పెట్టుబడులు, వివాహానికి సంబంధించిన ఖర్చుల్లాంటివన్నీ లెక్క వేసుకోవాలి. వీటన్నింటికీ అవసరమైనప్పుడు, సరిపోయేంత నిధిని కూడబెట్టాలి. ఊహించని ఖర్చులకూ సిద్ధంగా ఉండాలి. చదువుల ఖర్చు ఏటా 8-10 శాతం పెరుగుతోంది. దీనికి తగ్గట్లుగా ఆలోచించి, సరైన నిర్ణయం తీసుకోవాలి. పిల్లల భవిష్యత్తు రక్షణ కోసం ప్రత్యేక బీమా పాలసీలు, మ్యూచువల్ ఫండ్ పథకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిని పరిశీలించవచ్చు.

ధీమాగా ఉండాలి..

అనుకోని సంఘటనలు కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులను సృష్టిస్తాయి. దీన్ని నివారించేందుకు మీ పేరు మీద కచ్చితంగా బీమా పాలసీ తీసుకోవాలి. ఆర్జించే వ్యక్తి లేని దురదృష్టకర సందర్భంలో జీవిత బీమా పాలసీ కుటుంబానికి ఆర్థిక అనిశ్చితి ఏర్పడకుండా చూస్తుంది. అప్పులను తీరుస్తుంది. కుటుంబం తన లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగపడుతుంది. పిల్లల చదువులు ఆగిపోవు. వార్షికాదాయానికి కనీసం 12 రెట్ల వరకూ జీవిత బీమా పాలసీ ఉండేలా చూసుకోవడం అవసరం.

పొదుపు.. పెట్టుబడులు..

డబ్బు కోసం మీరు ఎంతో కష్టపడుతుంటారు. మరి ఆ డబ్బును ఆదా చేయడంతోపాటు, సరైన పథకాల్లో మదుపు చేసినప్పుడే మెరుగైన ఆర్థిక వృద్ధిని సాధించగలరు. మార్కెట్ ఆధారిత పెట్టుబడులను ఎంచుకోవచ్చు. మీ డబ్బును పెట్టుబడి పెట్టేటప్పుడు మీ నష్టభయ సామర్థ్యాన్ని అంచనా వేసుకోవడం చాలా ముఖ్యం. ఎంత మేరకు నష్టం వచ్చినా తట్టుకోగలరు అనేది అర్థం చేసుకోవాలి. దీని ఆధారంగానే పెట్టుబడులు ఎంచుకోవాలి. ఈక్విటీ పెట్టుబడుల్లో స్వల్పకాలంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణానికి మించిన రాబడిని అందించడంతోపాటు, సంపదను పెంచేందుకూ ఉపకరిస్తాయి. తక్కువ నష్టభయం ఉండే పథకాల్లోనూ కొంత శాతం మదుపు చేయడం మంచిది.

ఆరోగ్య బీమాతో..

వైద్య ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మీ ఆర్థిక శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని, ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవడం ఎంతో అవసరం. సంస్థ అందించే బృంద బీమా ఉన్నప్పటికీ సొంతంగా ఒక పాలసీ తీసుకునే ప్రయత్నం చేయండి. ఇప్పుడున్న పరిస్థితుల్లో కుటుంబానికి అంతటికీ కలిసి రూ.10 లక్షల వరకూ ఆరోగ్య బీమా, దీనిపై మరో రూ.20 లక్షల వరకూ సూపర్ టాపప్ ఉండాలి. ఆరోగ్య బీమా పాలసీకి చెల్లించిన ప్రీమియానికి సెక్షన్ 80డీ ప్రకారం నిబంధనల మేరకు పన్ను మినహాయింపూ (పాత పన్ను విధానంలో) లభిస్తుంది

విశ్రాంత జీవితంలో..

పదవీ విరమణకు ఇంకా 18-20 ఏళ్ల వయసు ఉంటుంది. కాబట్టి, దీనికోసం దీర్ఘకాలిక ప్రణాళికతో సిద్ధం కావాలి. విశ్రాంత జీవితం ప్రశాంతంగా సాగించేందుకు ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా ప్రత్యేకంగా పెట్టుబడులు ప్రారంభించాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మీ పొదుపు, పెట్టుబడుల వ్యూహాన్ని సమీక్షిస్తూ సర్దుబాటు చేసుకోవాలి. ప్రస్తుత లక్ష్యాలను సాధిస్తూ.. దీర్ఘకాలిక వ్యూహంతో ముందడుగు వేయాలి.

టీడీఎస్ వివరాలకు 12బీఏఏ

ఉద్యోగులకు లభించిన వేతనేతర ఆదాయాలపై మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్), మూలం వద్ద పన్ను వసూలు (టీసీఎస్)కు సంబంధించిన వివరాలను సైతం యాజమాన్యానికి తెలియజేసేందుకు కొత్త పత్రం వచ్చింది. ఇందుకోసం 12బీఏఏను తీసుకొచ్చినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) వెల్లడించింది. ఉద్యోగులకు జీతం కాకుండా ఇతర వివిధ ఆదాయ వనరులు అంటే.. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ, ఈక్విటీ పెట్టుబడుల నుంచి వచ్చిన డివిడెండ్లపై టీడీఎస్, కారు లేదా విదేశీ కరెన్సీని కొనుగోలు చేసినప్పుడు టీసీఎస్‌లాంటివి ఉంటాయి. వీటన్నింటినీ యాజమాన్యానికి అందించేందుకు ఇప్పటివరకూ వీలు లేదు. ఈ కొత్త ఫారం వల్ల ఇతర టీడీఎస్, టీసీఎస్ వివరాలనూ అందించేందుకు వీలవుతుంది.

టీడీఎస్ అయినప్పుడు.. : ◆ పన్ను మినహాయించిన సెక్షన్ ◆ పన్ను మినహాయించిన వ్యక్తి/సంస్థ పేరు ◆ చిరునామా ◆ ట్యాక్స్ డిడక్షన్ అండ్ కలెక్షన్ అకౌంట్ నంబరు (టాన్) వివరాలు ◆ ఎంత మొత్తం పన్ను కోత విధించారు ◆ వచ్చిన ఆదాయం ◆ ఇతర ముఖ్యమైన వివరాలు ఈ పత్రంలో తెలియజేయాలి. టీసీఎస్ సందర్భంలోనూ ఇవే వివరాలు అవసరం అవుతాయి.

లాభమేమిటి? : ఉద్యోగులకు ఈ కొత్త 12బీఏఏ పత్రం వల్ల ప్రయోజనం చేకూరనుంది. సాధారణంగా యాజమాన్యాలు ఇతర ఆదాయ వనరులకు చెల్లించే పన్నును పరిగణనలోకి తీసుకోవు. ఉద్యోగి జీతం, ప్రకటించిన పెట్టుబడుల ఆధారంగానే టీడీఎస్ చేస్తుంటాయి. దీనివల్ల తరచూ అదనపు టీడీఎస్‌కు కారణం అవుతుంది. ఫారం 12బీఏఏతో ఉద్యోగులు తాము చెల్లించిన టీడీఎస్, టీసీఎస్ వివరాలను తెలియజేసేందుకు వీలు ఏర్పడనుంది. దీనివల్ల కచ్చితమైన పన్ను మొత్తాన్ని టీడీఎస్ చేసేందుకు అవకాశం ఉంటుంది.

స్టాక్ మార్కెట్ సేవల సంస్థల్లో...

స్టాక్ మార్కెట్, దానికి సంబంధించిన కార్యకలాపాల్లో నిమగ్నమైన సంస్థల్లో పెట్టుబడి పెట్టే లక్ష్యంతో టాటా మ్యూచువల్ ఫండ్ కొత్తగా టాటా నిఫ్టీ క్యాపిటల్ మార్కెట్ ఇండెక్స్ ఫండ్‌ను తీసుకొచ్చింది. ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 21 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.5,000. ఇది ఇండెక్స్ తరగతికి చెందిన ఓపెన్ ఎండెడ్ పథకం. కొత్తగా ప్రవేశ పెట్టిన నిఫ్టీ క్యాపిటల్ మార్కెట్స్ ఇండెక్స్ ఆధారంగా ఈ పథకాన్ని టాటా మ్యూచువల్ ఫండ్ తీసుకొచ్చింది. నిఫ్టీ 500 ఇండెక్స్ ఈ పథకం పనితీరుకు కొలమానం. అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలు, స్టాక్ బ్రోకింగ్ కంపెనీలు, స్టాక్ ఎక్స్ఛేంజీలు, డిపాజిటరీ, క్లియరింగ్ సేవలను అందించే సంస్థల్లో మదుపు చేస్తుంది. కొత్త మదుపరుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో స్టాక్ మార్కెట్ కార్యకలాపాల్లో ఉన్న సంస్థల ఆదాయాలు, లాభాలు బాగుంటున్నాయి. ఇలాంటి సంస్థలను గుర్తించి, పెట్టుబడులు పెట్టడం ద్వారా మదుపరులకు లాభాలు తెచ్చిపెట్టడం ఈ పథకం వ్యూహం.

నష్టభయం తట్టుకుంటే

ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్ నుంచి స్మాల్ క్యాప్ పథకం అందుబాటులోకి వచ్చింది. ట్రస్ట్ ఎంఎఫ్ స్మాల్ క్యాప్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 25. కనీస పెట్టుబడి రూ.1,000. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 టీఆర్ఐ సూచీతో ఈ పథకం పనితీరును పోల్చి చూస్తారు. సాధారణంగా స్మాల్ క్యాప్ పథకాల్లో అధిక నష్టభయంతో పాటు మంచి ప్రతిఫలం ఉంటుందనేది తెలిసిన విషయమే. వరుసగా కొన్నేళ్ల పాటు ఇలాంటి పథకాల్లో ఎలాంటి లాభాలు కనిపించని సందర్భాలూ ఉంటాయి. పైగా కొంత నష్టమూ ఉండొచ్చు. అన్ని సందర్భాల్లోనూ ఒత్తిడి తట్టుకోగల మదుపరులే స్మాల్ క్యాప్ పథకాల్లో పెట్టుబడికి సిద్ధం కావాలి. దీర్ఘకాలంలో మెరుగైన లాభాలను స్మాల్ క్యాప్ పథకాలు ఆర్జిస్తున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మదుపరులు ఈ అంశాలతోపాటు, నష్టాన్ని తట్టుకునే శక్తి, ఉన్న వ్యవధి తదితర అంశాలను బేరీజు వేసుకొని, పెట్టుబడి నిర్ణయం తీసుకోవాలి.

డిజిటల్ రంగంలో

కొత్త పథకం

మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్.. దేశంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ సేవల విభాగాల్లో నిమగ్నమైన కంపెనీలపై పెట్టుబడి పెట్టే అవకాశాన్ని కల్పిస్తోంది. ఇందుకోసం మోతీలాల్ ఓస్వాల్ డిజిటల్ ఇండియా ఫండ్ అనే కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. దీని ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 25. కనీస పెట్టుబడి రూ.500. ఈ పథకంలో నష్టభయం కాస్త ఎక్కువే. ప్రతిఫలమూ అధికంగా ఉండే అవకాశాలున్నాయి. డిజిటల్ విభాగంలోని సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇ-కామర్స్, టెలికాం, మీడియా తదితర రంగాల్లో ఇది ప్రధానంగా పెట్టుబడులు పెడుతుంది.

పర్యావరణ హితంగా

వైట్‌వోక్ క్యాపిటల్ మ్యూచువల్ ఫండ్ ఒక ఆసక్తికరమైన పథకాన్ని తీసుకొచ్చింది. ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్ అండ్ గవర్నెన్స్) విభాగానికి చెందిన కంపెనీల్లో అత్యున్నతమైన పరిపాలనా విధానాలు పాటించే కంపెనీలను ఎంపిక చేసి పెట్టుబడి పెట్టటం వైట్‌వోక్ క్యాపిటల్ ఈఎస్‌జీ బెస్ట్-ఇన్-క్లాస్ స్ట్రాటజీ ఫండ్ ప్రధాన వ్యూహం. తద్వారా మదుపరులకు పరిమితమైన నష్టభయంతో మెరుగైన లాభాలు ఆర్జించాలనే లక్ష్యాన్ని ఈ పథకం నిర్దేశించుకుంది. ఎన్ఎఫ్ఓ చివరి తేదీ ఈ నెల 25. కనీస పెట్టుబడి రూ.500. ఇది సెక్టోరియల్/ థీమ్యాటిక్ విభాగానికి చెందిన ఓపెన్ ఎండెడ్ పథకం. పోర్ట్‌ఫోలియో నిర్మాణం కోసం కంపెనీలను ఎంచుకునే ముందు ఒక్కో కంపెనీ యాజమాన్యం తీరుతెన్నులు, వ్యాపార వృద్ధి ప్రణాళికలు, దీర్ఘకాలంలో పోటీని తట్టుకొని మనుగడ సాగించగలిగే శక్తి, లాభదాయకత, అకౌంటింగ్ విధానాలు పరిగణనలోకి తీసుకుంటారు. ఈఎస్‌జీ కంపెనీలపై పెట్టుబడి పెట్టాలని ఆశించే దీర్ఘకాలిక మదుపరులు పరిశీలించవచ్చు.

పదవీ విరమణ ప్రణాళికలపై అవగాహన పెరుగుతోంది

మ్యాక్స్ లైఫ్ ఐఆర్ఐఎస్ 4.0 నివేదిక

ఉద్యోగం చేస్తున్నప్పుడే పదవీ విరమణ ప్రణాళికల గురించి ఆలోచిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోందని మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ నివేదిక వెల్లడించింది. 35 ఏళ్లప్పటి నుంచే విశ్రాంత జీవితం గురించి పెట్టుబడులు పెడుతున్న వారి సంఖ్య 44 శాతానికి పైగానే ఉందని ఈ బీమా సంస్థ విడుదల చేసిన ఇండియన్ రిటైర్మెంట్ ఇండెక్స్ స్టడీ (ఐఆర్ఐఎస్ 4.0) వెల్లడించింది. ఆసక్తికరంగా సర్వేలో పాల్గొన్న 63 శాతం మంది ఇప్పటికే పదవీ విరమణ ప్రణాళికలను ప్రారంభించినట్లు పేర్కొంది. ప్రాథమిక, విలాసవంతమైన అవసరాలు, పిల్లల భవిష్యత్తుకు రక్షణ కల్పించడంతోపాటు దీనికీ ప్రాధాన్యం ఇస్తున్నారు. నివేదికలోని ఇతర విషయాలను గమనిస్తే..



- పదవీ విరమణ నాటికి ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచన 42 శాతం మంది వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రథమ శ్రేణి నగరాల్లో ఇది అధికంగా కనిపిస్తోంది.
- ఇతరులతో పోలిస్తే ఇద్దరూ ఆర్జిస్తూ, పిల్లలు లేని దంపతులు పదవీ విరమణ ప్రణాళికలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.
- ఇదే సమయంలో పలు రంగాల్లో పనిచేసే గిగ్ వర్కర్లలో 76 శాతం మంది పని మానేసిన తర్వాత కుటుంబ కనీస అవసరాల గురించి ఆందోళన చెందుతున్నారు. 75 శాతం మంది పిల్లల చదువులు, ఇతర ఖర్చుల విషయంలో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.
- పట్టణాల్లో ఉన్న 70 శాతం మంది విశ్రాంత జీవితంలో ఒత్తిడి లేకుండా, కుటుంబంతో కలిసి ఉంటామని భావిస్తున్నారు. ఆరోగ్యం క్షీణిస్తుందని, ఒంటరిగా ఉండాల్సి వస్తుందని 27 శాతం మంది అనుకుంటున్నారు.

ఎన్‌పీఎస్‌పై పెరిగిన విశ్వాసం


జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)పై ఉద్యోగుల విశ్వాసం పెరుగుతోంది. దాదాపు 90 శాతం మంది ఎన్‌పీఎస్‌ను సురక్షితమైన, నమ్మకమైన పెట్టుబడి సాధనంగా పేర్కొన్నారు. ముఖ్యంగా ద్వితీయ శ్రేణి పట్టణాల నుంచి ఎన్‌పీఎస్‌లో ఎక్కువగా చేరుతున్నారు. ముఖ్యంగా ఆకర్షణీయమైన రాబడి, జీవితాంతం పింఛను సౌకర్యం, పన్ను ఆదా అంశాలు దీనికి కారణం అవుతున్నాయి.

మెరుగ్గా మహిళలు..

పదవీ విరమణ ప్రణాళికల విషయంలో మహిళలు పురుషులకంటే భిన్నంగా ఆలోచిస్తున్నారు. గతంతో పోలిస్తే ఒక శాతం మెరుగ్గా ఉన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తున్న మహిళలలో ఆర్థిక అవగాహన పెరిగింది. 66 శాతం మంది మహిళలు ప్రస్తుత పెట్టుబడులు తమకు పదవీ విరమణ సమయంలో ఆర్థిక రక్షణ కల్పిస్తాయని భావిస్తున్నారు. 48 శాతం మంది మహిళలు రిటైర్మెంట్ తర్వాతా పూర్తి ఆరోగ్యంగా ఉంటామని తెల్పి చెప్పారు.

అత్యవసర నిధి సిద్ధంగా ఉందా?

అత్యవసరంలో వాడుకునేందుకు వీలుగా మన దగ్గర ఎప్పుడూ కొంత డబ్బు ఉండాలి. ఈ మొత్తాన్ని సమకూర్చుకునేందుకు ఒక ప్రణాళిక అవసరం. అప్పుడే ఈ నిధి ఏర్పడుతుంది. మరి దీనికోసం ఏం చేయాలో చూద్దామా..



చిన్న అవసరం వచ్చినా రుణం తీసుకోవడం... చేబదులుగా మిత్రులు, బంధువులను అడగడం చాలామందికి అలవాటు. జీవితం అంటేనే అనిశ్చితి. ఎలాంటి హెచ్చరికలు లేకుండానే ఎన్నో ఖర్చులు వస్తుంటాయి. వైద్యపరమైన అత్యవసరం, ఇల్లు, వాహన మరమ్మతు, ఉద్యోగం మారాల్సి రావడంలాంటివి ఎన్నో ఉంటాయి. వీటన్నింటికీ సిద్ధంగా ఉండాలంటే అత్యవసర నిధి రూపంలో కొంత డబ్బు మన దగ్గర ఎప్పుడూ ఉండాల్సిందే. ఆర్థిక నిపుణులు చెప్పే సూచనల ప్రకారం కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపోయే మొత్తం అత్యవసర నిధిగా ఉండాలి. అంటే, మీకు నెలకు రూ.40వేలు ఖర్చవుతుంటే.. రూ.2,40,000 ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలి. వ్యాపారం చేస్తున్న వారు కనీసం ఏడాది ఖర్చులను పక్కన పెట్టుకోవాలి. మీ జీవన శైలి, కుటుంబ పరిస్థితి, ఇతర బాధ్యతల ఆధారంగా ఇది మారవచ్చు. ఖర్చులతోపాటు రుణ వాయిదాలనూ లెక్కలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది.

సరైన పథకంలో..

అత్యవసరంలో వాడుకునేందుకు ఈ మొత్తాన్ని పెట్టుకుంటున్నాం కాబట్టి, సులభంగా తీసుకునేందుకు వీలుండాలి. మార్కెట్ ఆధారిత పథకాల్లో పెట్టుబడి పెట్టడం వల్ల హెచ్చుతగ్గులు కనిపిస్తాయి. కాబట్టి, స్థిరమైన రాబడిని అందించే పథకాలనే ఎంచుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. అధిక వడ్డీనిచ్చే పొదుపు ఖాతాలు, డెట్ మ్యూచువల్ ఫండ్లను పరిశీలించాలి.

◆ వచ్చిన ఆదాయంలో నుంచి ప్రతి నెలా కొంత మొత్తం అత్యవసర నిధికి వెళ్లేలా ఏర్పాటు చేయండి. దీనివల్ల మీ ప్రమేయం లేకుండానే ఆ మొత్తం పెరిగేందుకు వీలవుతుంది. మీరే ప్రతి నెలా జమ చేస్తుంటే.. కొన్నిసార్లు దాన్ని పట్టించుకోకపోవచ్చు. ప్రాథమిక పొదుపు ఖాతా నుంచి రికరింగ్ డిపాజిట్ ఖాతాకు ఈ మొత్తాన్ని మళ్లించండి.

ఎప్పుడు వాడాలి..

అత్యవసర నిధిని వైద్యపరమైన ఇబ్బందులు, ఉద్యోగం కోల్పోయిన సందర్భాల్లో మాత్రమే వాడుకోవాలి. అంతేకానీ, వినోదాలు, విహార యాత్రలకు దీన్ని ఉపయోగించడం సరికాదు.

◆ మీ ఆదాయం పెరిగినా, అతిగా ఖర్చు చేయడం మానుకోండి. జీవన శైలి ద్రవ్యోల్బణం మీ పొదుపు మొత్తాలను వేగంగా నాశనం చేస్తుంది.

◆ క్రెడిట్ కార్డు రుణాన్ని పెంచుకోవడం లేదా తిరిగి చెల్లించకుండా ఉండటం ఆర్థికంగా ఇబ్బందులకు దారి తీస్తుంది. అత్యవసర నిధి ఉంటే ఊహించని ఖర్చులు తలెత్తినప్పుడు క్రెడిట్ కార్డు వాడాల్సిన అవసరం ఉండదు.

◆ ఆరోగ్య బీమా ఉంది కదా... అత్యవసర నిధి ఎందుకు అని చాలామంది అనుకుంటారు. ఇది పొరపాటు. ఆరోగ్య బీమా వైద్య ఖర్చులను మాత్రమే చెల్లిస్తుంది. అనుబంధంగా ఎన్నో అవసరాలకు డబ్బు కావాల్సి వస్తుందని మర్చిపోవద్దు.

బంగారంలో మదుపు చేయాలనుకుంటే..

మార్గదర్శి

నేను ఇటీవలే ఉద్యోగంలో చేరాను. మరో నాలుగేళ్ల పాటు నెలకు రూ.20వేల వరకూ మదుపు చేయగలను. ఈ పరిస్థితుల్లో నా ఆర్థిక ప్రణాళిక ఎలా ఉండాలి. - చంద్ర



❐ కాస్త అధిక రాబడి రావాలంటే ఈక్విటీ ఆధారిత పెట్టుబడి పథకాలను ఎంచుకోవాలి. మీకు నాలుగేళ్ల సమయం ఉంది కాబట్టి, హైబ్రిడ్ ఈక్విటీ, బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లలో క్రమానుగతంగా మదుపు చేయండి. నాలుగేళ్లపాటు పెట్టుబడిని కొనసాగిస్తే.. 10.5 శాతం సగటు రాబడితో రూ.11,22,061 జమయ్యే వీలుంది.

మా అమ్మాయి వయసు 15. తన భవిష్యత్తు అవసరాల కోసం బంగారంలో మదుపు చేయాలని అనుకుంటున్నాం. నెలకు రూ.60వేల వరకూ పెట్టుబడి పెట్టగలం. నేరుగా బంగారం కొనకుండా ఎలాంటి పథకాలను ఎంచుకోవచ్చు? - శైలజ

❐ బంగారంలో మదుపు చేయాలనుకోవడంలో తప్పు లేదు. కానీ, మొత్తం పెట్టుబడిని ఒకే చోట పెట్టడం వల్ల కొన్నిసార్లు మంచి రాబడిని ఆర్జించే అవకాశాలు కోల్పోతాం. మరో రెండుమూడేళ్ల తర్వాత మీ అమ్మాయి చదువు కోసం పెద్ద మొత్తంలో డబ్బు అవసరం అవుతుంది. పెళ్లి సమయంలో బంగారమూ కావాలి. ఈ రెండు అవసరాలనూ తీర్చే విధంగా మీరు పెట్టుబడి ప్రణాళిక వేసుకోవాలి. రూ.60వేలలో రూ.25వేలను గోల్డ్ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానంలో మదుపు చేయండి. లేదా గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లనూ (ఈటీఎఫ్) పరిశీలించవచ్చు. మిగతా రూ.35వేలను డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి మళ్లించండి. ఇలా మీ పెట్టుబడిని కనీసం ఏడేళ్లపాటు కొనసాగిస్తే సగటున 12 శాతం వార్షిక రాబడి అంచనాతో రూ.81,35,780 అయ్యేందుకు అవకాశం ఉంటుంది.

నేను బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్‌లో రూ.5లక్షలు జమ చేశాను. దీనికి బదులుగా షేర్లలో మదుపు చేస్తే అధిక రాబడి వచ్చేందుకు అవకాశాలు ఉంటాయి అంటున్నారు. నిజమేనా? - రంజిత్

❐ స్టాక్ మార్కెట్లో కొత్తగా పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లు మంచి మార్గం. ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లతో పోలిస్తే ఇందులో నష్టభయం కాస్త తక్కువగా ఉంటుంది. మార్కెట్లు పతనం అవుతున్నప్పుడూ వీటి ఎన్ఏవీ అంతగా పడిపోదు. మీకు షేర్ మార్కెట్‌పై పూర్తి అవగాహన ఉంటే నేరుగా షేర్లలో మదుపు చేయొచ్చు. కానీ, అధిక నష్టభయం ఉంటుందని మర్చిపోవద్దు. కొన్నిసార్లు పెట్టుబడికీ నష్టం రావచ్చు. కాబట్టి, మీ పెట్టుబడిని బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్‌లోనే కొనసాగించడం మంచిది.

నేను ఆరేళ్ల క్రితం రూ.50లక్షల టర్మ్ పాలసీ తీసుకున్నాను. ఇప్పుడు దీన్ని రద్దు చేసుకొని, కొత్తగా రూ.1.50 కోట్ల పాలసీ తీసుకోవాలని ఆలోచిస్తున్నాను. నెలకు రూ.80వేలు చేతికి వస్తున్నాయి. నాకు ఈ పాలసీ ఇస్తారా? - మహేందర్

❐ బీమా సంస్థలు టర్మ్ పాలసీ ఇచ్చే ముందు పాలసీదారుడి ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తాయి. ఆ తర్వాతే ఎంత మొత్తానికి పాలసీ ఇవ్వాలన్నది నిర్ణయిస్తాయి. కొన్ని బీమా సంస్థలు వార్షికాదాయానికి 20 రెట్ల వరకూ పాలసీని ఇస్తుంటాయి. నెలకు రూ.80వేల ఆదాయం ఉంది కాబట్టి, మీకు రూ.కోటిన్నర పాలసీ వచ్చే అవకాశాలున్నాయి. ఒకే కంపెనీ నుంచి కాకుండా మంచి క్లెయిం సెటిల్‌మెంట్ ఉన్న రెండు కంపెనీలను ఎంచుకొని రూ.75 లక్షల చొప్పున పాలసీని తీసుకోండి. పాత పాలసీని వెంటనే రద్దు చేసుకోకుండా, కొత్త పాలసీలు వచ్చాక ఏడాదిపాటైనా కొనసాగించండి. కొత్తగా పాలసీ తీసుకునేటప్పుడు పాత పాలసీ వివరాలను తెలియజేయడం మర్చిపోవద్దు.

పాత పన్ను విధానంలో కొనసాగుతున్నాను. పన్ను ఆదా కోసం సెక్షన్ 80సీలో ఇంకా రూ.80వేల వరకూ పెట్టుబడి అవకాశం ఉంది. దీనికోసం యూనిట్ ఆధారిత బీమా పాలసీ తీసుకోవచ్చా? - హరీశ్

❐ పాత పన్ను విధానం ఎన్ని సంవత్సరాలు కొనసాగుతుందో చెప్పలేం. దీని ఆధారంగా పెట్టుబడుల ప్రణాళిక ఉండటం అంత మంచిది కాదు. యూనిట్ ఆధారిత బీమా పాలసీ(యులిప్)లో అయిదేళ్ల లాకిన్ వ్యవధి ఉంటుంది. ఏటా తప్పనిసరిగా ప్రీమియం చెల్లించాలి. దీనికి ప్రత్యామ్నాయంగా ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్) ఎంచుకోవచ్చు. దీనికి మూడేళ్ల లాకిన్ వ్యవధి ఉంటుంది. ఏటా పెట్టుబడి పెట్టాల్సిన అవసరమూ ఉండదు.

– తుమ్మ బాల్‌రాజ్

పజిల్ టెస్ట్

పోటీపరీక్షల్లో అభ్యర్థుల విశ్లేషణా సామర్థ్యాలను తెలుసుకునేందుకు అనలిటికల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. ఈ విభాగం నుంచి వచ్చే ప్రధాన అంశాల్లో పజిల్ టెస్ట్ ఒకటి. ఈ రకమైన ప్రశ్నలకు సమాధానాలు సాధించేందుకు ప్రాథమిక గణిత పరిజ్ఞానం అవసరం. తార్కిక ఆలోచన విధానంతో సమాచారాన్ని విశ్లేషించి ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి.



తార్కికంగా ఆలోచిస్తే.. మార్కుల సాధన తేలికే!

పజిల్ టెస్ట్‌లో ప్రశ్నలు కింది రకాలుగా ఉంటాయి.

1. వర్గీకరణ ప్రశ్నలు
2. సీటింగ్/ ప్లేసింగ్ అరేంజ్‌మెంట్స్
3. పోలిక తరహా ప్రశ్నలు
4. వస్తువులు/ అంశాల క్రమానుగత క్రమం
5. ఇచ్చిన నిబంధనల ఆధారంగా సమాధానాన్ని ఎంచుకోవడం
6. కుటుంబ ఆధారిత ప్రశ్నలు
7. మిస్‌లేనియస్ ప్రశ్నలు

సూచన (ప్ర. 1 – 5): కింది సమాచారాన్ని పరిశీలించి ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

B, M, T, R, K, H, D అనే వ్యక్తులు ఒక రైలులో టైర్ - III స్లీపర్ బెర్తులు ఉన్న కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తున్నారు. వీరు ఇంజినీర్, డాక్టర్, ఆర్కిటెక్ట్, ఫార్మాసిస్ట్, లాయర్, జర్నలిస్ట్, పాథాలజిస్ట్‌లుగా పనిచేస్తున్నారు. రెండు లోయర్ బెర్తులు, మూడు మిడిల్ బెర్తులు, రెండు అప్పర్ బెర్తులను తీసుకున్నారు. ఇంజినీర్ అయిన B అప్పర్ బెర్త్‌లో లేరు. B ఏ బెర్త్‌నైతే కలిగి ఉన్నాడో అలాంటి బెర్త్‌ను ఆర్కిటెక్ట్ మాత్రమే కలిగి ఉన్నాడు. M, Hలవి మిడిల్ బెర్త్‌లు కాదు, వారి వృత్తులు వరుసగా పాథాలజిస్ట్, లాయర్. T ఒక ఫార్మాసిస్ట్. D జర్నలిస్ట్ లేదా ఆర్కిటెక్ట్‌లలో ఏదీకాదు. K అనే వ్యక్తి డాక్టర్ కలిగి ఉన్న అదే రకమైన బెర్త్‌ను కలిగి ఉన్నాడు.

1. కింది వారిలో ఆర్కిటెక్ట్ ఎవరు?
1) M 2) R 3) D 4) ఎవరూ కాదు

2. D అనే వ్యక్తి వృత్తి ఏమిటి?
1) లాయర్ 2) డాక్టర్
3) ఫార్మాసిస్ట్ 4) ఇంజనీర్

3. కింది జతల్లో లోయర్ బెర్త్ తీసుకున్న వారెవరు?
1) BD 2) BK
3) BT 4) ఎవరూ కాదు

4. కింది వారిలో మిడిల్ బెర్త్‌లో ఉన్నవారెవరు?
1) DKR 2) DHT
3) HKT 4) DKT

5. కింది వాటిలో వ్యక్తి - బెర్త్ - వృత్తులకు సంబంధించి సరైంది ఏది?
1) K - అప్పర్- లాయర్ 2) D - అప్పర్- డాక్టర్
3) M - లోయర్- జర్నలిస్ట్ 4) R - లోయర్- ఆర్కిటెక్ట్

సాధన:

ప్రయాణికుడు	బెర్త్	వృత్తి
B	లోయర్	ఇంజినీర్
M	అప్పర్	పాథాలజిస్ట్
T	మిడిల్	ఫార్మాసిస్ట్
R	లోయర్	ఆర్కిటెక్
K	మిడిల్	జర్నలిస్ట్
H	అప్పర్	లాయర్
D	మిడిల్	డాక్టర్

సమాధానాలు: 1-2 2-2 3-4 4-4 5-4

సూచన (ప్ర. 6 - 9): ఇచ్చిన సమాచారాన్ని పరిశీలించి ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

P, Q, R, S, Tలు అయిదుగురు స్నేహితులు. వీరంతా గోవా నుంచి విడివిడిగా చెన్నై, కోల్‌కతా, దిల్లీ, హైదరాబాద్, మంగళూరుకు వేర్వేరు రవాణా మార్గాలైన బస్సు, రైలు, విమానం, కారు, పడవ ద్వారా ప్రయాణించారు. దిల్లీకి వెళ్లిన వ్యక్తి పడవ వాడలేదు. R కారులో మంగళూరు వెళ్లాడు. S పడవలో ప్రయాణించాడు. Q కోల్‌కతాకు విమానంలో వెళ్లాడు. T రైలులో ప్రయాణించాడు. దిల్లీ, చెన్నైలకు గోవా నుంచి బస్సు మార్గం లేదు.

6. కింది వాటిలో ప్రదేశం, రవాణాకు సంబంధించి ఏది సరైంది?
1) దిల్లీ - విమానం 2) చెన్నై - పడవ
3) కోల్‌కతా - బస్సు 4) మంగళూరు - రైలు

7. Q : కోల్‌కతా అదే విధంగా S : ....
1) మంగళూరు 2) దిల్లీ 3) చెన్నై 4) హైదరాబాద్

8. కింది వారిలో దిల్లీకి వెళ్లింది?
1) R 2) S 3) Q 4) T

9. కింది వాటిలో Pకి సరిపోలే వాక్యం ఏది?
1) దిల్లీకి రైలులో వెళ్లాడు.
2) కోల్‌కతాకు బస్సులో ప్రయాణించాడు.
3) చెన్నైకి పడవలో వెళ్లాడు
4) హైదరాబాద్‌కి బస్సులో ప్రయాణం చేశాడు

సాధన:

వ్యక్తి	ప్రదేశం	వాహనం
P	హైదరాబాద్	బస్సు
Q	కోల్‌కతా	విమానం
R	మంగళూరు	కారు
S	చెన్నై	పడవ
T	దిల్లీ	రైలు

సమాధానాలు: 6-2 7-3 8-4 9-4

సూచన (ప్ర. 10 – 14): కింది సమాచారాన్ని పరిశీలించి, ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

i. A, B, C, D, E, F, Gలు ఒక గోడపై తూర్పునకు అభిముఖంగా కూర్చున్నారు.
ii. Dకి వెంటనే కుడివైపున C ఉన్నాడు.
iii. B అత్యంత చివరన ఉన్నాడు, E అతని పక్కనే ఉన్నాడు.
iv. G అనే వ్యక్తి E, Fల మధ్య ఉన్నాడు.
v. D దక్షిణంవైపు నుంచి మూడో స్థానంలో ఉన్నాడు.

10. Eకి కుడివైపు కూర్చున్న వారెవరు?
1) G 2) C 3) D 4) F


11. కింది జతల్లో అత్యంత చివరలో కూర్చున్న వారెవరు?
1) AB 2) AE 3) FB 4) CB

12. ఉత్తరంవైపు నుంచి C మూడో స్థానం పొందేలా చేయాలంటే కింది వారిలో ఎవరి స్థానం మార్చాలి?
1) D 2) G 3) F 4) E

13. కింది ఏ జత మధ్య D కూర్చొని ఉన్నాడు?
1) CE 2) CF 3) AF 4) AC

14. సమాచారంలోని i-v నిబంధనల్లో A కూర్చున్న స్థానాన్ని కనుక్కోవడానికి అవసరం లేని నిబంధన ఏది?
1) ii 2) i 3) iii 4) అన్నీ అవసరమే

సాధన:



సమాధానాలు: 10-1 11-1 12-2 13-2 14-4

సూచన (ప్ర. 15 – 19): కింది సమాచారాన్ని పరిశీలించి ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

A, D, Y, U, P, Q, J అనే ఏడుగురు యువకులు ఆషియానా, టాప్-వ్యూ, రిడ్జ్ అనే మూడు వేర్వేరు భవనాల్లో నివసిస్తున్నారు. వారిలో ప్రతి ఒక్కరు వేర్వేరు రంగులైన ఎరుపు, ఆకుపచ్చ, నీలం, తెలుపు, నలుపు, పసుపు, గులాబీ రంగు (అదే క్రమంలో ఉండాల్సిన అవసరం లేదు) గాలిపటాలను ఎగురవేస్తున్నారు. ఏ భవనాల్లోనైనా ముగ్గురి కంటే ఎక్కువ లేదా ఇద్దరి కంటే తక్కువ ఉండకూడదు. Q గులాబీ రంగు గాలిపటం ఎగురవేస్తున్నాడు అంతేకాకుండా J మాత్రమే నివసిస్తున్న ఆషియానా భవనంలో నివసిస్తున్నాడు. Y నలుపు రంగు గాలిపటం ఎగురవేస్తున్నాడు, రిడ్జ్ భవనంలో నివసించడం లేదు. U అనే వ్యక్తి A లేదా P నివసిస్తున్న భవనంలో నివసించడం లేదు, పసుపు రంగు గాలిపటాన్ని ఎగురవేస్తున్నాడు. D రిడ్జ్ భవనంలో మరో వ్యక్తితో నివసిస్తున్నాడు, ఆకుపచ్చ రంగు గాలిపటం ఎగురవేస్తున్నాడు. టాప్-వ్యూ భవనంలో ఎవరూ తెలుపు రంగు గాలిపటాన్ని ఎగురవేయడం లేదు. P నీలం రంగు గాలిపటం ఎగురవేయడం లేదు.



రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

15. రిడ్జ్ భవనంలో ఎవరు నివసిస్తున్నారు?
1) D, U 2) D, A, P
3) Y, A, P 4) A, P

16. నీలం రంగు గాలిపటం ఎవరు ఎగురవేస్తున్నారు?
1) A 2) J
3) P 4) దత్తాంశం సరిపోదు

17. ఎరుపు రంగు గాలిపటం ఎవరు ఎగురవేస్తున్నారు?
1) A 2) J
3) P 4) దత్తాంశం సరిపోదు

18. టాప్ - వ్యూ భవనంలో ఎవరు నివసిస్తున్నారు?
1) Y, J, P 2) A, P
3) A, P, D 4) A, Y, P

19. J అనే వ్యక్తి ఏ రంగు గాలిపటం ఎగురవేస్తున్నారు?
1) నీలం 2) తెలుపు
3) నలుపు 4) దత్తాంశం సరిపోదు

సాధన:

యువకులు	భవనం	గాలిపటం
A	టాప్-వ్యూ	నీలం రంగు
D	రిడ్జ్	ఆకుపచ్చ రంగు
Y	టాప్-వ్యూ	నలుపు రంగు
U	రిడ్జ్	పసుపు రంగు
P	టాప్-వ్యూ	ఎరుపు రంగు
Q	ఆషియానా	గులాబీ రంగు
J	ఆషియానా	తెలుపు రంగు

సమాధానాలు: 15-1 16-1 17-3 18-4 19-2

443 Word of the Day

Repugnant

Telugu meaning: విముఖత, అయిష్టత

English meaning: The word repugnant is an adjective that describes something extremely distasteful or unacceptable.

Synonyms: Disgusting, Abhorrent

Antonyms: Pleasant, Agreeable

Usage: 1. The repugnant smell of the garbage made it impossible to enjoy the park.

2. His views on social equality were repugnant to many in the audience.

నోటిఫికేషన్స్

సీఎస్ఎల్, కేరళ

కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్) అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 307. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 23 అక్టోబరు 2024.

అప్రెంటిస్ పోస్టులు

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం ఖాళీలు 600. దరఖాస్తు రుసుము రూ.150 + జీఎస్టీ. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ 24 అక్టోబరు 2024.

బీఎస్సీ కోర్సులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మర్) 2024-25 విద్యా సంవత్సరానికి బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. చివరి తేదీ 24 అక్టోబరు 2024.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు, ప్రవేశాలకు నేడే (అక్టోబరు 18) ఆఖరు తేదీ

☛ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీజీ ప్రోగ్రామ్. సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీతో పాటు ఐసీఏఆర్ - ఏఐఈఈఏ (పీజీ) 2024 ఉత్తీర్ణులైనవారు అర్హులు.

☛ హ్యూలెట్‌లో క్లౌడ్ డెవలపర్ పోస్టులు. డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులు అర్హులు.

☛ ఎన్ఐటీఎంలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.



ఇండియన్ పాలిటీ

రాష్ట్ర ప్రభుత్వం

రాజ్యాంగం ప్రకారం ప్రతి రాష్ట్రానికి దాని సొంత పరిపాలనా వ్యవస్థ ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వాలు కార్యనిర్వాహక శాఖ, శాసనసభ, న్యాయవ్యవస్థ అనే మూడు శాఖలను కలిగి ఉంటాయి. ఇవి పౌరులకు కావాల్సిన అవసరాలను తీర్చడంలో, సమర్థ పాలన అందించడంలో ప్రభుత్వానికి తోడ్పాటు అందిస్తాయి.

ఈ వీడియోలో రాష్ట్ర ప్రభుత్వం - రాజ్యాంగ వివరణ, రాష్ట్ర కార్యనిర్వాహక శాఖ, శాసననిర్వాహక శాఖ, గవర్నర్ ఆర్డినెన్స్, రాజ్యాంగంలో వాటికి సంబంధించిన ఆర్టికల్స్ - వివరణ మొదలైన అంశాల విశ్లేషణ ఉంది.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వీడియో పాఠం చూడండి.. మరిన్ని వీడియోల కోసం ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబ్ చేయండి!

The 'Father of Photosynthesis' is...

Current Affairs

1. Which of the following persons was sworn in as the Chief Justice of the Delhi High Court?
A) Naresh Patil B) Rakesh
C) Manmohan D) Jagadeesh

2. What is the full form of ITR?
A) Income Tax Return
B) Income Turn Return
C) Income Trial Return
D) Income Tariff Return

3. Which of the following persons of cricket in India achieved the fastest 27000 runs milestone?
A) Virat Kohli B) Suryakumar Yadav
C) Rohit Sharma D) Shubman Gill

4. Which of the following schemes was launched on the occasion of the birth anniversary of Mahatma Gandhi?
A) Dharti Aayog Janjatiya Gram Utkarsh Abhiyan
B) Dharti Aaramb Janjatiya Gram Utkarsh Abhiyan
C) Dharti Aaba Janjatiya Gram Utkarsh Abhiyan
D) Dharam Aaba Janjatiya Gram Utkarsh Abhiyan

5. What is the full form of VOM regarding Space?
A) Venus Orbital Mission
B) Venus Orbiter Mechanism
C) Venus Origin Mission
D) Venus Orbiter Mission

6. Which of the following persons was awarded the Global Prestige Award at the House of Lords, recognizing his contributions to the Indian film industry?
A) Vinod Bachchan B) Rajiv Chandar
C) Gagan Pratap D) Laxman Chatterjee

7. '75 Great Revolutionaries of India' book was written by which of the following persons?
A) Praveen Kumar B) Bhim Singh
C) Sujith Kumar D) Pranav singh

8. World Cerebral Palsy Day is observed on which of the following persons?
A) April 6 B) March 6
C) November 6 D) October 6

General Science

9. Which of the following is the process of breaking down fat into smaller blood cells so that enzymes can operate and food may be digested more easily?
A) Emulsification B) Caramelisation
C) Filtration D) Bromination



10. Which of the following was a British physicist, who won the Nobel Prize (1951) in Physics for splitting the atomic nucleus?
A) J.J. Thomson B) John Cockcroft
C) William Gilbert D) Auguste Bravais

11. Which of the following is not a Micronutrient?
A) Calcium B) Copper C) Iron D) Zinc

12. Who is known for his discovery of photosynthesis and as the 'father of photosynthesis'?
A) Craig Venter B) Joseph Gay Lussac
C) Robert Boyle D) Jan Ingenhousz

SSC Exams Special

General Awareness

Polity

13. Delhi became the capital of India on ....
A) 13 December 1911
B) 12 November 1911 C) 12 December 1911
D) 13 November 1911

14. Which of the following articles speaks about Freedom of trade, commerce and intercourse?
A) Article 290 B) Article 311
C) Article 295 D) Article 301

15. Vernacular Press Act and Arms Act, both enacted by Viceroy ....
A) Lord Ripon B) Lord Lytton
C) Lord Dalhousie D) William Bentick

16. Provision of Suspension of fundamental rights during emergency was borrowed from which country?
A) Germany B) Australia
C) Ireland D) South Africa

History

17. There were .... types of 'land gifts' that Chola kings gave to their people on the basis of Chola inscriptions.
A) Three B) Five C) Four D) Six

18. Muhammad Bin Tughlaq established a separate department (Diwan-i-Amir Kohi) to take care of which sector ?
A) Agriculture B) Defence
C) Finance D) Education

19. Who described the Indian federal system as 'Federalism with Centralising Tendency'?
A) Morris Jones B) Ivor Jennings
C) Dennis Robertson D) Granville Austin

20. Who among the following is not part of Navratnas of Akbar?
A) Abul Fazl B) Tansen
C) Mullah Do Piaza
D) Buland Iqbal

Scan the QR code for Key

*These model questions were prepared by subject experts of **QnA Academy**, Hyderabad*

ప్రిపరేషన్ టెక్నిక్

పుస్తకంలో లేదా నోట్ బుక్‌లో చదివేటప్పుడు ముఖ్యమైన అంశాలను ఇబ్బందిలేని కలర్స్‌తో మార్క్ చేయడం లేదా అండర్‌లైన్ చేయడం ద్వారా హైలైట్ చేసుకోవాలి. దీని వల్ల ప్రధానమైన విషయాలను తేలిగ్గా గుర్తుంచుకోవచ్చు, వేగంగా రివిజన్ చేసుకోవచ్చు.

డీఎస్సీ - 2024
హిందీ కంటెంట్

కరెంట్ అఫైర్స్



■ ఇటీవల భారత నౌకాదళంలో చేరిన అణుశక్తితో నడిచే రెండో బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి (ఎస్ఎస్‌బీఎన్) ఏది? (రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ జలాంతర్గామిని విశాఖపట్నంలో ప్రారంభించారు. అణుశక్తితో నడిచే భారత తొలి బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్)

జ: ఐఎన్ఎస్ అరిఘాత్

మాదిరి ప్రశ్నలు

■ జాతీయ పారిశ్రామిక కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ) కింద ఎన్ని కొత్త పారిశ్రామిక స్మార్ట్ సిటీస్ ఏర్పాటుకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. (ఈ ప్రాజెక్టుల అంచనా పెట్టుబడి మొత్తం రూ. 28,602 కోట్లు. వీటిని 10 రాష్ట్రాల్లో ఏర్పాటు చేయనున్నారు.) జ: 12

■ పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ) కింద భారత పౌరసత్వాన్ని పొందిన మొదటి గోవా వ్యక్తిగా ఇటీవల ఎవరు వార్తల్లో నిలిచారు?

జ: జోసెఫ్ ఫ్రాన్సిస్ పెరైరా

■ ఇరాన్ మొదటి మహిళా ప్రభుత్వ ప్రతినిధిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (ప్రముఖ విద్యావేత్త అయిన ఈమె గతంలో 'టెక్నికల్ అండ్ ఒకేషనల్ ట్రైనింగ్ యూనివర్సిటీ ఆఫ్ షరియా'కి నాయకత్వం వహించారు.)

జ: ఫతేమెహ్ మొహాజెరానీ

మరింత సమాచారం

తేలినా.. మునిగినా.. ఉంటుందో సూత్రం!

జనరల్ స్టడీస్ - భౌతిక శాస్త్రం

అంతపెద్ద ఓడ నీళ్లపై ఎలా తేలుతుంది? గాలితో నిండి ఇంత లావుగా మారిన బెలూన్ కూడా ఎగురుకుంటూ ఏవిధంగా వెళ్లిపోతుంది? ఒకే పరిమాణం ఉన్న చెక్క నీటిపై తేలితే, ఇనుము మునిగిపోతుంది ఎందుకని? ఎప్పుడైనా ఆలోచించారా? వీటన్నింటిలో కొన్ని భౌతికశాస్త్ర సూత్రాలు పనిచేస్తుంటాయి. పదార్థాల స్వభావాన్ని, స్థితిని వాటి సాంద్రత ప్రభావితం చేస్తుంది. తేలడం, మునగడం, ఎగరడాలను అదే నిర్ణయిస్తుంది. భౌతిక శాస్త్రంలో ప్రాథమికాంశాలైన ఈ నియమాలను అభ్యర్థులు తెలుసుకోవాలి. వాటి ఆధారంగా పనిచేసే పరికరాలు, ఉపయోగాలతోపాటు ఆర్కిమెడిస్, పాస్కల్, బెర్నౌలీ సూత్రాలు, సమీకరణాలను అర్థం చేసుకోవాలి. సంబంధిత అనువర్తనాలపై అవగాహన కలిగి ఉండాలి.



భారీ ఓడ



జలాంతర్గామి

తేలియాడే వస్తువులు

కొన్ని రకాల వస్తువులు నీటిలో మునుగుతాయి, మరికొన్ని తేలుతాయి. అలాగే గాజు గోలీలు నీటిలో మునుగుతాయని, చెక్కముక్క నీటిలో తేలుతుందని అందరికీ తెలుసు.

1) రెండు కిలోగ్రాముల చెక్క ముక్క ఒక కిలోగ్రాము ఇనుము కంటే బరువైంది.

2) ఇనుము, చెక్క కంటే బరువైంది.

ఈ వాక్యాల్లో బరువు అనే పదం ఏ అర్థంలో వాడారో తెలుసుకోవాలి. విజ్ఞాన శాస్త్రంలో ఏ పదాన్ని అయినా అందరికీ ఒకే రకంగా అర్థమయ్యే విధంగా ఉపయోగిస్తారు. మొదటి వాక్యం ప్రకారం త్రాసులో ఒక పళ్లెంలో రెండు కిలోగ్రాముల చెక్కను, మరో పళ్లెంలో ఒక కిలోగ్రాము ఇనుమును ఉంచితే త్రాసు దండం చెక్కను ఉంచిన పళ్లెం వైపు వంగుతుంది.

◆ రెండో వాక్యం ప్రకారం.. ఇనుము, చెక్క కంటే బరువైనదంటే ఒకే పరిమాణం ఉన్న ఇనుము, చెక్క ముక్కలను త్రాసు పళ్లాల్లో చెరొక దాన్ని ఉంచితే త్రాసు దండం ఇనుప ముక్కను ఉంచిన పళ్లెం వైపు వంగుతుంది. విజ్ఞానశాస్త్ర పరిభాషలో చెక్క కంటే ఇనుము సాంద్రత ఎక్కువ. బరువు, తేలిక అనేవి సాంద్రత ఆధారంగా నిర్ణయమవుతాయి.

సాంద్రత: ప్రమాణ ఘనపరిమాణం ఉన్న పదార్థ ద్రవ్యరాశిని సాంద్రత అంటారు.

$\therefore$ సాంద్రత = $\dfrac{\text{ద్రవ్యరాశి}}{\text{ఘనపరిమాణం}}$

● నీటి సాంద్రత = 1 gm/cm^3

S.I. యూనిట్ ⟶ kg/m^3

CGS యూనిట్ ⟶ gm/cm^3

◆ ఎక్కువ సాంద్రత ఉండే పదార్థాలు బరువైనవని, తక్కువ సాంద్రత ఉండే పదార్థాలు తేలికైనవని చెప్పవచ్చు.

సాపేక్ష సాంద్రత/తారతమ్య సాంద్రత: ఒక వస్తువు సాంద్రతను నీటి సాంద్రతతో పోల్చడాన్ని సాపేక్ష సాంద్రత అంటారు.

◆ వస్తువు సాపేక్ష సాంద్రత = $\dfrac{\text{వస్తువు సాంద్రత}}{\text{నీటి సాంద్రత}}$

◆ ద్రవం సాపేక్ష సాంద్రత = $\dfrac{\text{ద్రవం ద్రవ్యరాశి}}{\text{అంతే ఘనపరిమాణం ఉండే నీటిద్రవ్యరాశి}}$

◆ పాదరసం సాపేక్ష సాంద్రత = 13.6 (సాపేక్ష సాంద్రతకు ప్రమాణాలు లేవు)



బారోమీటర్

1) ఒకే ద్రవ్యరాశి ఉండే పాలు, నీరు కలిపినప్పుడు ఆ మిశ్రమం ఫలిత సాంద్రత = $\dfrac{2P_1P_2}{P_1+P_2}$

2) ఒకే ఘనపరిమాణం ఉండే పాలు, నీరు కలిపినప్పుడు ఆ మిశ్రమం ఫలిత సాంద్రత = $\dfrac{P_1+P_2}{2}$

వాతావరణ పీడనం(P_o) : భూమిపై ఉన్న అన్ని వస్తువులపై గాలి కలిగించే పీడనాన్ని వాతావరణ పీడనం అంటారు.

$\therefore P_o = pgh$

p = వాతావరణ సాంద్రత

g = గురుత్వ త్వరణం

h = వాతావరణం ఎత్తు

◆ వాతావరణ పీడనాన్ని కొలవడానికి బారోమీటర్ ఉపయోగిస్తారు.

భారమితి (బారోమీటర్): దీన్ని టారిసెల్లి అనే శాస్త్రవేత్త కనుక్కున్నాడు. ఇందులో పాదరసాన్ని ఉపయోగిస్తారు.

◆ సముద్ర మట్టం వద్ద సాధారణ వాతావరణ పీడనం P_o = 76 cm

◆ సముద్ర మట్టం వద్ద వాతావరణ పీడనం ఒక అట్మాస్ఫియర్ పీడనానికి సమానం.

$\therefore$ 1 Atma = 1.01×10^5 పాస్కల్

◆ భారమితిలో పాదరస స్తంభం ఎత్తు హఠాత్తుగా తగ్గడం తుపాను రాకను సూచిస్తుంది.

◆ భారమితిలో పాదరస స్తంభం ఎత్తు నెమ్మదిగా తగ్గడం వర్షం రాకను సూచిస్తుంది.

◆ సముద్ర మట్టం నుంచి ఎత్తుకు వెళ్లేకొద్దీ వాతావరణ పీడనం తగ్గుతుంది. లోతుకు వెళ్లేకొద్దీ పెరుగుతుంది.

నీరు - పీడనం: నీరు మూడు రకాల పీడనాలను కలిగిస్తుంది.

1) **ఊర్ధ్వ పీడనం:** నీరు వస్తువులపై ఊర్ధ్వ దిశలో కలిగించే పీడనాన్ని ఊర్ధ్వ పీడనం అంటారు.

2) **అధో పీడనం:** నీరు పాత్ర అడుగు భాగంలో కలిగించే పీడనాన్ని అధోపీడనం అంటారు.

3) **పార్శ్వ పీడనం:** నీరు పాత్ర పక్కతలాలపై కలిగించే పీడనాన్ని పార్శ్వపీడనం అంటారు.

ఉత్ప్లవన బలం: ద్రవంలో ఉన్న వస్తువులపై ఊర్ధ్వ దిశలో కలగజేసే బలాన్ని ఉత్ప్లవన బలం అంటారు.

◆ ద్రవాల సాంద్రతను కొలిచే పరికరం - హైడ్రోమీటర్

◆ పాల స్వచ్ఛతను కొలిచే పరికరం - లాక్టోమీటర్

ఆర్కిమెడిస్ సూత్రం: ద్రవంలో ఒక వస్తువును పూర్తిగా లేదా పాక్షికంగా ముంచినప్పుడు అది ఆ ద్రవంలో కోల్పోయినట్లు అనిపించే బరువు, ఆ వస్తువు తొలగించిన ప్రవాహి లేదా ద్రవం బరువుకు సమానం.

అనువర్తనాలు: 1) ఆభరణాల స్వచ్ఛతను కనుక్కోవడానికి ఉపయోగపడుతుంది. 2) జలాంతర్గాములు ఈ సూత్రం మీదే పనిచేస్తాయి.

పాస్కల్ నియమం: ప్రత్యేకమైన ఆకారం ఉండే పాత్రలో ద్రవం నింపి ఒకవైపు తక్కువ పీడనాన్ని కలిగిస్తే అది ఆ ద్రవంలో అన్ని వైపుల్లో సమానంగా పీడనాన్ని కలిగించి రెండో వైపు అధిక పీడనాన్ని ఉత్పత్తి చేస్తుంది. దీన్నే పాస్కల్ నియమం అంటారు.

అనువర్తనాలు: 1) హైడ్రాలిక్ బ్రేకులు 2) హైడ్రాలిక్ జాకీలు 3) పత్తి నుంచి పత్తి బేళ్ల తయారీ 4) బ్రామాప్రెస్ పనిచేయడానికి ఈ నియమం ఉపయోగపడుతుంది.

బెర్నౌలీ సూత్రం: భూమికి క్షితిజ సమాంతరంగా, వేగంగా గాలి వీచినప్పుడు వస్తువు పైభాగంలో కంటే అడుగు భాగంలో అధిక పీడనం ఏర్పడి వస్తువులు పై దిశగా కదులుతాయి. దీన్నే బెర్నౌలీ సూత్రం అంటారు.

అనువర్తనాలు: ● విమానం గాల్లోకి ఎగరడం. ● ఫ్యాన్ గాలికి గోడకు తగిలించిన క్యాలెండర్ అడుగుభాగాన కాగితాలు పైకి కదలడం. ● తుపాను గాలికి తాటాకులు, గుడిసె పైకప్పులు ఎగిరిపోవడం. ● గాలిపటం భూమి నుంచి కొంత ఎత్తులో ఎగరడం.



రచయిత: చంటి రాజుపాలెం



Measure of the relative tendency

Plant Physiology

Transport in Plants (2 Marks)

1) What are porins? What role do they play in diffusion?

A: Porins are protein channels. They form huge pores on the outer membranes of plastids, mitochondria and some bacteria they allow small-sized protein molecules to diffuse through them.

2) Define water potential. What is the value of water potential of pure water?

A: The measure of relative tendency of water to move from one part to another part is called water potential. Pure water potential is - Zero (0).

Q&A

(4 Marks)

1) Define and explain water potential.

A: Water potential (ψ_w): Water potential is the measure of the relative tendency of water to move from one part to another part through diffusion, osmosis. Pure water, water potential is zero (0). Water potential has two main components.

i) Solute potential (ψ_s): When a solute is dissolved in pure water, the concentration of pure water decreases. Hence its water potential also decreases. It is called solute potential, it is always negative.

ii) Pressure potential (ψ_p): When some water enters into a plant cell, due to diffusion the pressure against cell wall increases. This makes the cell turgid. This is called pressure potential. It is always positive. Water potential $\psi_w = \psi_s + \psi_p$.

Some More Imp Questions

1) What are apoplast and symplast? **(2 M)**

2) How does guttation differ from transpiration? **(2 M)**

3) Compare the imbibing capacities of pea and wheat seeds. **(2 M)**

4) What is meant by plasmolysis? How is it practically useful to us? **(4 M)**

For Answers

- D. Rakesh

ఆ మొక్క పేరు టెర్రర్ ఆఫ్ బెంగాల్!

మానవ మనుగడకు, పర్యావరణ సమతౌల్యతకు జీవవైవిధ్యం ప్రధానం. నిర్దిష్ట ప్రాంతంలో మొక్కలు, జంతువులు, ఇతర జీవ రాశుల సహజ ఆవాసాలను అది ప్రభావితం చేస్తుంది. స్వచ్ఛమైన గాలి, నీరు, మొక్కల్లో పరాగ సంపర్కం, ఆహార వలయాలు, అడవులు, గడ్డిభూములు, చిత్తడి నేలలు లాంటివన్నీ ఇందులో భాగమే. వ్యవసాయ ఉత్పాదకత, ఆహారభద్రత, జీవన నాణ్యతలకు ఆధారమైన జీవవైవిధ్య స్థితిగతులు దేశంలో, ప్రపంచవ్యాప్తంగా ఏవిధంగా ఉన్నాయో పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. జీవవైవిధ్య హాట్‌స్పాట్‌లకు ఉన్న ప్రాధాన్యం, వాటి పరిరక్షణకు జరుగుతున్న కృషి, ఇందులో నిమగ్నమైన సంస్థలు, కుదిరిన ఒప్పందాలు, చేపడుతున్న చర్యలు, ఎదురవుతున్న సమస్యలు, సవాళ్ల గురించి తెలుసుకోవాలి.



జీవవైవిధ్యం

1. సూక్ష్మజీవులను ఉపయోగించి కాలుష్య కారకాలను తొలగించడాన్ని ఏమంటారు?
   1) బయో లీచింగ్ 2) బయో ప్రాస్పెక్టింగ్
   3) బయో పైరసీ 4) బయో రెమెడియేషన్

2. ఒక వ్యక్తి లేదా సంస్థ స్థానిక ప్రజలకు చెందిన సాంప్రదాయ విజ్ఞానాన్ని వారి అనుమతితో వినియోగించి, సాంప్రదాయ విజ్ఞానం ద్వారా చేకూరే ప్రయోజనాలను వారికి పంచే దృగ్విషయాన్ని ఏమంటారు?
   1) బయో లీచింగ్ 2) బయో ప్రాస్పెక్టింగ్
   3) బయో పైరసీ 4) బయో రెమెడియేషన్

3. ఒక వ్యక్తి లేదా సంస్థ స్థానిక ప్రజలకు చెందిన సాంప్రదాయ విజ్ఞానాన్ని వారి అనుమతి లేకుండా, దాని ద్వారా చేకూరే ప్రయోజనాలను వారికి పంచకుండా చేసే దృగ్విషయాన్ని ఏమంటారు?
   1) బయో లీచింగ్ 2) బయో ప్రాస్పెక్టింగ్
   3) బయో పైరసీ 4) బయో రెమెడియేషన్

4. సూక్ష్మజీవులను ఉపయోగించి, ధాతువుల నుంచి లోహాలను వెలికి తీయడాన్ని ఏమంటారు?
   1) బయో లీచింగ్ 2) బయో ప్రాస్పెక్టింగ్
   3) బయో పైరసీ 4) బయో రెమెడియేషన్

5. మానవ కార్యకలాపాల వల్ల ప్రస్తుతం జీవులు అంతరించిపోయే సామూహిక విలుప్తత అనేది అంచనా వేసిన దానికంటే కూడా ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తల భావన. అయితే ఇది ఎన్నో సామూహిక విలుప్తత?
   1) 6వ 2) 7వ 3) 8వ 4) ఏదీకాదు

6. ప్రపంచ విత్తన బ్యాంకు, భారతదేశ విత్తన బ్యాంకులను వరుసగా ఎక్కడ నెలకొల్పారు?
   1) స్వాల్ బర్డ్ (నార్వే), చంగ్లా (లద్దాఖ్)
   2) జెనీవా (స్విట్జర్లాండ్), న్యూదిల్లీ (ఇండియా)
   3) వాషింగ్టన్ (అమెరికా), హైదరాబాద్ (తెలంగాణ)
   4) టొరంటో (కెనడా), బెంగళూరు (కర్ణాటక)

7. మొక్కలు/జంతువులను వాటి సహజ ఆవాసాలకు వెలుపల సంరక్షించడాన్ని ఏమంటారు?
   1) ఎక్స్-సిటు పరిరక్షణ 2) అన్యదేశ-పరిరక్షణ
   3) ఇన్-సిటు పరిరక్షణ 4) ఏదీకాదు

8. ఒక జనాభా ద్వారా స్రవించే టాక్సిన్స్ ఇతర జనాభా పెరుగుదలకు ఆటంకం కలిగిస్తాయి. దీన్ని ఏమని పిలుస్తారు?
   (ఈ సూత్రం మీద ఆధారపడి సహజ సిద్ధమైన కలుపు నివారిణులను తయారు చేయవచ్చు)
   1) అల్లెలోపతి 2) అల్బినోపతి
   3) హోమియోపతి 4) ఏదీకాదు

9. యాంటీబయోటిక్ పెన్సిలిన్ దేని నుంచి గ్రహిస్తారు?
   1) ఆల్గే 2) ఫంగస్ 3) బ్యాక్టీరియా 4) వైరస్

10. కిందివాటిలో సరికాని జతను గుర్తించండి.
    1) జాతీయ వారసత్వ జంతువు - ఏనుగు
    2) జాతీయ జలచర జంతువు - ఆలివ్ రిడ్లీ తాబేలు
    3) జాతీయ పక్షి - నెమలి
    4) జాతీయ పుష్పం - కమలం

పర్యావరణం

11. జీవవైవిధ్య విలువలో ఎంపిక విలువ ఒకటి అయితే చక్కెరకు ప్రత్యామ్నాయంగా కింది వాటిలో ఏది ఉపయోగపడుతుంది?
    1) షుగర్ బీట్ 2) బీట్‌రూట్
    3) చక్కెర తులసి 4) పొటాటో

12. 'టెర్రర్ ఆఫ్ బెంగాల్' అని ఏ మొక్కను పిలుస్తారు. దేశంలోని నీటిపారుదలకు సంబంధించిన కాలువల్లో విపరీతంగా పెరుగుతూ నీటిపారుదలకు ప్రధాన సమస్యగా ఉంది?
    1) వయ్యారిభామ 2) గుర్రపు డెక్క
    3) సాల్వియా 4) కలువ

13. ఐయూసీఎన్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1948 2) 1949 3) 1950 4) 1960

14. IUCN అంటే?
    1) ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్
    2) ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్
    3) ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్సెస్
    4) సహజవనరుల అంతర్జాతీయ పరిరక్షణ

15. కింది ప్రకటనల్లో ఏది తప్పు?
    1) భారతదేశంతో సహా ప్రపంచంలో 17 మెగా జీవవైవిధ్య దేశాలున్నాయి.
    2) కన్జర్వేషన్ ఇంటర్నేషనల్ 1998లో 17 మెగా జీవవైవిధ్య దేశాలను గుర్తించింది.
    3) గుర్తింపు కోసం ప్రమాణాల్లో మొదటిది దేశంలో 1500 వాస్కులర్ ఎండెమిక్ మొక్కలు ఉండాలి.
    4) దేశం తప్పనిసరిగా తన సరిహద్దుల్లో సముద్ర పర్యావరణ వ్యవస్థను కలిగి ఉండాలి.

16. కిందివాటిలో భారతదేశంలోని బయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్‌లో లేనిది?
    1) సుంద ల్యాండ్ 2) పశ్చిమ కనుమలు
    3) తూర్పు కనుమలు
    4) తూర్పు హిమాలయాలు

17. హాట్‌స్పాట్‌ల భావనను నిర్వచించడంతోపాటు, ప్రచారం చేసే మార్గదర్శక సంస్థ?
    1) కన్జర్వేషన్ ఇంటర్నేషనల్ 2) ఐయూసీఎన్
    3) వరల్డ్ వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ 4) యునెస్కో

18. బయోడైవర్సిటీ హాట్‌స్పాట్ అనే భావనను ప్రవేశపెట్టింది ఎవరు?
    1) నార్మన్ మేయర్స్ 2) ఎర్నెస్ట్ హెకెల్
    3) ఎల్టన్ 4) ఎవరూకాదు

19. జీవవైవిధ్య హాట్‌స్పాట్‌గా అర్హత సాధించడానికి, ఒక ప్రాంతానికి తప్పనిసరిగా రెండు కఠినమైన ప్రమాణాలుండాలి. వీటికి సంబంధించి కింది వాటిలో ఏది సరైంది?
    ఎ) ఇది తప్పనిసరిగా కనీసం 1500 వాస్కులర్ ప్లాంట్లను స్థానికంగా కలిగి ఉండాలి (అంటే అది ఆ ప్రాంతంలో తప్ప భూగ్రహం మీద మరెక్కడా కనిపించకూడదు).
    బి) ఇది దాని అసలు సహజ వృక్షసంపదలో 30% లేదా అంతకంటే తక్కువ కలిగి ఉండాలి. అంటే 70 శాతం వరకు సహజ వృక్షసంపదను కోల్పోయి ఉండాలి.
    1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఏదీకాదు

20. కిందివాటిలో సరికాని ప్రకటన?
    1) భారతదేశం 17 మెగా బయోడైవర్సిటీ దేశాల్లో ఒకటి.
    2) ప్రపంచంలో 36 బయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్ ఉన్నాయి.
    3) ఇండియాలో 3 బయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్ ఉన్నాయి.
    4) ప్రపంచ భూభాగంలో భారత్ వాటా 2.4% కానీ ప్రపంచ జీవవైవిధ్యంలో మనదేశ వాటా 7.8%.

21. జీవవైవిధ్య నష్టానికి కారణాల్లో మొదటిది, ప్రధానమైంది?
    1) ఆవాసాల విధ్వంసం
    2) విదేశీ ఆక్రమణ జాతులు
    3) కాలుష్యం 4) జూమ్ కల్టివేషన్

22. కిందివాటిలో విదేశీ ఆక్రమణ జాతులకు ఉదాహరణలు ఏవి?
    ఎ) వయ్యారిభామ బి) ప్రోసోఫిస్ జూలీ ఫ్లోరా
    సి) గుర్రపు డెక్క
    1) ఎ, బి, సి 2) బి, సి 3) ఎ, బి 4) ఎ, సి

23. జీవవైవిధ్యం కింది మార్గాల్లో మానవ ఉనికికి ఆధారం?
    1) నేల నిర్మాణం 2) నేలకోత నివారణ
    3) వ్యర్థాల రీసైక్లింగ్
    4) పంటల పరాగ సంపర్కం

24. కిందివాటిలో జీవవైవిధ్య నష్టానికి కారణం?
    ఎ) ఆవాసాల విధ్వంసం
    బి) కొత్త జాతుల ఆక్రమణ సి) బుష్ మీట్
    డి) జంతు ప్రదర్శనశాలలో జంతువులను ఉంచడం
    1) ఎ, బి 2) ఎ, బి, సి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

25. కిందివాటిలో పశ్చిమ కనుమలకు సంబంధించి సరికానిది?
    1) మనదేశంలోని నాలుగు బయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్‌లో పశ్చిమ కనుమలు ఒకటి.
    2) పశ్చిమ కనుమలు ఆరు రాష్ట్రాల్లో విస్తరించాయి. అందులో ఆంధ్రప్రదేశ్ ఒకటి.
    3) కావేరి, కృష్ణా, గోదావరి నదులకు పశ్చిమ కనుమలు జన్మస్థానాలు.
    4) పశ్చిమ కనుమల సంరక్షణ కోసం మాధవ గాడ్గిల్, కస్తూరి రంగన్ లాంటి కమిటీలను MOEFCC ఏర్పాటు చేసింది.

26. ICUN (1948), UNEP (1992) ప్రకారం ఒక భౌగోళిక ప్రాంతంలోని వేటి సముదాయాన్ని జీవ వైవిధ్యత అంటారు?
    1) జన్యువుల సముదాయం
    2) జాతుల సముదాయం
    3) ఆవరణ వ్యవస్థల సముదాయం 4) పైవన్నీ

27. కిందివాటిలో సరికాని ప్రకటనను గుర్తించండి.
    1) జీవవైవిధ్యం అనే పదాన్ని మొదటగా డబ్ల్యూ.రోసెన్ ఉపయోగించాడు.
    2) జీవవైవిధ్యం అనే భావనను నార్మన్ మేయర్స్ ప్రవేశపెట్టాడు.
    3) బయోస్ఫియర్ = లిథోస్ఫియర్ + హైడ్రోస్ఫియర్ + అట్మాస్ఫియర్
    4) జీవవైవిధ్యం తక్కువగా ఉంటే ఆవరణ వ్యవస్థల స్థిరత్వం ఎక్కువగా ఉంటుంది

28. భారతదేశంలో అత్యధిక సంఖ్యలో రామ్‌సర్ సైట్‌లున్న రాష్ట్రం ఏది?
    1) పశ్చిమ బెంగాల్ 2) ఉత్తరాఖండ్
    3) తమిళనాడు 4) మహారాష్ట్ర

29. మాంట్రీక్స్ రికార్డ్ కింద భారతదేశంలోని ఏ చిత్తడి నేలలు నమోదయ్యాయి?
    1) కియోలాడియో నేషనల్ పార్కు
    2) లోక్‌తక్ సరస్సు
    3) 1, 2 4) ఏదీకాదు

30. రామ్‌సర్ కన్వెన్షన్ ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
    1) 1975, డిసెంబరు 21
    2) 1985, డిసెంబరు 21
    3) 1980, జనవరి 21 4) ఏదీకాదు

31. కిందివాటిలో మాంట్రీక్స్ రికార్డ్ జాబితాలో ఉన్నవి.
    1) పొడి భూములు 2) చిత్తడి నేలలు
    3) 1, 2 4) ఏదీకాదు

32. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో రామ్‌సర్ చిత్తడి నేలల ప్రాంతాలున్న దేశం?
    1) యునైటెడ్ స్టేట్స్ 2) ఆస్ట్రేలియా
    3) యునైటెడ్ కింగ్‌డమ్ 4) రష్యా

33. రామ్‌సర్ ఒప్పందం ఏ సంవత్సరంలో రూపొందింది?
    1) 1961 2) 1970 3) 1971 4) 1972

34. రామ్‌సర్ కన్వెన్షన్ అనేది వేటి పరిరక్షణ, స్థిరమైన వినియోగానికి సంబంధించిన అంతర్జాతీయ ఒప్పందం?
    1) చిత్తడి నేలలు 2) డ్రైలాండ్స్
    3) నదులు 4) ఏదీకాదు


35. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీని ఎప్పుడు స్థాపించారు? (భారతదేశంలో జీవవైవిధ్య పరిరక్షణ, పరిశోధనలు నిర్వహిస్తున్న అతిపెద్ద ఎన్జీఓ)
    1) 1883 2) 1890
    3) 1947 4) 1952

సమాధానాలు

1-4; 2-2; 3-3; 4-1; 5-1; 6-1; 7-1; 8-1; 9-2; 10-2; 11-3; 12-2; 13-1; 14-2; 15-3; 16-3; 17-1; 18-1; 19-3; 20-3; 21-1; 22-1; 23-4; 24-2; 25-2; 26-4; 27-4; 28-3; 29-3; 30-1; 31-2; 32-3; 33-3; 34-1; 35-1.

మోదీ కృషితో ప్రబల ఆర్థిక శక్తిగా భారత్

- అంతర్జాతీయ స్థాయిలో ఆయనే మన బ్రాండ్
- చండీగఢ్‌లో ఎన్డీయే సీఎంల సమావేశంలో చంద్రబాబు



ఈనాడు, అమరావతి: పదేళ్లుగా ప్రధాని మోదీ చేస్తున్న కృషి, చేపట్టిన కార్యక్రమాలతో భారతదేశం ఆర్థికంగా బలమైన శక్తిగా మారుతోందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. కేంద్రం తీసుకొచ్చిన కార్యక్రమాలతో ప్రపంచంలోనే రెండు, మూడు అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదుగుతోందని ప్రశంసించారు. మోదీ నాయకత్వంపై ప్రజలు మరోసారి విశ్వాసం ఉంచారనేందుకు హరియాణా ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల్లోనూ ఎన్డీయే విజయం ఖాయమని చెప్పారు. చండీగఢ్‌లో గురువారం జరిగిన ఎన్డీయే సీఎంల సమావేశంలో వికసిత్ భారత్ -2047పై చర్చలో భాగంగా ఆత్మనిర్భర్ భారత్, పేదరికం లేని సమాజం, మౌలిక సౌకర్యాల కల్పన, రవాణా ఖర్చులు తగ్గించడం, పెద్దఎత్తున ఉద్యోగాల కల్పన, తక్కువ రేటుకే విద్యుత్తు, నైపుణ్యమున్న మానవ వనరులు, నదుల అనుసంధానం, జనాభా నిర్వహణ, సాంకేతికత సమ్మేళనం తదితర అంశాలపై చంద్రబాబు మాట్లాడారు. 'దృఢమైన నిర్ణయాలు, సుపరిపాలన, మంచి రాజకీయాలు, ప్రత్యేక ఆకర్షణ, కమ్యూనికేషన్ తదితర అంశాలే మోదీని విజయవంతమైన నేతగా నిలిపాయి. ఎంతో మంది ప్రధానులు వచ్చినా.. ప్రపంచంలో భారతదేశాన్ని ఇంతగా బ్రాండ్ చేసింది మోదీయే. గుజరాత్ ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి మోదీ ఏ ఎన్నికల్లోనూ ఓడిపోలేదు. ప్రజలతో ఆయనకున్న అనుబంధం, ఆకాంక్షలను ఇది తెలియజేస్తుంది' అని కొనియాడారు. 'కెప్టెన్‌గా మోదీ తన ఆలోచనతో వికసిత్ భారత్ 2047 దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. అందరం ఆయనకు మద్దతుగా నిలబడదాం.. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని అడుగులు వేద్దాం' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

లాజిస్టిక్ ఖర్చులు 14% తగ్గించుకోవచ్చు

ఓడరేవులు, విమానాశ్రయాలు, లాజిస్టిక్ పార్కులు, అంతర్గత జలమార్గాలు, రైల్వేలు, ఫ్రైట్ కారిడార్లు, ఎక్స్‌ప్రెస్ వేలు తదితర రంగాల్లో ప్రైవేటు భాగస్వామ్యంతో వేగవంతమైన ఫలితాలు సాధించొచ్చని చంద్రబాబు చెప్పారు. నాణ్యమైన మౌలిక సౌకర్యాల కల్పన ద్వారా లాజిస్టిక్ ఖర్చులను 14% తగ్గించుకోవచ్చన్నారు. మనకున్న పునరుత్పాదక ఇంధన వనరులకు సాంకేతికతను జోడిస్తే ఇంధన రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చు. తద్వారా చమురు దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. డేటా ఎనలిటిక్స్, ఏఐ, రోబోటిక్స్ వాడకం ద్వారా రోగనిర్ధారణ, ఆరోగ్య సేవల ఖర్చును భారీగా తగ్గించవచ్చు. ప్రపంచస్థాయి మౌలిక సౌకర్యాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేయాలి' అని చంద్రబాబు సూచించారు.

వాజపేయికి ఆ మాట చెప్పింది నేను, చంద్రబాబే: మోదీ

గతంలో కశ్మీర్‌లో జరిగిన ఎన్డీయే సీఎంల సమావేశంలో.. సంస్కరణలకు సిద్ధంగా ఉన్నామని తాను, చంద్రబాబు అప్పటి ప్రధాని వాజపేయికి చెప్పామని ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు. సంస్కరణలతో పేదలకు లబ్ధి కలుగుతుందని, అంతిమంగా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని నాడు వివరించామన్నారు. వికసిత్ భారత్ 2047 కోసం చంద్రబాబు సూచించిన పలు అంశాలను మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

యువ పర్వతారోహకుణ్ని అభినందించిన గవర్నర్

ఈనాడు, హైదరాబాద్: అరుణాచల్‌ప్రదేశ్‌లోని గోరిచెన్ పర్వతాన్ని అధిరోహించిన అతి పిన్నవయస్కుడిగా గుర్తింపు పొందిన తెలంగాణ యువ పర్వతారోహకుడు బి.యశ్వంత్‌ను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభినందించారు. 2024 సెప్టెంబరులో 6,488 మీటర్ల పర్వతాన్ని అధిరోహించిన ఆయన గురువారమిక్కడ గవర్నర్‌ను కలిశారు. త్వరలో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించనున్నట్లు యశ్వంత్ తెలిపారు.



పర్వతారోహకుడు యశ్వంత్‌ను అభినందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తెలంగాణలో కళారంగాలకు పెద్దపీట

రాష్ట్ర సాంస్కృతిక సంచాలకుడు హరికృష్ణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో జానపద, గిరిజన సాంస్కృతిక, కళారంగాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర సాంస్కృతిక సంచాలకుడు మామిడి హరికృష్ణ తెలిపారు. దిల్లీలో కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ నృత్య మహోత్సవంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సాంస్కృతిక వికాసం, కళారూపాల విశిష్టతను వివరించారు. రాష్ట్రంలో గ్రామీణ కళారూపాల సంరక్షణ, ప్రత్యేక శిక్షణ, అవకాశాలు, పెన్షన్, నగదు ప్రోత్సాహకాల విధానం ద్వారా జానపద, గిరిజన కళల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. అత్యుత్తమ కళాకారులకు రూ.25 లక్షల ప్రోత్సాహకాన్ని, పేద పద్మశ్రీ పురస్కార గ్రహీతలకు రూ.25 వేల పింఛన్‌ను ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు.

మిద్దెతోటలకు తెలంగాణ ప్రోత్సాహం

ఉద్యానశాఖ సంచాలకురాలు యాస్మీన్ బాషా

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మిద్దెతోటల సాగుకు అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తున్నామని రాష్ట్ర ఉద్యానశాఖ సంచాలకురాలు షేక్ యాస్మీన్ బాషా తెలిపారు. సిక్కిం రాష్ట్ర ఉద్యానశాఖ అదనపు సంచాలకుడు బిజు పెరియార్ గురువారం తమ బృందంతో కలిసి తెలంగాణలో పర్యటించారు. ఈ సందర్భంగా మిద్దెతోటల పెంపకాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన యాస్మీన్ బాషాతో సమావేశమై మిద్దెతోటల సాగు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తోటల సాగుకు శిక్షణ శిబిరాలను నిర్వహిస్తూ పెంపకందారుల అనుమానాలను నివృత్తి చేస్తున్నామన్నారు.

అమెరికాలో వేలానికి అరుదైన రాజ్యాంగ ప్రతి

వాషింగ్టన్: అమెరికా రాజ్యాంగానికి సంబంధించి అరుదైన ప్రతిని నార్త్ కరోలినాలో వేలం వేస్తున్నారు. 237 ఏళ్ల క్రితం అమెరికాలో రాష్ట్రాల ఆమోదం నిమిత్తం పంపిన ఈ ప్రతికి కనిష్ఠ బిడ్ 10 లక్షల డాలర్లుగా నిర్ణయించారు. ఫలానా మొత్తం రావాలనే లక్ష్యమేమీ విధించుకోలేదు. రాజ్యాంగ సభ ఏర్పడ్డాక ప్రచురించిన ఈ ప్రతిని 1787లో ఇంకా క్రియాశీలం కాని తొలి అమెరికన్ ప్రభుత్వానికి సమర్పించారు. మార్పుచేర్పుల కోసం అప్పట్లో రాష్ట్రాలకు దీనిని పంపారు. అప్పటి అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్ రాసిన లేఖ ఉన్న ఈ పుస్తకానికి అట్టగా లోహపు రేకును వాడారు. వంద ప్రతులను అప్పట్లో ముద్రించినప్పటికీ ఇప్పటికి ఎనిమిది మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో వీటిలో ఏడు ఉంటే ఒకటి మాత్రమే నార్త్ కరోలినాలో అప్పట్లో గవర్నర్‌గా ఉన్న శామ్యూల్ జాన్సన్ వద్ద ఉంది. ప్రస్తుతం దీన్ని వేలంలో ఉంచారు. 2021లో న్యూయార్క్‌లో ఒక ప్రతిని వేలం వేస్తే 4.32 కోట్ల డాలర్లు పలికింది. ఒక పుస్తకానికి అంత ధర రావడం అదే తొలిసారి.



దిల్లీలో గురువారం కనువిందు చేసిన సూపర్‌మూన్

పౌరసేవలకు డ్రోన్ల విస్తరణ

- విధాన రూపకల్పనకే అమరావతిలో డ్రోన్ సమ్మిట్
- ఏపీలో డ్రోన్ సిటీ ఏర్పాటు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారుల వెల్లడి



అమరావతి డ్రోన్ సదస్సు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, అధికారులు

ఈనాడు, దిల్లీ: ఇప్పటి వరకు సైన్యం, వ్యూహాత్మక అవసరాల ఉపయోగానికే పరిమితమైన డ్రోన్లను పౌరసేవల కోసం విస్తృత స్థాయిలో ఉపయోగించేలా విధాన రూపకల్పన చేసేందుకే అమరావతిలో ఈ నెల 22, 23 తేదీల్లో డ్రోన్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయానశాఖ సీనియర్ ఆర్థిక సలహాదారు పీయూష్ శ్రీవాత్సవ, ఏపీ ప్రభుత్వ మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ప్రకటించారు. కేంద్ర పౌర విమానయానశాఖతో కలిసి ఏపీ ప్రభుత్వం డ్రోన్ సమ్మిట్ నిర్వహించబోతున్న తరుణంలో అధికారులు గురువారం పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసి వివరాలు అందించారు. అనంతరం పీయూష్ శ్రీవాత్సవ విలేకర్లతో మాట్లాడుతూ 'దేశంలో డ్రోన్ రంగం ఆకాశమే హద్దుగా ఎదుగుతోంది. విభిన్న రంగాల్లో డ్రోన్ల ప్రయోగం విజయవంతంగా జరుగుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో వరదల సమయంలో బాధితులకు ఆహారం, మందులు అందజేయడానికి డ్రోన్లు ఉపయోగించారు. ఇలా డ్రోన్లను విభిన్న అవసరాలకు ఉపయోగించే విధానాన్ని అభివృద్ధి చేయాలి. ఇందుకోసం ఒక ఎకో సిస్టమ్‌ను సృష్టించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్రోన్ సిటీ నిర్మించాలని యోచిస్తోంది. అందులో భాగంగా ప్రస్తుతం సదస్సు నిర్వహిస్తోంది' అని పేర్కొన్నారు.

అన్ని రాష్ట్రాల కంటే ముందుగా ఏపీలో..

సురేష్ కుమార్ మాట్లాడుతూ డ్రోన్లను ప్రజా అవసరాలకు ఉపయోగించడం కోసమే అమరావతిలో రెండు రోజులపాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డ్రోన్ ప్రాధాన్యాన్ని గుర్తించి దేశంలో అందరి కంటే ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2015లోనే డ్రోన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు గత నెలలో సమావేశమైనప్పుడు డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానానికున్న ప్రాధాన్యంపై చర్చించి వాటి పరిశోధన, అభివృద్ధి, తయారీ కార్యక్రమాలకు ప్రభుత్వపరంగా చేయూతనందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. డ్రోన్ రంగానికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలనూ ఒకేచోట కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అమరావతిలో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగే డ్రోన్ సదస్సులో తయారీదారులు, పెట్టుబడిదారులు, ఐఐటీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఎవరెవరు ఏయే అవసరాల కోసం డ్రోన్లు ఉపయోగించుకోవాలనుకుంటున్నారో తెలుసుకొని దాని ప్రకారం ఒక విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చిందన్నారు. వివిధ రంగాల్లో డ్రోన్ల వినియోగంపై అక్టోబర్ 6 నుంచి 17 వరకు డ్రోన్ హ్యాకథాన్ నిర్వహించామని, అందులో విజేతలకు నాలుగు కేటగిరీల్లో రూ.24 లక్షల నగదు బహుమతులు అందించనున్నట్లు సురేష్‌కుమార్ చెప్పారు. 22వ తేదీ సాయంత్రం కృష్ణా నది ఒడ్డున పున్నమిఘాట్‌లో 5 వేల డ్రోన్లతో దేశంలోనే అతిపెద్ద ప్రదర్శన నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సుకు 1,110 మంది ప్రతినిధులు, 190 మంది ఎగ్జిబిటర్లు, 83 మంది స్పీకర్లు, 422 మంది హ్యాకథానర్లు పేర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 24 ప్రభుత్వ శాఖలు తమకు ఏయే అవసరాల కోసం డ్రోన్లు కావాలో చెబుతూ ప్రతిపాదనలు సమర్పించాయన్నారు. విలేకర్ల సమావేశంలో ఏపీ డ్రోన్ ఫెడరేషన్ ఎండీ దినేష్‌కుమార్ మాట్లాడారు.

డ్రోన్ ఎయిర్ షోలో అమరావతి ఆకృతి

- 5,500 డ్రోన్లు గాల్లో చక్కర్లు కొడుతూ వివిధ ఆకృతుల రూపకల్పన
- ప్రదర్శన కోసం తాత్కాలిక కమాండ్ కంట్రోల్ రూమ్
- విజయవాడలోని పున్నమి ఘాట్‌లో నిర్వహణకు ఏర్పాట్లు

ఈనాడు – అమరావతి: ఒకటి కాదు.. రెండు కాదు.. 5,500 డ్రోన్లు ఒకేచోట నుంచి ఆకాశంలోకి ఒక్కసారిగా దూసుకెళుతుంటే ఎలా ఉంటుంది? అవి ఒకదాని మీదుగా ఒకటి గిరికీలు కొడుతూ.. రకరకాల ఆకృతులు ప్రదర్శిస్తుంటే చూడటానికి ఎంత బాగుంటుంది? అబ్బురపరిచే ఇలాంటి ప్రదర్శనకు కృష్ణా నదీ తీరం వేదిక కానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించే జాతీయ డ్రోన్ సమ్మిట్‌లో భాగంగా విజయవాడలోని పున్నమి ఘాట్ దగ్గర డ్రోన్ ఎయిర్ షో ఏర్పాటు చేసింది. దేశంలోనే మొదటిసారి అత్యధిక సంఖ్యలో డ్రోన్లు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నాయి. ఎయిర్ షో ద్వారా ఒకదాని తర్వాత మరొకటిగా ఆరు నుంచి ఎనిమిది ఆకృతుల్లో చేసే (థీమ్స్) ప్రదర్శనతో ప్రజలకు కనువిందు చేయబోతున్నాయి. ఇందులో రాష్ట్ర అంశాలతో పాటు.. దేశానికి సంబంధించిన ఆకృతులనూ ప్రదర్శించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర రాజధాని 'అమరావతి' కూడా దీనిలో ఒక అంశంగా ఉండబోతోంది. సంబంధిత డిజైన్లు త్రీడీ హాలోగ్రామ్‌లో పెడతారు. ఒకదాని తర్వాత ఒక డిజైన్‌లోకి డ్రోన్లు మారుతూ చూపరులను ఆకట్టుకోనున్నాయి. ఆ ప్రదర్శనకు అనుగుణంగా నేపథ్య సంగీతం, ఆకృతులకు సంబంధించిన ముఖ్య అంశాలను ప్రజలకు వివరించేలా వాయిస్ ఓవర్ కూడా ఏర్పాటు చేస్తున్నారు.

అత్యున్నత సాంకేతికత వినియోగం

రేడియో కమ్యూనికేషన్ విధానంలో, ఆటోపైలట్ మోడ్‌లో డ్రోన్లు పనిచేస్తాయి. డ్రోన్లతో ప్రదర్శనకు ముందుగా కో-ఆర్డినేట్స్ (లాటిట్యూడ్స్, లాంగిట్యూడ్స్) ఆధారంగా నిపుణులు కంప్యూటర్‌లో ప్రోగ్రామింగ్ చేస్తారు. ఒకదానికి ఒకటి విజిబుల్‌గా ఉంటే.. సిగ్నల్ సమస్య లేకుండా సులువుగా గాల్లో ఎగిరేందుకు వీలుంటుంది. దీనికోసం చదునైన నేల మీద వరుసగా డ్రోన్లను ఉంచి.. ప్రదర్శన ఆరంభమైన వెంటనే ఒకదాని వెంట మరొకటి వాటి ప్రోగ్రామింగ్ ఆధారంగా గాల్లోకి లేచేలా సిద్ధం చేస్తారు. ఉదాహరణకు.. మూడు డ్రోన్లు ఉంటే ఒకటి పైన, మరొకటి మధ్యలో, మూడోది కింద ఉండేలా లొకేషన్ లాకవుతుంది. ప్రోగ్రాం ఆన్ చేయగానే నిర్దేశిత లొకేషన్‌లో డ్రోన్ ప్రయాణిస్తుంది. అలా గాల్లో ఎగురుతూనే కుడి.. ఎడమ వైపు తిరిగేందుకు వీలుగా కోడింగ్ చేస్తారు. ఆ మార్గంలోనే అవి పయనిస్తాయి. ఆటోపైలట్ విధానంలో ఏ తరహా ఆకృతులు (థీమ్స్)ను ఎయిర్‌షో ద్వారా ప్రదర్శించాలనేది కూడా ముందుగానే నిపుణులు కంప్యూటర్‌లో త్రీడీ విధానంలో డిజైన్ చేసి.. ప్రోగ్రామింగ్ చేస్తారు. ఆ విధంగానే డ్రోన్లు ప్రదర్శన చేస్తాయి.

ఒకే నమూనా, ఒకే బరువు డ్రోన్ల వినియోగం

ప్రదర్శనలో వినియోగించనున్న 5,500 డ్రోన్లు ఒకే విధంగా ఉంటాయి. ఒకదానితో ఒకటి అనుసంధానం కావడం కోసం.. దేశీయంగా తయారై, ఒకే తరహా సాంకేతికతతో పనిచేసే వాటినే వినియోగిస్తున్నారు. ప్రదర్శనలో వినియోగించే ఒక్కో డ్రోన్ 200 గ్రాముల బరువు ఉంటుంది. వాటిలో వినియోగించే బ్యాటరీ సామర్థ్యం ప్రకారం 17 నిమిషాలపాటు గాల్లో ఎగరనుంది. రాను, పోను వ్యవధి తీసేస్తే 15 నిమిషాల పాటు ఇవి ప్రదర్శనలో ఉంటాయి. దిల్లీకి చెందిన ఓ సంస్థ ఈ ప్రదర్శన మొత్తాన్ని పర్యవేక్షిస్తోంది. ప్రదర్శన పర్యవేక్షణ కోసం ప్రభుత్వం తాత్కాలిక కంట్రోల్ రూమ్ సిద్ధం చేస్తోంది. ఎయిర్‌షో లైవ్‌లో నగరం మొత్తం ప్రదర్శించేందుకు 20 ప్రాంతాల్లో టీవీలు అమర్చనున్నారు.

200 స్థానాల్లో కూటమికి ఏకాభిప్రాయం

- శరద్‌పవార్

పుణె: మహారాష్ట్ర అసెంబ్లీలోని 288 స్థానాలకుగాను 200 నియోజకవర్గాల్లో మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) భాగస్వామ్య పక్షాల నడుమ ఏకాభిప్రాయం కుదిరినట్లు ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ వెల్లడించారు. సాతారా జిల్లాలోని కరాడ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. భాజపా చేతిలో కాంగ్రెస్ ఓటమిని చవిచూసిన హరియాణా ఎన్నికల ఫలితాలు మహారాష్ట్రపై ఎటువంటి ప్రభావం చూపబోవన్నారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన జమ్మూకశ్మీర్ ఎన్నికలే దేశానికి అత్యంత ముఖ్యమైనవని, అక్కడ 'ఇండియా' కూటమి భాగస్వామ్య పార్టీ గెలిచిందని తెలిపారు. మరోవైపు.. ఏక్‌నాథ్ శిందే సారథ్యంలోని శివసేన అధికార ప్రతినిధి సంజయ్ శిర్‌సాట్ మీడియాతో మాట్లాడుతూ ఎంవీఏలోని కాంగ్రెస్, శివసేన (ఉద్ధవ్), ఎన్సీపీ (ఎస్పీ) ఎన్నికల తర్వాత కూడా కలిసి ఉండటం సందేహమేనని అన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామంటూ మహిళపై సామూహిక అత్యాచారం

జైపుర్: ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపి ఓ మహిళపై హోటల్‌లో కొందరు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన రాజస్థాన్‌లో చోటు చేసుకుంది. ముందుగా తనకు మత్తుమందు కలిపిన శీతల పానీయాన్ని రింకు మీనా, వినోద్ అందించారని బాధితురాలు ఆరోపించారు. అనంతరం తనపై దారుణం జరిగిందన్నారు. హోటల్‌లో రిసెప్షనిస్టు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి, ఇప్పుడు తనకు సంబంధించిన అభ్యంతరకర వీడియోలు బహిరంగపరుస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విమానం కూలి ఇద్దరు జర్మన్ పైలట్ల మృతి

హెల్సింకీ: రెండో ప్రపంచ యుద్ధకాలం నాటి విమానం దక్షిణ ఫిన్లాండ్‌లో కూలిపోయిన ఘటనలో జర్మనీకి చెందిన ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. విమానం గాల్లోకి లేచిన కొద్ది క్షణాల్లోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని గురువారం పోలీసులు వెల్లడించారు. సింగిల్ ఇంజిన్, రెండు సీట్లు ఉండే టీ-6 టెక్సాన్ విమానాలను 1930ల్లో అమెరికా సైనిక శిక్షణకు వినియోగించేవారు. ప్రస్తుతం వాటిని ఎయిర్ షోల్లో ప్రదర్శిస్తున్నారు. ఆ రకానికి చెందిన చిన్ని విమానం రేస్‌కాల ఏవియేషన్ వాయు స్థావరానికి సమీప అడవిలో బుధవారం కుప్పకూలిందని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో నైపుణ్యం కలిగిన ఇద్దరు పైలట్లు మృతి చెందారని తెలిపారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా: రాజస్థాన్‌లోని కోటాలో నీట్ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న 20 ఏళ్ల విద్యార్థి హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీర్జాపుర్‌కు చెందిన అశుతోష్ చౌరాసియా (20) గత ఆరు నెలలుగా నీట్ పరీక్షకు సిద్ధమవుతున్నాడు. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా, హాస్టల్ నిర్వాహకుడు తలుపు తట్టినా అశుతోష్ స్పందించలేదు. దీంతో నిర్వాహకుడు పోలీసులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి లోపలికి వెళ్లి చూశారు. అతడు ఉరివేసుకుని కనిపించాడు. ఈ ఏడాదిలో ఇది 15వ ఘటన. యువకుడు మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని, చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు

ప్రాణం మీదకు తెచ్చిన పిజ్జా గొడవ

దిల్లీ: పిజ్జాను పంచుకోవడంలో తలెత్తిన గొడవ ఓ మహిళ ప్రాణం మీదకు తెచ్చిన ఘటన దిల్లీలో చోటు చేసుకుంది. ఉత్తర దిల్లీలోని వెల్‌కం ప్రాంతంలో బుధవారం రాత్రి బాధితురాలు సాద్మా బావ కుటుంబ సభ్యుల కోసం పిజ్జాలు తీసుకొచ్చారు. వాటిని అందరికి పంచుతున్న సందర్భంగా ఆయన, మరో మహిళతో సాద్మాకు మాటామాటా పెరిగింది. దీన్ని మనసులో పెట్టుకున్న ఆమె తన నలుగురు సోదరులను ఇంటికి పిలిచింది. వారు తమ బావలతో గొడవపడ్డారు. ఈ సందర్భంగా సాద్మా సోదరుడు ముంతాహిర్ తుపాకీని పేల్చడంతో అది ఆమె కడుపులోకి దూసుకుపోయింది. స్థానిక జీటీబీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేశామన్నారు.



పాకిస్థాన్‌లోని రావల్పిండిలో పంజాబ్ క్యాంపస్‌లో జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ విద్యార్థులు తగులబెట్టిన సామగ్రి

కౌలు రైతులకు మానవతా దృక్పథంతో రుణాలివ్వాలి

బ్యాంకర్ల సమావేశంలో ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: ఏపీలో 9 లక్షల సీసీఆర్‌సీ (పంట సాగుదారు హక్కు కార్డులు) అందజేయగా, అందులో 2 లక్షల మందికి మాత్రమే బ్యాంకుల నుంచి పంటరుణాలు అందాయని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మరింత మంది కౌలు రైతులకు రుణాలు మంజూరయ్యేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల ఎకరాల్ని ప్రకృతి సేద్యం కిందకు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందని, ఇందుకు బ్యాంకర్ల సహకారం అవసరమని గుర్తుచేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో బ్యాంకర్లు అందించిన సహకారాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో మణిమేఖలై ప్రశంసించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాలకు రూ.3.75 లక్షల కోట్ల రుణాలివ్వాలని లక్ష్యం నిర్దేశించుకోగా, జూన్ 30 నాటికి రూ.1.37 లక్షల కోట్లు అందించామని తెలిపారు. వ్యవసాయానికి రూ.89,438 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.44,150 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.87 వేల కోట్ల అప్పులిచ్చినట్లు తెలిపారు. సీసీఆర్‌సీ కార్డులున్న అందరికీ పంట రుణాలివ్వాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ కోరారు. ప్రాయోజిత పథకాల్లో సాధించిన ప్రగతిని బ్యాంకర్ల కమిటీ కన్వీనర్ సీవీఎన్ భాస్కర్‌రావు వివరించారు. కాకినాడ, కృష్ణా జిల్లాల్లో డిజిటల్ కరెన్సీపై పైలట్ ప్రాజెక్టును చేపట్టామని ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ ఏవో బషీర్ తెలిపారు.

రెడ్‌కార్పెట్ వేసి మీకు స్వాగతం పలుకుతున్నా

- మాది బిజినెస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం
- పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు చంద్రబాబు ఆహ్వానం

ఈనాడు, అమరావతి: 'మాది బిజినెస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం. ప్రతిభావంతులైన యువత, పటిష్ఠమైన మౌలిక సదుపాయాలు మీ కోసం ఎదురుచూస్తున్నాయి. పారిశ్రామిక రంగంలో అనుభవజ్ఞులతో సమగ్ర, సంప్రదింపుల ఆధారంగా కొత్త పాలసీలు రూపొందించాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు ఎక్స్ వేదికగా ఆయన ఆహ్వానం పలికారు. మీకు స్వాగతం పలికేందుకు రెడ్ కార్పెట్ వేసినట్లు వెల్లడించారు. 'దేశంలోనే అత్యుత్తమ వ్యాపార వాతావరణాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నాం. మీకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దీనికి నేను వ్యక్తిగతంగా హామీ ఇస్తున్నాను. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఇంతకు మించిన సమయం మరొకటి లేదు. మాతో కలిసి పనిచేయండి. మీకోసం ఎదురుచూస్తున్నా' అని చంద్రబాబు పేర్కొన్నారు.

కాందిశీకుల ఆస్తుల విక్రయం మార్గదర్శకాలకు కేంద్రం సవరణ

దిల్లీ: దేశ విభజన, యుద్ధం వంటి సమయాల్లో శత్రుదేశాలకు వెళ్లిపోతూ కాందిశీకులు వదిలి వెళ్లిన ఆస్తుల విక్రయాలకు సంబంధించిన మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం సవరించింది. 1947-1962 మధ్య కాలంలో అత్యధికంగా కాందిశీకులు పాకిస్థాన్, చైనాలకు చేరుకుని ఆయా దేశాల పౌరసత్వం పొందారు. కాందిశీకులు వదిలి వెళ్లిన ఆస్తుల్లో గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.కోటి కన్నా తక్కువ విలువైనవి, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.5కోట్ల కన్నా తక్కువ విలువైన వాటిని సంరక్షణ అధికారులు విక్రయించవచ్చని కేంద్ర హోంశాఖ ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. అయితే, ఈ ప్రక్రియలో తొలి ప్రాధాన్యాన్ని ఆయా ఆస్తుల ఆక్రమణదారులకు కల్పించాలని తెలిపింది. కొనుగోలుకు ఆక్రమణదారులు ఆసక్తి కనబరచని పక్షంలో బహిరంగ వేలం లేదా టెండర్ల ద్వారా విక్రయాలను చేపట్టవచ్చని వివరించింది. దేశవ్యాప్తంగా 12,611 కాందిశీకుల ఆస్తులున్నాయి. వాటి విలువ సుమారు రూ.లక్ష కోట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు.

మనీలాండరింగ్ చట్టంపై తీర్పును సమీక్షించాలన్న పిటిషన్ విచారణ వాయిదా

దిల్లీ: మనీలాండరింగ్ చట్టం(పీఎంఎల్ఏ)లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి కల్పించిన అధికారాలను సమర్థిస్తూ వెలువడిన 2022 తీర్పును సమీక్షించాలని కోరిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు నవంబరు 27వ తేదీకి వాయిదా వేసింది. ఈ చట్టం ప్రకారం ఈడీకి సంక్రమించిన వ్యక్తుల అరెస్టు, ఆస్తుల జప్తు అధికారాలను సవాల్ చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వీటిపై విచారణ జరుపుతోంది.

యూపీలో కర్రతో చిరుతను చంపిన రైతు

బిజ్‌నౌర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బిజ్‌నౌర్ జిల్లాలో తనపై దాడి చేసిన చిరుతపులిని ఆత్మరక్షణ కోసం ఓ రైతు కర్రతో చితకబాది చంపాడు. కాలాగఢ్ ప్రాంతంలోని భిక్కావాలా గ్రామానికి చెందిన తెజ్వీర్ సింగ్ (60) పొలంలో పనిచేసుకొంటూ ఉండగా చిరుత అకస్మాత్తుగా దాడి చేసింది. రైతును పొదల్లోకి లాక్కొని వెళ్లేందుకు చిరుత ప్రయత్నించగా.. అప్రమత్తమైన రైతు కర్రతో దాని తలపై గట్టిగా పలుమార్లు కొట్టాడు. దీంతో చిరుత మృతిచెందింది. తెజ్వీర్ కేకలు విని పరుగున వచ్చిన స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తెజ్వీర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు అటవీ అధికారి సునీల్ రాజౌరా తెలిపారు.

ఆఫ్రికాలో ఎంపాక్స్ మృతుల సంఖ్య 1,100

కంపాలా: ఆఫ్రికాలో ఎంపాక్స్ మృతుల సంఖ్య 1,100కు చేరుకుంది. దేశాల మధ్య సరిహద్దుల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందడంతోపాటు టెస్టు కిట్లు సరిపడినన్ని లేకపోవడమే ఇందుకు కారణమని గురువారం అధికారులు వెల్లడించారు. గత వారంలో 50 మంది ఎంపాక్స్‌తో చనిపోయారని వివరించారు. ఆఫ్రికా ఖండంలోని మొత్తం 55 దేశాల్లో 18 దేశాలకు ఈ వ్యాధి విస్తరించిందని తెలిపారు.

మంగళగిరిని గోల్డ్‌హబ్‌గా అభివృద్ధి చేస్తాం

మంత్రి లోకేశ్



మంత్రి నారా లోకేశ్‌తో కలిసి కేకు కోస్తున్న స్వర్ణకారులు

తాడేపల్లి(ఉండవల్లి), న్యూస్‌టుడే: గుంటూరు జిల్లాలోని మంగళగిరిని గోల్డ్‌హబ్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో గురువారం లక్ష్మీనరసింహ గోల్డ్‌స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఆయన్ను కలిశారు. సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న స్వర్ణకార కార్పొరేషన్ కలను నెరవేర్చారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంత్రితో కేకు కోయించి, ఆయన్ను గజమాలతో ఘనంగా సత్కరించారు. స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుకు సంబంధించి విధివిధానాలను అందరూ కలిసి రూపొందించాలని లోకేశ్ వారికి సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వర్ణకార కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని లోకేశ్ నిలబెట్టుకున్నారని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. దేశంలోనే మూడో స్వర్ణకార కార్పొరేషన్ రాష్ట్రంలో ఏర్పాటు కానుందని సంబరాలు చేసుకున్నారు.